

'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 357


బుధవారం 19-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ

ప్రభుత్వరంగ జీవితబీమా దిగ్గజం ఎల్ఐసీ ఆరోగ్య బీమాలోకి ప్రవేశిస్తోంది. ఇందుకు వీలుగా ఓ కంపెనీలో వాటా కొననుంది.

- వివరాలు 15లో ▶



గాజాపై భీకర దాడులు

ఇజ్రాయెల్ సైన్యం గాజాపై దాడులకు దిగింది. ఈ దాడుల్లో 413 మందికిపైగా మృతి చెందారు. 600 మంది గాయపడ్డారు.

- వివరాలు 6లో ▶



మాడ్యూల్ నుంచి సునీతను బయటకు తీసుకొస్తున్న దృశ్యం..

క్షేమంగా సునీత..

అమెరికా ఫ్లోరిడా తీరంలో సముద్ర జలాల్లో దిగిన స్పేస్ ఎక్స్ డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్

సుమారు 9 నెలల నిరీక్షణ.. కోట్లాది మంది ప్రార్థనలు.. నాసా శాస్త్రవేత్తల అవిరళ కృషి.. ఎలాన్ మస్క్ 'స్పేస్ ఎక్స్' తోడ్పాటు.. ఎట్టకేలకు భారత సంతతికి చెందిన నాసా ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్, విల్మోర్, మరో ఇద్దరు వ్యోమగాములు భువికి తిరిగొచ్చారు.



భూమిపైకి దిగాక మాడ్యూల్‌లో సునీత, ఇతర వ్యోమగాములు

2.17: స్పేస్ క్రాఫ్ట్ భూమికి తిరిగొచ్చే ప్రక్రియ షురూ

2.18: లీకేజీలు ఉన్నాయా అనే చెకింగ్ పూర్తి

2.35: కక్ష్య నుంచి విడిపడే ప్రక్రియ మొదలైంది.

2.51: కక్ష్య నుంచి విడివడే ప్రక్రియ పూర్తయి.. స్పేస్‌క్రాఫ్ట్ కిందకు దిగడం ప్రారంభమైంది.

3.10: డ్రాగన్ ఫ్రీడమ్ మాడ్యూల్ భూవాతావరణంలోకి ప్రవేశించింది. అత్యంత వేగంగా ప్రయాణిస్తుండటంతో స్పేస్ ఎక్స్ గ్రౌండ్ స్టేషన్‌తో సిగ్నల్ కట్ అయింది. **3.21**కి సిగ్నల్ కలిసింది.

3.26: భూమికి 5 కి.మీ. ఎత్తులో ఉండగా పారాచూట్‌లు తెరుచుకున్నాయి.

3.28: డ్రాగన్ మాడ్యూల్ సురక్షితంగా సముద్రంలో దిగింది.

3.55: మాడ్యూల్‌ను నౌకలో ఎక్కించారు.

4.23: మాడ్యూల్ నుంచి సునీతను బయటకు తీసుకొచ్చారు. వ్యోమగాములను హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలించారు.



పారాచూట్‌తో దిగుతూ..



ఫ్లోరిడా సముద్రజలాల్లో దిగిన డ్రాగన్ మాడ్యూల్



మాడ్యూల్‌ను నౌకలోకి ఎక్కిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

ఐక్యతా స్ఫూర్తి బలోపేతం



మహా కుంభమేళా విజయవంతం కావడంపట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఇలాంటి భారీ సామూహిక వేడుక నిర్వహించే విషయంలో భారతదేశ శక్తిసామర్థ్యాలను ప్రశ్నించినవారికి ఈ కుంభమేళా ద్వారా తగిన సమాధానం ఇచ్చామన్నారు.

- వివరాలు 6లో ▶

తదుపరి సీఎస్‌గా కె. రామకృష్ణారావు!



తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావును ప్రభుత్వం ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఏప్రిల్ చివర్లో రిటైరవనున్నారు.

- వివరాలు 12లో ▶

సమాధానాలు చెప్పలేక సర్కారు పారిపోతోంది



అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు వేసే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ప్రభుత్వం పారిపోతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.

- వివరాలు 2లో ▶

పిటిషనర్‌కు రూ. కోటి జరిమానా



వాస్తవాలను దాచి పిటిషన్లపై పిటిషన్లు వేస్తూ కోర్టు సమయాన్ని వృథా చేసిన ఓ పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినందుకు రూ. కోటి జరిమానా విధించింది.

- వివరాలు 12లో ▶

ఎస్సీ వర్గీకరణకు ఓకే

ఉభయసభల్లో ఏకగ్రీవంగా ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం

జనాభా లెక్కల తర్వాత ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతాం: సీఎం రేవంత్‌రెడ్డి

- వర్గీకరణ హామీ నిలబెట్టుకున్నాం.. ఎస్సీ ఉప కులాలను 3 కేటగిరీలుగా చేశాం
- వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన కుటుంబాలను ఆదుకుంటామని వెల్లడి
- దశాబ్దాల పోరు తర్వాత ఎస్సీ వర్గీకరణకు కార్యరూపం: మంత్రి ఉత్తమ్
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లోనూ ఎస్సీ వర్గీకరణ చేయాలి: కడియం
- ఎస్సీ రిజర్వేషన్లు గ్రూప్ 1, 2, 3కి బదులు ఏ, బీ, సీగా సవరించాలి: పాయల్ శంకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) ఉప వర్గీకరణకు లైన్ క్లియర్ అయింది. దీనికి సంబంధించి వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం శాసనసభ, శాసనమండలిలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లును ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. అంతకు ముందు ఈ బిల్లుపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది చేపట్టనున్న జనగణన తర్వాత ఎస్సీల సంఖ్య ఆధారంగా వారి రిజర్వేషన్లను మరింత పెంచుతామని ప్రకటించారు. వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని శాసనసభలో ఆమోదింపజేయడంలో చూపిన చిత్తశుద్ధిని గుర్తు చేశారు. కాంగ్రెస్ దళితుల పక్షపాతి అని, రాజ్యాంగ రూపకల్పన కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని చెప్పారు. అనేక మంది దళితులకు కాంగ్రెస్ పార్టీ కీలక పదవులు ఇచ్చి పైకి తెచ్చిందని.. దళిత బిడ్డ మల్లికార్జున ఖర్గేకి పార్టీ అధ్యక్ష పదవి ఇచ్చిందని పేర్కొన్నారు.

అందరి అభీష్టం మేరకే..

ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చిన మరుక్షణమే తమ ప్రభుత్వం స్పందించిందని సీఎం రేవంత్ చెప్పారు. "మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం వేశాం. వారి సూచన మేరకు జస్టిస్ షమీమ్ అక్తర్ సారథ్యంలో ఏకసభ్య కమిషన్ వేశాం. వర్గీకరణపై కమిషన్ విస్తృతంగా సమాచారం సేకరించింది. అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకుంది. 8,681 విజ్ఞప్తులను కూలంకషంగా పరిశీలించింది. 59 ఎస్సీ ఉప కులాలకు సంబంధించిన స్థితిగతులతో నివేదిక ఇచ్చింది. ఆ సిఫార్సులను మంత్రివర్గం యథాతథంగా ఆమోదించింది. 59 ఉపకులాలను మూడు కేటగిరీలు చేశాం. అత్యంత వెనుకబడిన 15 ఉప కులాలకు ఒక్క శాతం, మధ్యస్థంగా వెనుకబడిన 18 ఉప కులాలకు 9శాతం, గణనీయంగా లబ్ధిపొందిన

మిగతా 2వ పేజీలో ▶



మీ మద్దతు లేకుండా ఎవరూ అధికారంలో కొనసాగలేరు

- బీసీ సంఘాల అభినందన సమావేశంలో సీఎం రేవంత్
- మీ సహకారంతోనే రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటైంది
- అందుకే మనసు పెట్టి మీకు న్యాయం చేసే ప్రయత్నం చేశా..
- చిత్తశుద్ధితో బీసీల గణన చేశాం.. దానిని చట్టం చేశాం..

3 లో

రూ.3.05 లక్షల కోట్లు!

నేడు 2025-26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం



- ఆర్థిక మాంద్యం, సొంత పన్నుల రాబడులు, రుణ సేకరణ ప్రాతిపదికన వాస్తవిక కోణంలో ఆదాయ, వ్యయాల లెక్క
- ఆరు గ్యారంటీల్లో భాగంగా పింఛన్ల పెంపునకు నిధులు కేటాయించే చాన్స్
- సమీకృత పాఠశాలలు, యువ వికాసం, రేషన్‌షాపుల్లో సన్నబియ్యానికి కూడా..
- వ్యవసాయం, వైద్యం, సాగునీరు, విద్య, గ్రామీణాభివృద్ధి శాఖలకు ప్రాధాన్యం
- ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను జనాభా ప్రాతిపదికన పెంచే చాన్స్
- ఈసారి స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్ శాఖలకు భారీగా టార్గెట్?
- భూముల అమ్మకాలు, విలువల సవరణతో అదనపు ఆదాయంపై ఫోకస్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం, సొంత పన్నుల రాబడులు, రుణ సేకరణకు గల అవకాశాలు, కేంద్రం నుంచి అందే సాయం ప్రాతిపదికన వాస్తవిక కోణంలో వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26) గాను రూ.3.05 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నట్లు తెలిసింది. 2024–25లో ప్రతిపాదించిన రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌కు ఇది సుమారు 5 శాతం అదనం. బుధవారం ఉదయం 9:30 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో భేటీ కానున్న రాష్ట్ర మంత్రివర్గం బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించనుంది. అనంతరం 11:14 గంటలకు అసెంబ్లీలో ఆర్థిక మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.. శాసనమండలిలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెడతారని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి.

గ్యారంటీలకు తోడుగా!

తాజా బడ్జెట్‌లో ఎప్పటిలాగే వ్యవసాయం, వైద్యం, సాగునీరు, విద్య, గ్రామీణాభివృద్ధి శాఖల పద్దులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని ఆర్థిక శాఖ వర్గాలు

మిగతా 12వ పేజీలో ▶

కరువు రైతులను ఆదుకొనే పూర్తి బాధ్యత సీఎందే

ఎండిన ప్రతి ఎకరాకూ రూ. 25వేల పరిహారం ఇవ్వాలి: కేటీఆర్



- బడ్జెట్ సమావేశాల్లోనే పరిహారం ప్రకటించాలని డిమాండ్
- కరువు ముప్పుపై ముందే హెచ్చరించినా సర్కార్ పట్టించుకోలేదని మండిపాటు
- బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పుకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న కరువు కాంగ్రెస్ తెచ్చిందని.. రైతులను ఆదుకునే పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎండిన ప్రతీ ఎకరాకు రూ. 25 వేల చొప్పున అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేదికగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ముంచుకొస్తున్న కరువు ముప్పుపై ముందే హెచ్చరించినా, తెలివిలేని కాంగ్రెస్ ప్రభుత్వం చెవికి ఎక్కలేదన్నారు. దీంతో రాష్ట్రంలో పచ్చని పంటలు ఎండిపోతున్నాయని, వ్యవసాయ శాఖ సమర్పించిన ప్రాథమిక నివేదిక కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించిందని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ జరగక, పెట్టుబడి సాయం అందక ఇప్పటికే అల్లాడుతున్న రైతులకు పంటలు ఎండిపోవడం గోరు చుట్టు మీద రోకటి పోటులా ఉందన్నారు.

ఆర్థిక శక్తిని ఆగం చేస్తున్నారు

ఆర్థికశక్తిగా ఎదిగిన తెలంగాణను ఆగం చేసి బీద అరుపులు అరుస్తున్నారని, రాష్ట్రంలో పాలనకు బదులుగా పీడన జరుగుతోందని కేటీఆర్ అన్నారు. హైడ్రా పేరిట వసూళ్లు, మూసీ సుందరీకరణ పేరిట పేదలపై పగ, ఫార్మాసిటీ పేరిట భూముల దందా జరుగుతోందన్నారు. ఫోర్త్‌సిటీ పేరిట ముఖ్యమంత్రి కుటుంబం రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని, ట్రిపుల్‌ఆర్ పేరిట పేదల భూముల ఆక్రమణ జరుగుతోందన్నారు. గతంలో మద్యం వద్దు అంటూ నినదించిన రేవంత్...ఇప్పుడు ధరల సవరణ, కొత్త బ్రాండ్ల పేరిట అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.



మంగళవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సంప్రదాయ చీరకట్టులో 2024 మిస్ వరల్డ్ క్రిస్టినా పిష్కోవా

- వివరాలు 16లో

నగరం ఖ్యాతి పెరిగేలా..

మేలో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలతో హైదరాబాద్ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు

12 లో

ఇదండీ సంగతి





మాల్ఫార్మేషన్ కాంప్లెక్స్ డిజార్డర్(వైరస్) గతంలో ఉత్తరాది రాష్ట్రాల్లో సాగయ్యే లాంగ్ర, చౌశ, మల్లిక, రత్న వంటి మామిడి వెరైటీలకు సోకేది. కానీ ఈసారి సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల్లో దక్షిణాది వెరైటీలు (తోతాపురి, దశేరి, బంగినపల్లి) వంటి రకాలకు కూడా సోకింది. దిగుబడిని పూర్తిగా శూన్యం చేసే ఈ వైరస్ ఎలాంటి నిరోధక చర్యలకు కూడా లొంగడం లేదని ఫల పరిశోధన స్థానం సైంటిస్టులు చెబుతున్నారు.

అసాధారణ వాతావరణం..

మామిడి రైతు ఆగమాగం

పగలు 40 డిగ్రీలు.. రాత్రి అత్యల్పంగా 13 డిగ్రీలు

- పలు జిల్లాల్లో తోటలకు తెగుళ్ల దెబ్బ
- సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల్లో కొత్త వైరస్‌లు... మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో తామర పురుగు
- నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో 40% రాలిన పిందెలు... ఆదిలాబాద్, జగిత్యాలలో టెంకె పురుగు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పగటివేళ అత్యధికంగా 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉండి..రాత్రి వేళ ఒక్కసారిగా 13 డిగ్రీలకు పడిపోతున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో సంభవిస్తున్న అసాధారణ వాతావరణ మార్పులు మామిడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈనెల 6, 7 తేదీల్లో సంగారెడ్డిలో అత్యల్పంగా 13.3 డిగ్రీలు, 14.2 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీని ప్రభావం మామిడి తోటలపై పడుతోందని ఫల పరిశోధన శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. దీంతో కొత్త రకం డిజార్డర్లు వెలుగు చూస్తున్నాయని వారు చెబుతున్నారు.

రాష్ట్రంలో మామిడి తోటల పరిస్థితి ఇలా..

వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో మామిడి తోటలకు తామర పురుగు సోకింది. కోడిగుడ్డు పరిమాణం వరకు పెరిగిన కాయలపై బ్రౌన్‌కలర్‌లో గీతల మచ్చలు ఏర్పడ్డాయి. దీంతో

మిగతా 5వ పేజీలో ▶

ఉద్యానవన శాఖ గణాంకాల ప్రకారం..

2.89 లక్షల ఎకరాలు
రాష్ట్రంలో మామిడి తోటల విస్తీర్ణం

2.70 లక్షల ఎకరాలు
కాత కాసే స్థాయిలో ఉన్న తోటల విస్తీర్ణం

9,227 మొత్తం రైతుల సంఖ్య

10.23 లక్షల మెట్రిక్ టన్నులు
మామిడి వార్షిక దిగుబడి అంచనా



బెంగళూరుకు చెందిన ప్రముఖ డాగ్ బ్రీడర్ ఎస్.సతీశ్ కొనుగోలు చేసిన ఒకామి అనే శునకం ఇది. దీని ధర ఎంతో తెలుసా.. జస్ట్ రూ. 50 కోట్లే!!

- వివరాలు 16లో

క్లుప్తంగా...

ప్రశ్నోత్తరాల రద్దు ఎందుకు?

స్పీకర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: శాసనసభలో ప్రశ్నోత్తరాలు రద్దు చేయడంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం స్పీకర్ చాంబర్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కీలక అంశాలకు సంబంధించిన ప్రశ్నలున్నా ప్రస్తావనకు నోచుకోక.. వాటికి పరిష్కారం లేకుండా పోయిందన్నారు. కాగా తమ నియోజకవర్గాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పదే పదే ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎమ్మెల్యేలు స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

వర్గీకరణ చేపట్టాలన్నదే కేసీఆర్ లక్ష్యం

25 ఏళ్లుగా పార్టీది ఇదే వైఖరి: వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణకు బీఆర్‌ఎస్ పూర్తి మద్దతునిస్తోందని, కేసీఆర్ ఈ దిశగా అనేక విధాలా తోడ్పాటునిచ్చారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం శాసనసభలో తెలిపారు. వర్గీకరణ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, వర్గీకరణపై పోరాడిన వ్యక్తులు, సంస్థలకు కేసీఆర్ అండగా నిలిచారని, 25 ఏళ్లుగా తమ పార్టీ ఇదే వైఖరితో ఉందన్నారు. వర్గీకరణకు సానుకూలంగా కేసీఆర్ ప్రభుత్వం తీర్మానం చేసిందని, ఈ ప్రతిని ప్రధాని నరేంద్రమోదీకి ఆయనే స్వయంగా అందజేశారని తెలిపారు. చట్టసవరణ చేపట్టని కేంద్ర వైఖరిపై తమ పార్టీ పార్లమెంట్‌లోనూ పోరాడిందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను విద్య, ఉద్యోగాల్లో అమలు చేస్తామని రేవంత్ ప్రభుత్వం ప్రకటించినా, కార్యాచరణలో అది కన్పించలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆత్మవిశ్వాసం కల్పించాలి: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: తరతరాలుగా అణగారిన దళిత వర్గాల్లో ఆత్మవిశ్వాసం కల్పించాలని సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు సూచించారు. వర్గీకరణ బిల్లుకు ఆయన మద్దతు తెలిపారు. కోర్టు వివాదం కారణంగా ఎస్సీ వర్గాలు అనేక ఇబ్బందులు పడ్డాయని, పురోగతి ఆగిపోయిందని కాంగ్రెస్ సభ్యుడు వేముల వీరేశం అన్నారు. 30 ఏళ్ల వర్గీకరణ అలజడికి పరిష్కారం లభించడం అభినందనీయమని మరో ఎమ్మెల్యే కిడారి నాగరాజు అన్నారు. వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడం చరిత్రాత్మక ఘటనగా తోట లక్ష్మీకాంతరావు అభివర్ణించారు. ఇప్పటికీ దళిత వర్గాల పట్ల వివక్ష కొనసాగుతోందని మందుల స్యామేల్ పేర్కొన్నారు.

బీజేవైఎం ముట్టడి.. అదుపులో 'ఏలేటి'

అసెంబ్లీ వద్ద ఉద్రిక్తతకు దారితీసిన ఘటనలు



అసెంబ్లీ వద్ద ఏలేటిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. బీజేవైఎం నేతలు, కార్యకర్తల అరెస్టుపై ప్రశ్నించిన బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని రెండు గంటల పాటు వివిధ స్టేషన్ల మధ్య తిప్పారు. దీన్ని నిరసిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఆవరణలో బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమి విక్రయాన్ని నిలిపివేయాలంటూ మంగళవారం బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు అసెంబ్లీ వద్దకు తరలివచ్చారు. దీంతో బీజేవైఎం అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ తదితరులను పోలీసులు అరెస్ట్‌చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు తమపై పిడిగుద్దులు కురిపించారని బీజేవైఎం శ్రేణులు మండిపడ్డాయి. పోలీసులు, బీజేవైఎం శ్రేణుల మధ్య తోపులాట జరుగుతున్న సమయంలో అసెంబ్లీ సమావేశాలకు వెళ్లేందుకు అటుగా వచ్చిన బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పోలీసుల వైఖరిని ప్రశ్నించారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని బోయినపల్లి స్టేషన్‌కు తరలించారు. అనంతరం దాదాపు 2 గంటల పాటు అటుఇటు తిప్పుతూ అసెంబ్లీ ప్రాంగణంలో విడిచిపెట్టారు. కాగా, తమ శాసనసభాపక్షనేత అసెంబ్లీకి వస్తుంటే అరెస్ట్‌చేసి ఆయన హక్కులకు భంగం కలిగించారంటూ బీజేపీ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. మహేశ్వర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, పాల్వాయి హరీశ్‌బాబు తదితరులు నల్లబ్యాడ్జీలు ధరించి అసెంబ్లీ ఆవరణలోని మెట్లపై కూర్చుని నిరసన తెలిపారు.

టీటీడీ తరహాలో యాదగిరిగుట్టకు పాలక మండలి

దేవాదాయ శాఖ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

- మొత్తం 18 మందితో పాలక మండలి
- ఆలయ పాలనపరమైన నిర్ణయాలన్నీ బోర్డు పరిధిలోనే..
- వేములవాడ, భద్రాచలం ఆలయాలకూ బోర్డు ఏర్పాటు చేయాలని సభ్యుల విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: యాదగిరిగుట్ట దేవాలయానికి తిరుమల తిరుపతి దేవస్థానాల తరహాలో పాలక మండలిని ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమైంది. దీనికి సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెలంగాణ ధార్మిక హిందూ మత సంస్థల, ధర్మాదాయాల చట్టం-1987 సవరణ బిల్లుకు శాసనసభ మంగళవారం ఆమోదం తెలిపింది. సాలీనా రూ.100 కోట్లకుపైగా ఆదాయం ఉన్న ఆలయాలకు పాలకమండళ్లను నియమించేందుకు ఇది వీలు కల్పించనుంది.

18 మందితో బోర్డు..

యాదగిరిగుట్ట ఆలయానికి ఏర్పాటు చేయబోయే బోర్డు చైర్మన్‌ను ప్రభుత్వం నియమిస్తుంది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, దేవాదాయ శాఖ కమిషనర్ సభ్యులుగా, దేవాలయ కార్యనిర్వహణాధికారి సభ్య కార్యదర్శిగా, యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (వైటీడీఏ) వైస్ చైర్మన్, వ్యవస్థాపక ధర్మకర్త (ఓటు వేయు హక్కు కలిగి ఉంటారు) తదితరులు సభ్యులుగా ఉంటారు. వీరే కాకుండా మరో 9 మందితో కలిపి మొత్తం 18 మందిని ప్రభుత్వం నియమిస్తుంది. ఇందులో ఒకరు శాసనమండలి సభ్యులు, ఒక ఎస్సీ, ఒక బీసీ వర్గాలకు చెందిన వారు, కనీసం ఒక మహిళ ఉండాల్సి ఉంటుంది. ఆలయ స్థానాచార్యులు కూడా బోర్డు సభ్యుడిగా కొనసాగుతారు. బోర్డుకు సహాయ సహకారాలు అందించేందుకు తొలి రెండేళ్ల పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి.. మొదటి ఐదేళ్ల కాలానికి యాదాద్రి భువనగిరి కలెక్టర్ కూడా సభ్యులుగా కొనసాగుతారు. దేవాలయ పాలనపరమైన నిర్ణయాలన్నీ ఈ బోర్డే తీసుకుంటుంది.

వైటీడీ పేరుపై అభ్యంతరం!

యాదగిరిగుట్ట దేవస్థానాన్ని వైటీడీ అని ప్రభుత్వం బిల్లులో ప్రస్తావించింది. బిల్లుపై చర్చలో పలువురు సభ్యులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. టీటీడీ అంటే తిరుమల తిరుపతి దేవస్థానాలు అని.. వైటీడీ అంటే యాదగిరిగుట్ట టెంపుల్ దేవాలయమా? అని బీజేపీ సభ్యుడు హరీశ్‌బాబు ప్రశ్నించారు. టీటీడీ తరహాలో ధ్వనించేలా పోటీగా ఆ పేరు పెట్టినట్టు కనిపిస్తోందని పేర్కొన్నారు. కాగా యాదగిరిగుట్ట అభివృద్ధి అథారిటీ మనుగడ ఉండనందున.. దేవస్థానం పేరును వైజీడీ (యాదగిరిగుట్ట దేవస్థానం)గా మార్చాలని కాంగ్రెస్ సభ్యుడు రాజగోపాల్‌రెడ్డి సూచించారు.

కేసీఆర్ పేరు చిరస్థాయిలో ఉంటుంది..

యాదగిరిగుట్ట బోర్డులో ఎమ్మెల్సీ సభ్యుడు/సభ్యురాలు ఉండనున్నట్టు బిల్లులో ఉందని.. ఓ ఎమ్మెల్యేకు కూడా సభ్యత్వం కల్పించాలని బీఆర్‌ఎస్ సభ్యుడు హరీశ్‌రావు కోరారు. యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం చేపట్టిన మాజీ సీఎం కేసీఆర్ పేరును మంత్రి ప్రస్తావించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే కేసీఆర్ పేరు చరిత్రలో నిలిచిపోతుందని, తెలంగాణ ఇచ్చిన వ్యక్తిగా సోనియా పేరు చిరస్థాయి అయినట్టు, యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం విషయంలో కేసీఆర్ పేరు ఉంటుందని మంత్రి కొండా సురేఖ సమాధానంగా చెప్పారు. ఇక ఉమ్మడి నల్గొండలో ఎస్టీల జనాభా అధికంగా ఉన్నందున.. బోర్డులో ఓ ఎస్టీ కూడా ఉండేలా చూడాలని హరీశ్‌రావుతోపాటు బీజేపీ సభ్యుడు హరీశ్‌బాబు విజ్ఞప్తి చేశారు. వేములవాడ, భద్రాచలం, బాసర, కొండగట్టు దేవాలయాలకు కూడా ట్రస్టుబోర్డులను ఏర్పాటు చేయాలని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ సభ్యుడు ఆది శ్రీనివాస్, బీజేపీ సభ్యుడు హరీశ్‌బాబు తదితరులు కోరారు. యాదగిరిగుట్ట వేద పాఠశాలను విశ్వవిద్యాలయం స్థాయికి పెంచాలని, హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిధులను కోటి నుంచి రూ.5 కోట్లను పెంచాలని బీఆర్‌ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఈ బిల్లుకు మద్దతు తెలుపుతున్నామని.. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ రూ.82 వేల నగదు, ముఖరంజా భార్య ఇజ్రా రూ.8 లక్షల విలువైన ఆభరణాలను యాదగిరిగుట్ట దేవాలయానికి గతంలో సమర్పించారని మజ్లిస్ సభ్యుడు కౌసర్ మొహియుద్దీన్ పేర్కొన్నారు.

'గుట్ట' వార్షికాదాయం రూ.224 కోట్లు..

యాదగిరిగుట్టలో కనీస వసతులు కూడా లేకపోవటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న తీరు చూసి.. గత 15 నెలల్లో పలు వసతులు కల్పించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి వల్ల కూడా దేవాలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రస్తుతం ఆలయ వార్షికాదాయం రూ.224 కోట్లకు చేరిందని వెల్లడించారు. దళితవాడల్లో యాదగిరీశుడి కల్యాణోత్సవాల నిర్వహణపై దృష్టి సారిస్తామని తెలిపారు. రూ.42 కోట్ల నిధులతో బాసర ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని.. గోదావరి, సరస్వతీ పుష్కరాలకు ఏర్పాట్లు ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. బ్రాహ్మణ పరిషత్తును బలోపేతం చేస్తామని, ధూపదీప నైవేద్య పథకం చెల్లింపుల్లో పెండింగ్ లేకుండా చూస్తామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు ఓకే

▶ మొదటి పేజీ తరువాయి

26 ఉప కులాలకు 5 శాతం మేర విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించాం..'' అని రేవంత్ తెలిపారు.

ఆ దళిత కుటుంబాలకు సాయం

ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన దళిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యమిస్తామని సీఎం తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద రూ.4 లక్షల సాయం అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణకు జనాభా లెక్కలే కీలమని చెప్పారు. 2026లో దేశవ్యాప్తంగా జనగణన చేపట్టే వీలుందని, అది పూర్తయిన తర్వాత రిజర్వేషన్లు మరింత పెంచుతామని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదానికి సహకరించిన అన్నిపక్షాలకు రేవంత్ కృతజ్ఞతలు తెలిపారు.

ఇది చరిత్రాత్మక దినం: ఉత్తమ్



ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించుకున్న ఈ రోజు ఇది చరిత్రాత్మక దినంగా నిలిచిపోతుందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అభివర్ణించారు. తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి ప్రతి శాసనసభ సమావేశంలో, పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ జరగాలని అన్ని పార్టీలు, ప్రభుత్వాలు గొంతెత్తేవని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణకు ఉమ్మడి ఏపీలో, తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాలు మద్దతు ఇచ్చినా చట్టబద్ధత రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం రేవంత్ నాయకత్వంలో చిత్తశుద్ధితో ఎస్సీ వర్గీకరణను పూర్తి చేశామన్నారు. వర్గీకరణ కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి చైర్మన్‌గా వ్యవహరించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎస్సీలకు 15శాతంగా ఉన్న రిజర్వేషన్లు త్వరలో పెరుగుతాయని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎస్సీ జనాభా దాదాపు 18శాతంగా ఉన్నట్టు వెల్లడైందని గుర్తు చేశారు. ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలని కమిషన్ సిఫార్సు చేసిందని.. కానీ వర్గీకరణ ఫలాలు ఎస్సీల్లోని అన్ని కులాలకు దక్కాలన్న ఉద్దేశంతో దానిని మంత్రివర్గం ఆమోదించలేదని ఉత్తమ్ చెప్పారు.

ఎస్సీలను కూరలో కరివేపాకులా వాడుకున్నారు

గత ప్రభుత్వం ఎస్సీలను కూరలో కరివేపాకులా చూసిందని ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. వర్గీకరణపై ఇంత పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంటే మాజీ సీఎం, మాజీ మంత్రులంతా గైర్హాజరు కావడం బాధాకరమన్నారు.

మాలలపై కొంతకాలంగా దుష్ప్రచారం జరుగుతోందని, జనాభా ప్రాతిపదికనే మాలలకు ఫలాలు దక్కాయని ఎమ్మెల్యే గడ్డం వివేక్ చెప్పారు. ఉద్యోగాలు, సంక్షేమ పథకాల్లో ఎక్కువగా మాదిగలకు దక్కాయని, తర్వాతే మాలలు ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతమున్న ఎస్సీ జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణను కేంద్రంలో కూడా అమలు చేయాలని, కేంద్ర ఉద్యోగాల్లోనూ వర్గీకరణ ఆధారంగానే నియామకాలు చేపట్టాలని మాజీ మంత్రి కడియం శ్రీహరి కోరారు. ఈ మేరకు పార్లమెంటులోనూ చట్టం చేయాలన్నారు.



ఎస్సీ వర్గీకరణను గ్రూప్-1, 2, 3లుగా విభజించారని.. అలాగాకుండా గ్రూప్-ఏ, బీ, సీ కేటగిరీలుగా చేయాలని ఎమ్మెల్యే పాయల్‌శంకర్ ప్రభుత్వాన్ని కోరారు.

ఇక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంఐఎం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మద్దతు ప్రకటించారు. చర్చ అనంతరం బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించినట్టు సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

కేవలం వర్గీకరణతోనే పూర్తి న్యాయం జరగదు

- ఎస్సీలకు ఆర్థిక సహకారం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతం చేయాలి
- అసెంబ్లీలో మంత్రి దామోదర
- మూడు గ్రూపులుగా ఎస్సీ ఉపకులాలు
- 15 కులాలకు ఒక శాతం.. 18 కులాలకు 9శాతం.. 26 కులాలకు 5 శాతం రిజర్వేషన్



సాక్షి, హైదరాబాద్: షెడ్యూల్డ్ కులాలకు వర్గీకరణే అంతిమ పరిష్కారం కాదని, దానితోనే పూర్తి న్యాయం జరగదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఎస్సీలకు ఆర్థిక చేయూత, నైపుణ్యాభివృద్ధి తదితర కార్యక్రమాలను విస్తృతం చేసి.. వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలని పేర్కొన్నారు. మంగళవారం ఆయన శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి, మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడ్డాక నిమిషాల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి అసెంబ్లీ వేదికగా ప్రకటన చేశారు. మంత్రివర్గ ఉపసంఘం, ఆ తర్వాత ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ 82 రోజుల్లో అధ్యయనం పూర్తి చేసి, 199 పేజీల నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించింది. కమిషన్ నివేదిక ఇచ్చిన 2025 ఫిబ్రవరి 4వ తేదీని సామాజిక న్యాయ దినంగా ప్రకటించాం. ఆ రోజుతోపాటు అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదం పొందిన మార్చి 18వ తేదీ చరిత్రలో నిలిచిపోతాయి.

మూడు గ్రూపులుగా రిజర్వేషన్

రాష్ట్రంలో ఎస్సీ కేటగిరీలోని 59 షెడ్యూల్డ్ కులాలను మూడు గ్రూపులుగా విభజించాలని వన్ మెన్ కమిషన్ సిఫారసు చేసింది. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూపు-1లో చేర్చి 1 శాతం రిజర్వేషన్లు మధ్యస్థంగా ప్రయోజనం పొందిన 18 కులాలను గ్రూపు-2లో చేర్చి 9శాతం రిజర్వేషన్లు.. మెరుగైన ప్రయోజనం పొందిన 26 కులాలను గ్రూప్-3లో చేర్చి 5 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేసింది. ఈ వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదు. జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా వారికి అందిస్తున్నాం. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత వర్గీకరణ పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుంది. వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు కొత్తగా ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు ఇవ్వలేదు. ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి చేసి చట్టబద్ధత జరిగే వరకు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన కృషి ఆయన కమిట్‌మెంట్, దార్శనికతకు నిదర్శనం. గతంలో ఎస్సీ సబ్‌ప్లాన్, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ఇప్పుడు వర్గీకరణలో కీలకపాత్ర ఉండటం నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నాను..''అని భట్టి పేర్కొన్నారు.

భవిష్యత్తులో కాంగ్రెస్ నుంచే ఓబీసీ సీఎం అవుతారు

శాసనమండలిలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ నుంచే ఓబీసీ నాయకుడు రాష్ట్ర సీఎం అవుతారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్ అంశంపై చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలోనూ ఓబీసీలు సీఎం అయ్యారని, తెలంగాణలో ఓబీసీ అభ్యర్థి సీఎం పదవి చేపట్టడం కాంగ్రెస్ తప్ప ఇతర ఏ పార్టీల వల్ల సాధ్యం కాదన్నారు.

ప్రియాంకా.. స్కూటీలు ఎక్కడ?

మండలి ఆవరణలో ప్లకార్డులతో బీఆర్‌ఎస్ నిరసన



స్కూటీ కటౌట్లను ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీలు కవిత, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు మంగళవారం శాసనమండలి ఆవరణలో వినూత్న నిరసన తెలిపారు. స్కూటీల ఆకారంలో ఉన్న ప్లకార్డులతో సభ ఆవరణకు చేరుకున్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని వాగ్దానం చేశారని, అధికారంలోకి వచ్చి 15 నెలలైనా హామీ నెరవేర్చలేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు ధ్వజమెత్తారు. 'ప్రియాంకగాంధీ.. స్కూటీలు ఎక్కడ?' అంటూ ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ తదితరులు నినాదాలు చేశారు. అనంతరం మండలి మీడియా పాయింట్ వద్ద కవిత మాట్లాడుతూ కల్యాణమస్తులో భాగంగా తులం బంగారం ఇవ్వలేమన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఆడపిల్లలకు స్కూటీలు ఎగ్గొట్టే పనిచేస్తోందన్నారు.


సమస్యలకు కేంద్రంగా తెలంగాణ..

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను మళ్లీ సమస్యలకు కేంద్రంగా మార్చుతోందని శాసనమండలి బీఆర్‌ఎస్ ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఆరోపించారు. స్టేషన్‌ఘన్‌పూర్ సభలో తామిచ్చిన హామీలు అమలు చేయలేమని స్వయంగా వారే ఒప్పుకోవటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. డిగ్రీ, ఆపై చదివే విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రపంచస్థాయి నగరంగా ఫ్యూచర్ సిటీ

ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

- శాసన మండలి ప్రశ్నోత్తరాలు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు దీటుగా ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఫోర్త్‌సిటీ ఏర్పాటు అంశంపై బీఆర్‌ఎస్ సభ్యుడు శంభీపూర్ రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. అది ఫోర్త్‌సిటీ కాదని ఫోర్ బ్రదర్స్ సిటీ అని శంభీపూర్ రాజు వ్యాఖ్యానించడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రంగారెడ్డి జిల్లాకు చెందిన 7 మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 770 చ.కి.మీ.ల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మెట్రోరైలు విస్తరణపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ మెట్రో స్థానం జాతీయ స్థాయిలో రెండు నుంచి తొమ్మిదో స్థానానికి పడిపోయిందని చెప్పారు. హైదరాబాద్ నగరానికి నలువైపులా మెట్రో విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెట్రో నిర్మాణానికి కేంద్రం సహకరించకపోతే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తామని చెప్పారు.

మూడు నుంచి నాలుగేళ్లలో ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం: కోమటిరెడ్డి

రీజినల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టు (ఆర్‌ఆర్‌ఆర్)ను మూడు నుంచి నాలుగేళ్లలో పూర్తి చేస్తామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రి గడ్కరీని పలుమార్లు కలిసి ప్రాజెక్టు నిర్మాణంపై ప్రతిపాదనలు ఇచ్చామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఓఆర్‌ఆర్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు సహా ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసం చేసిన హైదరాబాద్ సిటీని మరోసారి ప్రపంచ పటంలో గొప్పగా నిలబెడతామని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఓఆర్‌ఆర్‌ను సైతం అమ్ముకున్నారని విమర్శించారు.

మూసీనది పునరుజ్జీవన ప్రాజెక్ట్ చేసి తీరుతాం..

హైదరాబాద్, నల్లగొండ జిల్లాల ప్రజలకు స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన గాలి అందించేందుకు మూసీనది పునరుజ్జీవనం చేసి తీరతామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మూసీనది పునరుజ్జీవన ప్రాజెక్టుపై ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, టి.జీవన్‌రెడ్డి, బల్మూరి వెంకట్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. మూసీలో ఇళ్లు కోల్పోతున్న వారికి ఇప్పటికే 309 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నష్టపరిహారం అందించామని తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి సమస్యపై ఎమ్మెల్సీ తాతా మధు అడిగిన ప్రశ్నకు మంత్రి సీతక్క సమాధానమిస్తూ, తాగునీటి ఎద్దడి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రంగారెడ్డిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల స్వాధీనం

జీరో అవర్‌లో సభ్యుల ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సమాధానం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై విచారణ జరిపించి స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కొంగరకలాన్‌లో సర్వే నెం.300లోని 95 ఎకరాల భూమిని గత ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసిందని, దీని విలువ రూ.2 వేల కోట్లు ఉంటుందని కాంగ్రెస్ సభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం శాసనసభ జీరో అవర్‌లో ఆరోపించగా, మంత్రి పొంగులేటి ఈ మేరకు బదులిచ్చారు. చెరువులను మట్టితో పూడ్చితే విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు.

- గిరిజనులు అధికంగా ఉండే ప్రాంతాలకు అదనంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని పొంగులేటి తెలిపారు. తిరుమలగిరి మండలంలోని 18 గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు.
- ఆరోగ్యశ్రీ పథకం పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఈనెల 17 నుంచి ఆస్పత్రులు నగదు రహిత చికిత్సలను నిలిపేశాయని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు.
- మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థులకు మళ్లీ గుడ్లనే ఇవ్వాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు.
- ఉస్మానియా వర్సిటీలో ఆందోళనలు, నిరసనలపై నిషేధం విధిస్తూ ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఆందోళనలు, నిరసనలు తెలుపుతున్న వారిని అరెస్టు చేయడం తగదన్నారు.
- తనను శాసనసభ నుంచి వెలివేస్తానని సీఎం రేవంత్ పదేపదే అంటున్నారని, తన నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలోనైనా 100 శాతం రుణమాఫీ జరిగితే తానే రాజీనామా చేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాలు విసిరారు.
- విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎండిపోయిన పంటలకు పరిహారం చెల్లింపుపై కూనంనేని సాంబశివరావు ప్రతిపాదించిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్టు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

సమాధానాలు చెప్పలేక సర్కారు పారిపోతోంది

కీలకమైన ప్రశ్నలున్నా 'క్వశ్చన్ అవర్' రద్దు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో 'క్వశ్చన్ అవర్'లో సభ్యులు వేసే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ప్రభుత్వం పారిపోతోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కీలకమైన అంశాలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక 'క్వశ్చన్ అవర్'ను రద్దు చేసిందన్నారు. సభ్యులకు తెలియకుండా ప్రశ్నల్లోనూ మార్పులు జరుగుతున్నా యని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శాసనసభ లాబీల్లో హరీశ్‌రావు మంగళవారం మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. హెచ్‌ఎండీఏ భూములు తాకట్టు పెట్టడంతో పాటు గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ), జల మండలి (హెచ్‌ఎండబ్ల్యూఎస్) నుంచి అప్పులు తెచ్చిన విషయంపై ప్రశ్నలు ఉండటంతో ప్రభుత్వానికి ఇబ్బంది అవుతుందనే ప్రశ్నోత్తరాలను రద్దు చేశారన్నారు. మొత్తం రూ.50 వేల కోట్లు అప్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారు. యాసంగి పంటలు ఎండిపోవడంపై కేటీఆర్‌కు సంబంధించిన ప్రశ్న కూడా ప్రశ్నావళిలో ఉందని, ఈ అంశంపై స్పీకర్‌కు సోమవారం తాను ఫోన్ చేసి క్వశ్చన్ అవర్ రద్దుపై ప్రశ్నించానని తెలిపారు.

ఆంధ్రా జలదోపిడీతో ఎండుతున్న పంటలు

ఆంధ్రా జలదోపిడీ కారణంగా మహబూబ్‌నగర్, నల్లగొండలో పంటలు ఎండిపోతున్నాయని హరీశ్‌రావు విమర్శించారు. వానాకాలం వ్యవసాయ సీజన్‌లో రైతులకు రైతు భరోసా ఇచ్చారా లేదా అనే ప్రశ్న వేస్తే ఏకంగా ప్రశ్నోత్తరాలే రద్దయ్యాయన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడం వల్ల తక్కువ ధరకు రైతులు పంటలు అమ్ముకొని నష్టపోయారని చెప్పారు. రాష్ట్రంలో 50 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ జరగలేదని, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట నియోజకవర్గంలో 42,363 మంది రైతులకుగాను 22,949 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యిందని హరీశ్ చెప్పారు.

నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి

జీరో అవర్‌లో గళమెత్తిన అధికార, విపక్ష పార్టీల సభ్యులు

సాక్షి, హైదరాబాద్: ప్రాజెక్టుల కింద సాగునీరు అందక.. భూగర్భ జలాలు పడిపోయి యాసంగి పంటలెండిపోతున్నాయని పలువురు అధికార, విపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. శాసనసభలో మంగళవారం ఉదయం 10-12 గంటల మధ్య నిర్వహించిన జీరోఅవర్‌లో సాగు, తాగునీటి కష్టాలపై ఎమ్మెల్యేలు గళమెత్తారు.

- కాకతీయకాల్వ డి-89, 97ల కింద నీళ్లు అందక ఆయకట్టు పంటలు ఎండిపోతున్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆందోళన వ్యక్తం చేశారు.
- హుజూరాబాద్ పరిధిలో డీబీఎం-21, 22, 23, 24, 29 కాల్వల కింద ఆయకట్టుకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు.
- భూపాలపల్లి నియోజకవర్గంలో డీబీఎం 38 కాల్వ మరమ్మతులకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.220 కోట్లు ఖర్చు చేసినా, చుక్కనీరు రాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఆరోపించారు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్నారు. 44,470 ఎకరాల పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు.
- దేవాదుల ప్రాజెక్టు మూడో దశలోని ప్యాకేజీ-6 పనులకు నిధులు కేటాయించి సత్వరంగా పూర్తి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కోరగా, బుధవారం మంత్రి ఉత్తమ్ మూడోదశ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బదులిచ్చారు.
- ముధోల్‌లో రెండేళ్ల కింద 100 చెరువులు ధ్వంసం కాగా, పునరుద్ధరణ పనుల కోసం ఇప్పటి వరకు టెండర్లు నిర్వహించలేదని బీజేపీ ఎమ్మెల్యే రామారావు పవార్ అన్నారు. నిధుల మంజూరు కోసం ఆర్థికశాఖకు తిరిగి తిరిగి తన చెప్పులు అరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.
- హైదరాబాద్‌లో 15 రోజులుగా కలుషిత తాగునీటిని సరఫరా చేస్తున్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ చెప్పారు.
- మునుగోడు నియోజకవర్గంలో సాగునీరు అందక, భూగర్భ జలాలు పడిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు పైలాన్‌ను ఏర్పాటు చేసిన చౌటుప్పల్ పట్టణానికే తాగునీటి సరఫరా కావడం లేదన్నారు. రూ.50వేల కోట్లు అప్పు చేసి గత ప్రభుత్వం నిర్మించిన మిషన్ భగీరథ విఫలమైందన్నారు.
- నిర్మల్ నియోజకవర్గంలో పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మీ పార్టీకి ప్రతీది అలవాటు అయ్యింది

జీరోఅవర్‌లో అత్యధిక మంది ఎమ్మెల్యేలు సాగునీరు, తాగునీటి కష్టాలే చెప్పుకున్నారని గంగుల కమలాకర్ విమర్శించగానే మైక్ కట్ అయ్యింది. మీ పార్టీకి ప్రతీది (రాజకీయం చేసే) అలవాటు అయ్యిందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ బీఆర్‌ఎస్ సభ్యులపై అసహనం వ్యక్తం చేశారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ గంగులకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు.

మీ మద్దతు లేకుండా అధికారం కష్టం

- బీసీ సంఘాల అభినందన సమావేశంలో సీఎం రేవంత్
- మీ సహకారంతోనే రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటైంది
- అందుకే మనసు పెట్టి మీకు న్యాయం చేసే ప్రయత్నం చేశా..
- చిత్తశుద్ధితో బీసీల గణన చేశాం.. దానిని చట్టం చేశాం..
- పొలిటికల్ ట్రాప్‌లో పడవద్దని పిలుపు.. 10 లక్షల మందితో సభ పెట్టాలని సూచన



అభినందన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, పొన్నం, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, ఐలయ్య, జాజుల తదితరులు

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాల ప్రజల మద్దతు లేకుండా తెలంగాణలో ఎవరూ అధికారంలో కొనసాగలేరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీసీల సహకారంతోనే రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటైందని చెప్పారు. బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో మనసు పెట్టి పనిచేశానని, పక్కాగా బీసీ జనాభా లెక్కలతో డాక్యుమెంట్ తయారు చేసి, చట్టం చేసి రక్షణ కల్పించామని వెల్లడించారు. బీసీ సంఘాలు పొలిటికల్ ట్రాప్‌లో పడి కుల గణన విషయంలో విమర్శలు చేయవద్దన్నారు. బీసీ బిల్లులు అసెంబ్లీలో ఆమోదం పొందిన నేపథ్యంలో.. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో పలు బీసీ సంఘాలు ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. సీఎంను బీసీ సంఘాల నేతలు శాలువాలతో సత్కరించారు. అనంతరం రేవంత్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''మీరు నాకు అభినందనలు చెబుతున్నారు. ఈ అభినందనలన్నింటినీ మూటగట్టి తీసుకెళ్లి రాహుల్‌గాంధీకిస్తా. భారత్‌జోడో యాత్ర సందర్భంగా కృష్ణా మండలం మీదుగా తెలంగాణలో ప్రవేశించినప్పటి నుంచి చార్మినార్ వరకు రాహుల్‌గాంధీ ఒకటే మాట చెప్పారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చే రాష్ట్రాలతోపాటు కేంద్రంలో అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో కులగణన చేస్తామన్నారు. మీ సహకారంతోనే తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పాటైంది. అందుకే బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో మనసు పెట్టి పని చేశా.

నిబద్ధతతో ముందుకు వెళ్లాం..

కులగణన చేసేందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సబ్‌కమిటీ చైర్మన్‌గా నియమించాం. కొందరు దీన్ని కూడా తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లగలిగిన నిబద్ధత, అధికారులతో పని చేయించగలిగిన నైపుణ్యం ఉన్న నాయకుడు కనుకనే ఆయనకు బాధ్యత ఇచ్చాం. బీసీల జనాభాకు సంబంధించి ఏ పరీక్షకైనా, ఎలాంటి స్క్రూటినీలో అయినా నిలబడేలా పక్కా డాక్యుమెంట్ రూపొందించాం. దాన్ని లాకర్‌లో దాచిపెట్టదల్చుకోలేదు. డాక్యుమెంట్‌ను బిల్లు పెట్టి చట్టం చేశాం. అందుకే బీసీల కులగణన విషయంలో నేను చరిత్రలో ఉండిపోతా. దేశంలో ఏ రాష్ట్రంలో కులగణన జరిగినా తెలంగాణకు వచ్చి నేర్చుకుని పోవాలి. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాసినప్పుడు కూడా ఇంతటి కీర్తిని ఊహించి ఉండరు. అదే తరహాలో తెలంగాణలో బీసీల గణన గురించి ఇప్పటికిప్పుడు చర్చ జరగకపోవచ్చుగానీ ముమ్ముందు మాత్రం కచ్చితంగా తెలంగాణ గురించి చెప్పుకోవాల్సిందే.

తప్పు ఉందంటే.. నష్టం చేసుకున్నట్టే..

బీసీ సోదరులు అర్థం చేసుకోవాలి. కులగణన లో తప్పు ఉందని అంటే.. మీకు మీరు నష్టం చేసుకున్నట్టే. స్వయంగా పర్యవేక్షణ చేస్తూ, అందరినీ భాగస్వాములను చేశాను కాబట్టే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయగలిగాం. వాయిదా వేయాలనుకుంటే పదేళ్లకు కూడా వీడని విధంగా చిక్కుముళ్లు వేయొచ్చు. ఓబీసీలతో కాంగ్రెస్ పార్టీకి చరిత్రాత్మక అనుబంధం ఉంది. బీసీల మద్దతు లేకుండా ఎవరూ అధికారంలో కొనసాగలేరు. అడగాలి కొట్లాడాలే తప్ప మమ్మల్ని అనుమానించి అవమానిస్తే లాభం లేదు. బీసీల గణన విషయంలో తెలంగాణ ఇచ్చిన డాక్యుమెంట్ ఓ బైబిల్, ఖురాన్, భగవద్గీత లాంటిది. అవసరమైనప్పుడు రాజ్యాంగాన్ని కూడా సవరించుకున్నాం. అలాగే ఈ డాక్యుమెంట్‌ను కూడా భవిష్యత్తులో అవసరమైతే సవరించుకుంటాం.

10 లక్షల మందితో సభ పెట్టండి

బీసీ కుల గణన ప్రక్రియలో ఎన్నో పరిణామాలను ఎదుర్కొన్నా. అవన్నీ బయటకు చెప్పను. రిస్క్ చేసి బీసీల జనాభా లెక్కలు తేల్చా. మీరు అభినందనలు ఇక్కడే తెలపడం కాదు. పరేడ్ గ్రౌండ్స్‌లో 10 లక్షల మందితో సభ పెట్టండి. రాహుల్‌గాంధీని పిలిపిస్తా. అభినందించండి. ఆయనకూ బలం వస్తుంది. దేశం మొత్తం కుల గణన జరపాలని పోరాడే శక్తి వస్తుంది' అని సీఎం రేవంత్ అన్నారు. సమావేశంలో కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం, పొంగులేటి, వీహెచ్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు ఈర్ల శంకరయ్య, రాజ్‌ఠాకూర్, వాకిటి శ్రీహరి, ప్రకాశ్‌గౌడ్, బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్‌గౌడ్, టి. చిరంజీవులు, దాసు సురేశ్ పాల్గొన్నారు.

సీఎం చెప్పిన ఏడంతస్తుల కథ

బీసీల కులగణన విషయంలో రాజకీయ నాయకుల విమర్శలను పెద్దగా పట్టించుకోనుగానీ బీసీ సంఘాలు మాత్రం విమర్శలు చేయవద్దని, తమను బాధ పెట్టవద్దని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ''బీసీల గణనకు నేను పునాదులు వేశా. స్లాబ్ వేసి ఓ అంతస్తు కట్టా. ఆ ఇంట్లోకి రండి. వచ్చి కాపురం చేయండి. అన్నం వండుకుని తినండి. మీకు వీలున్నప్పుడు రెండో అంతస్తు, మూడో కట్టుకోండి. అలా కాకుండా మాకు ఏడంతస్తుల భవనం కట్టివ్వలేదు. మేం ఆ ఇంట్లోకి రామంటే మీకే నష్టం. ఏడంతస్తులు కట్టేలోపు పునాదులు శిథిలమై స్లాబ్ కూలిపోతుంది. బీసీ సంఘాలు పొలిటికల్ ట్రాప్‌లో పడొద్దు. నేనిచ్చిన డేటా మీకు లంకెబిందెల్లాంటిది. కొట్లాడితే తెలంగాణ వచ్చింది. కొట్లాడితేనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కొట్లాడితే జనగణనలో కులగణన జరగదా? ఒక్కసారి జనగణనలో కులగణన ప్రారంభమైతే ప్రతి పదేళ్లకోసారి బీసీల జనాభా ఎంత ఉందో తేలిపోతుంది''అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

తెలంగాణ మార్గం చూపింది.. దేశమంతా జనగణన జరగాలి

- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ట్వీట్
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చింది: ప్రియాంక
- మీ ప్రేరణతోనే... మీ నాయకత్వంలోనే: సీఎం రేవంత్ రీట్వీట్



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన మరో వాగ్దానాన్ని నెరవేరుస్తూ బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ఆమోదించిందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. జనగణన విషయంలో తెలంగాణ.. దేశానికి ఓ మార్గం చూపిందని, ఈ జనగణన దేశమంతా జరగాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ మంగళవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'జనగణన ద్వారా మాత్రమే వెనుకబడిన వర్గాల హక్కులు సాధ్యమవుతాయని కాంగ్రెస్ పార్టీ మరోమారు స్పష్టం చేసింది. తెలంగాణ తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా ఇప్పటి వరకు రిజర్వేషన్ల విషయంలో ఉన్న 50 శాతం పరిమితి తొలగింపునకు మార్గం సుగమమైంది. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లభించనుంది' అని రాహుల్ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

మీకు అండగా ఉంటాం: ప్రియాంక



'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చింది. 42% రిజర్వేషన్లతో బీసీ వర్గాలు మరింత అభివృద్ధి సాధిస్తారు. తెలంగాణ ప్రజలు, బీసీ వర్గాలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఇది కేవలం రిజర్వేషన్ల కల్పన మాత్రమే కాదు. సామాజిక న్యాయంపై కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనం. మీరు మమ్మల్ని నమ్మినట్టుగానే, మేం మీకు అండగా ఉంటాం. జై తెలంగాణ, జైహింద్, జైకాంగ్రెస్' అని ప్రియాంక ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.

కలలు సాకారమవుతున్నాయి: సీఎం రేవంత్

రాహుల్, ప్రియాంకాగాంధీలు సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులకు సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. 'గర్వించదగిన రోజు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలను నెరవేర్చుతోంది. రాహుల్, ప్రియాంక నేతృత్వంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కలలను సాకారం చేస్తూ, ప్రజలకిచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ, ప్రతి గ్యారంటీని నిజం చేస్తూ ముందుకెళుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన విప్లవాత్మక నిర్ణయం. సామాజిక న్యాయ అమలులో తెలంగాణ దేశానికి మార్గదర్శనం చేయడం గర్వకారణం. ఆ ఇద్దరి ప్రేరణకు ధన్యవాదాలు' అని రేవంత్‌రెడ్డి రీట్వీట్ చేశారు.



బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం హర్షణీయం

మంత్రి పొన్నంను కలిసిన బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం రూపొందించిన బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవ ఆమోదం దక్కడం గొప్ప విషయమని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ అన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌తో తెలంగాణ సంఘం ప్రతినిధుల బృందం సమావేశమైంది. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు దక్కాల్సిన అవసరం ఉందని, రాజ్యాంగ సవరణతోనే బీసీలకు రిజర్వేషన్ల పెంపు జరుగుతుందని తెలిపారు.

నాలుగు బిల్లులకు ఆమోదం

- శాసన మండలిలో బీసీ బిల్లులు, ఎస్సీ వర్గీకరణ, దేవాదాయ చట్ట సవరణ బిల్లులు క్లియర్
- తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు సాధించుకుందాం: మంత్రి పొన్నం ప్రభాకర్
- కాంగ్రెస్ చిత్తశుద్ధిపై అనుమానం ఉంది: మధుసూదనాచారి

సాక్షి, హైదరాబాద్: శాసన మండలి మంగళవారం నాలుగు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లుతో పాటు దేవాదాయ చట్ట సవరణ బిల్లును కూడా ఓకే చేసింది. బీసీ బిల్లులను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ వర్గీకరణ బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం శాసనమండలిలో ప్రవేశపెట్టారు. ఇక తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూట్స్ అండ్ ఎండోమెంట్స్ అమెండ్‌మెంట్ బిల్లు-2025ను దేవాదాయ మంత్రి కొండా సురేఖ ప్రవేశపెట్టారు.

అంతా కలసి ఒత్తిడి తేవాలి: పొన్నం

కేంద్రం ఈడబ్ల్యూఎస్‌తో 50శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేసిన తరువాత రిజర్వేషన్ల పెంపునకు మార్గం సుగమం అయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. తమిళనాడు తరహాలో కేంద్రంపై అన్ని రాజకీయపార్టీలు కలిసి ఒత్తిడి తీసుకువచ్చి రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రంలో పాస్ చేయించే బాధ్యతను బీజేపీ పార్లమెంట్ సభ్యులు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్‌లో వంద మంది ఎంపీలతో మద్దతు తెలిపేందుకు రాహుల్ గాంధీ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీసీలకు అన్ని ప్రభుత్వాలు అన్యాయం చేశాయని, 42శాతం రిజర్వేషన్లు అందించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

భవిష్యత్తులో పూర్తి సహకారం: మధుసూదనాచారి

బీసీ బిల్లుకు బీఆర్‌ఎస్ తరఫున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని, భవిష్యత్తులో అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి చెప్పారు. కానీ కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిపై తమకు అనుమానం ఉందని పేర్కొన్నారు. ఇక ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే దేశం విచ్ఛిన్నం అవుతుందని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పార్లమెంటులో వ్యాఖ్యానించారని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. బీసీల విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. కాగా.. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బీజేపీ తరఫున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి తెలిపారు. అంతా కలిసి ఉమ్మడి వ్యూహంతో ముందుకు వెళ్లాలని కోదండరాం కోరారు.

దొంగతనానికి దూరంగా ఉండాలి. అంటే, ఇతరులకు చెందిన దేన్నిగానీ వారి అనుమతి లేకుండా స్వాధీనం చేసుకోకూడదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 19 మార్చి 2025

నాగ్‌పూర్ దారుణం

ఉన్నత విద్యలో చరిత్ర, సాహిత్యం, తత్వశాస్త్రం వగైరా మానవ విజ్ఞాన శాస్త్రాల ప్రాధాన్యత అడుగంటి రెండున్నర దశాబ్దాలు దాటుతుండగా చరిత్రను ఆధారం చేసుకుని నిర్మించినట్టు చెబుతున్న సినిమాలు వివాదాస్పదం కావటం, ఉద్రిక్తతలు ఏర్పడటం ఇటీవలి ధోరణి. తాజాగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో రాజుకున్న హింసాకాండ మూలాలు కూడా అక్కడే ఉండటం యాదృచ్ఛికం కాదు. సోమవారమంతా నాగ్‌పూర్‌లో చెలరేగిన హింసలో 33మంది పోలీసులు, అయిదుగురు పౌరులు గాయపడగా రెండు బుల్‌డోజర్లతోసహా అనేక వాహనాలకు దుండగులు నిప్పంటించారు. ఆరో మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సంస్థలు నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పవిత్ర గ్రంథంలోని వాక్యాలున్న చద్దర్‌ను దగ్ధం చేశారన్న వదంతి ఈ హింసకు కారణమని పోలీసులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ నెల మొదటివారం నుంచే మహారాష్ట్రలో ఉద్రిక్తతలు అలుముకున్నాయి. ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ జీవిత ఘట్టాలతో రాసిన ఒక చరిత్రాత్మక నవల ఆధారంగా నిర్మించిన 'ఛావా' సినిమా చుట్టూ తొలుత వివాదం రాజుకుంది. అందులోని ఉదంతాలకు చారిత్రక ఆధారాలు లేవని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎమ్మెల్యే అబూ అసిమ్ అజ్మీ అనడంతోపాటు ఔరంగజేబు క్రూరుడు కాదన్నారు. ఆపై మరిన్ని మలుపులు తిరిగింది. మరాఠా వారసత్వాన్ని అవమానించిన 'ద్రోహి' అజ్మీని వెంటనే అసెంబ్లీనుంచి బహిష్కరించాలని అధికార మహాయుతి ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.

ఈ ఘటనల వెనక ముందస్తు పథకం ఉన్నదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అంటున్న మాటలు వాస్తవం. కానీ ఈనెల మొదటివారంలో సమస్య రాజుకున్నప్పటి నుంచి ఇంటెలిజెన్స్ వర్గాలు, పోలీసులు ఏం చేశారు? దుండగుల కదలికలను అంచనా వేయటంలో ఎందుకు విఫలమయ్యారు? పెట్టుబడుల కోసం, అభివృద్ధి సాధించామని చూపటం కోసం ప్రభుత్వాలన్నీ పోటీపడుతున్న కాలంలో శాంతిభద్రతలను దెబ్బతీసే ఇలాంటి ఘటనల వల్ల అప్రదిష్టపాలవుతామన్న స్పృహ కూడా లేదా? హింసకు ఆద్యులెవరన్నది తేలడం తర్వాత సంగతి. ముందు పౌర జీవనం అస్తవ్యస్తమైంది. ప్రతి ఒక్కరూ బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిన స్థితి. నాగ్‌పూర్ ఆ రాష్ట్రానికి రెండో రాజధాని. జనాభారీత్యా ముంబై, పుణేల తర్వాత మూడో స్థానంలో ఉంటుంది. 300 ఏళ్ల చరిత్రగల ఈ నగరంలో దేశంలోనే తొలి బట్టలమిల్లును టాటాలు స్థాపించారు. 1920 నాటి నాగ్‌పూర్ కాంగ్రెస్ జాతీయ సదస్సులోనే సహాయ నిరాకరణ ఉద్యమం పురుడు పోసుకుంది. ఇక్కడే హెడ్గేవార్ ఆరెస్సెస్‌ను స్థాపించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ 1956 అక్టోబర్ 14న బౌద్ధమతాన్ని స్వీకరించి దళిత బుద్ధిస్ట్ ఉద్యమానికి అంకురార్పణ చేసింది ఇక్కడే. ఇది చదువుల తల్లి నిలయం. 1923లో మొదలైన నాగ్‌పూర్ యూనివర్సిటీ సహా ఇక్కడ అయిదు విశ్వవిద్యాలయాలున్నాయి. అయిదు వైద్య కళాశాలలున్నాయి. ఆటోమొబైల్ పరిశ్రమతోపాటు ఇక్కడ ఎన్నో తయారీరంగ పరిశ్రమలున్నాయి. పుణే తర్వాత ఇక్కడే ఐటీ పరిశ్రమలు ఎక్కువ.

చరిత్రను మలుపుతిప్పిన అనేకులు ఆనాటి అవగాహన, పరిమితుల మేరకు తమ పాత్ర నిర్వహించి నిష్క్రమించారు. వారి చర్యల వెనకున్న ఆంతర్యమేమిటో, అందువల్ల వివిధ వర్గాలకు కలిగిన ఖేదం లేదా మోదం ఏమిటో...వాటి పర్యవసానాలేమిటో విశ్లేషించి చెప్పటం చరిత్రకారులు చేసే పని. అయితే అలా వెలువడే చరిత్రలు నూరు శాతం వాస్తవమని భావించటానికి వీలుండదు. ఎందుకంటే చరిత్రను వక్రీకరించటం మొదలెట్టి చాన్నాళ్లయింది. ఇక సృజనాత్మకత జోడించి రాసే కాల్పనిక రచనల గురించి చెప్పేదేముంది? శంభాజీ తీరుతెన్నులను నిశితంగా విమర్శించేవీ ఉన్నాయి. ఆయన్ను ఆకాశానికెత్తేవీ ఉన్నాయి. అయితే నేరుగా శంభాజీని కలిసి, సంభాషించిన నికొలాయ్ మానుచ్చి అనే ఇటాలియన్ తన యాత్రా రచన 'స్టోరియా దొ మొగర్'లో అనేక అంశాలు రాశాడు. అవి కల్పితం అయ్యే చాన్సు తక్కువ. ఔరంగజేబు 49 ఏళ్లపాటు పాలించి తన 88వ యేట 1707లో మరణించాడు. అతని హయాంలో దాదాపు 25 యేళ్లపాటు యుద్ధాలే సాగాయి. ముఖ్యంగా మరాఠాలకూ, మొగల్ సైన్యానికీ మధ్య తీవ్ర వైరం ఉండేది. ఆ క్రమంలో శంభాజీని హతమార్చి, అతని ఏడేళ్ల కుమారుడు సాహూను ఖైదు చేయటం చరిత్రలో చోటుచేసుకున్న వాస్తవిక అంశాలు. పద్దెనిమిదేళ్ల కారాగారవాసం తర్వాత ఔరంగజేబు మరణానంతరం సాహూ విడుదల కావటం, ఆ తర్వాత రాజ్యాధికారం చేపట్టడం, మరాఠాల ప్రాభవం మరింత పెరిగి, ఉపఖండంలో వారు తిరుగులేని శక్తిగా రూపుదిద్దుకోవటం చరిత్ర. క్రూరత్వమే వీరత్వంగా చలామణి అయిన మధ్యయుగాల్లో ఔరంగజేబు వంటి పాలకుల్లో మంచిని వెదకటంవల్ల కలిగే ప్రయోజనమేమిటో అజ్మీ వంటివారు చెప్పాలి. మహారాష్ట్ర ప్రజలకూ, ముఖ్యంగా మరాఠాలకూ శివాజీతో, ఆయన వారసత్వంతో భావోద్వేగాలతో ముడిపడిన అనుబంధం ఉంటుంది. దాన్ని గాయపరిచి, వివాదాన్ని సృష్టించి ఆయన సాధించదల్చుకున్నదేమిటో అర్థంకాని విషయం. రాజకీయంగా అజ్మీ ఏ పార్టీతో ఉన్నా, ఎంతగా వివాదాస్పదుడైనా బీజేపీ, శివసేనలతోసహా అన్ని పార్టీలతోనూ ఆయనకు సాన్నిహిత్యం వుంది. హత్య కేసు వివాదంలో ఇరుక్కుని మంత్రి పదవి కోల్పోయిన ధనంజయ్ ముండా ఉదంతం నుంచి అధికార కూటమిని కాపాడటానికే ఉద్దేశపూర్వకంగా అజ్మీ ఈ వివాదం రెచ్చగొట్టారని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపణ. ఆ మాటెలావున్నా బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు నోరు అదుపులో ఉంచుకోవటం అవసరం. నాగ్‌పూర్ హింస ఈ సంగతినే తెలియజెబుతోంది.

రిజర్వేషన్లపై ఆచితూచి ముందడుగు

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ ప్రభుత్వం చట్టపరమైన బాధ్యతలతో జాగ్రత్తగా ముందడుగు వేసినట్లు కనిపిస్తున్నది. ఆలస్యాలకు బలికాకుండా శరవేగంగా బిల్లు తయారు చేయడం, పట్టాలు ఎక్కించడం విశేషమే. మంత్రివర్గం ఆరు గంటల దాకా చర్చించింది. చదువులు, ఉద్యోగాలలో బీసీలకు రిజర్వేషన్లను 42 శాతం ఇవ్వాలనుకోవడం; నిర్మాణ, నిర్వహణ కాంట్రాక్టులలో కూడా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం; ఉత్తర్వుగా కాకుండా ప్రత్యేకంగా చట్టం ద్వారా 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం; తెలంగాణ శాసనసభలో ప్రతిపక్షం కూడా వ్యతిరేకించే అవకాశం లేకుండా రిజర్వేషన్లు రూపొందించడం; అందుకే ఏకగ్రీవంగా అందరూ ఈ బిల్లులు ఒప్పుకోవడం; భారత రాజ్యాంగంలో తొమ్మిదవ షెడ్యూల్ కింద రక్షణ ద్వారా కోర్టు తిరస్కరించకుండా జాగ్రత్తలకు ప్రయత్నించడం ఇందులో విశేషాలు.

లెక్కలు లేకపోవడం వల్లే...

ఒక ఆలోచన, నిర్ణయం, బిల్లు అనే దశలు దాటి శాసనసభలో ప్రవేశానికి రావడం విశేషమే. కొన్ని దశాబ్దాల నుంచి రాజకీయాల ద్వారా రిజర్వేషన్ చట్టాలతో ప్రభుత్వాలు ఆటలాడుకున్నాయి. మనం చరిత్రాత్మకమైన నిర్ణయాలు అనుకున్న చట్టాలు, ఓ పదేళ్ల తరువాత సుప్రీంకోర్టు చెత్తబుట్టలో పడిపోయాయి. ఇవన్నీ రాజ్యాంగానికి ముసుగు కప్పి మోసం చేయడం అని వోటర్లకు కూడా అర్థమై ఉండవచ్చు. కానీ తెలంగాణ ప్రభుత్వం కాస్త ఆలోచించి, కొట్టిపడేయకుండా నిలబడే చట్టాలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపిస్తున్నది.

కులగణన ద్వారా బీసీల లెక్క తేల్చి రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. మొదట ఎస్సీ, ఎస్టీ కోటా రాజ్యాంగం ప్రకారం చేర్చారు. అయినా చాలామందికి వెనుకబడిన వారు ఉన్నారని అర్థమైంది. కనుక ఎస్సీ, ఎస్టీ కాక ఇతర వెనుకబడిన వారు (ఓబీసీ) అని చట్టపరమైన నామకరణం చేశారు. ఆ అంశాన్ని సుప్రీంకోర్టు అనేక సార్లు అంగీకరించింది. సరైన లెక్కలు లేకపోవడం వల్ల బీసీ రిజర్వేషన్ల చట్టాలు దెబ్బతిన్నాయనేది చాలామంది అభిప్రాయం. 2024 నవంబర్, డిసెంబర్‌లో సామాజిక, ఆర్థిక, విద్యావిషయ, ఉపాధి, రాజకీయ, కులాల సర్వే నిర్వహించారు. వారిలో 56.33 శాతం మంది జనాలు వెనుకబడినారని చెప్పారు. అందులో హిందువులు, ముస్లింలు, ఎస్సీ, ఎస్టీల నుంచి క్రైస్తవులను కూడా లెక్కించారు.

న్యాయం కోసం పోరాటం

ఎస్సీ, ఎస్టీ కోటాలలో ఉప కోటాలు చేయడానికి దశాబ్దాల పోరాటం చేసిన తరువాత, సుప్రీంకోర్టు కోటాల పునర్విభజన రాజ్యాంగ బద్ధమే అన్నది. కానీ సుప్రీంకోర్టు తీర్పు సరిపోదు. ఎందుకంటే అక్కడ ఒక సూత్రం నిర్ణయమవుతుంది. ఒక్క విషయం మనం మరిచిపోకూడదు. రాజ్యాంగం కింద సమానత సాధించడం కోసం కొన్ని రిజర్వేషన్లు చేసే అధికారం ఉందనీ, అవకాశం ఉందనీ మాత్రమే చెబుతున్నారు. ఆ రాజ్యాంగ నియమాలు ఉన్నంత మాత్రాన, తోచిన రీతిలో జీవోలు, బిల్లులు, చట్టాలు తెచ్చినంత మాత్రాన రిజర్వేషన్లు అమలు జరగవు. అందుకే తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ, ఎస్టీ బిల్లుల ప్రవేశ పరిణామాలు ఏమి ఉంటాయో చర్చించవలసిన అవసరం ఉంది. ఇవన్నీ తెలియకుండానే ఇది చారిత్రక ఘట్టం అనీ, కాదనీ అనడం మంచిది కాదు.



తెలంగాణ శాసనసభ ఆమోదించిన రెండు విడి బిల్లుల ప్రకారం, బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి చేరితే; ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం పెరుగుతాయి. ఇవి మొత్తం 67 శాతం అవుతాయి. ఇవి గాక ముస్లింల రిజర్వేషన్లు 4 నుంచి 12 శాతానికి పెంచాలని ఒక బిల్లును 2017లో ప్రవేశపెట్టారు. కానీ దానికి రాష్ట్రపతి నుంచి ఆమోదం ఇంకా రాలేదు. అయితే, రిజర్వేషన్లు అన్నీ కలిసి గరిష్ఠంగా 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు ఉంది. ఆ న్యాయ వివాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నా, అన్ని పార్టీలూ కలిసి ఏకగ్రీవంగా సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాయి.

అన్వయానికి లోబడి...

రాజ్యాంగంలో ఎన్ని గొప్ప అధికరణాలు ఉన్నప్పటికీ, పీఠికలో అందమైన అంశాలు ఉన్నప్పటికీ, చట్టాలు, నిర్ణయాలు సుప్రీంకోర్టు తీర్పు అన్వయానికి లోబడి ఉండాలి. మొత్తం భారతదేశానికి రిజర్వేషన్లలో 50 శాతం గరిష్ఠ పరిమితి అనే తీర్పు ఉంది. తమిళనాడులో 69 శాతం బీసీ కోటా నిర్ణయం నిలబడిందనే తీర్పు ఆధారంగా 50 శాతం మించినా ఫరవాలేదని వాదిస్తున్నారు. అన్నాడీఎంకే రిజర్వేషన్లను 50 నుంచి 68 శాతానికి పెంచింది. అందులో క్రీమీ లేయర్ కోటాను తీసేశారు. దాంతో అన్నాడీఎంకే ఓడిపోయింది. తరువాత డీఎంకే గెలిచి, ముఖ్యమంత్రి కరుణానిధి మోస్ట్ బ్యాక్‌వర్డ్ (ఎంబీసీ) సృష్టించాడు. వన్నియర్లను కోటాలో చేర్చారు. వారి వాటా కింద 20 శాతం ఇచ్చారు. ఇదిగాక ఎస్టీలకు ఒక శాతం చేర్చారు. మొత్తమ్మీద ఆ లెక్కల ద్వారా రిజర్వేషన్లు 69 శాతానికి చేరాయి. అది 1989లో జరిగింది.

ఆ తరువాత 1992లో ఇంద్రసహానీ కేసులో ఆర్టికల్ 16(4) కింద రిజర్వేషన్లు 50 శాతం కన్న మించకూడదని సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. పట్నా హైకోర్టు 2023లో రిజర్వేషన్లు 50 నుంచి 65 శాతానికి పెంచితే కొట్టివేసింది. బిహార్ మాటే కాదు, హరియాణా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మహారాష్ట్రల్లోనూ అసెంబ్లీలకు భంగపాటు తప్పలేదు. జనాభా ఆధారంగా బీసీల లెక్క 50 నుంచి 52 శాతానికి పెరుగుతుందని అంటున్నారు. 42 శాతం రిజర్వేషన్ల దగ్గరే ఆగితే ఫరవాలేదు. కానీ పూర్తిగా లెక్కలు వేసుకుంటే 50 శాతం దాటితే రిజర్వేషన్లు చెల్లవనే ప్రమాదాలు ఉన్నాయి. ఫలానా రాష్ట్రం 69 శాతం (తమిళనాడు) ఇచ్చిందనీ, అంతకన్నా ఎక్కువ ఎందుకు ఇవ్వకూడదనీ వాదిస్తే సుప్రీంకోర్టు కేసులు ఎదుర్కోక తప్పదు.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

- ◆ తెలంగాణ శాసనసభ ఆమోదించిన రెండు విడి బిల్లుల ప్రకారం, బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి చేరితే; ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం అవుతాయి.
- ◆ సరైన లెక్కలు లేకపోవడం వల్ల బీసీ రిజర్వేషన్ల చట్టాలు దెబ్బ తిన్నాయనేది చాలామంది అభిప్రాయం.
- ◆ సమానత సాధించడం కోసం కొన్ని రిజర్వేషన్లు చేసే అధికారం ఉందనీ, అవకాశం ఉందనీ మాత్రమే రాజ్యాంగం చెబుతోంది. రాజ్యాంగ నియమాలు ఉన్నంత మాత్రాన తోచిన రీతిలో జీవోలు, బిల్లులు, చట్టాలు తెస్తే రిజర్వేషన్లు అమలు జరగవు.

సోషల్ మీడియా

గతం లేదా భవిష్యత్తు



కేంద్ర ప్రభుత్వం మనల్ని 400 ఏళ్ల గతంలోనైనా, 40 ఏళ్ల ముందైనా జీవించేలా బలవంత పెడుతోంది. ఎప్పుడూ వర్తమానంలో ఉండనివ్వడం లేదు. ఔరంగజేబును ద్వేషించు! 'వికసిత్ భారత్' కోసం కలలు కను!! ప్రస్తుత బాధలు మరిచిపో!!

– యశ్వంత్ సిన్హా, కేంద్ర మాజీ మంత్రి

పిడికెడు మట్టి



తన వీలునామా ప్రకారం ఔరంగజేబును సాధారణ 'కచ్చీ ఖబర్'లో ఖననం చేశారు. ఏనాడో ఆయన ఎముకలు మట్టిలో కలిసిపోయి ఉంటాయి. ఆ స్థలానికి పాలరాతి చేర్పులు చాలా కాలం తర్వాత హైదరాబాద్ నిజాం వల్ల జరిగాయి. ఆ జాలీలను ఇప్పుడు తొలగించినా, ఉంచినా ఔరంగజేబుకు నష్టం లేదు. కానీ ఉన్నాడో లేడో తెలీని 300 ఏళ్ల క్రితం చనిపోయిన ఒక మనిషి పేరుతో ద్వేషాన్ని రెచ్చగొట్టి దేశాన్ని తగలబెట్టకుండా ఉండే వివేకం మాత్రం మేల్కొనాలి.

– రాణా సఫ్వీ, చరిత్రకారిణి

ఎందుకు సమర్థన?



హిట్లర్‌లాగే ఔరంగజేబును నేను పట్టించుకోను. ఇద్దరికీ క్రూరమైన చరిత్ర ఉందనడంలో సందేహం లేదు. కానీ హిట్లర్ ఉన్మాదానికి మద్దతిచ్చారని నమ్ముతున్నప్పటికీ హిట్లర్‌ను సమర్థిస్తూ ఇప్పుడు జర్మన్లు ముందుకురారు. అలాంటప్పుడు ఔరంగజేబును సమర్థించేవాళ్లను అనుమానంతో చూడాల్సి ఉంటుంది.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

అసలు గురువు



నిరక్షర వామపక్షీయులకు మోదీ తనను తాను 'విశ్వగురు' అని చెప్పుకోలేదని కూడా తెలీదు. ఆయన దేశం గురించి ఆ మాటన్నారు. చాలామంది మెదళ్లు మొద్దుబారిపోయాయి.

– మోహన్ సిన్హా, జర్నలిస్ట్

అసమానతా మైదానం



ఐపీఎల్ అనేది నిజమైన ఆట కాదు. అందులో దేశం కోసం ఆడటం అనే గర్వం లేదు. లక్షలాది మధ్యతరగతి ప్రేక్షకుల సంపదను కొద్దిమంది మెగా రిచ్ క్లాస్ ఆటగాళ్లు (జాతీయ, అంతర్జాతీయ), టీమ్ ఓనర్లు, బోర్డు, బ్రాడ్‌కాస్టర్లకు బదిలీ చేసే వినోద క్రీడ అది. ఇండియాలో మరే ఆట కూడా ఐపీఎల్‌లా సంపద అసమానతకు కారణం కావడం లేదు.

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

దీనికా?



మా తలుపు దగ్గర ఒక పోలీస్ కనబడితే ఒకింత ఆశ్చర్యపోయాను. ఆయన ఒక ఫొటోను ఆడిస్తూ, 'ఈయన మీకు తెలుసా?' అన్నారు. మా పొరుగు ఫ్లాట్ వైపు చూపిస్తూ, 'ఎక్కువ పరిచయం లేదు. ఏం చేశారు?' అని నెమ్మదిగా అడిగాను. ఒక క్షణం ఆగి, 'పాస్‌పోర్ట్ వెరిఫికేషన్' అన్నారు.

– కాజోల్ శ్రీనివాసన్, కమెడియన్

ఇన్ బాక్స్

పేర్ల మార్పిడితో ఒరిగేదేమిటి?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు, అలాగే 55 సంవత్సరాల నుంచి ఉన్న బల్కంపేట 'గాంధీ ప్రకృతి వైద్యశాల'కు మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య పేరు పెట్టడానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. వైశ్యులకు ప్రాధాన్యం తగ్గకుండా కొత్తగా చర్లపల్లిలో నిర్మించిన రైల్వే టెర్మినల్‌కు కేంద్ర ప్రభుత్వ సహకారంతో 'అమరజీవి పొట్టి శ్రీరాములు టెర్మినల్'గా నామకరణం చేయాలని ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నట్టు ప్రకటించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు వైశ్యుల ప్రతినిధి కాదు. ఆయనను కులం గాటికి కట్టకూడదు. ఆయన విశ్వమానవుడు. ప్రకృతి వైద్యం అంటే గాంధీ అనీ, గాంధీ అంటే ప్రకృతి వైద్యం అనే భావన చాలామంది మదిలో ఉంది. అటువంటి జాతిపిత పేరు తీసి రోశయ్య పేరు పెట్టడం సముచితం కాదు. 55 సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన గాంధీ నేచర్ క్యూర్ హాస్పిటల్, కళాశాల ఏమాత్రం పురోగతి లేకుండా ఉంది. అప్పుడు మొదలుపెట్టిన బిఎన్‌వైఎస్ కోర్సు తప్ప కొత్తగా పెట్టిన డిప్లొమా, పీజీ కోర్సులు ఏవీ లేవు. ఈ ఆస్పత్రి ఎప్పుడూ పేషంట్స్ తాకిడితో రద్దీగా ఉంటుంది. అయితే తొంభై శాతం డాక్టర్లు, సహాయ సిబ్బంది పదవీ విరమణ చేయడంతో ఔట్ సోర్సింగ్ స్టాఫ్‌తో ఆస్పత్రి నడుస్తోంది. సిబ్బంది నియామకం, పరిశోధనను ప్రోత్సహించడం, పీజీ కోర్సును ఏర్పాటు చేయడం వంటి అభివృద్ధికరమైన చర్యలు తీసుకోవాల్సింది పోయి... పేర్ల మార్పు వ్యవహారాన్ని తెర మీదకు తీసుకు రావడం సరైనదేనా అనేది ప్రభుత్వం ఆలోచించాలి.

గాంధీ నేచర్ క్యూర్ ఆస్పత్రికి తోడు జిల్లా స్థాయి ప్రకృతి వైద్యశాలలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం ఈ యాంత్రిక ప్రపంచంలో ప్రజలకు సహజ (ప్రకృతి) వైద్యాన్ని అందుబాటులోకి తెస్తుందని ఆశించడం అత్యాశ కాబోదు. ప్రస్తుతం పేర్ల మార్పిడి తతంగాన్ని అలా వదిలేసి కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకూ, సంస్థలకూ ఇప్పుడు నామకరణం చేయాలనుకున్న పేర్లను పెట్టవచ్చు.

– డా॥ యం. అఖిల మిత్ర, ప్రకృతి వైద్యులు

మానవ సంకల్ప విజయానికి ప్రతీక!

సైన్స్ చరిత్రను తిరగేస్తే యాదృచ్ఛికంగా జరిగిన ఆవిష్కరణలు కోకొల్లలు కనిపిస్తాయి. ఎనిమిది రోజుల పర్యటన కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారతీయ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ తొమ్మిది నెలల సుదీర్ఘ కాలం అక్కడే గడపడమూ ఈ కోవకే చెందుతుంది. ఎందుకంటే... మనిషి యుగాలుగా ఆశిస్తున్న, ఆకాంక్షిస్తున్న గ్రహాంతరయానమనే స్వప్నాన్ని ఈ యాత్ర మరికొంత దగ్గర చేసింది మరి!

సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు తిరిగి భూమిని చేరిన రోజు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది. అంతరిక్ష ప్రయోగాల్లో ఇదో చరిత్రాత్మక ఘట్టంగానే చూడాలి. బోయింగ్ కంపెనీ తయారు చేసిన స్టార్‌లైనర్ అంతరిక్ష నౌకలో సాంకేతిక సమస్యలు రావడం, సకాలంలో వాటిని సరిదిద్దే అవకాశం లేకపోవడంతో ఈ ఇద్దరు వ్యోమగాములు మునుపెవ్వరూ గడపనంత అత్యధిక సమయాన్ని ఐఎస్ఎస్‌లో గడపాల్సి వచ్చింది. భూమికి 408 కిలోమీటర్ల ఎత్తులో తిరుగుతూండే ఐఎస్ఎస్‌లో ఉండటం అంత ఆషామాషీ వ్యవహారం కానేకాదు. అతి తక్కువ గురుత్వాకర్షణ శక్తి ఉంటుందిక్కడ. దీనివల్ల శరీరంలోని ద్రవాలన్నీ ఉండాల్సిన చోట కాకుండా... శరీరం పైభాగంలోకి చేరుతూంటాయి. ఇరవై నాలుగు గంటలకు ఒకసారి సూర్యోదయ, సూర్యాస్తమయాలను చూసే మనిషి... ఐఎస్ఎస్‌లో వీటిని పదహారు సార్లు చూడాల్సి వస్తుంది. ఇది కాస్తా వ్యోమగాముల నిద్రపై ప్రభావం చూపుతుంది. కంటినిండా కునుకు లేక... కుటుంబానికి దూరంగా... ఇరుకైన చిన్న గదిలో నెలలపాటు గడపడం ఎంత కష్టమో మనం ఊహించనైనా ఊహించ లేము. ఊపిరి తీసుకోవడం మొదలుకొని కాలకృత్యాలు తీర్చుకోవడం వరకూ ప్రతి ఒక్కటి మానసికంగానూ, భౌతికంగానూ సవాలే! ఇంతటి శ్రమకోర్చి మరీ వీరు భూమికి తిరిగి వస్తూండటమే ఈ అంతరిక్ష ప్రయోగాన్ని మిగిలిన వాటికంటే ప్రత్యేకమైందిగా మారుస్తోంది.

తొమ్మిది నెలలు చేసిందేమిటి?

గత ఏడాది జూన్‌లో సునీత, విల్మోర్‌లు ఇద్దరూ ఐఎస్ఎస్‌కు ప్రయాణమైనప్పుడు వారి వద్ద ఎనిమిది రోజులకు సరిపడా ప్రణాళికలైతే సిద్ధంగానే ఉన్నాయి. ఏ ఏ ప్రయోగాలు చేపట్టాలి. ఐఎస్ఎస్ నిర్వహణ తాలూకూ పనులు ఏమిటి? అన్నది వీరికి తెలుసు. కానీ అనూహ్యంగా వారి తిరుగు ప్రయాణం నిరవధికంగా వాయిదా పడింది. దీంతో వారికి ఎదురైన సరికొత్త సవాలు అంతకాలం ఏం చేయాలి? అన్నది. నాసా పరిశోధకుల సలహా సూచనల మేరకు వీరు ఈ తొమ్మిది నెలల కాలంలో సుమారు 150 వరకూ పరిశోధనలు చేపట్టారు. జీవ వ్యవస్థలపై సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తి ప్రభావం, అంతరిక్షంలో మొక్కల పెంపకం, బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు అంతరిక్షంలో ఎలా ప్రవర్తిస్తాయి? అన్న ప్రశ్నలకు సమాధానం తెలుసుకునే ప్రయత్నం చేశారు. అంతేకాదు... భవిష్యత్తులో మనిషి సుదీర్ఘకాలం పాటు అంతరిక్ష ప్రయాణాలు చేపట్టాల్సి వస్తే... అంతరిక్ష నౌకల్లో అగ్ని ప్రమాదాల్లాంటివి జరక్కుండా ఉండేందుకు... మంటలు ఎలా వ్యాపిస్తాయి? అన్న విషయంపై పరిశోధనలు నిర్వహించారు కూడా! దీంతో



ఐఎస్ఎస్‌లో బుచ్ విల్మోర్‌తో సునీతా విలియమ్స్

పాటే గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉండటం వల్ల శరీరంలోని కండరాలకు జరిగే నష్టాన్ని నివారించేందుకు యూరోపియన్ ఎన్‌హాన్స్‌డ్ ఎక్స్‌ప్లోరేషన్ ఎక్సర్‌సైజ్ డివైజ్(ఈ4డీ)ని పరీక్షించారు. ఈ పరికరం సైక్లింగ్, రోయింగ్‌లతోపాటు రెసిస్టెన్స్ ఎక్సర్‌సైజ్‌ల ద్వారా వ్యోమగాముల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. అలాగే గ్రహాంతర ప్రయాణాలకు కీలకమైన నీటి పునర్వినియోగం, ప్రత్యేకమైన సూక్ష్మజీవుల ద్వారా మనిషికి అవసరమైన పోషకాల ఉత్పత్తి వంటి అంశాలపై కూడా ప్రయోగాలు చేశారు.

సౌర కుటుంబం మొత్తమ్మీద మనిషి జీవించేందుకు జాబిల్లి తరువాత కొద్దోగొప్పో అనుకూలతలున్న గ్రహం అంగారకుడు. స్పేస్ ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఇంకొన్నేళ్లలోనే మనిషిని అంగారకుడిపైకి చేరుస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఐఎస్ఎస్‌లో సునీతా, విల్మోర్‌లు గత తొమ్మిది నెలలుగా చేసిన ప్రయోగాలకు, పరిశోధనలకు ప్రాధాన్యం ఏర్పడుతోంది. సుదీర్ఘకాలం పాటు అంతరిక్షంలో ఉండటం భౌతికంగా, మానసికంగా ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఈ తొమ్మిది నెలల ప్రయాణం తరువాత శాస్త్రవేత్తలకు కొంత స్పష్టత ఏర్పడి ఉంటుంది. దీని ఆధారంగా భవిష్యత్తులో అంగారక ప్రయాణం జరిగే అవకాశాలు లేకపోలేదు. గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉన్న పరిస్థితుల్లో మన ఎముకలు పెళుసుబారుతాయి. కండరాలు, దృష్టి బలహీనపడతాయి. అలాంటప్పుడు ఏ రకమైన వ్యాయామాల ద్వారా నష్టాన్ని పరిమితం చేయవచ్చునన్నది సునీత, విల్మోర్‌ల పరిశోధనల ద్వారా తెలిసింది. అంతరిక్షంలో ఉండే విపరీతమైన రేడియోధార్మికత నుంచి వ్యోమగాములను రక్షించుకునేందుకు కూడా వీరి ప్రయోగాలు సాయపడతాయి.

వ్యోమగాముల త్యాగాల గురుతులు...

ఎట్టకేలకు సునీత, విల్మోర్‌లు భూమిని చేరనున్నారన్నది అందరికీ సంతోషం కలిగించే వార్తే. కాకపోతే ఆ ఇద్దరు వ్యోమగాములు ఇప్పటివరకూ ఉన్న సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తి వాతావరణం నుంచి సాధారణ పరిస్థితులకు ఎలా అడ్జెస్ట్ అవుతారన్నది ఒక ప్రశ్న. ఇది మరోసారి వారి సహనాన్ని, దృఢ చిత్తాన్ని పరీక్షించనుంది. వ్యోమగాముల శ్రమ, వేదనలను గమనిస్తే మానవ కల్యాణం కోసం వారు ఇంత త్యాగం చేస్తున్నారా? అనిపించకమానదు.

సునీత, విల్మోర్‌లు ఇద్దరూ 300కుపైగా రోజులు అంతరిక్షంలో గడపడం ఒక రికార్డే. అయితే ఇది వారి వ్యక్తిగతమైంది కాదు. మానవ సంకల్పానికి లభించిన విజయమని చెప్పాలి. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా), స్పేస్-ఎక్స్, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భాగస్వాములైన సుమారు 15 దేశాల శాస్త్రవేత్తలు అందరి ఉమ్మడి విజయం. 'చందమామ రావే... జాబిల్లి రావే' అంటూ పాటలకే పరిమితమైన ఒక తరం మాదిరిగా కాకుండా... 'గ్రహరాశులను అధిగమించి, ఘనతారల పథము నుంచి... గగనాంతర రోదసిలో గంధర్వ గోళగతులు దాటి' అంటూ సాగే నవతరానికి స్ఫూర్తి కూడా!

– గిళియార్ గోపాలకృష్ణ మయ్యా, సీనియర్ జర్నలిస్ట్

కృష్ణ మందహాసం

సరిగ్గా యుద్ధం ఆరంభం కాబోతుండగా, అర్జునుడు అకస్మాత్తుగా అశ్రునయనాలతో 'నేను ఈ యుద్ధం చేయలేను!' అనేశాడు. ఆ మాటకు శ్రీకృష్ణుడు చిరునవ్వుతో సమాధానమిచ్చాడు: **'తం ఉవాచ హృషీకేశః ప్రహసన్ ఇవ.'** సమాధానం విషయం తరవాత. తనకు అత్యంత ఆప్తుడూ, మహావీరుడూ అంతటి విషాదగ్రస్తుడై ఉంటే, అచ్యుతుడికి చిరునవ్వు ఎందుకు వచ్చినట్టు అంటే చాలా కారణాలు కనిపిస్తాయి. సమ్మోహనకరమైన చిరునవ్వు శ్రీకృష్ణుడి సహజ లక్షణం. ఆయన నల్లనివాడూ, నవ్వు రాజిల్లెడి మోమువాడూ కదా! అదొక కారణం.

జ్యోతిర్మయం

ఎన్నో ఆశలు తన మీద పెట్టుకొని, ఇంత సేన యుద్ధంలోకి దిగగానే, తమ పక్షంలో అందరికంటె గొప్పవీరుడు 'నేను యుద్ధం చేయను, పొ'మ్మంటే, సామాన్యుడయితే కోపావేశంలో మునిగిపోయేవాడు. కానీ, విషమ సమయంలో ప్రశాంతతను కోల్పోతే, తల పెట్టిన కార్యం తలకిందులవుతుందని ఆ ఘటనాఘటన సమర్థుడికి బాగా తెలుసు. కనక ఆయన చిరునవ్వు చెదరలేదు.

శ్రీకృష్ణుడి చిరునవ్వుకు ముఖ్య కారణం అర్జునుడి ఆవేదన వెనక ఉన్న అజ్ఞానమూ, అమాయకత్వమూ! 'నేను స్వజనాన్ని చంపితే పాపాన్ని పొందుతాను!' అన్న అభ్యంతరం ఆధ్యాత్మిక దృష్ట్యా అన్నివిధాలా అవకతవకగా ఉంది. ఆయన 'నేను, నేను' అని అహంకరిస్తున్నాడు, 'నేను' అంటే ఎవరో గ్రహించకుండా. 'స్వజనం, బంధుమిత్రులూ' అంటూ 'మమ'కారం చూపుతున్నాడు, ఆత్మస్వరూపుడైన తనకు స్వజనం-పరజనం అన్న పరిమితులు లేవని విస్మరించి! 'చంపటం' గురించి వాపోతున్నాడు, చావు గురించిగానీ, చంపేదెవరూ, సమసేదెవరూ అని గానీ సరైన ఎరుక లేకుండా! 'పాపం తగులుతుంద'ని బాధపడుతున్నాడు, ఎటువంటి కర్మల వల్ల పాపపుణ్యాలు చుట్టుకొంటాయో, ఎలాంటి కర్మలవల్ల పాపపుణ్యాల బంధనాలను తప్పించుకోవచ్చో మరచిపోయి!

మహామహా వీరులు కూడా జగన్మాయకు అతీతులు కాలేరు గదా అన్న స్ఫురణ కలిగి, మాధవుడి ముఖాన ముందొక మందహాసం వెలిగింది. ఆ తరవాత వివరంగా గీతాబోధ చేశాడు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.పంచమి రా.8.57 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** విశాఖ రా.8.44 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.10.04 నుండి 11.51 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.45 నుండి 12.32 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.02 నుండి 9.46 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.10, **సూర్యాస్తమయం:** 6.06.

క్లుప్తంగా...

ఆర్డీవో కార్యాలయ సామగ్రి జప్తు

- ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశం
- భూ నిర్వాసితుడికి పరిహారం చెల్లించనందుకు..

ఖమ్మం లీగల్: భూ నిర్వాసితుడికి పరిహారం చెల్లించకపోవడంతో ఆర్డీవో కార్యాలయంలోని కంప్యూటర్లు, ఫర్నిచర్ జప్తు చేయాలని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఆదేశించారు. ఖమ్మం ఖానాపురం బైపాస్ రోడ్డు నిర్మాణానికి 321 గజాల ప్లాటును మానుకొండ వెంకటేశ్వర్లు నుంచి సేకరించారు. ఆయనకు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కోర్టు, హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా స్పందించలేదు. దీంతో ఖమ్మం ప్రిన్సిపల్ జిల్లా న్యాయాధికారి కోర్టులో భూసేకరణ అధికారి ఆర్డీవోపై ఎగ్జిక్యూషన్ పిటిషన్‌ను యజమాని దాఖలు చేశారు. ఈమేరకు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ఆర్డీవో కార్యాలయంలోని కంప్యూటర్లు, ఫర్నిచర్‌ను జప్తు చేయాలని మంగళవారం తీర్పు చెప్పారు. కాగా, భూయజమాని తరపున వంజాకు లక్ష్మీనారాయణరావు వాదించారు.

అసెంబ్లీకి వస్తున్న మాజీ సర్పంచుల అరెస్టు

- సర్పంచుల జేఏసీ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: పెండింగ్ బిల్లులను చెల్లించాలని అసెంబ్లీలో మంత్రులను కోరేందుకు వస్తున్న మాజీ సర్పంచులను పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. తమ సమస్యపై అసెంబ్లీలో చర్చించడంతో పాటు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ఇచ్చేందుకు వెళితే ఎక్కడికక్కడ అరెస్టులు చేశారని మాజీ సర్పంచ్‌లు మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో అసెంబ్లీ సమీపానికి చేరుకున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లులపై వినతిపత్రం సమర్పణకు ప్రయత్నిస్తే అరెస్ట్ చేయడాన్ని జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఖండించారు. సంఘ నాయకులతో కలిసి అరెస్ట్ అయ్యాక ఆయన మీడియాతో మాట్లాడుతూ, తమను తీవ్రవాదులుగా ఎక్కడికక్కడ అరెస్ట్‌లు చేయడం ఏమిటని ప్రశ్నించారు. విపక్షంలో ఉండగా రేవంత్‌రెడ్డి సర్పంచుల బిల్లుల కోసం ధర్నా చేశారని, సీఎం అయ్యాక బిల్లుల విడుదల గురించి ఏ రోజూ మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర సర్పంచుల సంఘం, జేఏసీ నేతలపై పెట్టిన కేసులు కొట్టివేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

26న 'చలో రామోజీ ఫిలింసిటీ'

- పేదల ఇళ్ల స్థలాల విముక్తికి సీపీఎం పిలుపు
- రామోజీ కబ్జాలపై పోరాటానికి నూతన కమిటీ నియామకం

ఇబ్రహీంపట్నం: రామోజీ ఫిలింసిటీ ఆక్రమించిన పేదల ఇళ్ల స్థలాలకు విముక్తి కల్పించేందుకు ఈనెల 26న నిర్వహించనున్న 'చలో రామోజీ ఫిలింసిటీ'కార్యక్రమానికి తరలిరావాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి.యాదయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు పొల్కంపల్లి, నాగన్‌పల్లి, రాయపోల్, ముకునూర్ గ్రామాల బాధిత లబ్ధిదారులతో మంగళవారం రాయపోల్‌లో సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రామోజీ ఆక్రమించిన ఇంటి స్థలాల్లో గుడిసెలేద్దాం.. నిర్బంధాలను ఎదిరించి పేదింటి కలలను సాకారం చేసుకుందాం' అని పిలుపునిచ్చారు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 60 గజాల చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిందని గుర్తుచేశారు. ఇందులో పాగా వేసిన రామోజీ యాజమాన్యం ఇళ్ల నిర్మాణానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించిందని మండిపడ్డారు. ఈ విషయమై కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈనెల 26న బాధితులతో కలిసి ఇళ్ల స్థలాలను ఆక్రమించుకుంటామని వెల్లడించారు. కాగా, రామోజీ ఫిలిం సిటీ కబ్జా చేసిన ఇంటి స్థలాల విముక్తి కోసం పొల్కంపల్లి గ్రామానికి చెందిన పి.జగన్ కన్వీనర్‌గా పోరాట కమిటీని ఎన్నుకున్నారు.

మాదిగ, ఉపకులాల సంఘాల జేఏసీ సంబురాలు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభ ఆమోదించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మాదిగ, మాదిగ ఉపకులాల సంఘాల జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బిల్లు ఆమోదం సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.



మామిడి రైతు ఆగమాగం

▶ మొదటి పేజీ తరువాయి

మామిడి కాయలకు ఆశించిన ధర వచ్చే పరిస్థితి లేదు.

- ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో సుమారు 40 శాతం వరకు మామిడి పిందెలు రాలిపోయాయి. చెట్లకు ఆశించిన మేరకు నీరు అందకపోవడమే దీనికి కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల పరిధిలో మామిడి గోళి కాయ సైజులో ఉన్నప్పుడే టెంకె పురుగు సోకింది. దీంతో కాయ కాస్త పెరగ్గానే రాలిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కోత దశలో దీని ప్రభావం స్పష్టత కనిపిస్తుందంటున్నారు.
- రాష్ట్రంలోనే అత్యధికంగా మామిడితోటలు సాగయ్యే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చెట్లకు పూత దశలోనే తేనెమంచు పురుగు సోకింది. ఇప్పుడు పండు ఈగ సోకే అవకాశాలున్నాయి.

మామిడిలో మరిన్ని జాగ్రత్తలు అవసరం
– హరికాంత్ పొరిక, ఉద్యానవన శాస్త్రవేత్త

ఎండ తీవ్రత నేపథ్యంలో మామిడి తోటలకు తగిన జాగ్రత్తలు అవసరమని కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ



సంగారెడ్డి జిల్లాలోని మామిడితోట

ఉద్యాన వర్సిటీకి చెందిన శాస్త్రవేత్త హరికాంత్ పొరిక చెబుతున్నారు.

వేసవి ప్రారంభంలో మామిడి పూత ఎక్కువగా రాలితే పిందెగా ఉన్నప్పుడు 10 గ్రాముల మోనో పొటాషియం ఫాస్ఫేట్, 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దీనివల్ల పూమొగ్గల సంఖ్య పెరుగుతుంది. కాయ ఎదుగుదల సమయంలో మరోసారి పిచికారీ చేయాలి. ఎక్కువగా పిందె రాలుతున్నట్టు గమనిస్తే మార్కెట్‌లో దొరికే ఎన్.ఎ.ఎ. మందును 2.5 గ్రా./100 నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బోరాన్ లోపాన్ని సవరించడానికి 1.25 గ్రా. బోరాక్స్‌ను కాయ ఎదుగుదల సమయంలో పిచికారీ చేయాలి. మార్చి నెలలో 3 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలి. ఏప్రిల్‌లో మెగ్నీషియం, ఇనుప ధాతు లోపాలను సవరించడానికి 3 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, 3 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలి.

దిగుబడులపై తీవ్ర ప్రభావం



ఒక వారంలోనే అతి తక్కువ, అతిఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణంలో ఈ అసాధారణ మార్పులు పండ్ల తోటలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ముఖ్యంగా మామిడిపై ఎక్కువగా ఉంటుంది. 13 డిగ్రీల కంటే ఉష్ణోగ్రత తగ్గితే మామిడి దిగుబడి పడిపోతుంది. ఆయా జిల్లాల్లో మామిడిపంటలకు సోకుతున్న చీడపీడలను గమనించి వెంటనే నివారణ చర్యలు చేపట్టేలా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాము.

–డాక్టర్ వి.సుచిత్ర, సీనియర్ సైంటిస్ట్, ఫ్రూట్ రీసెర్చ్‌స్టేషన్, సంగారెడ్డి

పిందె దశలోనే రాలిపోయింది



మామిడి తోటను రూ.2.50 లక్షలకు కౌలుకు తీసుకున్నా. పూతకు ముందే చీడపీడలు ఆశించాయి. మందులు పిచికారీ చేశాం. పూత సమయంలో నల్లి, బూజు ఆశించాయి. సస్యరక్షణ చర్యలు చేపట్టాం. అత్యధిక శాతం పూత చిగురుగా మారింది. కాసిన కాతలో అధికభాగం పిందె దశలోనే పండుగా మారి రాలిపోతోంది.

– ముంతాజ్‌బేగం, రొంపేడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

70 శాతం పిందె రాలిపోయింది



పూతతోపాటు ఇప్పుడిప్పుడే వస్తున్న పిందెపై ప్రభావం పడుతుంది. కొన్ని పిందెలు రాలిపోతున్నాయి. పూత నిలబడటానికి రూ.2.50 లక్షల విలువ చేసే మందులను పిచికారీ చేశాను. కూలీలకు రూ.60 వేల వరకు ఖర్చు చేశారు. అయినా, 70 శాతం పిందె రాలిపోయింది.

– స్వతంత్రం, భువనగిరి జిల్లా

వైరస్ సోకి పూత రాలింది



రెండు ఎకరాల మామిడి తోటలో 70 చెట్లు ఉన్నాయి. వైరస్ సోకి పూత పూర్తిగా రాలిపోయింది. చెట్లకు అసలు పిందెలు లేవు. చాలా నష్టం జరిగింది. అధికారులు సర్వే చేసి పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– గంగారాం, మందర్నా గ్రామం, నిజామాబాద్ జిల్లా

ఇల్లెందుకు 'సీతారామ' నీళ్లివ్వండి

సీఎంకు విన్నవించిన మాజీ ఎమ్మెల్యే నర్సయ్య

సాక్షి, హైదరాబాద్: సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లెందు నియోజకవర్గానికి తరలించాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, బోడు, కొమరారం మండలాల ఏర్పాటు, ఇల్లెందు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య.. సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అధికారులు, అఖిలపక్షాలతో భేటీ ఏర్పాటు చేయాలని మంత్రి ఉత్తమ్‌కు సీఎం సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్యేలు ఊకె అబ్బయ్య, రాంచంద్రునాయక్, మురళీ నాయక్, రాందాసు నాయక్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేల కృతజ్ఞతలు

ఎస్సీల వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించినందుకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో సీఎంను కలిసిన వారిలో ఎస్సీ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, లక్ష్మీకాంతరావు, కాలె యాదయ్య, మందుల శామ్యేల్ ఉన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన గిరిజన నేత కె.శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చినందుకు పలువురు గిరిజన ఎమ్మెల్యేలు సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలతో పాటు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ఆమోదించినందుకు మాజీ ఎంపీ వి.హనుమంతరావు కూడా సీఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడి నర్సయ్య. చిత్రంలో ఉత్తమ్, సీతక్క, కోరం, వేం తదితరులు

పంటలు చేతికందేవరకు దేవాదుల నీరు

- స్టాండింగ్ క్రాప్స్‌ను కాపాడుతాం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- దివంగత నేత వైఎస్‌ఆర్ వల్లే దేవాదుల ఎత్తిపోతల: మంత్రి పొంగులేటి

సాక్షిప్రతినిధి, వరంగల్ : ఉమ్మడి వరంగల్‌లో దేవాదుల ప్రాజెక్టు కింద వేసిన పంటలు చేతికందే వరకు సాగునీటిని సరఫరా చేస్తామని..స్టాండింగ్ క్రాప్స్ లాస్ కాకుండా చూస్తామని రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎంత రాత్రయినా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో పంపుహౌస్‌లో ఉన్న 800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేసే పంప్ స్విచ్చాన్ చేశాకే హైదరాబాద్‌కు వెళతానని ఆయన స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు ప్రగతిపై చర్చ, అదనంగా పంప్‌లను ఆన్‌చేసి జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల చివరి ఆయకట్టుకు సాగునీటి విడుదల చేసేందుకు మంగళవారం సాయంత్రం ఆయన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటకు చేరుకున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నీటిపారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, కలెక్టర్ ప్రావీణ్య, ఇంజనీరింగ్ అధికారులతో ఈ సందర్భంగా ఉత్తమ్ దేవాదుల ప్రాజెక్టుపై సమీక్షించారు. అనంతరం మీడియాతో ఉత్తమ్ మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం అని చెప్పారు.

గోదావరి జలాలు అందించాలని..: పొంగులేటి

2004లో దివంగత నేత డాక్టర్ వైఎస్‌ఆర్ జలయజ్ఞంలో భాగంగా గోదావరి నీళ్లను 5.57 లక్షల ఎకరాలకు అందించాలని దేవాదుల ప్రాజెక్టును ప్రారంభించారని, ఫేస్-1, 2 పూర్తయి గత ప్రభుత్వం వైఫల్యం వల్ల ఫేస్- 3 పనులు ఆగిపోయాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు ఫేస్-3 పూర్తి చేస్తున్నామని చెప్పారు.

నిట్ గెస్ట్‌హౌస్‌లో రాత్రి 11:30 దాకా వేచిచూసి...

'జనగామ జిల్లాలో కొన్ని చోట్ల పంటలు ఎండిపోతున్నాయి. దేవాదుల ఎత్తిపోతల పథకం మోటార్‌ను ప్రారంభిస్తే 50-60 వేల ఎకరాలకు నీరు అందుతుంది. అయితే టెక్నికల్ సమస్యతో ట్రయల్‌రన్ ఆలస్యమైంది. మరమ్మతు పనుల్లో ఆస్ట్రియా నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఉంది. మరో నాలుగు గంటల్లో రిపేర్లు పూర్తి కావొచ్చు. రాత్రి 11 గంటలే కాదు ఎంత సమయం పట్టినా మోటార్‌ను ఆన్ చేశాకే వెళతానని'మంత్రి ఉత్తమ్ హనుమకొండ 'నిట్' గెస్ట్‌హౌస్‌లోనే వేచి ఉన్నారు. మరమ్మతులు ఆలస్యం కావడంతో రాత్రి 11:30 తర్వాత ఉత్తమ్ హైదరాబాద్‌కు వెళ్లారు.



పంప్‌హౌస్ వద్ద పూజలు చేస్తున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రి పొంగులేటి, కడియం శ్రీహరి తదితరులు

ఈడబ్ల్యూఎస్ కోటా కింద రూ. వెయ్యికోట్లు ఇవ్వండి

సీఎం, టీపీసీసీ అధ్యక్షుడికి ఎమ్మెల్యేల వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు పలువురు ఎమ్మెల్యేలు ధన్యవాదాలు తెలిపారు. ఇదే విధంగా అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా ఈడబ్ల్యూఎస్ కోటా కింద అదనంగా రూ.వెయ్యి కోట్లు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు సీఎం, పీసీసీ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, వేముల వీరేశం, వీర్లపల్లి శంకర్, పర్ణికారెడ్డి, బాలూనాయక్, అనిల్ కుమార్‌రెడ్డి, మేఘారెడ్డి, రాజేందర్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాజ్ ఠాకూర్ తదితరులున్నారు. ఈ అంశంపై సీఎం సానుకూలంగా స్పందించారని, వార్షిక బడ్జెట్‌లో దీనికి తగిన కేటాయింపులు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యేలు వెల్లడించారు.

వర్గీకరణపై సీఎంకు ధన్యవాదాలు

మాదిగ హక్కుల దండోరా

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. దళితులలో వెనుకబడిన వర్గాలందరికీ విద్య, ఉద్యోగ రంగాలలో సమానావకాశాలు దక్కాలని చేసిన పోరాటం నేటికి ఫలించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ సహా అన్ని రాజకీయ పార్టీలకు మాదిగ హక్కుల దండోరా పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా | బొగ్గు ఉత్పత్తి, రవాణా పెరగాలి

- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్



సాక్షి, హైదరాబాద్ : విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా పెరగాలని సింగరేణి సీఎండీ బలరాం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సింగరేణితో ఇంధన ఒప్పందమున్న అన్ని విద్యుత్ కేంద్రాలకు రోజుకు కనీసం 50 రేకుల(వ్యాగన్లు) వరకు బొగ్గును రవాణా చేయాల్సిన అవసరముందని గుర్తు చేశారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని గనుల్లోనూ వేసవి జాగ్రత్త చర్యలను పాటించాలని స్పష్టం చేశారు. రాబోయే మూడు నెలల్లోనూ విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉత్పత్తి, రవాణాకు విఘాతం కలగకుండా అన్ని కాంట్రాక్టులకు ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు.

మిథనాల్ తయారీ ట్రయల్‌రన్ విజయవంతంపై హర్షం

ఎస్టీపీపీలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన కార్బన్ డై యాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ ట్రయల్‌రన్ విజయవంతం అవడం పట్ల సీఎండీ హర్షం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల్లోనే పూర్తిస్థాయిలో మిథనాల్ ఉత్పత్తి చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణరావు, సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఈడీ ఎస్‌డీ ఎం.సుభాని, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

ఓయూ నిషేధాజ్ఞలపై పోరు

- జేఏసీగా పది విద్యార్థి సంఘాలు
- నేడు 10 గంటల రాస్తారోకో
- రేపు పాలన భవనం ఎదుట భారీ ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిషేధాజ్ఞలపై పోరుకు పది విద్యార్థి సంఘాలతో ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీని ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట మంగళవారం బీఆర్‌ఎస్‌వీ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, ఎంఎస్‌ఎఫ్, ఎస్‌ఎస్‌యూ, టీఎస్‌యూ, వీఏఎస్ తదితర సంఘాల విద్యార్థి నాయకులు సమావేశమయ్యారు. విద్యార్థుల గొంతు నొక్కే అప్రజాస్వామిక ఉత్వర్వుల రద్దుకు ఐక్యంగా ఉద్యమించాలని నిర్ణయించారు. బుధవారం 10 గంటల రాస్తారోకో, గురువారం ఓయూ పాలన భవనం ఎదుట భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఓయూ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

వీసీ ఉత్తర్వులను రద్దు చేయాలి

మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ధర్నాలు, నిరసనలను నిషేధిస్తూ వీసీ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని వర్సిటీ ఆర్ట్స్ కళాశాల మాజీ అధ్యక్షుడు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగలేఖ రాశారు. ఉస్మానియా వర్సిటీ అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే నిలుపు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు, నిరసనలు తెలపడం వారి హక్కు అని స్పష్టం చేశారు. విద్యార్థి సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నా చేస్తున్న విద్యార్థులను అకారణంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.


హిందీ రుద్దడాన్ని ప్రతిఘటించాలి

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

సాక్షి, హైదరాబాద్: త్రిభాషా సూత్రం పేరుతో హిందీని దక్షిణాది, హిందీయేతర రాష్ట్రాలపై బీజేపీ కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రుద్దుతోందని, ఇలాంటి నియంతృత్వ పోకడలను ప్రతిఘటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ కోరారు. యూజీసీ నూతన నిబంధనలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల దుష్టలక్ష్యమైన 'విపక్ష్ ముక్త్'(ప్రతిపక్ష రహిత) భారత్ నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలతో కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 'మావోయిస్టు ముక్త్ భారత్'పేరుతో బీజేపీ కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న 'కగార్'దాడులను వ్యతిరేకించాలని అభయ్ కోరారు.

వివాదాస్పద భూముల గెజిట్‌పై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివాదాస్పద భూములు, భవనాల వివరాలపై గెజిట్ జారీ చేయాలంటూ దాఖలైన వ్యాజ్యంలో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని రెవెన్యూ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. వివాదాస్పద భూములు, భవనాలపై గెజిట్ ప్రచురించాలని, వీటిని రెవెన్యూ కార్యాలయాల్లో, స్థానిక సంస్థల ఆఫీసుల్లో ప్రజలకు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులైన అధికారులకు నోటీసులు జారీ చేసింది.

మండల స్థాయిలో పంటల పర్యవేక్షణకు కమిటీలు

'సాక్షి' కథనంపై స్పందించిన వ్యవసాయశాఖ సంచాలకుడు గోపి

సాక్షి, హైదరాబాద్: భూగర్భ జలాల క్షీణత, కాలువల్లో తక్కువ నీటి లభ్యత కారణంగా కొన్ని జిల్లాల్లో వరి పంటకు సంబంధించి కొంతమేర తేమ తగ్గిందని వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం మండల స్థాయిలో వ్యవసాయ, నీటిపారుదల శాఖాధికారులతోపాటు తహసీల్దార్‌ను ఒక కమిటీగా వేసి, నిరంతరం పంటలను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ఈ కమిటీలోని అధికారులు పంటలను పర్యవేక్షిస్తూ రైతులకు అందుతున్న నీటి వినియోగం గురించి తెలుసుకుంటూ, ప్రత్యామ్నాయంగా వరికి అవసరమైన నీటి వనరులు సమకూరుస్తారని వివరించారు. 'సాక్షి'దినపత్రికలో సోమవారం 'లక్ష ఎకరాల్లో ఎండిన వరి'శీర్షికతో ప్రచురితమైన కథనానికి గోపి స్పందించారు. రాష్ట్రంలో యాసంగి 2024-25 సంవత్సరంలో 74 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని, గతేడాది యాసంగి సాగు విస్తీర్ణంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం యాసంగిలో సాగు విస్తీర్ణం 7.5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పెరిగిందన్నారు. ఇందులో వరి సాగు విస్తీర్ణం 5.4 లక్షల ఎకరాలు అంటే 10.6 శాతమని, మొక్కజొన్న 1.6 లక్షల ఎకరాల్లో (23.5%) గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు.

శ్రేయ హియరింగ్ క్లినిక్‌తో వినికిడి శక్తి సంరక్షణ

సాక్షి, హైదరాబాద్: చేతికి దగ్గరలో ఉన్న ఎవరికైనా.. మీ మాట వినిపించడం లేదా? అందుకు మీ గొంతు పెంచాల్సి వస్తోందా?.. అయితే ఆ ధ్వని చాలా ఎక్కువగా ఉన్నట్లే పరిగణించండి.. అంటున్నారు శ్రేయ హియరింగ్ క్లినిక్ నిర్వాహకులు. పని వద్ద పెద్ద శబ్దం ఉన్న యంత్రాలుంటే, సురక్షిత ఇయర్ ప్లగ్‌లు లేదా ఇయర్ మఫ్‌లను ధరించాలన్నారు. రద్దీరహదారికి సమీపంలో నివసిస్తుంటే, రాత్రి ట్రాఫిక్ శబ్దం ఇబ్బందికరంగా అనిపిస్తే, స్లీపింగ్ ఇయర్ ప్లగ్‌లను వాడాలంటున్నారు. శ్రేయ హియరింగ్ క్లినిక్‌లు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్నాయి. శబ్దం లేదా వయసు సంబంధిత, ఇతర కారణాల వల్ల ఏర్పడే వినికిడి లోపాన్ని అధిగమించేందుకు ఈ క్లినిక్‌లు ఎంతో సహాయపడుతున్నాయి. ఉత్తమ వినికిడి సహాయ యంత్రాలను సిఫార్సు చేయడం ద్వారా.. తమ క్లయింట్ల వినికిడి శక్తిని మెరుగుపరిచామని శ్రేయ హియరింగ్ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ సత్య రాణా తెలిపారు.

చట్టం మేరకే ఆధార్-ఓటర్ కార్డ్ అనుసంధానం

సుప్రీంకోర్టు మార్గదర్శకాలనూ పాటిస్తాం: ఈసీ

న్యూఢిల్లీ: చట్టానికి లోబడే, సుప్రీంకోర్టు గత తీర్పులు, మార్గదర్శకాలను అనుసరిస్తూ ఆధార్-ఓటర్ కార్డు అనుసంధాన ప్రక్రియను చేపడతామని భారత ఎన్నికల సంఘం(ఈసీ) మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) ఉన్నతాధికారులు, అందులోని సాంకేతిక నిపుణులతో సంప్రదింపుల ప్రక్రియకు త్వరలో శ్రీకారం చుడతామని ఈసీ వెల్లడించింది. ఇందులోభాగంగా మంగళవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శి, న్యాయశాఖలో సంబంధిత కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లతో ఈసీ చర్చలు జరిపింది. ఈ భేటీలో ఈసీ తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు పాల్గొన్నారు. ఆధార్- ఓటర్ అనుసంధానం ఇంకా మొదలుకాలేదని 2023 ఏప్రిల్‌లో రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంగా కేంద్రప్రభుత్వం వెల్లడించిన విషయం విదితమే. ఓటర్ కార్డుతో ఆధార్ అనుసంధానం కాని వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించబోమని నాడు ప్రభుత్వం స్పష్టంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం భారతీయ పౌరులకు మాత్రమే ఓటేసే హక్కు ఉంటుంది. ఆధార్‌కార్డు అనేది కేవలం ఒక గుర్తింపు మాత్రమేనని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. '' ఓటర్ల గుర్తింపు కార్డు (ఈపీఐసీ)ని ఆధార్‌తో అనుసంధానించడం అనేది కేవలం రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని 23(4), 23(5), 23(6) సెక్షన్ల నిబంధనలు, 2023 ఏడాదిలో సుప్రీంకోర్టు వెలువర్చిన తీర్పుకు అనుగుణంగా చేయాలని ఈ భేటీలో నిర్ణయించాం'' అని మంగళవారం ఈసీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఓటర్ అభీష్టం మేరకే అతని ఓటర్‌కార్డును ఆధార్ డేటాబేస్‌తో అనుసంధానించాలని చట్టం నిర్దేశిస్తోంది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి తన గుర్తింపును నిర్ధారించుకోవడానికి తన ఆధార్ వివరాలను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు ఇవ్వాలా వద్దా అనే స్వీయ విచక్షణాధికారం ఓటర్‌కే ఉంటుందని ఎన్నికల నియమాలు(సవరణ),చట్టం, 2021, ప్రజాప్రతినిధుల చట్టం,1950లోని సెక్షన్ 23 సూచిస్తున్నాయి.

గుడ్‌బై ఐఎస్ఎస్

భావోద్వేగం నడుమ సునీత వీడ్కోలు


- నలుగురు వ్యోమగాములను ఆప్యాయంగా సాగనంపిన సహచరులు
- ఫొటోలు, సెల్ఫీలతో సందడి

కేప్ కెనవెరాల్: తొమ్మిది నెలలకు పైచిలుకు అంతరిక్ష వాసానికి తెర పడింది. భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్‌తో పాటు నాసాకు చెందిన మరో వ్యోమగామి బచ్ విల్మోర్ మంగళవారం స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్ వ్యోమనౌకలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి భూమికి బయల్దేరారు. గత సెప్టెంబర్లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన ఇద్దరు వ్యోమగాములు నిక్ హ్యాస్, అలెగ్జాండర్ గోర్బనోవ్ కూడా వారితో పాటు తిరిగొస్తున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10.30 తర్వాత వ్యోమనౌక ఐఎస్ఎస్ నుంచి విడివడింది. కాసేపటికి భూమివైపు 17 గంటల ప్రయాణం ప్రారంభించింది. వాతావరణం అనుకూలిస్తే బుధవారం తెల్లవారుజామున 2.41కి అది భూ కక్ష్యలోకి ప్రవేశించనుంది. ఆ క్రమంలో వాతావరణంతో రాపిడి వల్ల పుట్టుకొచ్చే విపరీతమైన వేడికి క్యాప్సూల్ మండిపోకుండా అందులోని హీట్‌షీల్డ్ రక్షణ కవచంగా నిలుస్తుంది. కాసేపటికి వ్యోమనౌకలోని నాలుగు ప్యారాచూట్లు తెరుచుకుని దాని వేగాన్ని బాగా తగ్గిస్తాయి. చివరికి క్యాప్సూల్ గంటకు కేవలం 5 కి.మీ. వేగంతో తెల్లవారుజాము 3.27 గంటలకు అమెరికాలో ఫ్లోరిడా తీరానికి సమీపంలో సముద్రంలో దిగుతుంది. ఆ వెంటనే నలుగురు వ్యోమగాములను ఒక్కొక్కరుగా అందులోంచి బయటికి తీసుకొస్తారు. అనంతరం తదుపరి పరీక్షల నిమిత్తం నేరుగా నాసా కేంద్రానికి తీసుకెళ్తారు.



డ్రాగన్ వ్యోమనౌకలోకి ప్రవేశించాక...

సునీత బృందం తిరుగు ప్రయాణం సందర్భంగా ఐఎస్ఎస్‌లో భావోద్వేగపూరిత సన్నివేశాలు చోటుచేసుకున్నాయి. తిరుగు ప్రయాణంలో ఎదురయ్యే విపరీతమైన పీడనం, ఒత్తిళ్లను తట్టుకునేందుకు అనువైన స్పేస్ సూట్, హెల్మెట్, బూట్లు తదితరాలు ధరించి వారంతా చివరిసారిగా ఐఎస్ఎస్‌లో కలియదిరిగారు. స్పేస్ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌకలో ఆదివారం ఐఎస్ఎస్‌కు చేరుకున్న వ్యోమగాములతో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. వారిని ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. అనంతరం సునీత బృందానికి వారు వీడ్కోలు పలికారు. ''మిమ్మల్ని ఎంతగానో మిస్సవుతాం. మీ ప్రయాణం అద్భుతంగా సాగాలి'' అని నాసా ఆస్ట్రోనాట్ అన్నే మెక్‌క్లెయిన్ ఆకాంక్షించారు. సునీత తదితరులు తమ వస్తువులతో వ్యోమనౌకలోకి చేరుకోగానే దాని ద్వారాన్ని మూసేశారు. రెండు గంటలపాటు పూర్తిస్థాయి పరీక్షలు చేసి అంతా సరిగానే ఉందని నిర్ధారించారు. అనంతరం డ్రాగన్ భూమికేసి బయల్దేరింది. 2024 జూన్ 5న బోయింగ్ స్టార్‌లైనర్ తొలి మానవసహిత ప్రయోగంలో భాగంగా సునీత, విల్మోర్ ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ఎనిమిది రోజుల్లోనే తిరిగి రావాల్సి ఉండగా స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యల కారణంగా వీలుపడలేదు.



ఐఎస్ఎస్ నుంచి విడివడుతున్న స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్ వ్యోమనౌక (ఇన్‌సెట్లో) భూమికి తిరిగొస్తూ...

మా హృదయాల్లో ఉన్నారు: మోదీ

భారత్ రావాలంటూ సునీతకు లేఖ

సునీతా విలియమ్స్ సాధించిన విజయాల పట్ల 140 కోట్ల పై చిలుకు భారతీయులు ఎంతగానో గర్విస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2016లో అమెరికా పర్యటన సందర్భంగా సునీతను, ఆమె తండ్రి దివంగత దీపక్ పాండ్యాను కలిశానని గుర్తు చేసుకున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షులు జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్‌లతో భేటీ అయినప్పుడు కూడా ఆమె క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నట్టు చెప్పారు. ''మీరు వేలాది మైళ్ల దూరంలో ఉన్నా మా అందరి హృదయాలకు ఎప్పుడూ అత్యంత సన్నిహితంగానే ఉంటారు. అతి త్వరలో మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఆత్రుతగా ఉన్నాం. తిరిగి రాగానే భారత్‌కు రండి. అద్వితీయ విజయాలు సాధించిన మీవంటి ఆత్మీయ పుత్రికకు ఆతిథ్యమిచ్చేందుకు దేశం ఎదురు చూస్తోంది'' అంటూ సునీతకు లేఖ రాశారు. దీనిపై ఆమె సంతోషం వెలిబుచ్చారు. మోదీకి, భారత ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వీకుల గ్రామంలో ప్రార్థనలు

మెహసానా: సునీత క్షేమంగా భూమికి తిరిగి రావాలంటూ గుజరాత్‌లోని మెహసానా జిల్లాలో ఉన్న ఆమె గ్రామం ఝులాసన్‌లో అంతా ప్రార్థనలు చేశారు. పలువురు గ్రామస్తులు ఒక రోజు ముందునుంచి అఖండ జ్యోతులు వెలిగించారు. బుధవారం సునీత క్షేమంగా దిగేదాకా అవి వెలుగుతూనే ఉంటాయని ఆమెకు సోదరుని వరసయ్యే నవీన్ పాండ్యా వివరించారు. ''ఆ తర్వాత భారీ ఎత్తున వేడుకలకు కూడా సర్వం సిద్ధమైంది. సునీత ఫొటోలు పట్టుకుని స్కూలు నుంచి ఆలయం దాకా ఘనంగా ఊరేగింపు నిర్వహిస్తాం'' అని చెప్పుకొచ్చారు. స్థానిక స్కూలు విద్యార్థులైతే 15 రోజులుగా ప్రార్థనలు చేస్తున్నారని ప్రిన్సిపల్ చెప్పారు. సునీత తండ్రి దీపక్ పాండ్యా 1957లో అమెరికా వెళ్లి స్థిరపడ్డారు. 2006, 2013ల్లో సునీత ఝులాసన్ వచ్చివెళ్లినట్టు ఆమె బంధువులు గుర్తు చేసుకున్నారు. తనను మరోసారి ఆహ్వానిస్తామని చెప్పారు.

యుద్ధానికి పాక్షిక విరామం

రష్యా అధ్యక్షుడు పుతిన్ సుముఖత

మౌలిక వనరులపై దాడులు ఆపుతామని ప్రతిపాదన

ఉక్రెయిన్‌కు సైనిక సాయం నిలిపేయాలని షరతు

- వాటితోపాటు మరిన్ని డిమాండ్లు
- ట్రంప్‌తో గంటకు పైగా ఫోన్ చర్చలు
- పశ్చిమాసియా వేదికగా చర్చలు: వైట్‌హౌస్
- ద్వైపాక్షిక బంధాల పునరుద్ధరణ
- త్వరలో భారీ ఆర్థిక ఒప్పందాలు
- చరిత్రాత్మకంగా అభివర్ణించిన రష్యా



వాషింగ్టన్/మాస్కో: రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి తెర దించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా, అమెరికా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్, డొనాల్డ్ ట్రంప్ మంగళవారం జరిపిన ఫోన్ చర్చలు ఇందుకు వేదికయ్యాయి. ఉక్రెయిన్‌పై దాడులకు పాక్షికంగా విరామమిచ్చేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సుముఖత వ్యక్తం చేశారు. అందులో భాగంగా మౌలిక వనరులు, విద్యుదుత్పత్తి, ఇంధన వ్యవస్థలు తదితరాలపై దాడులు జరపబోమని ప్రతిపాదించారు. అయితే అందుకు ప్రతిగా అమెరికా, దాని మిత్ర దేశాలు ఉక్రెయిన్‌కు సైనిక, నిఘా సాయాలను పూర్తిగా నిలిపేయాలని షరతు విధించారు! వాటితో పాటు పలు ఇతర డిమాండ్లతో కూడిన భారీ జాబితాను ట్రంప్ ముందుంచారు. వాటన్నింటికీ ఉక్రెయిన్ అంగీకరించాల్సిందేనని కుండబద్దలు కొట్టారు. గంటకు పైగా జరిగిన సంభాషణలో యుద్ధంతో పాటు అమెరికా, రష్యా ద్వైపాక్షిక సంబంధాలు కూడా ప్రధానంగా చర్చకు వచ్చాయి. పాక్షిక యుద్ధ విరమణకు పుతిన్‌ను ఒప్పించడంలో ట్రంప్ సఫలమైనట్టు చర్చల అనంతరం వైట్‌హౌస్ ఒక ప్రకటనలో పేర్కొంది. యుద్ధం ఆగి శాశ్వత శాంతి నెలకొనాలని అధ్యక్షులిద్దరూ ఏకాభిప్రాయం వెలిబుచ్చినట్టు తెలిపింది. ''తర్వాతి దశలో నల్లసముద్రంలో కాల్పుల విరమణ, చివరగా పూర్తిస్థాయి కాల్పుల విరమణపై సాంకేతిక చర్చలు జరిపేలా అంగీకారం కుదిరింది. అవి పశ్చిమాసియా వేదికగా తక్షణం మొదలవుతాయి'' అని వివరించింది. అమెరికా, రష్యా మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కూడా నేతలిద్దరూ నిర్ణయించినట్టు పేర్కొంది. ఈ దిశగా త్వరలో కీలక ఆర్థిక ఒప్పందాలు తదితరాలు కుదరనున్నట్టు వెల్లడించింది. అమెరికా ఇటీవల ప్రతిపాదించిన 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ వెంటనే అంగీకరించడం, దానిపై సంతకం కూడా చేయడం తెలిసిందే. ఈ ప్రతిపాదనకు పుతిన్ కూడా సూత్రప్రాయంగా అంగీకరించారు. పలు అంశాలపై స్పష్టత కోసం ట్రంప్‌తో మాట్లాడతానని చెప్పారు. ఉక్రెయిన్‌లో రష్యా ఆక్రమించిన భూములు, జపోరిజియా అణు విద్యుత్కేంద్రం తదితరాలు కూడా తమ మధ్య చర్చకు వస్తాయని సంభాషణకు ముందు ట్రంప్ మీడియాకు తెలిపారు. ఇరు దేశాల మధ్య పంపకాలకు సంబంధించి రష్యాతో ఇప్పటికే చర్చలు మొదలు పెట్టినట్టు కూడా చెప్పారు! ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగినందుకు మూడేళ్లుగా రష్యాపై అమెరికా కఠిన ఆంక్షలను అమలు చేస్తుండటం తెలిసిందే. పుతిన్, ట్రంప్ తాజా చర్చలను చరిత్రాత్మకంగా రష్యా అభివర్ణించింది. వాటి ఫలితంగా ప్రపంచం మరింత సురక్షితంగా మారిందని అభిప్రాయపడింది. యుద్ధానికి ముగింపుపై ఇటీవల సౌదీ అరేబియాలో అమెరికా పలుమార్లు చర్చలు జరపడం తెలిసిందే. పాక్షిక, దశలవారీ కాల్పుల విరమణ ప్రతిపాదనలు, పుతిన్ తాజా షరతులపై ఉక్రెయిన్ స్పందన ఏమిటన్నది తెలియాల్సి ఉంది.

కాల్పుల విరమణకు తూట్లు

గాజాపై భీకర దాడులు

413 మందికి పైగా మృతి

- హమాస్ చీఫ్, అగ్ర నేతలు హతం
- ఇక సమరమే: నెతన్యాహు
- బందీలకిది మరణశాసనం: హమాస్



గాజాలో శిథిలాల మధ్య తమ వస్తువులతో బాలిక

డెయిర్ అల్ బలా: పశ్చిమాసియాలో శాంతి యత్నాలు బూడిదలో పోసిన పన్నీరే అయ్యాయి. గాజాలో ప్రశాంతత రెండు నెలల ముచ్చటగానే ముగిసింది. రంజాన్ మాసం ముగిసేదాకా సంయమనం పాటిస్తామన్న హామీని ఇజ్రాయెల్ తుంగలో తొక్కింది. కాల్పుల విరమణ ఒప్పందంలో ఇజ్రాయెల్ కోరిన మార్పులకు హమాస్ నిరాకరించడంతో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కన్నెర్రజేశారు. ఆయన ఆదేశాలతో ఇజ్రాయెల్ సైన్యం గాజాపై మంగళవారం తెల్లవారుజామునే భారీ స్థాయిలో దాడులకు దిగింది. ఎడతెరిపి లేని బాంబుల వర్షంతో హమాస్ అగ్ర నాయకత్వాన్ని దాదాపుగా తుడిచిపెట్టేసింది. గాజాలో హమాస్ ప్రభుత్వ సారథి ఇస్మాయిల్ అల్ దాలిస్‌తో పాటు అంతర్గత శాఖ సారథి మహమూద్ అబూ వట్ఫా, అంతర్గత భద్రతా విభాగం డైరెక్టర్ జనరల్ బహజాత్ అబూ సుల్తాన్ తదితర అగ్ర నేతలు దాడుల్లో మృతి చెందారు. దీన్ని హమాస్ కూడా ధ్రువీకరించింది. దాడులకు కనీసం 413 మందికి పైగా బలయ్యారని, 600 మందికి పైగా గాయపడ్డారని ప్రకటించింది. వారిలో చాలామంది బాలలేనని ఆవేదన వెలిబుచ్చింది. తమ ప్రతిస్పందన తీవ్రస్థాయిలో ఉంటుందని, ఇంతకింతా ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. తమవద్ద బందీలుగా ఉన్న 25 మందికి పైగా ఇజ్రాయెలీలకు తాజా దాడులు మరణశాసనమేనంటూ హమాస్ ప్రతినిధి ఇజ్జత్ అల్ రిషెక్ మండిపడ్డారు. ప్రమాదంలో పడ్డ తన సర్కారును కాపాడుకోవడానికి శాంతియత్నాలకు నెతన్యాహు ఉద్దేశపూర్వకంగానే తూట్లు పొడిచారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై ప్రధాని ఘాటుగా స్పందించారు. తమ బందీలను సైనిక చర్య ద్వారానే విడిపించుకుంటామని ప్రకటించారు. హమాస్‌పై ఇక మరిన్ని సైనిక దాడులతో విరుచుకుపడతామని కుండబద్దలు కొట్టారు. తర్వాతి చర్యలపై అత్యున్నత స్థాయి భద్రతాధికారులతో మంగళవారం సాయంత్రం లోతుగా మంతనాలు సాగించారు. తాజా పరిణామాలతో గాజాలో శాంతియత్నాలకు తెర పడ్డట్టేనని భావిస్తున్నారు. ఇజ్రాయెల్ తమను సంప్రదించిన మీదటే తాజా దాడులకు దిగిందన్న అమెరికా ప్రకటన కూడా ఇందుకు బలం చేకూరుస్తోంది.

భూతల దాడులు!

మంగళవారం నాటి దాడుల్లో డజన్ల కొద్దీ లక్ష్యాలను సమూలంగా ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. గాజాపై అతి త్వరలో భూతల దాడులకు కూడా సిద్ధమవుతున్నట్టు కన్పిస్తోంది. తూర్పు గాజాను ఖాళీ చేయాల్సిందిగా తాజా దాడుల అనంతరం ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించింది. వారంతా మధ్య ప్రాంతంవైపు వెళ్లాలని పేర్కొంది. మిగిలి ఉన్న హమాస్ నేతలను కూడా అంతం చేయడంతో పాటు దాని వనరులు, మౌలిక సదుపాయాలన్నింటినీ ధ్వంసం చేయడమే ఇకపై లక్ష్యమని ఇజ్రాయెల్ అధికారి ఒకరు తెలిపారు. 2023 అక్టోబర్ 7న హమాస్ సాయుధులు ఇజ్రాయెల్‌లోకి చొరబడి విచక్షణారహితంగా దాడులకు దిగడం తెలిసిందే. వందలాది మంది పౌరులను కాల్చి చంపడమే గాక 250 మందికి పైగా ఇజ్రాయెలీలను బందీలుగా తీసుకెళ్లారు. దానికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ తెర తీసిన యుద్ధం 17 నెలలపాటు సాగింది. ఫలితంగా 50 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. గాజా దాదాపుగా నేలమట్టమైంది. ఈ నేపథ్యంలో ఈజిప్ట్, ఖతార్, అమెరికా మధ్యవర్తిత్వంలో జరిగిన శాంతి చర్చలు ఫలించి జనవరి నుంచి ఆరు వారాల పాటు కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరింది. 25 మంది బందీలను హమాస్, బదులుగా 2,000 మందికి పైగా పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడిచిపెట్టాయి. అది ముగిశాక రెండో దశ విరమణకు జరుగుతున్న చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. తన వద్ద మిగిలిన 59 మంది ఇజ్రాయెలీ బందీలను వదిలేస్తానని, బదులుగా యుద్ధానికి పూర్తిగా ఫుల్‌స్టాప్ పెట్టి సైన్యం గాజా నుంచి పూర్తిగా వైదొలగాలని హమాస్ డిమాండ్ చేసింది. అందుకు ఇజ్రాయెల్ ససేమిరా అంది.

హమాసే కారణం: అమెరికా

ఇజ్రాయెల్ తాజా దాడులను అమెరికా సమర్థించింది. ఈ విషయమై ఇజ్రాయెల్ తమను ముందుగానే సంప్రదించిందని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లెవిట్ వెల్లడించారు. ఉగ్రవాద చర్యలకు మూల్యం తప్పదంటూ హౌతీలతో పాటు హమాస్‌ను కూడా ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారని ఆమె గుర్తు చేశారు. తాజా పరిస్థితికి హమాసే కారణమని అమెరికా జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి బ్రయాన్ హ్యూస్ ఆరోపించారు.

'వెబ్‌సైట్‌లో ఓటింగ్ డేటా'పై చర్చకు సిద్ధంగా ఉన్నాం

సుప్రీంకోర్టుకు తెలిపిన ఈసీ

న్యూఢిల్లీ: పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలన్న డిమాండ్‌పై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) సుప్రీంకోర్టుకు తెలిపింది. పిటిషనర్లు 10 రోజుల్లో వినతిపత్రాలు సమర్పించాలని సూచించింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన 48 గంటల్లోగా పోలింగ్ స్టేషన్లవారీగా ఓటింగ్ వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, ఎన్జీవో అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ 2019లో సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం వీటిపై విచారణ జరిపింది. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ వాదనలు వినిపించారు. ఈ డిమాండ్‌పై చర్చించడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ సిద్ధంగా ఉన్నారని, పిటిషనర్లు వారిని కలిసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ధర్మాసనానికి తెలిపారు. ఈసీ వాదనలను పరిశీలించిన ధర్మాసనం పది రోజుల్లోగా ఈసీకి వినతిపత్రం ఇవ్వాలని ఆదేశించింది. విచారణను జూలై 28వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ఇవే పిటిషన్లపై గత ఏడాది మే 17న అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల సంఘం స్పందనను కోరింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇది ఎన్నికల ప్రక్రియను దెబ్బతీస్తుందని, యంత్రాంగంలో గందరగోళాన్ని సృష్టిస్తుందన్న ఈసీ, ఎన్జీవో డిమాండ్‌ను వ్యతిరేకించింది.

44 ఏళ్ల క్రితం 24 మంది దళితుల హత్య..

ముగ్గురికి మరణ శిక్ష

యూపీలోని మెయిన్‌పురి జిల్లా ప్రత్యేక కోర్టు తీర్పు

మెయిన్‌పురి: ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి జిల్లా ప్రత్యేక కోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. 44 ఏళ్ల క్రితం 24 మంది దళితులు హత్యకు గురైన కేసులో ముగ్గురు దోషులకు మరణ శిక్ష ఖరారు చేసింది. 1981 నవంబర్ 18వ తేదీన సాయంత్రం 4.30 గంటల సమయంలో 17 మంది దోపిడీ దొంగలు ఖాకీ దుస్తులు ధరించి దెహూలీ గ్రామంలోకి ప్రవేశించారు. దొంగతనం చేస్తుండగా అడ్డుకున్న దళితులపై తుపాకులతో కాల్పులు జరిపారు. దీంతో 24 మంది దళితులు ప్రాణాలు కోల్పోయారు. బాధితుల్లో పలువురు మహిళలు, ఇద్దరు చిన్నారులు సైతం ఉన్నారు. అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దళితుల హత్య ఘటనలో మొత్తం 17 మంది నిందితులపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణ సుదీర్ఘకాలంపాటు కొనసాగింది. ఇప్పటికే 14 మంది నిందితులు మృతిచెందారు. ఈ కేసులో ప్రత్యేక జడ్జి ఇందిరా సింగ్ ఈ నెల 12వ తేదీన కప్తాన్ సింగ్(60), రాంపాల్(60), రామ్‌సేవక్(70)ను దోషులుగా నిర్ధారించారు. మంగళవారం తుది తీర్పు ప్రకటించారు. ముగ్గురు దోషులకు మరణ శిక్షతోపాటు రూ.50 వేల చొప్పున జరిమానా విధించారు.

ట్రంప్‌ను అపార్థం చేసుకోవద్దు

'అమెరికా ఫస్ట్' అంటే కేవలం అమెరికా ప్రయోజనాల పరిరక్షణే కాదు

- ప్రపంచవ్యాప్తంగా అందరి మేలు కోసమే ఈ విధానం
- 'రైసినా డైలాగ్'లో తులసి గబ్బార్డ్

న్యూఢిల్లీ: తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానమైన 'అమెరికా ప్రథమం'ను 'అమెరికా ఒంటరి'గా ఎవరూ అపార్థం చేసుకోవద్దని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ కోరారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ విధానమైన 'ఇండియా ఫస్ట్' తరహాలోనే మోదీ 'అమెరికా ఫస్ట్'ను తన విధానంగా మార్చుకున్నారని వివరించారు. ఈ విషయంలో ఇరువురు నేతల మధ్య సారూప్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ 'న్యూజిలాండ్ ఫస్ట్' అనే విధానం అమలు చేస్తున్నారని తెలిపారు. ట్రంప్ సైతం ఆదేబాటలో నడుస్తున్నారని వివరించారు. ఇతర దేశాలతో సంబంధాల ప్రాముఖ్యతను ట్రంప్ అర్థం చేసుకోవడం లేదన్న అభిప్రాయానికి రావడం సరైంది కాదన్నారు. ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణ కోసం ఇతర దేశాలతో కలిసి పనిచేయాలన్నదే ఆయన ఆశయమని స్పష్టంచేశారు. మంగళవారం ఢిల్లీలో 'రైసినా డైలాగ్' కార్యక్రమంలో తులసి గబ్బార్డ్ ప్రసంగించారు. అమెరికా ఫస్ట్ అంటే అర్థం కేవలం అమెరికా ప్రయోజనాల పరిరక్షణ, అమెరికా ప్రజల భద్రతే కాదని తేల్చిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అందరి మేలు కోసం ఈ విధానాన్ని ట్రంప్ ఎంచుకున్నారని వివరించారు. ఇండియాతో సంబంధాల బలోపేతానికి ట్రంప్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. ఇండో-పసిఫిక్‌లో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడానికి ఇండియాతో కలిసి పనిచేయాలన్నదే అమెరికా ఉద్దేశమని స్పష్టంచేశారు. కీలక రంగాల్లో రెండు దేశాలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. ఆ దిశగా తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. హిందూ మతాన్ని ఆచరించే తులసి గబ్బార్డ్ తన ప్రసంగాన్ని 'నమస్తే, జైశ్రీరామ్' అంటూ ఆరంభించడం విశేషం. ఈ పదాలు మనందరిలో అంతర్గతంగా ఉండే దైవ భావనను మేల్కొల్పుతాయని చెప్పారు. కులం, మతం, ప్రాంతం, వర్గం అనే తేడాలేకుండా మనమంతా పరస్పరం అనుసంధానమై ఉన్నామని తెలియజేస్తాయని వివరించారు. అయితే, అమెరికాలో ఖలిస్తానీ శక్తుల కార్యకలాపాలు, ఇండియా ఉత్పత్తులపై ట్రంప్ ప్రభుత్వం విధించబోయే సుంకాల గురించి ఆమె ప్రస్తావించలేదు.

మన బంధం మరింత బలోపేతం

భవిష్యత్తులో ఇండియా-అమెరికా సంబంధాలు మరింత బలపడనున్నాయని తులసి గబ్బార్డ్ అభిప్రాయపడ్డారు. వివిధ కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణతోపాటు ఇండో-పసిఫిక్‌లో శాంతి, స్థిరత్వం కోసం భారత్-అమెరికా భాగస్వామ్యం బలోపేతం కావడం తప్పనిసరి అని వ్యాఖ్యానించారు. ఇద్దరు గొప్ప మిత్రులైన నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో భారత్-అమెరికా భాగస్వామ్యం దృఢంగా నిలిచి ఉందని వెల్లడించారు. మన రెండు దేశాల నడుమ ఈ భాగస్వామ్యం, స్నేహం రాబోయే రోజుల్లో మరింత బలోపేతం అవుతుందనడంలో సందేహం లేదన్నారు.



తులసి

ప్రాదేశిక సమగ్రతపై రాజీపడం: ఉక్రెయిన్ మంత్రి

తమ దేశ ప్రాదేశిక సమగ్రతపై రాజీ పడే ప్రసక్తే లేదని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సైబిహా తేల్చిచెప్పారు. ఆయన మంగళవారం రైసినా డైలాగ్‌లో మాట్లాడారు. రష్యాతో సంఘర్షణకు శాంతియుతమైన పరిష్కారం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రష్యాతో అతిత్వరలో కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అయితే, రష్యా ఆక్రమించుకున్న ఉక్రెయిన్ భూభాగాలను రష్యాలో అంతర్భాగంగా తాము ఎప్పటికీ గుర్తించబోమని స్పష్టంచేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేయడం ద్వారా రష్యా సాధించింది ఏమీ లేదని పేర్కొన్నారు.

ఐక్యతా స్ఫూర్తి బలోపేతం

లోక్‌సభలో కుంభమేళాపై మోదీ ఉద్ఘాటన



న్యూఢిల్లీ: మహా కుంభమేళా విజయవంతం కావడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఇలాంటి భారీ సామూహిక వేడుక నిర్వహించే విషయంలో భారతదేశ శక్తిసామర్థ్యాలను ప్రశ్నించినవారికి ఈ కుంభమేళా ద్వారా తగిన సమాధానం ఇచ్చామని అన్నారు. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో జరిగిన మహోత్సవం దేశంలో ఐక్యతా స్ఫూర్తిని మరింత బలోపేతం చేసిందని ఉద్ఘాటించారు. ప్రభుత్వంతోపాటు ప్రజలందరి కృషితోనే కుంభమేళా విజయవంతమైందని పేర్కొన్నారు. కుంభమేళా నిర్వహణలో సహకరించిన వారందరికీ ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన మంగళవారం లోక్‌సభలో మాట్లాడారు. కుంభమేళాకు కోట్లాది మంది తరలివచ్చారని, వసతుల గురించి ఆలోచించకుండా భక్తి శ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరించారని చెప్పారు. దాదాపు 45 రోజులపాటు దేశమంతటా నూతనోత్సాహం, ఉద్విగ్నత కనిపించాయని అన్నారు. మహాకుంభ్ వేడుక ఐక్యత అనే అమృతాన్ని మనకు పంచిపెట్టిందని వ్యాఖ్యానించారు. అహంకారం విడిచిపెట్టి నేను కాదు మనం అనే భావనతో జనం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి హాజరయ్యారని వివరించారు. మూలమూలల నుంచి జనం తరలిరావడం సంతోషం కలిగించిందని చెప్పారు. వారంతా ఐక్యతను చాటిచెప్పారని, అదే మన అసలైన బలమని వెల్లడించారు. మన ఐక్యతాస్ఫూర్తి చాలా బలంగా ఉందని, దాన్ని ఎవరూ దెబ్బతీయలేరని తేల్చిచెప్పారు.

మనది పోలీసు రాజ్యం కాదు

దిగువ కోర్టులపై సుప్రీం అసహనం

న్యూఢిల్లీ: అంత తీవ్రమైనవి కాని కేసుల్లో కూడా బెయిల్ పిటిషన్లను దిగువ కోర్టులు తరచూ తిరస్కరిస్తుండటంపై సుప్రీంకోర్టు విస్మయం వెలిబుచ్చింది. రెండు దశాబ్దాల క్రితం దాకా చిన్నాచితకా కేసుల్లో బెయిల్ విజ్ఞప్తులు హైకోర్టు దాకా కూడా వచ్చేవి కావని గుర్తు చేసింది. చీటింగ్ కేసులో రెండేళ్లకు పైగా కస్టడీలో ఉన్న ఓ నిందితునికి న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. ట్రయల్ కోర్టుల్లోనే తేలిపోవాల్సిన ఇలాంటి బెయిల్ పిటిషన్లు కూడా సుప్రీంకోర్టు దాకా వస్తున్నాయంటూ జస్టిస్ ఓకా ఆవేదన వెలిబుచ్చారు. ''దిగువ కోర్టుతో పాటు గుజరాత్ హైకోర్టు నిందితునికి బెయిల్ నిరాకరించాయి. అవాంఛనీయ పరిణామమిది. మామూలు కేసుల్లో కూడా దర్యాప్తు పూర్తయినా బెయిల్ నిరాకరించడం ఏమిటి? మనది ప్రజాస్వామిక దేశం. అవసరం లేకున్నా పౌరులను నిర్బంధించి అణచివేతకు పాల్పడే పోలీసు రాజ్యంలా పని చేయకూడదు'' అని అభిప్రాయపడ్డారు.


సాక్షి హైదరాబాద్

బుధవారం । 19 । మార్చి । 2025



ఏఐతో టోకరా!

ఏఐ బేస్ట్ సైబర్ క్రైమ్‌కు సంబంధించిన తొలి కేసు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నమోదైంది. ఓ మహిళ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.97 లక్షలు కాజేశారు. -8లో



ఎంతెంత దూరం?..

సిటీని 24/7 పని చేసే నగరంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎంపిక చేసిన జోన్లలో స్టాల్స్‌ను 24 గంటలూ తెరిచి ఉంచుతామని ప్రభుత్వం గత ఏడాది ప్రకటించింది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
38.0/22.0

వాతావరణం

నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 38, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం	గురువారం
సా. 6.32 గం.	ఉ. 4.59 గం.





ఆశల పల్లకిలో..



ఎలివేటెడ్ కారిడార్‌లు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు, మెట్రో రెండోదశ

గ్లోబల్ సిటీ వైపు అడుగులు వేస్తూ.. ప్రగతి పథాన దూసుకెళుతోంది మన మహా నగరం. ఎలివేటెడ్ కారిడార్‌లు, ఫోర్త్‌సిటీ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నిర్మాణాలు, మరోవైపు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు వివిధ మార్గాల్లో మెట్రో రెండో దశకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందుకోసం పెద్ద మొత్తంలో నిధులు అవసరం. అలాగే మూసీకి పునరుజ్జీవం కల్పించాలనే సంకల్పంతో ఉంది. నది సుందరీకరణకు నడుం బిగించింది. ఈసారి రాష్ట్ర బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం ఉంటుందని జలమండలి సైతం ఆశిస్తోంది. వివిధ అభివృద్ధి పనులకు దాదాపు రూ.5,500 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా సమర్పించింది. ఇలా వివిధ విభాగాలు నిధుల కేటాయింపులపై భారీగా ఆశలు పెట్టుకున్నాయి. బుధవారం శాసన సభలో డిప్యూటీ సీఎం, విత్త మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో భాగ్యనగరానికి ఎంతమేరకు ప్రాధాన్యం దక్కుతుందో చూడాలి మరి. – సాక్షి, సిటీబ్యూరో

ఇప్పటికే ప్రతిపాదనలు, ప్రారంభోత్సవాలు పూర్తి

- ఎలివేటెడ్, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లకు టెండర్లు
- బడ్జెట్ కేటాయింపులతోనే మూసీకి పునరుజ్జీవం
- నిధులొస్తేనే బాపూఘాట్ వద్ద అభివృద్ధి పనులు
- నిధుల కోసం జలమండలి ఎదురుచూపులు
- మహా నగరానికి ప్రాధాన్యం దక్కేనా?

నేడు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న భట్టి విక్రమార్క

హెచ్ఎండీఏ కార్యదర్శిగా గంగాధర్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) కార్యదర్శిగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ కె.గంగాధర్ నియమితులయ్యారు. రెవెన్యూ విభాగానికి చెందిన ఆయన ఏడాది కాలపరిమితికి డిప్యుటేషన్‌పై హెచ్ఎండీఏకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం సెక్రటరీగా కొనసాగుతున్న చంద్రయ్య డిప్యుటేషన్ కాల పరిమితి ముగియడంతో ఆయన స్థానంలో గంగాధర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎస్టేట్ అధికారిగా ఆయన హెచ్ఎండీఏలోనే పని చేశారు. అనంతరం తిరిగి మాతృ సంస్థ రెవెన్యూ విభాగానికి వెళ్లారు. మరోసారి కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై తిరిగి హెచ్ఎండీఏలో బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

ఇండో- జర్మన్ విద్యా భాగస్వామ్యాలు మరింత బలోపేతం

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు



హెచ్‌సీయూలోని ఎస్పైర్ బయోనెస్ట్ వద్ద..


రాయదుర్గం: ఉన్నత విద్యలో అంతర్జాతీయకరణను ప్రోత్సహించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు స్పష్టం చేశారు. ఇండో- జర్మన్ విద్యా భాగస్వామ్యాలను పెంపొందించడం మరింతగా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. మంగళవారం జర్మనీలోని 21 విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధుల బృందం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో పర్యటించింది. అనంతరం వైస్ చాన్సలర్‌తో ప్రత్యేక సమావేశమైంది. ఈ సందర్భంగా బీజేరావు మాట్లాడుతూ.. భారత్- జర్మనీ దేశాల మధ్య మరింత స్నేహభావం పెరగడంతో పాటు ఉన్నత విద్యలో కలిసి పని చేయడానికి మార్గం సుగమమవుతుందన్నారు. అనంతరం హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఎస్పైర్ బయోనెస్ట్ కేంద్రాన్ని, ఇతర విభాగాలను కూడా జర్మనీ బృందం సందర్శించింది.

ప్రాజెక్టులు పరుగులు పెట్టేనా!

హైదరాబాద్ మహా నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాల మేరకు గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన పలు ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, ప్రారంభోత్సవాలు పూర్తి చేసుకున్న ప్రాజెక్టులకు నిధుల కొరతే ప్రధాన సమస్యగా మారింది. నగరానికి ఉత్తరం వైపు రెండు ఎలివేటెడ్ కారిడార్‌లతో పాటు, ఫోర్త్‌సిటీ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నిర్మాణానికి హెచ్ఎండీఏ టెండర్ నోటీసులను వెల్లడించింది. మరోవైపు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు వివిధ మార్గాల్లో మెట్రో రెండో దశకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. కేంద్రం ఆమోదం కోసం ఎదురు చూస్తున్న ఈ ప్రాజెక్టుకు సావరిన్ గ్యారెంటీ లభిస్తే ముందుకు సాగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం శాసన సభలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఆయా ప్రాజెక్టులకు ఏ మేరకు నిధులు లభిస్తాయనే అంశం చర్చనీయాంశంగా మారింది.

ఎలివేటెడ్ కారిడార్లు..

ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు 5.4 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌కు బేగంపేట్ విమానాశ్రయం వద్ద 600 మీటర్ల సొరంగ మార్గానికి ఇటీవల ఎయిర్‌పోర్ట్ అథారిటీ నుంచి అనుమతి లభించడంతో నిర్మాణ సంస్థల నుంచి టెండర్‌లను ఆహ్వానిస్తూ హెచ్ఎండీఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.652 కోట్లతో ప్రణాళికలు రూపొందించింది. భూసేకరణకయ్యే ఖర్చులతో కలిపి ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.1,450 కోట్ల వరకు ఉంటుందని అంచనా. సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు 18.1 కిలో మీటర్ల రెండో ఎలివేటెడ్ కారిడార్‌కు సుమారు 197 ఎకరాల భూమి సేకరణకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ఇందులో 113.48 ఎకరాలు రక్షణశాఖ నుంచి సేకరించాల్సి ఉంది. మరో 83.72 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించాలి. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,232 కోట్లు కానున్నట్లు అంచనా. ఈ మార్గంలో క్షేత్రస్థాయి సర్వేతో పాటు అన్ని పనులు పూర్తయ్యాయి. రక్షణశాఖ నుంచి అనుమతి లభించిన వెంటనే నిర్మాణం చేపట్టేందుకు హెచ్ఎండీఏ సిద్ధంగా ఉంది. కానీ.. నిధుల కొరతే ప్రధాన సమస్య.



రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు..

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు 'రతన్‌టాటా రోడ్డు'గా నామకరణం చేసింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ ఔటర్ రింగ్ రోడ్డులోని టాటా ఇంటర్‌చేంజ్ (రావిర్యాల) నుంచి ఆమన్‌గల్ రీజినల్ రింగ్ రోడ్డు వరకు 41.50 కిలోమీటర్ల రేడియల్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును రెండు దశలుగా నిర్మించనున్నారు. మొదటి దశలో రావిర్యాల నుంచి (టాటా ఇంటర్‌చేంజ్) నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలో మీటర్లు పూర్తి చేస్తారు. ఇందుకోసం రూ.1,665 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండోదశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ట్రిపుల్ ఆర్ వద్ద ఆమన్‌గల్ వరకు రూ.2,365 కోట్లతో 22.3 కిలోమీటర్లు నిర్మించనున్నారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల్లోని 14 గ్రామాలకు ఈ రోడ్డుతో కనెక్టివిటీ సదుపాయం ఏర్పడనుంది. ఈ ప్రాజెక్టు కోసం హెచ్ఎండీఏ టెండర్‌లను కూడా ఆహ్వానించింది.

మెట్రో రెండో దశ..

మెట్రోరెండో దశలో రెండు భాగాలుగా విస్తరణకు ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టులను రూపొందించింది. మొదటిభాగంగా 5 కారిడార్లలో మెట్రో నిర్మాణానికి సుమారు రూ.24 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. ఎల్‌బీనగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు మియాపూర్ నుంచి పటాన్‌చెరు. రాయదుర్గం నుంచి కోకాపేట్, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు విస్తరించనున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ విస్తరణతో పాటు అటు హైకోర్టు వరకు మరో లైన్ చేపట్టాల్సి ఉంది. మొత్తం 76.4 కిలోమీటర్ల మెట్రో రెండో దశ ప్రాజెక్టు ప్రస్తుతం కేంద్రం అనుమతి కోసం ఎదురుచూస్తోంది. దీంతో పాటు రెండో భాగంగా జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 23 కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కిలోమీటర్లు చేపట్టనున్నారు. అలాగే అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి స్కిల్ వర్సిటీ వరకు ఈ కారిడార్ నిర్మాణం కోసం సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. ఫోర్త్‌సిటీతో పాటు నార్త్‌సిటీలో రెండు కారిడార్‌లకు సైతం డీపీఆర్‌లను రూపొందించేందుకు హెచ్ఏఎంఎల్ కసరత్తు చేపట్టింది. రెండో దశలో మొదట ప్రతిపాదించిన 5 కారిడార్‌లు కలిపి 76.4 కిలోమీటర్లు కాగా, ఫోర్త్‌సిటీతో రెండో దశ 116.4 కిలోమీటర్లకు పెరగనుంది. అలాగే నార్త్‌సిటీ రెండు కారిడార్‌లతో కలిపి మొత్తం రెండో దశ ప్రాజెక్టు 161.4 కిలోమీటర్లకు చేరనుంది. దీంతో నిర్మాణ వ్యయం కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టును చేపట్టాలనేది ప్రతిపాదన.

జలమండలికి 'నిధుల' వరద పారేనా!

ఈసారి రాష్ట్ర బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం ఉంటుందని జలమండలి ఆశిస్తోంది. వివిధ అభివృద్ధి పనులకు దాదాపు రూ.5,500 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. గోదావరి రెండు, మూడో దశ పనులు, ఓటర్ రింగ్ రోడ్ తాగునీటి సరఫరా పథకం-3, ఎస్టీపీ, రుణాల చెల్లింపు, ఉచిత నీరు, విద్యుత్ రాయితీ కింద నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గత ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు రూ.5,650 కోట్లతో ప్రతిపాదనలు చేయగా ప్రభుత్వం రూ.3,385 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం పెరిగిన అవసరాల దృష్ట్యా రూ.4 వేల కోట్లకు పైగా నిధుల కేటాయింపులు ఉండవచ్చని జలమండలి ఆశలు పెట్టుకుంది. మహా హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం గోదావరి ఫేజ్-2, 3 నిర్మాణ పనుల మొత్తం వ్యయంలో ప్రభుత్వ వాటా 40 శాతం, నిర్మాణ సంస్థ వాటా 60 శాతం భరించాల్సి ఉంది. రాష్ట్ర వాటా కింద అవసరమైన నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలు సమర్పించింది. ఓటర్ రింగ్‌రోడ్ తాగునీటి సరఫరా పథకం-3, సుంకిశాల పనులు చేపట్టేందుకు నిధులు అవసరమని భావిస్తోంది. వంద శాతం మురుగు శుద్ధి లక్ష్యంగా కొత్త ఎస్టీపీ ప్రాజెక్టుల మిగిలిన పనుల కోసం, ఉచిత నీటి సరఫరా నిధుపై జల మండలి ఆశలు పెట్టుకుంది.



మూసీ మెరిసేనా?





మూసీ నదికి పునరుజ్జీవం కల్పించాలన్న ముఖ్యమంత్రి కల బడ్జెట్ కేటాయింపులతో తీరనుంది. బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌పై మూసీ రిఫర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) కోటి ఆశలు పెట్టకుంది. తొలి దశలో ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.5 కి.మీ., అలాగే హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 8.5 కి.మీ. రెండు వైపులా 21 కి.మీ. మేర మూసీ నదీ సుందరీకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆయా అభివృద్ధి పనులకు తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మూసీ శుద్ధి, వ్యర్థాలు, వరదల నియంత్రణ వ్యవస్థ, సుందరీకరణ, బృహత్ ప్రణాళిక రూపకల్పనలపై ఎంఆర్‌డీసీఎల్ అధికారులు దృష్టి సారించారు. 2030 డిసెంబర్ 30 నాటికి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మల్లన్నసాగర్ నుంచి మూసీకి 5 టీఎంసీల నీటిని తరలించి, నదిని శుద్ధి చేయడంతో పాటు మూసీ చుట్టూ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే మూసీపై 11 వారసత్వ వంతెనలను నిర్మించనున్నారు. నది బాపూఘాట్ వద్ద ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటుతో పాటు అమ్యూజ్‌మెంట్‌పార్క్, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్ వాటర్ స్పోర్ట్స్, వీధి వర్తకుల వ్యాపార సముదాయాలు, సైకిల్ ట్రాక్‌లు, గ్రీన్ స్పేస్‌లు, వంతెనలు, వినోద కేంద్రాలు, రెస్టారెంట్లు, క్రీడా సౌకర్యాలు, వాణిజ్య, రిటైల్ స్థలాలను అభివృద్ధి చేయనున్నారు.

మరో ముందడుగు..



పాతబస్తీ మెట్రో విస్తరణలో..

- ఇప్పటి వరకు 500కుపైగా చెక్కులు
- రూ.200 కోట్ల పరిహారం పంపిణీ
- రోడ్డు విస్తరణలో 980 నిర్మాణాల గుర్తింపు
- 400 ఆస్తులకు ప్రాథమిక నోటీసులు

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో విస్తరణలో మరో ముందడుగు పడింది. ఇప్పటివరకు సుమారు 500కు పైగా చెక్కులను పంపిణీ చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆస్తులు కోల్పోయిన బాధితులకు రూ.200 కోట్లకు పైగా పరిహారం అందజేశారు. చదరపు గజానికి రూ.81 వేల నుంచి రూ.లక్ష చొప్పున స్థలానికి ఖరీదు చెల్లించడంతో పాటు పునరావాసం కోసం పరిహారం కూడా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. రంజాన్ మాసం దృష్ట్యా కూల్చివేత పనులను నెమ్మదిగా కొనసాగిస్తున్నప్పటికీ.. విస్తరణ కోసం గుర్తించిన ఆస్తులకు నోటీసులు ఇవ్వడంతో పాటు పరిహారం చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోంది. 8 నెలల్లో మొత్తం పనులను పూర్తి చేసి మెట్రో నిర్మాణాన్ని ప్రారంభించాలని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఆర్ఎల్) లక్ష్యంగా పెట్టుకొంది.

అతిపెద్ద కారిడార్..

మెట్రో రెండో దశలోని మొదటి ఐదు లైన్‌లను నాలుగేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. రెండో దశలో భాగంగానే ప్రస్తుతం పాతబస్తీ మెట్రో పనులు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే ప్రధానమైన పనులను చేపట్టేందుకు అనుగుణంగా ఆస్తుల సేకరణ, రోడ్డు విస్తరణపై దృష్టి సారించారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్న సంగతి తెలిసిందే. దీంతో జేబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు అతి పెద్ద గ్రీన్ కారిడార్ అందుబాటులోకి రానుంది. ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట వరకు 11,00 ఆస్తులను అధికారులు గుర్తించారు. వీటిలో 980 నిర్మాణాలను మాత్రం తొలగించాల్సి ఉంది. ఆస్తుల సేకరణకు సుమారు రూ.వెయ్యి కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా.

కూల్చివేత పనులు వివిధ దశల్లో..

భూ సేకరణ చట్టానికి అనుగుణంగా సేకరించనున్న ఆస్తులకు పరిహారం చెల్లించేందుకు హెచ్ఏఎంఎల్ చర్యలు చేపట్టింది. మెట్రో నిర్మాణంలో మతపరమైన, ఆధ్యాత్మిక కట్టడాలకు ఎలాంటి విఘాతం కలగకుండా నివాసాలు, దుకాణాలు వంటివి మాత్రమే తొలగించనున్నారు. ఈ మేరకు గుర్తించిన 980 నిర్మాణాల్లో 400 నిర్మాణాలకు ప్రాథమిక నోటీసులు అందజేశారు. 325 మంది నుంచి ఆమోదం లభించింది. వాటిలో 216 ఆస్తులకు అవార్డు డిక్లేర్ చేశారు. ఇప్పటి వరకు 80 ఆస్తులను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వీటిలో 39 నిర్మాణాల కూల్చివేత పూర్తయిందని, మరో 41 నిర్మాణాల కూల్చివేతల పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు చెప్పారు. మరోవైపు ఇప్పటి వరకు చెల్లించిన పరిహారంలో కొంత భూమి ఖరీదు కోసం కాగా, సుమారు 215 మందికి పునరావాసం కోసం పరిహారం అందజేశారు.

7.5 కిలోమీటర్లు.. రూ.2,714 కోట్లు..

మెట్రో రెండో దశలో మొదటి 5 కారిడార్‌లకు రూ.24,269 కోట్లతో సమగ్రమైన ప్రాజెక్టు నివేదికలను రూపొందించారు. ఇందులో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మెట్రో నిర్మాణంలో భాగంగా ఆస్తులు కోల్పోయినవారికి చెల్లించే పరిహారం కాకుండా దాదాపు రూ.2,714 కోట్లు ప్రాజెక్టు ఖర్చు కానున్నట్లు అంచనా. మెట్రో రాకతో పాత నగరం మరింత ఆకర్షణను సంతరించుకోనుందని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అధికారులు చెబుతుండగా.. ప్రస్తుతం వాణిజ్య ప్రాంతాల్లోని దుకాణాలు, భవనాలు కోల్పోవడంతో ఉపాధి కోల్పోతామని పలువురు పాతబస్తీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హోటళ్లు, టీస్టాళ్లు, వివిధ రకాల వస్త్ర, కిరాణా దుకాణాలు, ఫ్యాన్సీ స్టోర్లు వంటివి కూల్చివేతలకు గురి కానున్నాయి.

'యాప్'రే!

ఈ- చలాన్లతో పెరుగుతున్న ఆదాయం

- తగ్గుతున్న 'చెత్త' సమస్యలు
- మరిన్ని ఉల్లంఘనలపై చర్యలకు సిద్ధం
- సత్ఫలితాలిస్తున్న జీహెచ్ఎంసీ ప్రత్యేక యాప్

సాక్షి, సిటీబ్యూరో: ఓవైపు చెత్త సమస్యల పరిష్కారం.. మరో వైపు జీహెచ్ఎంసీ ఖజానాకు గండి పడకుండా రెండు రకాలుగా ఉపకరించేందుకు జీహెచ్ఎంసీ ఇటీవల అందుబాటులోకి తెచ్చిన 'చెత్త వేస్తే ఈ-చలాన్' విధానం మంచి ఫలితాలిస్తోందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ విధానం కోసం జీహెచ్ఎంసీ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సంబంధిత అధికారులకు శిక్షణ నిచ్చింది. వాటిని వినియోగిస్తూ ప్రస్తుతం వారు మూడు రకాల ఉల్లంఘనలకు పెనాల్టీలు విధిస్తున్నారు.

సొమ్ము పక్కదారి పట్టకుండా..

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారెవరో గుర్తించేందుకు ప్రస్తుతం అన్నిప్రాంతాల్లో తగిన సాంకేతికత అందుబాటులో లేకపోవడంతో.. తొలుత దుకాణాల ముందు చెత్త వేసేందుకు ప్రత్యేకంగా చెత్త డబ్బాలు ఏర్పాటు చేయని దుకాణదారులకు, దుకాణాల ముందు వ్యర్థాలు వేస్తున్న వారికి, ఎక్కడ పడితే అక్కడ సీఅండ్‌డీ (నిర్మాణ, కూల్చివేతల) వ్యర్థాలు వేసినట్లు గుర్తించిన వారికి ఈ-చలానాలు విధిస్తున్నారు. దీంతో పాటు పెనాల్టీలను సైతం యూపీఐ ద్వారానే చెల్లించాల్సి ఉండటంతో పెనాల్టీల సొమ్ము పక్కదారి పట్టకుండా జీహెచ్ఎంసీ ఖజానాలోకే చేరేందుకు మార్గం ఏర్పడింది.

పెనాల్టీల వివరాలు అందుబాటులోకి..

గతంలో పెనాల్టీలకు పుస్తకాల్లోని రసీదులిచ్చినప్పుడు ఎవరికి ఎంత మేర పెనాల్టీ విధించారో, ఎంత వసూలు చేశారో, ఎంత జీహెచ్ఎంసీ ఖజానాలో చెల్లించారో, అసలు చెల్లించారో లేదో తెలిసేది కాదు. ప్రస్తుతం ఈ-చలానా కావడంతో ఎంతమందికి చలానాలు విధించింది, వాటిలో ఎంతమంది చెల్లించింది, ఎంత మొత్తం చెల్లించింది తదితర వివరాలు యాప్‌లోనే ఎప్పుడైనా ఉన్నతాధికారులు సైతం చూడవచ్చని అడిషనల్ కమిషనర్ సీఎస్ రఘు ప్రసాద్ (శానిటేషన్) తెలిపారు. అంతేకాకుండా పెనాల్టీలు విధిస్తారని తెలిసి యజమానులు తమ దుకాణాల ముందు బిన్లు ఏర్పాటు చేసుకుంటారని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త, సీఅండ్‌డీ వ్యర్థాలు వేసేవారు కూడా క్రమేపీ తగ్గుతారనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. మొత్తానికి యాప్‌తో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని, ఈ అనుభవంతో ముందు మరిన్ని ఉల్లంఘనలకు సైతం ఈ యాప్‌ను వినియోగించుకొని ఈ-చలానాలను విధించనున్నట్లు రఘు ప్రసాద్ తెలిపారు.

గత వారం రోజుల్లో దుకాణాల ముందు చెత్త డబ్బాలు ఉంచని 189 మంది దుకాణాల నిర్వాహకులకు విధించిన పెనాల్టీలు రూ.4,10,300.

- ఇందులో మంగళవారం 19 మందికి రూ. 55,400 పెనాల్టీలు విధించారు.
- వారం రోజుల్లో యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అత్యధికంగా 33 మందికి రూ.1,36,000 పెనాల్టీ విధించారు.
- మెహిదీపట్నం, ముషీరాబాద్, అంబర్‌పేట, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, బేగంపేట, మలక్‌పేట, చాంద్రాయణగుట్ట, చార్మినార్ సర్కిళ్లలో మాత్రం ఇంకా ఈ-చలానాలు ఇంకా ప్రారంభించనట్లు తెలిసింది. ఈ సర్కిళ్లలో ఇంతవరకు ఎలాంటి పెనాల్టీలు విధించలేదు.



‘డ్రగ్స్,గంజాయి నిర్మూలన సామాజిక బాధ్యత’

సాక్షి సిటీబ్యూరో: డ్రగ్స్, గంజాయి కేసుల్లో నిందితుల పట్ల కఠినంగా వ్యవహించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎక్సైజ్ శాఖ భవనంలోని సమావేశ మందిరంలో హైదరాబాద్ డివిజన్ ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు, ఎన్‌ఫోర్స్ మెంట్ బృందాలకు డైరెక్టర్ చేతుల మీదుగా క్యాష్ రివార్డులను అందజేశారు. హైదరాబాద్ నగరం డ్రగ్స్, గంజాయి, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ప్యూరిఫైడ్ లిక్కర్, ఇతర మత్తు పదార్థాలకు కేంద్రంగా ఉందని ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, ఎస్ టీ ఎఫ్ టీమ్‌లు, డీటీఎఫ్ టీమ్‌లు వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.నార్కోటిక్, పోలీస్, ఇతర ఏజెన్సీలకు ధీటుగా ఎక్సైజ్‌శాఖ పని చేయాలని, మన పనితీరే మన శాఖకు పేరు తెచ్చిపెడుతుందనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. హైదరాబాద్ డివిజన్‌లో 16 కేసుల్లో 41 మందికి డైరెక్టర్ చేతుల మీదుగా క్యాష్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈఎస్‌లు శ్రీనివాసరావు, స్మితా సౌజన్యలతో పాటు సీఐలు జగన్‌మోహన్‌రెడ్డి, రామకృష్ణ, చంద్రశేఖర్, శ్రీనివాస్, కోటమ్మ, శిరీష, మహేష్ పాల్గొన్నారు.

‘నేను ఇంటికి రాను.. నన్ను మరిచిపో’

భర్తకు మెసేజ్ చేసి భార్య అదృశ్యం


మీనాక్షి(ఫైల్)

సుభాష్‌నగర్: ‘నేను ఇంటికి రాను..నన్ను మరిచిపో’ అని భర్తకు మెసేజ్ చేసి ఓ మహిళ అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సాయిబాబానగర్ పాండుబస్తీలో రమేష్, మీనాక్షి దంపతులు నివాసం ఉంటున్నారు. మీనాక్షి స్థానికంగా కూరగాయల దుకాణం నిర్వహించేది. ఈ నెల 16న సాయంత్రం ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లింది. సాయంత్రం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన రమేష్ భార్య కనిపించకపోవడంతో ఆమె సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అయితే రాత్రి 10.45 గంటలకు ‘నేను ఇంటికి రాను.. నన్ను మరిచిపో’ అంటూ ఆమె భర్తకు మెసేజ్ పంపింది. దీంతో రమేష్ తన భార్య కనిపించడం లేదని సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐతో టోకరా!

ఎన్నారై వాట్సాప్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు

- అంతకు ముందే కాల్ చేసి వాయిస్ నమూనా రికార్డు
- డబ్బులు కావాలని ఆమె వదినకు సందేశం
- అనుమానంతో ఫోన్ చేసినా ఏఐతో మేనేజ్

రూ.1.97 లక్షలు స్వాహా, సిటీ సైబర్ ఠాణాలో కేసు



సాక్షి, సిటీబ్యూరో: ‘కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల డీపీలతో ఉన్న వాట్సాప్ నెంబర్ల నుంచి డబ్బు కావాలని సందేశాలు వస్తున్నాయా..? బదిలీ చేసే ముందు ఫోన్ చేసి ఖరారు చేసుకోండి’... ఇప్పటి వరకు డీపీ ఫ్రాడ్స్ నేపథ్యంలో పోలీసులు చేస్తున్న అలెర్ట్ ఇది. అయితే ఆ ఫోన్ కాల్ కూడా సైబర్ నేరగాళ్లకే వెళ్లి, వాళ్లే సంబంధీకుల మాదిరిగా మాట్లాడితే..! సరిగ్గా ఇదే జరిగింది. సైబర్ నేరగాళ్లు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను (ఏఐ) అడ్డంగా వాడేస్తున్నారు. టార్గెట్ చేసిన వ్యక్తుల వాయిస్‌లు రికార్డు చేసి, వారి వాట్సాప్ హ్యాక్ చేసి, సంబంధీకులను మోసం చేస్తున్నారు. ఏఐ బేస్డ్ సైబర్ క్రైమ్‌కు సంబంధించిన తొలి కేసు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నమోదైంది. అమెరికాలో ఉన్న మరదలి మాదిరిగా సిటీలో ఉన్న ఆమె వదినను సంప్రదించిన సైబర్ నేరగాళ్లు ఆమె నుంచి రూ.1.97 లక్షలు కాజేశారు. ఈ కేసును అధికారులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాక్ చేసి టూ స్టెప్ వెరిఫికేషన్...

నగరానికి చెందిన ఓ మహిళ (72) మరదలు అమెరికాలోని న్యూజెర్సీలో ఉంటున్నారు. ఇలాంటి అనేక మంది ఎన్నారైలకు సంబంధించిన ఫోన్ నెంబర్ల డేటాను ఉత్తరాదికి చెందిన సైబర్ నేరగాళ్లు డార్క్‌వెబ్ ద్వారా సంగ్రహిస్తున్నారు. న్యూజెర్సీలో ఉండే మహిళ ఫోన్ నెంబర్‌ను ఇదే తరమాలో చేజిక్కించుకున్న సైబర్ నేరగాళ్లు తొలుత ఆమెకు కాల్ చేశారు. ఆమెతో మాట్లాడుతున్నప్పుడు వాయిస్‌ను రికార్డు చేసుకున్నారు. ఆపై సదరు ఎన్నారై వాట్సాప్‌ను హ్యాక్ చేసి తమ ఆధీనంలోకి తీసుకున్న సైబర్ నేరగాళ్లు మళ్లీ తమ చేయిజారకుండా టూ స్టెప్ వెరిఫికేషన్ యాక్టివేట్ చేసుకున్నారు. దీంతో తన వాట్సాప్ హ్యాక్ అయిందని న్యూజెర్సీలో ఉన్న ఎన్నారై గుర్తించినప్పటికీ... తిరిగి తమ ఆధీనంలోకి తీసుకోలేకపోయారు. దీనిపై ఆమె అటు వాట్సాప్‌కు ఫిర్యాదు చేయకపోవడం, ఇటు సంబంధీకులను వెంటనే అప్రమత్తం చేయకపోవడం కేటుగాళ్లకు కలిసి వచ్చింది.

ఆమె మాదిరిగా ఈమెకు వలవేసి...

ఎన్నారై వాట్సాప్ తమ ఆధీనంలో ఉండటంతో సైబర్ నేరగాళ్లు అప్పటికే రికార్డు చేసిన ఆమె ఆడియోను ప్రత్యేక ఏఐ యాప్స్‌లో సింక్ చేసి ఉంచారు. ఇలా చేయడంతో తాము కోరుకున్న వ్యక్తులతో ఎన్నారై మాదిరిగా సైబర్ నేరగాళ్లు మాట్లాడే అవకాశం ఉంటుంది. ఇలాంటి కసరత్తులు పూర్తి చేసిన కేటుగాళ్లు అమెరికాలో ఉన్న మరదలి మాదిరిగా ఆమె వాట్సాప్ నుంచే నగరంలో ఉన్న వదినకు ఓ సందేశం పంపారు. తనకు అత్యవసరం కావడంతో కొంత నగదు పంపాలని అందులో ఉంది. ఈ సందేశం చూసి అనుమానించిన వదిన.. తన మరదలికి కాల్ చేసి నిర్ధారించుకోవాలని భావించారు. ఈమె డైరెక్ట్ కాల్ చేస్తే అసలు విషయం తెలిసిపోయేది. అయితే దీనికి ఇంటర్నేషనల్ కాల్ చేయాల్సి ఉండటంతో... వాట్సాప్ కాల్‌ను ఆశ్రయించారు. అయితే అప్పటికే ఎన్నారై వాట్సాప్ సైబర్ నేరగాళ్ల ఆధీనంలో ఉండటంతో కాల్ కూడా వారికే చేరింది.

ఏఐ యాప్ ద్వారా ఎన్నారై మాదిరిగా...

ఇలా జరిగే అవకాశం ఉందని భావించిన నేరగాళ్లు అప్పటికే ఎన్నారైకి కాల్ చేసి, ఆమె వాయిస్‌ను సంగ్రహించిన వాయిస్ నమూనాను ఏఐ యాప్‌తో సింక్ చేసి ఉంచారు. ఈ ఫోన్ కాల్‌ను వాళ్లు సదరు యాప్‌తో సింక్ చేసి మాట్లాడటంతో ఎన్నారై గొంతే నగర మహిళకు వినిపించింది. నగదు అడిగింది మీరేనా అంటూ ఆరా తీయగా.. ఔనంటూ అవతలి నుంచి సమాధానం వచ్చింది. దీంతో తన మరదలే నగదు అడిగారని ఖరారు చేసుకున్న నగర మహిళ రూ.1.97 లక్షలు గూగుల్ పే ద్వారా బదిలీ చేశారు. ఈ తర్వాత ఎన్నారై మరదల్ని మరోమారు సాధారణ కాల్ చేసి సంప్రదించిన నగర మహిళకు తాను మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఆమె సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇలాంటి ఏఐ ఆధారిత నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న అధికారులు ప్రతి ఒక్కరూ తమ వాట్సాప్‌కు టూ స్టెప్ వెరిఫికేషన్ యాక్టివేట్ చేసుకోవాలని కోరుతున్నారు. డీపీలు, స్టేటస్‌లు సైతం ‘ఓన్లీ కాంటాక్ట్స్’కు కనిపించేలా సెట్టింగ్స్ మార్చుకోవాలని స్పష్టం చేస్తున్నారు.

ఎంపీ ఇల్లని తెలియకుండానే చోరీకొచ్చాడు..

- చోరీ కోసమే డీకే అరుణ ఇంటికి వెళ్లిన ఘరానా దొంగ
- ఉత్తరాఖండ్‌కు చెందిన మహ్మద్ అక్రమ్‌గా గుర్తింపు
- నిందితుడిపై ఇప్పటికే ఢిల్లీ వ్యాప్తంగా 35 కేసులు
- అక్కడి పోలీసుల నిఘా తప్పించుకోవడానికే హైదరాబాద్‌కు


వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్


నిందితుడు అక్రమ్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎంపీ డీకే అరుణ ఇంట్లోకి ప్రవేశించిన అగంతకుడు ఉత్తరాఖండ్‌కు చెందిన ఘరానా దొంగ మహ్మద్ అక్రమ్‌గా తేలింది. 2004 నుంచి ఢిల్లీలోని ఖరీదైన ప్రాంతాలను టార్గెట్ చేస్తున్న ఇతడు తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చాడు. అది ఎంపీ ఇల్లు అని తెలియకుండానే లోపలికి ప్రవేశించాడు. కేవలం నగదు మాత్రమే తస్కరించే నైజం ఉన్న అక్రమ్ అది దొరక్కపోవడంతో ఫ్రూట్ బాక్సులు తీసుకుని ఉడాయించాడు. ఈ ఘరానా చోరుడిని పాతబస్తీలోని తలాబ్‌కట్టలో ఉన్న అతడి అద్దె ఇంటి సమీపంలో పట్టుకున్నట్లు పశ్చిమ మండల డీసీపీ విజయ్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. వెస్ట్‌జోన్, సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో నిందితుడు పట్టుబడినట్లు పేర్కొన్నారు.

విలాసవంతమైన జీవితం...

ఉత్తరాఖండ్‌లోని మొహల్లా ప్రాంతానికి చెందిన అక్రమ్ గతంలో తాపీ మేస్త్రీగా, ప్రస్తుతం టైల్స్ ఫిట్టింగ్ పనిచేస్తున్నాడు. జల్సాలు, అత్యంత విలాసవంతమైన జీవితానికి అలవాటుపడిన అక్రమ్ అందుకు అవసరమైన డబ్బు కోసం 2004 నుంచి నేరాలు చేయడం మొదలెట్టాడు. తనపై ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మొహల్లా నుంచి సాధారణ వ్యక్తిగా బయలుదేరి ఢిల్లీ వెళ్లేవాడు. అక్కడ ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు ధరించి లాడ్జిల్లో బస చేసేవాడు. ఆ అవతారంలోనే వెళ్లి సంపన్నులు ఉండే ప్రాంతాలను ఎంచుకుంటాడు. తొలిరోజు రెక్కీ చేసి, రెండో రోజు పంజా విసురుతాడు. ఇలా దేశ రాజధానిలో 35 ఇళ్లల్లో చోరీలు చేసి పలుమార్లు పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. 2014 నుంచి తన మకాంను ఢిల్లీకి మార్చాడు.

నో గోల్డ్... ఓన్లీ క్యాష్..

ఈ ఘరానా దొంగ గతంలో అనుచరుడిని ఏర్పాటు చేసుకుని చోరీలు చేసేవాడు. ఇంట్లోకి ప్రవేశించిన తర్వాత బంగారం, వెండితో పాటు నగదు కూడా ఎత్తుకుపోయేవాడు. 2019లో సౌత్-ఈస్ట్ ఢిల్లీ పోలీసులు ఇతడితో పాటు అనుచరుడు ఖాలిద్ మహ్మద్‌ను పట్టుకున్నారు. అప్పట్లో చోరీ బంగారాన్ని విక్రయించడానికి ఖాలిద్ ప్రయత్నించడమే పోలీసులకు ఆధారమైంది. ఆ అనుభవంతో పంథా మార్చుకున్న అక్రమ్... అనుచరులకు, నగలకు దూరంగా ఉంటున్నాడు. ఒంటరిగా సంచరిస్తూ, ఖరీదైన ఇళ్లల్లోకి ప్రవేశిస్తూ, నగదు మాత్రమే తస్కరించడం మొదలెట్టాడు. ఢిల్లీలో పోలీసుల నిఘా ఎక్కువ కావడంతో హైదరాబాద్‌కు వచ్చి తలాబ్‌కట్ట ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉన్నాడు. సంపన్నులు ఉండే ప్రాంతంలో ఇంటిని ఎంపిక చేసుకుని, భారీ మొత్తం కొల్లగొట్టి ఢిల్లీ వెళ్లిపోవాలని పథకం వేశాడు.

సీసీ కెమెరాల సాయంతో అరెస్ట్..

పాతబస్తీలో ఆటో ఎక్కే అక్రమ్ తాను టైల్స్ పని చేస్తానని, దానికోసం సంపన్నులు ఉండే ప్రాంతాలకు వెళ్లాలని డ్రైవర్‌కు చెప్పేవాడు. అలా శనివారం ఉదయం పెద్దమ్మ గుడి వద్దకు వచ్చిన అక్రమ్ అక్కడ నుంచి పలు ప్రాంతాల్లో తిరిగాడు. చివరకు డీకే అరుణ ఇంటిని ఎంపిక చేసుకుని.. మరుసటి రోజు ఇంట్లోకి ప్రవేశించాడు. ఇల్లు మొత్తం తిరిగినా ఎక్కడా నగదు కనిపించకపోవడం, నిద్రిస్తున్న పనిమనుషుల్లో కదలికలు గమనించడంతో బయటకు వచ్చేశాడు. ఈ కేసును ఛేదించడానికి వెస్ట్‌జోన్ పోలీసులు, సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ అధికారులు రంగంలోకి దిగారు. వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్ ఆధారంగా తలాబ్‌కట్టలో అక్రమ్‌ను గుర్తించి పట్టుకున్నారు.

ఎవరెవరు ‘ఇన్‌ఫ్లూయెన్స్’ చేశారు?

- సోషల్‌మీడియాను వడపోస్తున్న రాష్ట్ర పోలీసులు
- బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన వారిని గుర్తించేందుకే..
- కొందరు సెలబ్రిటీల ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు
- కానిస్టేబుల్ కిరణ్ పాత్రపై ముమ్మర దర్యాప్తు

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియా ద్వారా గేమింగ్, బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లపై హైదరాబాద్ పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఓ సామాజిక కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదుతో పంజగుట్ట ఠాణాలో 11 మందిపై నమోదైన కేసును సాంకేతికంగా దర్యాప్తు చేస్తున్నారు. మిగిలిన సెలబ్రిటీలు, యాంకర్లు, ఇన్‌ఫ్లూయెన్సర్లలో ఎవరైనా ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడుతున్నారా అనేది తేల్చేందుకు సోషల్‌మీడియాను వడపోస్తున్నారు. ఇప్పటికే కొందరు సెలబ్రిటీలపై ఆధారాలు లభించినట్లు తెలిసింది. పంజగుట్ట కేసులో హబీబ్‌నగర్ ఠాణా కానిస్టేబుల్ కిరణ్ కూడా నిందితుడిగా ఉన్నాడు. అతను యూనిఫాంలో ఇమ్రాన్ అనే ఇన్‌ఫ్లూయెన్సర్‌తో కలిసి కొన్ని వీడియోలు చేశాడు. వీటిని తన పరేషాన్ బాయ్స్ పేజ్‌లో పోస్టు చేసిన ఇమ్రాన్.. అనేక మందిని నమ్మించి, యాప్స్ ప్రమోట్ చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వీరిద్దరూ చిక్కడపల్లికి చెందిన వారని, స్నేహితులని పోలీసులు పేర్కొన్నారు. ఇమ్రాన్ ఖాతాలోని వీడియోలను అధ్యయనం చేసిన పోలీసులు కొన్ని అభ్యంతరకరమైన, అసభ్యకరమైనవి ఉన్నట్లు తేల్చారు. ఈ కేసుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు నిందితుల పాత్రలపై ఆరా తీస్తున్నారు. వీరికి యాప్స్ నిర్వాహకులతో ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీల పైనా దృష్టి సారించారు. పంజగుట్ట పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా నటి విష్ణు ప్రియ, ఇన్‌ఫ్లూయన్సర్ టేస్టీ తేజలకు నోటీసులు పంపించారు. మంగళవారం సాయంత్రం లోపు వారు తమ ముందు హాజరు కావాలని స్పష్టం చేశారు. మిగిలిన వారి ఫోన్లు స్విచ్ ఆఫ్‌లో ఉన్నాయి. విష్ణు ప్రియ, టేస్టీ తేజ తరఫున బిగ్‌బాస్ కంటెస్టెంట్ శేఖర్ భాష పోలీసు ఉన్నతాధికారులను కలిసి వారికి కొంత సమయం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా శేఖర్ భాషా మీడియాతో మాట్లాడుతూ .. విష్ణుప్రియ, టేస్టీ తేజలు బిగ్‌బాస్‌లో తన సహ కంటెస్టెంట్‌లు అని, వారు భయంతో స్టేషన్‌కు రాలేకపోయారని, వారి తరఫున తనను పంపి సమయం కోరారని చెప్పారు. ఉన్నతాధికారులు వారికి మూడు రోజుల సమయం ఇచ్చినట్లు పేర్కొన్నారు. బిగ్‌బాస్ నుంచి బయటికి వచ్చాక ఎంతో మంది తమ ప్రొడక్ట్స్ ప్రమోట్ చేయాలని కోరతారని, ఆ క్రమంలోనే విష్ణుప్రియ, టేస్టీ తేజ ఏడాదిన్నర క్రితం బెట్టింగ్ యాప్స్‌ను పర్యావసనాలు తెలియకుండా ప్రమోట్ చేశారన్నారు. ఇకపై బిగ్‌బాస్ ఫ్యామిలీలో ఎవరూ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ చేయరని హామీ ఇచ్చారు.

క్షమాపణలు చెప్పినా చర్యలు తప్పవు

పంజగుట్ట కేసులో నిందితులుగా ఉన్న వారి వీడియోలను విశ్లేషిస్తున్నాం. వీరికి యాప్స్ నిర్వాహకులకు మధ్య ఉన్న లావాదేవీలపై ఆరా తీస్తున్నాం. ఈ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలు, న్యాయ నిపుణుల సలహాల ఆధారంగా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలని అనేది తేలుస్తాం. ఈ యాప్స్ ప్లే, యాప్ స్టోర్స్‌లో ఉండట్లేదు. వ్యక్తిగతంగా, సందేశాల ద్వారా లింకుల రూపంలో షేర్ అవుతున్నాయి. కొందరు ఇన్‌ఫ్లూయన్సర్లు తాము చేసిన యాప్స్ ప్రమోషన్‌పై క్షమాపణలు చెబుతూ వీడియోలు పోస్టు చేస్తున్నారు. వారిలో పరివర్తన, పశ్చాత్తాపం రావడం అభినందనీయం. అయితే చేసిన తప్పునకు మాత్రం విచారణను ఎదుర్కోవాల్సిందే.

– ఎస్ఎం విజయ్‌కుమార్, వెస్ట్‌జోన్ డీసీపీ

జైలు నుంచి మహిళా జర్నలిస్టులు విడుదల

చంచల్‌గూడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా వార్తలు ప్రసారం చేసిన ఆరోపణలపై ఇద్దరు మహిళా యూట్యూబ్ జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. న్యాయస్థానం వారికి బెయిల్ మంజూరు చేయడంతో మంగళవారం రేవతి, తన్వీయాదవ్‌లు జైలు నుంచి విడుదలయ్యారు.

బెయిల్‌పై భాను కిరణ్ విడుదల

నగరంలో 2011 జరిగిన ఫ్యాక్షనిస్టు మద్దెలచెరువు సూరి హత్య కేసులో ప్రధాన నిందితుడు భానుకిరణ్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో మంగళవారం ఆయన చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. చర్లపల్లి జైల్లో ఉన్న భానుని 2016లో చంచల్‌గూడ జైలుకు తరలించారు. భానును కట్టుదిట్టమైన భద్రతతో అతడి అనుచరులు మరో చోటికి తరలించారు. మీడియాతో మాట్లాడేందుకు భాను నిరాకరించాడు.

గదిలో నిర్బంధించి..తీవ్రంగా కొట్టి..

సుచిరిండియా ఎండీ కిరణ్‌పై క్రిమినల్ కేసు నమోదు


లయన్ కిరణ్..

బంజారాహిల్స్: లెక్కల్లో తేడా వచ్చిందని తమ సంస్థ ఉద్యోగిని గదిలో నిర్బంధించి తీవ్రంగా కొట్టి హింసించాడనే ఆరోపణలపై సుచిరిండియా ఇన్‌ఫ్రా టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ లయన్ కిరణ్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..వరంగల్‌కు చెందిన బుస్సా ప్రియాంక్ సుచిరిండియాలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న సంస్థ జీఎం మధుసూదన్ అతడికి ఫోన్ చేసి కిరణ్‌ను కలవాలని చెప్పాడు. దీంతో ప్రియాంక్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లో ఉన్న లయన్ కిరణ్ ఇంటికి వచ్చాడు. అప్పటికే ఆగ్రహంగా ఉన్న కిరణ్ రూ.5 లక్షలు మోసం చేశావంటూ ప్రియాంక్‌పై దాడి చేయడమేగాక గదిలో నిర్బంధించాడు. దీంతో అతను తనను కొడుతున్నారంటూ తన బంధువు ప్రమోద్‌కుమార్‌కు సమాచారం అందించడంతో ప్రమోద్ డయల్ 100కు ఫిర్యాదు చేశాడు. సోమవారం సాయంత్రం బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రియాంక్‌ను స్టేషన్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కిరణ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనపై దాడి చేయడమే కాకుండా ఈ విషయం పోలీసులకు చెప్పినా తనను ఏమీ చేయలేరంటూ కిరణ్ బెదిరించాడని, బలవంతంగా ఫోన్ పే ద్వారా కొంత డబ్బును తన ఖాతాకు మళ్లించుకున్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మీడియా, పోలీసులను తప్పుదోవ పట్టించాడు

తప్పుడు సమాచారంతో మీడియాను, పోలీసులను తప్పుదోవ పట్టించిన తమ మాజీ ఉద్యోగి ప్రియాంక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సుచిరిండియా సంస్థ అధినేత లయన్ కిరణ్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తన సంస్థ వరంగల్ రిసార్ట్‌లో పని చేసే మాజీ ఉద్యోగి ప్రియాంక్ ఆర్థిక లావాదేవీల్లో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి బంజారాహిల్స్‌లోని తన ఇంటికి పిలిపించామన్నారు. అదే రిసార్ట్‌లో ఆపరేషనల్ హెడ్ పని చేసే అధికారిని ఈ వ్యవహారానికి సంబంధించి ఆధారాలు తీసుకుని రమ్మని చెప్పామని అప్పటి వరకు తన ఇంట్లో ముందున్న ఆఫీస్ వద్ద ఉండమని చెప్పామన్నారు. అతను వస్తే తన బండారం బయటపడుతుందనే భయంతో బయటికి వెళ్లిన ప్రియాంక్ డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చాడని అక్కడితో ఆగకుండా తనను కిడ్నాప్ చేశామని, కొట్టామని మీడియాతో చెప్పాడన్నారు.అతను స్వయంగా రూ. 5 లక్షల ఫ్రాడ్ జరిగిందని అందరికీ చెబుతున్నాడని ఈ వ్యవహారంపై తాము పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

నాగోలు: తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై పోలీసులు మంగళవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17న ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి.. తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, గతంలోనూ ఆయన తనను కులం పేరుతో దూషించినట్లు కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం 1989, సెక్షన్ 79, బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు.

కృతజ్ఞతలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: తెలంగాణ శాసన సభలో బీసీ బిల్లును ప్రవేశ పెట్టడమే కాకుండా ఏకగ్రీవంగా ఆమోదం పొందినందుకు తెలంగాణ బీసీ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం ఖైరతాబాద్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా రంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధనిక రాష్ట్రంగా చెప్పుకునే తెలంగాణ విద్యా రంగంలో దేశంలో చివరి స్థానంలో ఉండడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ ప్రాముఖ్యతను గుర్తించాలని, ఈ బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల మూసివేతను తక్షణమే నిలిపి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సౌకర్యాలు కల్పించి బలోపేతం చేయాలన్నారు. రాష్ట్రంలో 90 శాతం పైగా ఉన్న అట్టడుగు వర్గాలు అభివృద్ధి పథంలో పయనించాలంటే విద్యకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఇందిరానగర్‌లో తాగునీటి సమస్యకు చెక్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్, జవహర్ కాలనీల్లో మంచి నీటి సమస్యకు అధికారులు పరిష్కారం చూపారు. రూ. 67 లక్షల వ్యయంతో భారీ మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు బుధవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శంకుస్థాపన చేయనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 14 కొబ్బరిబోండాల చౌరస్తా నుంచి ఎన్టీఆర్ భవన్ వరకు 450 ఎంఎం డయా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా ఇందిరానగర్, జవహర్ కాలనీల్లో ఇప్పుడున్న మంచినీటి సమస్య పూర్తిగా పరిష్కారం కానుంది. తట్టికాన వాటర్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా చేయనున్నారు. ఈ పైప్‌లైన్ నిర్మాణం కోసం ట్రాఫిక్ పోలీసులు క్లియరెన్స్ కూడా ఇచ్చారు. పది రోజుల్లో పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని జలమండలి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ రెండు బస్తీల్లో నీటి సమస్య తీవ్రంగా ఉండగా 40 ఏళ్ల క్రితం వేసిన పైపులద్వారా నీళ్లను సరఫరా చేస్తుండటంతో చాలినన్ని నీళ్లు రావడం లేదు. ప్రస్తుతం వేయబోయే లైన్ ద్వారా ఈ సమస్యకు చెక్ పెడుతున్నారు.

వినూత్న ప్రాజెక్ట్ 'వేవియర్'కు పేటెంట్ హక్కులు



దివ్యతేజ

ఫిలింనగర్: జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్ 2019కు బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి పసుపులేటి దివ్యతేజ వినూత్న ప్రాజెక్ట్ 'వేవియర్'కు పేటెంట్ హక్కులు లభించాయి. సముద్రంలో మునిగిపోయే సంఘటనను నిరోధించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందింపజేయడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను నెలకొల్పారు. ఇందులో ఉపాధ్యాయులు విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ వారిని తీర్చిదిద్దుతున్నారు. దివ్యతేజ సైతం ఈ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో చురుకుగా పాల్గొని తయారు చేసిన ప్రాజెక్ట్ పాఠశాల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ మోడల్ నుంచి జాతీయ స్థాయిలో గొప్ప ఆవిష్కరణగా గుర్తింపు పొందింది. ప్రపసుపులేటి దివ్యతేజను అధ్యక్షులు మురళీముకుంద్, డైరెక్టర్ ఎం.వరలక్ష్మీ, ప్రిన్సిపాల్ కాంచనవల్లి అభినందించారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుడి రిమాండ్

రహమత్‌నగర్: పెళ్లి పేరుతో మోసం చేసిన యువడిని బోరబండ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రహమత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌కు చెందిన ఓ యవతికి ఆదే ప్రాంతానికి చెందిన రాకేష్ యాదవ్(26)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. సదరు యువతి అతనితో సన్నిహితంగా ఉండేది. తనను పెళ్లి చేసుకోవాలని రాకేషను కోరగా, దానికి అతడు నిరాకరించాడు. ఈ నెల 12 మరో అమ్మాయితో రాకేష్ వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న యువతి రాకేష్ నివాసానికి వెళ్లి ఆత్మహత్యాయానికి పాల్పడింది. అనంతరం యువతి ఫిర్యాదు మేరకు రాకేషను రిమాండ్‌కు తరలించారు.

35 కేంద్రాలు.. 8112 మంది విద్యార్థులు

- ఈ నెల 21 నుంచి 'పది' పరీక్షలు ప్రారంభం
- ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు
- ఆందోళన చెందవద్దంటున్న నిపుణులు



హాల్ టికెట్లతో విద్యార్థులు

బంజారాహిల్స్: 'పది' పరీక్షల ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులనున ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మెరుగైన ఫలితాల కోసం సూచనలు, సలహాలు ఇస్తున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. మాల్ ప్రాక్టీస్ నియంత్రణ కోసం ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిధిలో 17 ప్రభుత్వ ఉన్నత, రెండు ఎయిడెడ్, 4 గురుకులాలు, 4 వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్లు, 103 ప్రైవేటు పాఠశాలలు కలిపి 8,112 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నిపుణుల సూచనలు..

- ఉదయం 5 గంటలకే నిద్ర లేచి చదువుకోవాలి.
- సబ్జెక్టుల్లోని కీలక అంశాలను ఎప్పటికప్పుడు రాస్తుండాలి.
- బట్టీ పట్టకుండా అర్థం చేసుకుని చదవాలి.
- ఉదయం తేలికపాటి ఆహారం తీసుకుని పరీక్షకు బయలుదేరాలి.
- చల్లదనాన్ని కలిగించే పండ్ల రసాలు, పండ్లు తప్పనిసరిగా తీసుకోవాలి.
- జలుబు, నీరసం, ఇతర సమస్యలతో బాధ పడుతున్న వారు వైద్యుల సలహాలతో పరీక్షలకు వెళ్లాలి.
- తమ వెంట ఇంటి నుంచి మంచినీళ్ల సీసాలను తీసుకెళ్లడం ఉత్తమం.
- తేలికపాటి దుస్తులు ధరించాలి.
- పరీక్ష రాసి తిరుగు ప్రయాణంలో ఎండల నుంచి ఉపశమనం కోసం విద్యార్థులు తల, ముక్కు, నోరు కప్పి ఉంచేలా టోపీలు, చేతి రుమాలు కప్పి ఉంచాలి.
- రాత్రంతా మేల్కొని ఉండి చదవరాదు.
- చాలామంది విద్యార్థులు టెన్షనతో పరీక్షలు రాస్తుంటారని, అలా కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయడం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చని పేర్కొంటున్నారు.

పొంగిన మ్యాన్‌హోళ్లు.. జారిపడ్డ వాహనదారులు



రోడ్డుపై పారిన నూనె వ్యర్థాలు



శుభ్రం చేస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: సిల్ట్ ఛాంబర్లు ఏర్పాటు చేసుకోకుండా రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకుల నిర్లక్ష్యంతో వాహనదారులు రోడ్లపై జారిపడి గాయాపాలయ్యారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లో టీవీ9 వద్ద ఉదయం 10 గంటల నుంచి మ్యాన్‌హోళ్లు పొంగడంతో అందులోంచి వెలువడిన వ్యర్థాలు, నూనె పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చింది. టీవీ9 నుంచి సిగ్నల్ వరకు ఈ వ్యర్థాలు రోడ్డుపై పారడంతో వాహనదారులు జారి కిందపడ్డారు. సుమారు 20 మందికి పైగా వాహనదారులు కిందపడినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివకుమార్ జెట్టింగ్ వాహనాన్ని పంపించి వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కరించారు. పక్కనే ఉన్న సదరన్ మిర్చి రెస్టారెంట్ నిర్వాహకులు నేరుగా నూనె, ఇతర వ్యర్థాలను మ్యాన్‌హోల్‌లో పోయడంతో ఇది జరిగిందని అధికారులు గుర్తించారు. సదరు రెస్టారెంట్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని జలమండలి మేనేజర్ శివకుమార్ తెలిపారు.

ఇఫ్తార్‌కు విందుకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

ఫిలింనగర్: ఇఫ్తార్ విందుకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. షేక్‌పేట సమీపంలోని డైమండ్ హిల్స్ కాలనీలో నివసించే మహ్మద్ ముజాహిద్ కమల్ కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాలో ఉంటున్నాడు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని గత జనవరిలో కుటుంబంతో కలిసి డైమండ్ హిల్స్‌లోని తన ఇంటికి వచ్చాడు. సోమవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి ఇఫ్తార్ విందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బెడ్‌రూమ్‌లో అలమారాలో భద్రపరిచిన బంగారు నగలు, నగదు, విదేశీ కరెన్సీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన క్రైం పోలీసులు ఘటనా స్థలంలో క్లూస్‌టీమ్ సహాయంతో దొంగల వేలిముద్రలను ఇతర ఆధారాలను సేకరించారు. 34 తులాల బంగారంతో పాటు రూ.4.50 లక్షల నగదు, 550 కెనడియన్ డాలర్లు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రతీ వీధిలోకి చెత్త సేకరించే వాహనం వెళ్లాలి



శానిటేషన్ సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న రవి

బంజారాహిల్స్: ప్రతి వీధిలోకి చెత్త సేకరించే వాహనం వెళ్లేలా చూసుకోవాలని జూబ్లీహిల్స్ సర్కిల్-18 ఏఎంహెచ్‌వో డాక్టర్ కే.ఎస్ రవి అన్నారు. మంగళవారం ఆయన బంజారాహిల్స్‌లోని సిటీ మేనేజర్స్ ట్రెనింగ్ సెంటర్‌లో సర్కిల్-18లోని శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఏల పరిధిలో ఉండే పెద్ద పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్, సాఫ్ట్‌వేర్ సంస్థల కార్యాలయాల్లో వర్గ్రాబ్లేజ్ జనరేటర్స్ ఎలా పని చేస్తున్నాయో తనిఖీ చేసుకోవాలని సూచించారు. బీవోటీ పద్ధతిలో ఏర్పాటు చేసిన టాయ్‌లెట్స్ శుభ్రంగా ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. వీధుల్లో చెత్త సేకరించే వాహనాలకు కచ్చితంగా మైక్‌సెట్ ఉండటంతో పాటు తడి, పొడి చెత్త వేరుచేసే వ్యవస్థ అదే విధంగా హానికర వ్యర్థాలు సేకరించేందుకు ప్రత్యేక డబ్బాను కూడా కలిగి ఉండాలని అన్నారు. ప్రతి కమర్షియల్ దుకాణం ముందు 75 లీటర్ల సామర్థ్యం కలిగిన డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని సూచించారు.

కారు దొంగ రిమాండ్



పంజగుట్ట: మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్లేలోపే ఖరీదైన కారును దొంగతనం చేసిన కేసును పంజగుట్ట పోలీసులు ఛేదించారు. అమీర్‌పేట లీలానగర్‌కు చెందిన ప్రసాద్ ఆదివారం రాత్రి గ్రీన్‌పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసేందుకు తన ఎంజీ హెక్టార్ కారులో వెళ్లాడు. కారు ఆఫ్ చెయ్యకుండా మద్యం కొనేందుకు లోపలికి వెళ్లగానే గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కారుతో ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అక్కడి సీసీ కెమెరాలు పరిశీలించి దిగబార్ రఘునాథ్ (29)గా గుర్తించారు. మహారాష్ట్రకు చెందిన రఘునాథ్ అమీర్‌పేట, లాల్‌బంగ్లా సమీపంలో ఉంటూ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. మోనప్పా సర్కిల్ వద్ద రఘునాథ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ప్రజలపై డబ్బు, మద్యం ప్రభావం లేకుండా చూస్తాం



వివిధ పార్టీ నాయకులతో సమావేశమైన జకియా సుల్తానా

వెంగళరావునగర్ : త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలపై ఎలాంటి డబ్బు, మద్యం ప్రభావం పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తామని సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానా వెల్లడించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా స్థానికంగా బస్తీల్లో డబ్బులు, మద్యం పంపిణీ ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు రావడం తనిఖీలు చేసి వెళ్లడం జరుగుతుందని, అయితే రాజకీయ పార్టీలకు చెందిన కొంతమంది అధికారుల కళ్లుగప్పి ప్రజలకు అందజేస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఓటరు కార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానం చేస్తే దొంగ ఓట్లను అరికట్టవచ్చన్నారు. స్పందించిన ఉప కమిషనర్ జకియా సుల్తానా ఇకపై ఇలాంటి మద్యం, డబ్బు పంపిణీ లేకుండా ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు టి.సాయి శేషగిరిరావు, స్వామి, వినోద్, జీవీజ నాయుడు పాల్గొన్నారు.

నిమ్స్‌లో సెక్యూరిటీ సిబ్బంది వేతనాల గోస

విధులు బహిష్కరించి నిరసన

లక్డీకాపూల్ : నిమ్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులకు జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని నిమ్స్ కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం. వెంకటేష్ డిమాండ్ చేశారు. రెండు నెలల జీతాలను చెల్లించాలంటూ సెక్యూరిటీ గార్డులు విధులను బహిష్కరించారు. మంగళవారం నిమ్స్ స్పెషాలిటీ బ్లాక్ వద్ద నిరసన చేపట్టిన సెక్యూరిటీ గార్డులకు మద్దతుగా ఆయన మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డులకు ప్రతి నెల వేతనాలు చెల్లించడంలో ఓపీడీఎస్, నిమ్స్ యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. కార్మిక చట్ట ప్రకారం ప్రతి నెల7వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలన్నారు. నెలనెలా పే స్లిప్‌లు జీతాలతో పాటు ఇవ్వాలని కార్మిక శాఖ కమిషనర్ సూచించినప్పటికీ సంబంధిత యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. డబుల్ డ్యూటీలు చేయించుకుని వేతనాలు సరిగా చెల్లించడం లేదన్నారు. ప్రతినెల 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించకపోతే ఆందోళనను చేస్తామని హెచ్చరించారు. వేతన బకాయిల అంశంపై ఈ ఓపీడీఎస్ సెక్యూరిటీ సంస్థ ఆపరేషన్ మేనేజర్తో జరిగిన చర్చలలో మంగళవారం సాయంత్రం లోపు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సెక్యూరిటీ గార్డులు ఆందోళనను తాత్కాలికంగా విరమించి విధుల్లోకి వెళ్లినట్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి పావని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యం



శ్రీనివాస్

పంజగుట్ట: ఉద్యోగానికి వెళ్లిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమైన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. కూకట్‌పల్లిలో నివాసమండే మార్ని శ్రీనివాస్ (57) ఎర్రమంజిల్‌లోని రోడ్లు, భవణాల శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈ నెల 17న ఆఫీస్‌కు వెళ్లిన శ్రీనివాస్ రాత్రైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నకిలీ వీసాలతో మోసం

వెంగళరావునగర్ : నకిలీ వీసాలను పంపి డబ్బు తీసుకున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. మధురానగర్‌కాలనీలో నివసించే అవినాష్ ట్రావెల్స్ వ్యాపారం చేస్తుంటాడు. అతనికి గతేడాది నరేష్ అనే వ్యక్తి ద్వారా పల్నాడు ప్రాంతానికి చెందిన సయ్యద్ మదార్ పరిచయమయ్యాడు. తాను ఆర్మేనియాలో పని చేస్తుంటానని చెప్పాడు. తనకు తెలిసిన వారికి వీసాలు కావాలని అవినాష్ అడగ్గా రూ.1.20 ఖర్చవుతుందని చెప్పాడు. నరేష్ విడదల వారీగా మదార్‌కు ఆ నగదు పంపాడు. దానికి బదులుగా వాట్సాప్‌లో 8 వీసాలను మదార్ పంపాడు. వాటిని పరిశీలించగా నకిలీవని తేలింది. ఇదేమని ప్రశ్నించగా మదార్ మాత్రం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. వీసాల పేరుతో నగదు కాజేసిన మదార్‌పై బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యార్థులకు కళ్లద్దాల అందజేత



కళ్లద్దాలు పెడుతున్న కార్పొరేటర్

వెంగళరావునగర్ : మానవ శరీరంలో కళ్లు ముఖ్యమైన అవయవాలని కార్పొరేటర్ దేదీప్య విజయ్ పేర్కొన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గతంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని ఎలాంటి చిన్న సమస్యల తలెత్తిన సొంత వైద్యం చేయకుండా సమీపంలోని వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ రాజేశ్వరి, ఫార్మసిస్ట్ దివ్య, ఆశా వర్కర్ ఐశ్వర్య, నాయకులు విజయ్‌కుమార్, శ్యాంరావు, పవన్ ముదిరాజ్, ఆంజనేయులు యాదవ్, కిట్టు, సత్యనారాయణ, బాలు పాల్గొన్నారు.

రుణం ఇస్తామంటూ నగ్న ఫొటోలతో వేధింపులు

వెంగళరావునగర్: లోన్ కోసం యాప్‌లో దరఖాస్తు చేసుకుంటే నగ్న ఫొటోలు పంపి మహిళను బెదిరింపులకు గురి చేస్తున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్ పీఎస్ పరిధిలో నివసించే మహిళ తనకు రూ. లక్ష లోన్ కావాలని రూపే లోన్ యాప్ ద్వారా ప్రయత్నించగా ఆమెకు విడదల వారీగా రూ.3,600 పంపారు. అనంతరం ఆమె ఆధార్‌కార్డు వివరాలు అడిగి ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి భర్త, తల్లిదండ్రులు, సోదరులకు నగ్న ఫొటోలను పంపారు. తక్షణమే తాము కోరిన నగదు పంపాలని బెదిరించారు. ఆమె పలుమార్లు పంపినా మరికొంత డబ్బు కావాలని కోరడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

లోప్రెషర్ నీటి సమస్యను పరిష్కరించండి

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లో కొన్ని బస్తీల్లో వేధిస్తున్న లో ప్రెషర్ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు మంగళవారం జలమండలి మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. ఇటీవల తమ పార్టీ ప్రజా సమస్యలపై చేపట్టిన సర్వేలో ఎస్పీఆర్ హిల్స్‌లోని ఆశయ్యనగర్, మహాత్మానగర్, బీఆర్ నగర్ బస్తీల్లో మంచినీటి సరఫరా లోప్రెషర్‌తో అవుతుందని స్థానికులు తమ దృష్టికి తీసుకోరావడం జరిగిందన్నారు, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో శేషగిరిరావు, భాగ్యరాజ్, ఏఆర్‌నరసింహ, సమాధానం, కురుమయ్య, సావిత్రమ్మ పాల్గొన్నారు.

కేర్‌లో సంక్లిష్టమైన గుండె చికిత్స

సాక్షి, సిటీబ్యూరో: గుండెపోటుతో బాధపడుతున్న 68 ఏళ్ల వృద్ధురాలికి విజయవంతంగా చికిత్స అందించామని బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రి క్లినికల్ డైరెక్టర్, కార్డియాలజీ హెడ్ డాక్టర్ వి.సూర్య ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. కరోనరి ధమనులలో క్లిష్టమైన అడ్డంకులు, ఎడమ జఠరిక సిస్టోలిక్ పనిచేయకపోవడం(గుండె వైఫల్యం), రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఊపిరితిత్తులు, షుగర్ వంటి హైరిస్క్ క్లినికల్ ప్రొఫైల్ వల్ల ఆమె పరిస్థితి విషమంగా మారిందని పేర్కొన్నారు. అయితే అధునాతన గుండె సంరక్షణ, వినూత్న సాంకేతిక పద్ధతులతో ప్రాణాలను కాపాడామని పేర్కొన్నారు. రోగులకు చికిత్స చేయడమే కాదు గుండె సంరక్షణలో ఏది సాధ్యమనే అంశాన్ని పునర్నిర్వచించామని తెలిపారు. సంప్రదాయ గుండె శస్త్ర చికిత్స ప్రమాదకరమని భావించి కొత్త మార్గాన్ని ఎంచుకున్నామని, విఫలమవుతున్న గుండెకు ఇంపెల్లాస్మార్ట్ అసిస్ట్ అనే అత్యాధునిక యంత్ర పరికరంతో రక్త ప్రసరణను మెరుగుపర్చామని పేర్కొన్నారు.

బైక్‌పై వచ్చి మూకుమ్మడిగా కత్తితో దాడి



గాయపడ్డ వెంకటేష్‌యాదవ్

సనత్‌నగర్: సినీ ఫక్కీలో ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు కత్తుతో దాడి చేశారు. ఈ ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆటోట్రాలీ నడిపించుకుంటూ జీవనం సాగించే వెంకటేష్‌యాదవ్ (35) బేగంపేట భగవంతాపూర్‌లో ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు భగవంతాపూర్‌కు వచ్చి వెంకటేష్‌యాదవ్‌పై కత్తులతో దాడికి యత్నించారు. దీంతో వెంటనే వెంకటేష్ వారి నుంచి తప్పించుకునేందుకు పారిపోతుండగా వెంబడించారు. దుండగులు కత్తితో దాడి చేయడంతో భగవంతాపూర్ పార్కు వద్ద కింద పడిపోయాడు. జన సంచారం ఎక్కువగా ఉండడంతో దుండగులు పారిపోయారు. సంఘటన స్థలానికి ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తన సిబ్బందితో చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బస్సులో బంగారు గొలుసు చోరీ

వెంగళరావునగర్: బస్సులో బంగారు గొలుసును కాజేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బోరబండలోని రాధాకృష్ణనగర్‌కు చెందిన ఎస్.రాజేష్ ఈనెల 16న మైత్రీవనం వద్ద బోరబండ బస్సు ఎక్కాడు. కాసేపటికి తర్వాత చూసుకుంటే రాజేష్ మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైనట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్వరాజ్‌నగర్‌లో ఇఫ్తార్ విందు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బాబా ఫసియుద్దిన్

రహమత్‌నగర్ : బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్‌లో బస్తీ కాంగ్రెస్ నాయకుడు రజాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాసుల మహేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రహమత్‌నగర్: వేసవిలో చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కార్పొరేటర్ సీఎస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-2 కనకదుర్గా అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేముల యాదయ్య, కోశాధికారి ఎల్.వరప్రసాద్, సభ్యులు చెన్నయ్య, వెంకటేష్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



యూనివర్సిటీ అభివృద్ధే సర్కారు ధ్యేయం

టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్



మాట్లాడుతున్న చనగాని దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల న్యాయ పోరాటాలను ప్రభుత్వం గుర్తిస్తుందని, వర్సిటీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయాకర్ అన్నారు. మంగళవారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓయూ అధికారులు ఈ నెల 13న విడుదల చేసిన నిషేధాజ్ఞల సర్క్యులర్‌పై గతంలో యూనివర్సిటీని ధ్వంసం చేసిన శక్తులు అవకాశంగా వాడుకోవాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. సర్క్యులర్ కొత్తదేమీకాదని, బీఆర్ఎస్ పాలనలో కూడా సభలు, సమావేశాలు, ఇతర ఆందోళన కార్యక్రమాలపై నిషేధాజ్ఞలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భావ ప్రకటనా స్వేచ్ఛకు కాంగ్రెస్ పార్టీ భంగం కలిగించబోదని స్పష్టం చేశారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి యూనివర్సిటీల వ్యతిరేకిగా మారిన బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇవ్వొద్దని వివిధ విద్యార్థి సంఘాల నేతలను దయాకర్ కోరారు. పెరిగిన నిరుద్యోగం, మారిన సమాజ పరిస్థితుల దృష్ట్యా వర్సిటీల్లో విద్యా, ఉపాధి, ఉద్యోగ అవకాశాల పెంపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలో ఓయూ విద్యార్థి నాయకులను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డిల వద్దకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోనున్నట్లు చెప్పారు.

వందేళ్ల వేడుక-నాలుగు తరాల కలయిక

రాంగోపాల్‌పేట్: ఒకే కుటుంబానికి చెందిన నాలుగు తరాలవారు ఒక చోట కలుసుకున్నారు. అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య మొదటి తరానికి చెందిన వ్యక్తి వందేళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్‌కు చెందిన వీశంశెట్టి యాదగిరి 1925లో జన్మించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారందరూ కలిసి సికింద్రాబాద్‌లోని సప్తగిరి హోటల్‌లో మంగళవారం ఘనంగా ఉత్సవాలు జరుపుకున్నారు. యాదగిరితోపాటు ఆయన ఐదుగురు సోదరులు వారి కుమారులు, కుమార్తెలు, అల్లుళ్లు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవలు అందరూ ఒక్క చోట చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. నిండు నూరేళ్ల వయసులోనూ తన మునిమనవలను ఆడిస్తూ ఉల్లాసంగా గడుపుతున్న యాదగిరిని చూస్తూ అందరూ మురిసిపోయారు. వందేళ్ల వేడుకను ఎక్కడెక్కడో ఉన్న బంధువులు, స్నేహితుల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని యాదగిరి తెలిపారు. నూరేళ్ల జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సికింద్రాబాద్‌లోని వివిధ వ్యాపార సంస్థలు నెలకొల్పి విస్తరించినట్లు ఆయన వెల్లడించారు. అందరినీ ఒక చోట చేర్చి మరుపురాని జ్ఞాపకాన్ని అందించిన తన కుమారుడు ప్రేమ్ సాగర్‌ను అభినందించారు. యాదగిరి దంపతులను అందరూ సత్కరించారు.



వందేళ్ల వేడుకలో పాల్గొన్న నాలుగు తరాల కుటుంబ సభ్యులు

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన స్కల్ప్చర్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎగ్జిబిషన్స్ ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- వాలంటరీ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వరల్డ్ పద్మశాలి ఫౌండేషన్ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఉదయం 10.30 గంటలకు జరుగుతాయి. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగే ఈ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.
- మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కీసరలోని కల్యాణ మండపంలో పదవ తరగతి పాసైన నిరుద్యోగ మహిళల కోసం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

తగ్గమంటూ.. భగ్గుమంటూ..

నగరంలోని రెండు ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలు అట్టుడుకుతున్నాయి. గత కొద్దిరోజులుగా ఆందోళనలు మిన్నంటుతున్నాయి. విద్యార్థిలోకం భగ్గుమంటోంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూముల వేలం ఆందోళనలకు ఆజ్యంపోయగా, ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆందోళనలపై అధికారులు జారీ చేసిన నిషేధాజ్ఞలు అగ్గి రాజేశాయి. 400 ఎకరాల భూములను విక్రయించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హెచ్‌సీయూలోని విద్యార్థి సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ధర్నాలు, ర్యాలీలతో హోరెత్తిస్తున్నాయి. తాజాగా బీజేవైఎం కార్యకర్తలు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. మరోవైపు నిషేధాజ్ఞలతో తమ ధిక్కార స్వరాన్ని అణచివేయలేరంటూ ఓయూ విద్యార్థి సంఘాలు ముక్తకంఠంతో నినదిస్తున్నాయి. ఉద్యోగులు, ప్రొఫెసర్లు, పూర్వవిద్యార్థులు, మేధావులు విద్యార్థులను కలిసి సంఘీభావం ప్రకటించారు.

అసెంబ్లీ ముట్టడికి బీజేవైఎం యత్నం

హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని నిలిపివేయాలని నిరసన



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నాంపల్లి: హెచ్‌సీయూ భూముల రగడ అసెంబ్లీ దాకా వచ్చింది. యూనివర్సిటీకి చెందిన భూముల అమ్మకాన్ని నిరసిస్తూ మంగళవారం బీజేవైఎం అసెంబ్లీ ముట్టడికి యత్నించింది. దీంతో ఆ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. వీరికి మద్దతు తెలిపేందుకు వచ్చిన బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ మాట్లాడుతూ గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి సంబంధించిన 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో వసతుల అంశాన్ని గాలికి వదిలేసి వర్సిటీల భూములను కాజేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. భూముల వేలాన్ని ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, చిత్తరంజన్ కుమార్ యాదవ్, తరుణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గణేష్, సామల పవన్, రాష్ట్ర కార్యదర్శులు ప్రవీణ్, అశోక్, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి అరవింద్, అనితారెడ్డి, అధికార ప్రతినిధులు శివచంద్రగిరి, కుశాల్ గౌడ్, కోమలి నాయక్, ఇంద్రా, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



పోలీసు బారికేడ్లతో ఓయూ ప్రవేశ ద్వారాలు మూసివేత



చేతులకు సంకెళ్లతో ఏబీవీపీ నేతల వినూత్న నిరసన



ఐక్య విద్యార్థి సంఘాల నేతలతో మేధావుల సమావేశం

నిషేధాజ్ఞలపై కొనసాగుతున్న ఆందోళనలు

- బారికేడ్లతో ఓయూ ప్రవేశ ద్వారాల మూసివేత
- ఐక్య విద్యార్థి సంఘాల నాయకులతో మేధావుల సమావేశం
- అసెంబ్లీలో ప్రస్తావించిన సీపీఐ నేత కూనంనేనికి కృతజ్ఞతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విధించిన నిషేధాజ్ఞలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో మంగళవారం యూనివర్సిటీకి రెండువైపుల ప్రవేశ ద్వారాలను పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. జర్నలిస్టులు, న్యాయవాదులు, ఓయూ పూర్వ విద్యార్థులు, మేధావులు యూనివర్సిటీని సందర్శించారు. ఎన్ఆర్ఎస్ హాస్టల్ ఎదుట గల నరసింహా టీ కొట్టు వద్ద ఐక్య విద్యార్థి సంఘాల నాయకులతో మేధావులు సమావేశమయ్యారు. ఓయూ అధికారులు జారీ చేసిన నిషేధాజ్ఞల సర్క్యులర్, ఆందోళనలు, విద్యార్థులపై కేసులు, ఇతర పరిణామాల గురించి అడిగి తెలుసుకున్నారు. తాము చదివే రోజుల్లో విద్యార్థి నాయకులుగా అనేక కార్యక్రమాలు చేపట్టినా ఎలాంటి నిర్బంధాలు విధించలేదని పేర్కొన్నారు. ఆందోళనలపై నిషేధం విధించడమంటే విద్యార్థుల గొంతునొక్కడమేనని అన్నారు. ఓయూ అధికారులు జారీ చేసిన నిషేధ సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐక్య విద్యార్థి సంఘాల ఆందోళనలకు మేధావులు మద్దతు ప్రకటించారు. విద్యార్థులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సర్క్యులర్ రద్దుకు ఎమ్మెల్సీ కోదండరాంను కలవనున్నట్లు ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ నేతలు తెలిపారు. ఓయూలో విధించిన నిషేధాజ్ఞలపై అసెంబ్లీలో ప్రస్తావించి రద్దు చేయాలని డిమాండ్ చేసిన సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏబీవీపీ నేతల వినూత్న నిరసన

ఓయూ అధికారులు విధించిన నిషేధాజ్ఞలపై ఏబీవీపీ ఓయూ శాఖ నాయకులు మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట చేతులకు సంకెళ్లు వేసుకొని, నోటికి నల్ల రుమాలు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయించాలని, రూ.8 వేల కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని నిరసనలు వెల్లువెత్తుతున్న సందర్భంగా ఓయూలో నిషేధాజ్ఞలు విధించారని పేర్కొన్నారు. పాలన చేతగాని వీసీ ప్రొ.కుమార్ రాజీనామా చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు.

పీహెచ్‌డీలో పెరిగిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ప్రవేశాలు

- జేఎన్‌టీయూహెచ్‌లో నియామకాలు, రిజర్వేషన్లపై సమీక్ష
- హాజరైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమీక్ష సమావేశం నిర్వహించిన సందర్భంగా బక్కి వెంకటయ్య, కిషన్ కుమార్‌రెడ్డి, ఉద్యోగులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ పరిధిలో పీహెచ్‌డీలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సేవా సంబంధిత విషయాలు, రిజర్వేషన్ నియమావళిపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మంగళవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి, రెక్టర్ డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావుతోపాటు యూనివర్సిటీ అధికారులు, ఎస్సీ, ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు, అధ్యాపకుల నియామకాలు, రిజర్వేషన్ల అమలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహక కార్యక్రమాలు వంటి అంశాలపై చర్చించారు. పీహెచ్‌డీ ప్రవేశాల్లో అనేక మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఓపెన్ కేటగిరీ ద్వారా కూడా సీట్లు పొందారని రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తెలిపారు. 114 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారనీ, ఔట్ సోర్సింగ్‌లో రిజర్వేషన్ అమలుకు స్పష్టమైన మార్గదర్శకాలు లేవని చెప్పారు. అనంతరం బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సరైన శిక్షణ అందిస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రభుత్వం జగిత్యాల, మంథని కళాశాలలను మోడల్ ఇనిస్టిట్యూషన్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, భాషా ప్రావీణ్యత, పరిశ్రమలలో ఉపాధి అవకాశాలను వివరించారు. ప్రభుత్వ విద్యావిధానాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

తెలుగు వర్సిటీకి సురవరం నామకరణంపై హర్షం



మాట్లాడుతున్న సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి

కాచిగూడ: తెలుగు సాహిత్య రంగంలో భావితరాలకు స్ఫూర్తిని ఇచ్చే విధంగా తెలుగు విశ్వ విద్యాలయానికి తెలంగాణ సుప్రసిద్ధ రచయిత, వైతాళికుడు 'సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం'గా నామకరణం చేయడంపై సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్, తెలంగాణ సారస్వత పరిషత్, సురవరం కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, శాసనసభలో రాజకీయాలకు అతీతంగా సురవరం ప్రతాపరెడ్డి నామకరణానికి మద్దతు ఇచ్చిన ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య కృషిని గుర్తించి గౌరవించినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి కృతజ్ఞలు తెలిపారు. ప్రతి ఏడాది మే 28వ తేదీన ప్రతాపరెడ్డి జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని కోరారు. సురవరం ప్రతాపరెడ్డి పేరిట పురస్కారాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలుగు సాహిత్య, జర్నలిజం రంగాలలో విశేష సేవలు అందిస్తున్న వారికి, ఆయా రంగాలలో అధ్యయనం చేస్తున్న ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌ను 'సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం'తరఫున ఇవ్వాలని ట్రస్ట్ భావిస్తున్నట్లు తెలిపారు. ప్రతాపరెడ్డి రచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'కు ప్రత్యామ్నాయ రచనలు నేటికీ లేవన్నారు. సమావేశంలో సంయుక్త కార్యదర్శి జె.చెన్నయ్య, ట్రస్టీలు డాక్టర్ కృష్ణవర్ధన్ రెడ్డి, డాక్టర్ కొండా లక్ష్మీకాంత్ రెడ్డి, సురవరం పుష్పలత, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ట్రస్ట్ సభ్యులు, ప్రతాపరెడ్డి మనుమలు సురవరం అనిల్‌రెడ్డి, సురవరం కపిల్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తిని ప్రేమించండి.. బాధ్యతగా పనిచేయండి

ఎక్సైజ్ ఆకాడమీ డెరైక్టర్ ఎస్‌పి అజయ్ రావు



సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ శాఖలో మహిళా కానిస్టేబుళ్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బంది తమ విధినిర్వహణ పట్ల బాధ్యతగా ఉండాలని, వృత్తిని ప్రేమించాలని ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ ఎస్‌పి అజయ్‌రావు అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లకు మంగళవారం పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.శిక్షణలో భాగంగా వివిధ అంశాల్లో ప్రతిభకనబరచిన వారికి బహుమతులతో పాటు, శిక్షణ పూర్తి చేసుకున్న సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ జాయింట్ డెరైక్టర్ సీవీ శోధ రెడ్డి, అకాడమీ అసిస్టెంట్ డెరైక్టర్ మోహన్ బాబు, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెంట్ కృష్ణప్రియ, ఎస్ టి ఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి, మోహన్ కుమార్ పాల్గొన్నారు.

'మనూ'లో 4 ఏళ్ల బీఈడీ దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ)లో నాలుగేళ్ల బీఈడీ కోర్సు దరఖాస్తు గడువు పొడిగించినట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వనజ మంగళవారం తెలిపారు. బీఏ, బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీకామ్ బీఈడీ నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ) అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్లను ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ)-2025 అండర్ గ్రాడ్యుయేట్ రెగ్యులర్ కోర్సులలో అడ్మిషన్ల కోసం ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్‌ను మార్చి 22వ తేదీ వరకు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన వారికి బీఏ(ఆనర్స్/రీసెర్చ్), బీఏ జేఎంసీ(ఆనర్స్/రీసెర్చ్), బీకామ్(ఆనర్స్/రీసెర్చ్), బీఎస్సీ(ఆనర్స్/రీసెర్చ్, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ (మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీ), బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ (మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ), బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్(ఎమర్జెన్సీ అండ్ ట్రామా కేర్ టెక్నాలజీ) వంటి కోర్సుల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ప్రాస్పెక్టస్, ఇతర వివరాలన్నీ ఉంటాయని ఆమె వివరించారు.

కేన్సర్‌ను ముందే గుర్తిస్తే నయం

డాక్టర్ అంజిరెడ్డి స్మారకోపన్యాసంలో ప్రొ.అశోక్ వెంకటరామన్

సాక్షి, సిటీబ్యూరో: కేన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే పూర్తిగా నయమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ మేరకు సింగపూర్ కేన్సర్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ అశోక్ వెంకటరామన్ తన పరిశోధనలో వెల్లడైన విషయాలను తెలియజేశారు. డాక్టర్ రెడ్డీస్ లెబొరేటరీస్ వ్యవస్థాపకుడు కె.అంజిరెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా 'డాక్టర్ అంజిరెడ్డి మెమోరియల్ లెక్చర్'మూడో ఎడిషన్ 'సైన్స్, సొసైటీ, సస్టైనబిలిటీ' ప్రధానాంశంగా మంగళవారం ఇక్కడ కొనసాగింది. 'కేన్సర్ పుట్టుకను అణచివేయడం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. రెండు దశాబ్దాలుగా బీఆర్‌సీఏ జన్యువుపై తన పరిశోధనలు, కేన్సర్ పురోగతిలో జన్యు నేపథ్యం, పర్యావరణం, పరస్పర చర్యలను వివరించారు. కేన్సర్ కణితిని అణచివేసే మార్గాలు, జన్యు సమగ్రత, జీవక్రియ రుగ్మతలు, హానికరమైన పర్యావరణ పరిస్థితులు ఎలాంటి ప్రభావాలు చూపిస్తాయనే అంశమై శోధించామని వివరించారు. జన్యుశాస్త్రం, నిర్మాణ జీవశాస్త్రం, రసాయన శాస్త్రం, ఇమేజింగ్ పరిశోధన నైపుణ్యాన్ని సమగ్ర పరచడం ద్వారా కేన్సర్‌ను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు డాక్టర్ గుల్లపల్లి నాగేశ్వరరావు, డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ కో-చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

మా ఉద్యోగాలు మళ్లీ మాకివ్వండి

ప్రజాభవన్ వద్ద బైఠాయించిన ఆర్టీసీ సస్పెండెడ్ ఉద్యోగులు



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య

లక్డీకాపూల్: 'మా ఉద్యోగాలు మళ్లీ మాకు తిరిగి ఇవ్వాలి'అని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ సస్పెండెడ్ ఉద్యోగులు ప్రజాభవన్ వద్ద బైఠాయించారు. పలు ఆరోపణలతో విధుల నుంచి తొలగించిన ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద ఎత్తున మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చారు. న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి వద్ద మొర పెట్టుకున్నారు. తమ కుటుంబాలను ఆదుకోవాలని ప్రజాభవన్ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే ప్రభుత్వం సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేస్తోందని, త్రిసభ్య కమిటీని నియమించిందని, 200 మందిని ఆర్టీసీ తిరిగి విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. మిగిలిన ఉద్యోగుల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చిన్నారెడ్డి స్పష్టం చేశారు.

ప్రజావాణికి 395 దరఖాస్తులు

ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా మంగళవారం 395 దరఖాస్తులు అందాయని, వాటిలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 76, విద్యుత్ శాఖ 30, రెవెన్యూ 56, ఇందిరమ్మ ఇండ్లు 145 అర్జీలతోపాటు ఇతర శాఖలకు సంబంధించి 88 దరఖాస్తులు ఉన్నాయని ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి తెలిపారు.

24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కృతజ్ఞతా యాత్ర

- ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు ఆమోదంపై మాదిగ సంఘాల హర్షం
- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పిడమర్తి రవి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీకి మాదిగ జాతి రుణపడి ఉంటుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 9 శాతం రిజర్వేషన్లను మాదిగలకు తెలియజేసేలా ఈ నెల 24వ తేదీ నుంచి కృతజ్ఞతా యాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్‌లో వివిధ మాదిగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృతజ్ఞతా యాత్ర ముగింపు సభ ఏప్రిల్ 14వ తేదీన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ లాంటివారు ఎంతమంది మాయ చేసినా మాదిగజాతి మొత్తం కాంగ్రెస్ వైపే ఉంటుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల దేవుడని, వర్గీకరణకు అడ్డుపడ్డ కృష్ణ మాదిగ దయ్యం అని దుయ్యబట్టారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెట్టి ఆమోదించినందుకుగాను మాదిగ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 19న 33 జిల్లా కేంద్రాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం, అంబేడ్కర్ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు రాపోలు రాములు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మీసాల మల్లేశం. బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొడెల్లి సురేష్, మాదిగ రాజ్యాధికార పోరాట సమితి అధ్యక్షుడు నవీన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌టేక్ చేయబోయి...

ఆర్టీసీ బస్సు కింద పడి యువకుడి దుర్మరణం



పిల్లి సతీష్(ఫైల్)

గచ్చిబౌలి: ఓవర్ టేక్ చేయబోయి ఆర్టీసీ బస్సు కింద పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా, వేములపాలెం గ్రామానికి చెందిన పిల్లి సతీష్(22) జొమాటో డెలివరీ బాయ్‌గా పని చేస్తూ మియాపూర్‌లోని గోపాల్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి తండ్రి రమణ అక్కడే వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. సతీష్‌కు బావ రాయుడు సత్యలోకేష్ నగరానికి రావడంతో మంగళవారం అతడితో కలిసి బైక్‌పై పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లాడు. దర్శనం అనంతరం ఇద్దరూ కలిసి మియాపూర్ వెళుతుండగా కొండాపూర్‌లో నిర్మాణంలో ఉన్న కిమ్స్ హాస్పిటల్ ఎదురుగా మియాపూర్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో స్కూటీ అదుపు తప్పడంతో ఇద్దరూ కింద పడ్డారు. బస్సు చక్రాలు సతీష్ తల మీదుగా వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న రాయుడు ఎడమవైపు పడటంతో సురక్షితంగా బయటపడ్డాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 19, మార్చి, 2025





రంజాన్ సమయంలో నగరం మొత్తం సందడిగా ఉంటుంది.. దుకాణాలు అర్ధరాత్రి దాటి పనిచేసేందుకు అనుమతి ఇస్తారు.. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అనుమతి ఉండగా కేవలం ఒక్క నెల వరకే.. రంజాన్ పండగ ముగిసిన తర్వాత మళ్లీ యథాతథమే.. మరోవైపు సిటీని 24/7 పనిచేసే నగరంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది మార్చి నెలలో ఎంపిక చేసిన జోన్లలో వాణిజ్య సంస్థలు, తినుబండారాల స్టాల్స్‌ను 24 గంటలూ తెరిచి ఉంచుతామని ప్రకటించింది. అయితే అది ఇంకా కార్యరూపం దాల్చాల్సి ఉంది.

- సాక్షి, సిటీబ్యూరో

కన్ను మూతపడని నగరం కల సాకారమయ్యేనా..?

24/7 నగరం ఎంతెంత దూరం

- వేళల పెంపు ఐటీ కారిడార్‌లో నైట్ ఎకానమీకి ఊపు
- కొన్ని భయాలూ, ఆందోళనలూ దాని వెన్నంటే..
- సిటీని 24గంటలూ పనిచేయించే తొలి అడుగుకు ఏడాది

మోడల్ షాప్‌లు, ఎస్టాబ్లిష్‌మెంట్స్(ఉపాధి నియంత్రణ, సేవల నిబంధనలు) చట్టం 2015 ఆమోదించిన ప్రకారం.. ఈటింగ్ జాయింట్లు, సినిమా థియేటర్లు, మాల్స్, అలాగే 10 కంటే ఎక్కువ మంది ఉద్యోగులున్న సంస్థలు 24 గంటలూ తెరిచి ఉంచవచ్చు. ఆఫ్‌లైన్ ఆన్‌లైన్ రిటైలర్‌ల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించడం, మహిళలు, పురుషులకు మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ చట్టం ఉద్దేశ్యం. ఇది మహిళా కార్మికులకు సురక్షితమైన రవాణా అవసరమైన చోట డే కేర్ సేవలను అందించాలని ఆదేశించింది. రాష్ట్రాలు తమ స్థాయిలో చట్టాన్ని పొందుపర్చాలని వారి నగరాల్లో రాత్రిపూట ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించింది. అప్పటి నుంచి పలు రాష్ట్రాలు 24/7 నగరాలను సృష్టించేందుకు తమ ప్రణాళికలను ప్రారంభించాయి. మహారాష్ట్ర(ముంబై), గుజరాత్(అహ్మదాబాద్), మధ్యప్రదేశ్(ఇండోర్), ఢిల్లీ ఈ విషయంలో ముందంజలో ఉన్నాయని చెప్పొచ్చు.

ప్రస్తుతం 24/7 పరిస్థితి లేక చాలా వ్యాపారాలు అర్ధరాత్రికి ముందే మూతబడుతున్నాయి. దీంతో, ఎక్కువ పని గంటల తర్వాత రిలాక్స్ అయ్యేందుకు తగిన అవకాశాలు ఉండటం లేదని యువ ప్రొఫెషనల్స్‌లో అనేక మంది భావిస్తున్నారు. 'ఇది కేవలం పార్టీల గురించి మాత్రమే కాదు, పని–జీవిత సమతుల్యత గురించి. పనిలో ఎక్కువ గంటలు గడిపిన తర్వాత, రిలాక్స్ అయ్యేందుకు తగిన ప్రదేశం కావాలి,' అని ఐటీ ప్రొఫెషనల్ నూపుర్ అన్నారు. స్టార్టప్ ఉద్యోగి సాయి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ.. 'ప్రస్తుతం నా దినచర్య ఇల్లు–పని అనే రొటీన్‌లో మార్పు చేర్పులు లేక మానసికంగా అలసిపోతున్నా' అని చెప్పాడు.



సెప్టెంబరు 2017లో మహారాష్ట్ర ప్రభుత్వం భారతదేశ ఆర్థిక రాజధాని ముంబైని దేశపు మొదటి 24/7 నగరంగా ప్రకటించడానికి నోటిఫికేషన్ రూపొందించింది. అలా 24 గంటలూ తెరిచి ఉంచడం వల్ల రాష్ట్ర ఖజానాకు సంవత్సరానికి 649 మిలియన్ల డాలర్ల అదనపు ఆదాయాన్ని తీసుకురావచ్చని అంచనా వేసింది. రెస్టారెంట్లు, మాల్స్, మల్టీప్లెక్స్‌లు, షాపింగ్ ప్లాజాలను 'గేటెడ్ కమ్యూనిటీలు' లేదా భద్రత, పార్కింగ్ ప్రాంతాలతో కూడిన నాన్–రెసిడెన్షియల్ జోన్లలో 2020 జనవరి 27 నుంచి 24 గంటలూ తెరిచి ఉంచడానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే గుజరాత్ ప్రభుత్వం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన 1 మే 2019న ఈ చట్టాన్ని నోటిఫై చేసింది. అయితే మన దేశానికి కొత్తేమో గానీ.. '24/7 నగరాలు' లేదా 'రాత్రిపూట నగరాలు' అనే భావన మరీ కొత్తది కాదు ఐరోపా, ఆసియా యునైటెడ్ స్టేట్స్‌లలోని అభివృద్ధి చెందిన దేశాలలో 30కి పైగా ఇలాంటి నగరాలు ఉన్నాయి. వీటికి ప్రారంభంలో శ్రీకారం చుట్టింది లండన్, ఆమ్‌స్టర్‌డామ్, టోక్యో, పారిస్, న్యూయార్క్ అని చెప్పొచ్చు.





లెస్ నైట్.. లాభాలు కట్..

నైట్ లైఫ్ లేకపోవడం అర్ధరాత్రి వేళ వచ్చే కస్టమర్లపై ఆధారపడే వ్యాపారాలపై ప్రభావం చూపుతోంది. డీఎల్‌ఎఫ్ వంటి ప్రసిద్ధ స్ట్రీట్ ఫుడ్ హబ్‌లలో రాత్రి 11 గంటలలోపు కార్యకలాపాలు ముగుస్తున్నాయి. ఐస్‌క్రీమ్ పార్లర్స్, పబ్‌లు, రెస్టారెంట్‌లు కెఫెలు కస్టమర్లు రావడం ప్రారంభించిన కాసేపటికే మూసివేయాల్సి వస్తోంది. తద్వారా దాదాపు 25–30% రాబడికి గండి పడుతోంది. 'గతంతో పోలిస్తే కఠినమైన మూసివేత సమయాలతో, ఇబ్బందులు వస్తున్నాయి. కస్టమర్ల రాక పుంజుకునే టైమ్‌కి మూసివేయాల్సి వస్తోంది' అని గచ్చిబౌలిలోని ఫ్రాట్ హౌస్ జనరల్ మేనేజర్ మోహన్ కృష్ణ అన్నారు.

ప్రయోజనాలెంటి?

హై–టెక్ సిటీ వంటి కీలక ఐటీ, కమ్యూనికేషన్ ఆధారిత వాణిజ్య కేంద్రాలలో నైట్ ఎకానమీ పెంచడానికి 24/7 పనివేళలు ఉపకరిస్తాయని భావిస్తున్నారు. వ్యాపార కార్యకలాపాలు, పర్యాటక రంగం సహా అన్నీ ఊపందుకుని ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఇప్పటికే పలు సిటీలు నిరూపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పాపులర్ నగరాలు కొన్ని గమనిస్తే అవి 24/7 పనిచేస్తున్నవే కావడం గమనార్హం. లండన్, పారిస్, న్యూయార్క్.. వంటివి ఈ కోవలోకి వస్తాయి. అదేవిధంగా మన దేశంలోనూ పలు నగరాలను రోజంతా యాక్టివ్‌గా ఉండేవిగా మార్చాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఢిల్లీ, ముంబై వంటి మెట్రోలు కూడా మన హైదరాబాద్ మాదిరిగానే ఆ దిశగా ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. అయితే ఇప్పటి వరకూ ఏ ఒక్క నగరం కూడా పూర్తిస్థాయిలో 24/7 సిటీగా రూపాంతరం చెందలేదు.

అడ్డంకులూ, అవరోధాలూ..

24/7 నగరంగా రూపాంతరం చెందడంలో ప్రధానంగా ఆందోళన కలిగించేది నైట్ లైఫ్. రాత్రి మొత్తం వ్యాపార కార్యకలాపాలు జరగడం వల్ల భద్రతా సమస్యలు తలెత్తుతాయని అదే ప్రధాన నిరోధకంగా పోలీసు శాఖ భావిస్తోంది. నగరంలో 'నైట్ లైఫ్ విస్తరణ వల్ల మద్యపాన సంబంధిత గొడవలు, హింస, నేరాలు పెరిగే అవకాశం ఉంది. 'ఇప్పటికే దుర్గం చెరువు ఖాజాగూడ వంటి ప్రాంతాలు పార్టీ పీపుల్ వల్ల గందరగోళానికి కేంద్రాలుగా మారుతున్నాయి. స్థానికులు నివాసితుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి,' అని మాదాపూర్ పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. అలాగే రోజంతా రణగొణధ్వనులు ప్రశాంతతను దూరం చేసి మానసిక ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు.

21న నటరాజ రామకృష్ణ జయంతి ఉత్సవాలు



సాక్షి, సిటీబ్యూరో: ఆంధ్రనాట్యం సృష్టికర్త, పేరిణి పునరుద్ధరణ నాట్యగురు పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ 102వ జయంతి ఉత్సవాలను రవీంద్రభారతి శుక్రవారం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమి అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల తెలిపారు. కళాభవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరవుతారని తెలిపారు. నటరాజ రామకృష్ణ శిష్యులు పేరిణి శివ తాండవం, ఆంధ్ర, లాస్య నృత్యాలు ప్రదర్శిస్తారని, ఇది ఆయనకు తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమి తొలిసారిగా అధికారికంగా నిర్వహిస్తున్న నృత్య నివాళి అని ఆమె అభివర్ణించారు. తారామతి బారాదరిని అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత రామకృష్ణకే దక్కుతుందన్నారు. సంగీత నాటక అకాడమీ కార్యదర్శి బి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

ఆడీ పాడిన వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి విద్యార్థులు





నిజాంపేట్: ప్రగతినగర్ వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో సిన్టిలేషన్స్ 25 వార్షిక సాంస్కృతికోత్సవం మంగళవారం రెండో రోజుకు చేరింది. థ్రియరీ బ్యాండ్ సంగీత కార్యక్రమంతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. తెలుగు ఇండియన్ ఐడల్ పోటీదారు సాయి వల్లభ, స్టార్ మా సూపర్ సింగర్ ఫైనలిస్ట్ సాహితి అడపా, పాడుతా తీయగా పోటీదారు హారికా సాయిమణిలు తమ గానంతో వేలమంది ప్రేక్షకులను అలరించారు. వోగ్ వోయాజ్ పేరిట ఫ్యాషన్ వాక్ ఉత్సాహం నింపింది. కళాశాలకు చెందిన శాస్త్రీయ నృత్య విద్యార్థి బృందం నృత్యతరంగ్ పేరిట ప్రదర్శించిన నాట్యం ఆకట్టుకుంది. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రాలంకరణలో సందడి చేశారు.

జెంబే.. బీట్స్‌లో మునిగిపోండి!



సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్ ఐరన్ హిల్ కేఫ్‌లో ఈ నెల 23న జెంబే వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. సంప్రదాయ ఆఫ్రికన్ డ్రమ్స్ వాయించడంలో మెళకువలు నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న వారికి ఈ ఆదివారం అవకాశం కల్పిస్తున్నారు. అవసరమైన డ్రమ్స్‌ను సంస్థ అందిస్తోంది. ఈ ఇంటరాక్టివ్ సెషన్‌లో ప్రాథమిక చేతి పద్ధతులను నేర్చుకోవడం, సంప్రదాయ ఆఫ్రికన్ లయలను అన్వేషించడం, డ్రమ్మింగ్ ఆనందాన్ని పొందవచ్చని నిర్వాహకులు పేర్కొంటున్నారు.



పవ్వా రుచులు.. వహ్వా

రుచికరమైన ఫుడ్ ఎంజాయ్ చేస్తూ పలువురు ఫుడ్ ఇన్‌ఫ్లూయెన్సర్స్‌తో పాటు బ్లాగర్స్ సందడి చేశారు. జూబ్లీహిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పవ్వా రెస్టారెంట్‌లో రుచికరమైన ఆహార వస్తువులను మంగళవారం అందించారు. ఫుడ్ ఫెస్ట్‌లో ఫుడ్ ఇన్‌ఫ్లూయెన్సర్స్, బ్లాగర్స్ వహ్వా అంటూ చెఫ్‌లను పొగడ్తల్లో ముంచెత్తారు. 'ది క్వార్టర్ కల్చర్' థీమ్‌తో తాము సేవలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒక ఆహార పదార్థాన్ని కొంచెం తినేవారు, మీడియంగా తినేవారు. కడుపు నిండే తినేవారిగా విభజించుకొని క్వార్టర్, హాఫ్, ఫుల్ అనే ఓ కొత్త కాన్సెప్ట్‌తో ఆహార ప్రియులకు రుచికరమైన వంటకాలు వడ్డిస్తామని నిర్వాహకులు సంజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

– బంజారాహిల్స్







పిజ్జా మేకింగ్ వర్క్‌షాప్

సాక్షి, సిటీబ్యూరో: అకాన్ హైదరాబాద్‌లో ఈ నెల 23న మధ్యాహ్నం 1 గంటకు పిజ్జా తయారీపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. పిజ్జా తయారీకి అవసరమైన మెటీరియల్స్ సంస్థ సరఫరా చేస్తుంది. అనుభవజ్ఞులైన చెఫ్ పిజ్జా తయారీలో మెళకువలు నేర్పిస్తారు. ఆసక్తి ఉన్నవారు నిర్ణీత ఫీజు చెల్లించి హాజరుకావచ్చు.

పెరుగుతున్న స్ట్రోక్

యువత పారాహుషార్



సాక్షి, సిటీబ్యూరో: నగర యువతలో స్ట్రోక్(పక్షవాతం) కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయనీ, నగరంలోని ప్రతి ఏడుగురు స్ట్రోక్ రోగులలో ఒకరు 25–45 సంవత్సరాల మధ్య వయస్సులోపు వారేనని నగరానికి చెందిన వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. త్వరిత చికిత్స, రీహాబిలిటేషన్ ఇంతకు ముందెన్నడూ లేనంత క్లిష్టంగా మారిందన్నారు. నగరంలో స్ట్రోక్ బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో నగరానికి చెందిన ఫిజికల్ మెడిసిన్ రీహాబిలిటేషన్ బృందం స్ట్రోక్ రికవరీలో ముందస్తు రీహాబిలిటేషన్ ప్రాముఖ్యతపై ప్రత్యేక రౌండ్‌టేబుల్ సదస్సును సోమాజిగూడలో మంగళవారం నిర్వహించింది. పలువురు వైద్యులు పాల్గొని ధూమపానం, మద్యపానం, అధిక ఒత్తిడి స్థాయిలు, సరైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం వంటి జీవనశైలి కారణంగా యువత ఎక్కువగా ప్రమాదంలో పడుతోందని, దీర్ఘకాలిక వైకల్యాన్ని నివారించడానికి, ఆరోగ్య సంరక్షణ ఖర్చులను తగ్గించడానికి మెరుగైన ఫలితాల కోసం రోబోటిక్స్ ఏఐ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలు కీలకమని తేల్చిచెప్పింది. 'స్ట్రోక్ నుంచి బయటపడటం మొదటి అడుగు మాత్రమే.. నిజంగా కోలుకోవడం అనేది ముందస్తు రీహాబిలిటేషన్‌పై ఆధారపడి ఉంటుందని వైద్యులు అభిప్రాయపడ్డారు. సదస్సులో కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ చీఫ్ న్యూరో సర్జన్ డాక్టర్ నవీన్ మెహ్రోత్రా, సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ అనంత్ ఎగూర్, న్యూరో రిహాబిలిటేషన్ – ఫిజికల్ మెడిసిన్, నిపుణులు డాక్టర్ ఆస్తిక్ భట్ తదితర వైద్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సైబర్ నేరాలపై తెలంగాణలో 30,624 కేసులు

లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర హోంశాఖ పటిష్టమైన చర్యలు చేపడుతోందని ఆ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు.మూడేళ్ల వ్యవధిలో తెలంగాణలో 30,624 కేసులు నమోదైనట్టు లోక్‌సభలో వెల్లడించారు. 2020లో 5,024, 2021లో 10,303, 2022లో 15,297 కేసులో నమోదయ్యాయని వివరించారు. దేశంలోని అన్ని రకాల సైబర్ నేరాలను అరికట్టేందుకు హోంశాఖ 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్'(ఐ4సీ) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్థిక మోసాలపై వెంటనే స్పందించేలా, మోసగాళ్ల నిధులను స్వాహా చేయకుండా నిరోధించేందుకు ఐ4సీ కింద 'సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం'ను 2021లో ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా ఇప్పటివరకు 13.36 లక్షలకుపైగా వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో రూ.4,386 కోట్ల నగదును సేవ్ చేసినట్లు సంజయ్ వివరించారు.

రాష్ట్రానికి రూ.416 కోట్ల 'విపత్తు' నిధులు

- లోక్‌సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) నుంచి తెలంగాణకు రూ.416.8 కోట్లు, ఏపీకి కేంద్ర వాటాగా రూ.1,036 కోట్ల చొప్పున ఇచ్చినట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. ఈ నిధులను రెండు రాష్ట్రాలకు వేర్వేరుగా రెండు విడతల్లో ఇచ్చినట్లు మంగళవారం లోక్‌సభలో ఆ శాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ వెల్లడించారు. గతేడాది దేశవ్యాప్తంగా సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుపాను వంటి వాటికి తెలంగాణ, ఏపీ, నాగాలాండ్, ఒడిశా, త్రిపుర కొంతమేర దెబ్బతిన్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని 'ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం'(ఐఎంసీటీ) ఇచ్చిన అంచనాల మేరకు ఆ నిధులను ఇచ్చినట్లు చెప్పారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు బాధ్యత బీజేపీదే

- ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేసి.. చట్టం చేయాల్సిన బాధ్యత బీజేపీ ఎంపీలదేనని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి.. తమవంతు పాత్ర పోషించామని చెప్పారు. ఇక బిల్లును ఆమోదింపజేసే బాధ్యత బీజేపీ ఎంపీలదేనన్నారు. ఆయన మంగళవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీతో సమానంగా.. బీజేపీని ఎనిమిది లోక్‌సభ సీట్లలో గెలిపించారని గుర్తు చేశారు. వారు ప్రధాని మోదీని కలిసి, పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

బీసీ బిల్లు ఆమోదం బాధ్యత ప్రభుత్వానిదే..

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలు కిశోర్, కురువ విజయ్‌కుమార్‌తో కలిసి మంగళవారం శ్రీనివాస్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. రెండు జాతీయ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే తమిళనాడు తరహాలో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేలా పార్లమెంటులో బిల్లును ఆమోదించాలన్నారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో జ్యోతిబా పూలే పేరిట రూ.20 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ప్రవేశ పెట్టాలన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎంబీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

ఇంటర్ స్పాట్‌కు బయోమెట్రిక్ హాజరు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియలో ఈసారి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశ పెడుతున్నారు. ఈ దిశగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశించారు. మూల్యాంకనకు హాజరయ్యే అధ్యాపకులు ముందుగా ఆధార్ సంఖ్యతో బయోమెట్రిక్ హాజరును నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. భాషలకు సంబంధించిన సమాధాన పత్రాల మూల్యాంకన ఇప్పటికే మొదలైంది. ప్రధాన సబ్జెక్టుల మూల్యాంకన ఈనెల 21 నుంచి ప్రారంభమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా మూల్యాంకనం కోసం 19 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో మూల్యాంకన విధులు అప్పగించే అధ్యాపకులు సకాలంలో వస్తున్నారా? లేదా? అనేది పరిశీలించేందుకు ఆధార్ బయోమెట్రిక్ సాంకేతికతను వాడుతున్నారు.

హైదరాబాద్ ఖ్యాతి పెరిగేలా..

మేలో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలతో భాగ్యనగరం బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ పర్యాటక పటంలో హైదరాబాద్‌ను సమున్నతంగా నిలిపే అరుదైన అవకాశం.. ప్రపంచం యావత్తు నగరం వైపు దృష్టి సారించే కీలక సన్నివేశం.. ప్రపంచ మీడియా హైదరాబాద్ పేరును ప్రముఖంగా వినిపించి/చూపించే విశిష్ట నేపథ్యం.. అవును.. ఇప్పుడు హైదరాబాద్ ప్రపంచ దృష్టిని ఆకర్షించబోతోంది. మే ఏడో తేదీ నుంచి 31 వరకు హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్) పోటీలు జరగబోతున్నాయి. ఈ పోటీలను నిర్వహించేందుకు చాలా దేశాలు పోటీపడినా ఈసారి ఆ అవకాశాన్ని హైదరాబాద్ సాధించింది. అందాల పోటీలపై ఆసక్తితో ఆ పోటీలకు వేదికైన హైదరాబాద్ గురించీ ప్రపంచం ఆసక్తిని కనబరుస్తుంది. ఇప్పుడు ఈ 'ఆసక్తి'ని భావిశక్తిగా మార్చుకోవాలని తెలంగాణ ప్రభుత్వం గట్టిగానే ప్రయతిస్తోంది. ప్రపంచ సుందరి పోటీలకు వేదికవడం ద్వారా హైదరాబాద్ బ్రాండ్‌కు అంతర్జాతీయ ఖ్యాతిని పొందే ప్రయత్నం చేస్తోంది. తద్వారా రైజింగ్ తెలంగాణ గుర్తు ప్రపంచం నలుమూలలా చాటడం ద్వారా అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్యను పెంచుకునే ప్రయత్నం ప్రారంభించింది.

అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేలా..

ఈ పోటీలను కవర్ చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా పేరున్న దాదాపు 3 వేల మీడియా సంస్థలకు చెందిన ప్రతినిధులు హైదరాబాద్‌కు వస్తున్నారు. కేవలం పోటీల వివరాలనే కాకుండా, పోటీలకు అతిథ్యమిస్తున్న నగర విశేషాలను కూడా వారు ప్రపంచం ముందుంచనున్నారు. ఇక్కడి చరిత్ర, సంస్కృతి, ఐటీలో హైదరాబాద్ పురోగతి, స్థానికంగా ఉన్న మౌలిక వసతులు.. ఇలా అన్ని వివరాలను ప్రచారం చేస్తారు. దీంతో హైదరాబాద్ అంటే పర్యాటకుల్లో కొత్త ఆసక్తి పెరిగి ఈ నగర పర్యటనకు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇక పోటీలకు సంబంధించి న్యాయనిర్ణేతలుగా వైద్యులు, క్రీడాకారులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, పారిశ్రామికవేత్తలు.. ఇలా వివిధ నేపథ్యాలకు చెందిన 140 మంది కూడా ఇక్కడికి



రానున్నారు. వీరు కూడా హైదరాబాద్ ప్రత్యేకతలను విశ్వవ్యాప్తం చేయటంలో ఉపకరిస్తారని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఈ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా పరిగణించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వెరసి పర్యాటక రంగంలో అంతర్జాతీయ పెట్టుబడులను కూడా ఆకర్షించాలన్న ఆలోచనతో ఉంది. ప్రపంచస్థాయి అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ రంగంలో పురోగతి, ఘనమైన చరిత్ర, అద్భుత వైద్యసదుపాయాలు.. ఇలాంటి వివరాలను విశ్వవ్యాప్తం చేసే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మిస్ వరల్డ్ పోటీలు జరిగే వేళ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుంది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప సహా ఇతర చారిత్రక నిర్మాణాల నేపథ్యాన్ని ఈ సందర్భంగా కళ్లకు కట్టబోతోంది.

సీఎస్‌గా రామకృష్ణారావు!

- ప్రయత్నాల్లో శశాంక్‌గోయల్, జయేశ్‌రంజన్, వికాస్‌రాజ్ కూడా..




సాక్షి, హైదరాబాద్: తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావును ప్రభుత్వం ఖరారు చేసినట్టు సమాచారం. ప్రస్తుత సీఎస్ శాంతి కుమారి ఏప్రిల్ చివరలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆమె స్థానంలో రామకృష్ణారావు సీఎస్‌గా బాధ్యతలు చేపడతారని ప్రభుత్వవర్గాల కథనం. ఇంకా నెలరోజులకు పైగా సమయమున్న నేపథ్యంలో మరో ముగ్గురు ప్రత్యేక ప్రధానకార్యదర్శులు కూడా సీఎస్ పోస్టు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తుండడం గమనార్హం. రామకృష్ణారావు కాకుండా సీఎస్ కోసం పోటీ పడుతున్న వారిలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్ జనరల్ శశాంక్‌గోయల్(1990బ్యాచ్), 1992 బ్యాచ్ ఐఏఎస్‌లలో పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ ఉన్నారు. వీరి బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార శాఖల కార్యదర్శిగా ఉన్నారు. ఆయన రాష్ట్ర సర్వీసులోకి రావడానికి అయిష్టత వ్యక్తం చేసినట్టు సమాచారం.

- ప్రకృతి విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న అర్వింద్‌కుమార్ కూడా రామకృష్ణారావు బ్యాచ్‌కు చెందినవారే. అయితే ఆయన ఫార్ములా ఈ –రేసు కేసుల్లో ప్రస్తుతం విచారణ ఎదుర్కొంటున్నారు. అదీకాక ఓఆర్ఆర్ టోల్ వసూళ్లను ప్రైవేట్ సంస్థకు అప్పగించిన అంశంలో ప్రతిపక్ష నాయకుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు ఆరోపణలు చేస్తే.. ఆ సమయంలో రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగతంగా పరువునష్టం దావా వేశారు. రేవంత్‌రెడ్డి సీఎం బాధ్యతలు స్వీకరించిన తర్వాత అర్వింద్‌కుమార్‌ను పురపాలక శాఖ నుంచి అప్రాధాన్యమైన ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖకు బదిలీ చేశారు.
- శాంతికుమారి ఉద్యోగ విరమణ తర్వాత ఒకవేళ రామకృష్ణారావు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించినా, నాలుగు నెలలపాటు మాత్రమే ఆ పదవిలో కొనసాగుతారు. ఒకవేళ ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగింపు ఇచ్చే పక్షంలో నవంబర్ చివరి వరకు సీఎస్‌గా కొనసాగే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతి కుమారిని తప్పించి.. రామకృష్ణారావుకు సీఎస్ బాధ్యతలు అప్పగిస్తారని భావించినా, సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి మార్పు చేయకుండానే ఆమెను కొనసాగిస్తూ వచ్చారు. వచ్చే ఏప్రిల్‌లో ఆమె పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు(1991 బ్యాచ్)ను నియమించాలని నిర్ణయించినట్టు తెలిసింది. వాస్తవానికి రామకృష్ణారావు కంటే ఒక సంవత్సరం సీనియర్ 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శశాంక్‌గోయల్ వచ్చే సంవత్సరం సెప్టెంబర్‌లో ఉద్యోగ విరమణ చేస్తారు. కాగా జయేశ్‌రంజన్ ఉత్తరాదికి చెందిన ఓ ప్రముఖునితో సీఎస్ పదవి కోసం యత్నిస్తున్నట్టు తెలియడంతో... ఓ ఉన్నతాధికారి ఇటీవల జయేశ్‌రంజన్‌కు వ్యతిరేకంగా విజిలెన్స్ నివేదికను బయట పెట్టినట్లు సచివాలయంలో ప్రచారం జరుగుతోంది. శశాంక్‌గోయల్ 2026 సెప్టెంబర్‌లో, అర్వింద్‌కుమార్ 2026 అక్టోబర్‌లో, జయేశ్‌రంజన్ 2027 సెప్టెంబర్‌లో, వికాస్‌రాజ్ 2028 మార్చిలో, అదే సంజయ్ జాజు 2029 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేస్తారు.

పిటిషనర్‌కు రూ. కోటి జరిమానా

- తప్పుడు పిటిషన్లతో కోర్టును తప్పుదోవ పట్టిస్తారా?
- విలువైన సమయాన్ని వృథా చేశారంటూ తీవ్రంగా స్పందించిన హైకోర్టు
- పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా విధింపు హైకోర్టు చరిత్రలోనే తొలిసారి



సాక్షి, హైదరాబాద్ : వాస్తవాలను దాచి పిటిషన్లపై పిటిషన్లు వేస్తూ విలువైన కోర్టు సమయాన్ని వృథా చేసిన పిటిషనర్ వెంకటరామిరెడ్డి తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినందుకు రూ.కోటి జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని ఏప్రిల్ 10లోగా లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించింది. చెల్లించని పక్షంలో పిటిషన్‌ను మళ్లీ బెంచ్ ముందు ఉంచాలని రిజిస్ట్రీకి చెప్పింది. పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా విధింపు హైకోర్టు చరిత్రలోనే తొలిసారి కావడం గమనార్హం. మంగళవారం జస్టిస్ నగేశ్ భీమపాక ఈ సంచలనాత్మక తీర్పు వెలువరించారు. హైదరాబాద్‌లోని బండ్లగూడ మండలం కందికల్‌లోని సర్వే నంబర్ 310/1, 310/2లో తనకున్న 9.11 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ వెంకటరామిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు.

ఇలాంటి వారికి కఠిన శిక్ష అవసరం

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. '1980లో యజమాని ఆర్.వెంకటేశం నుంచి సదరు భూమిని వెంకటరామిరెడ్డి తండ్రి పట్టాభిరామిరెడ్డి కొనుగోలు చేశారు. పట్టాభూమి పొరపాట్ల కారణంగా ఆబాది భూమిగా నమోదైంది. అధికారులు వెంకటరామిరెడ్డిని ఆక్రమణదారుగా పేర్కొంటున్నారు. భూమిని నిషేధిత జాబితాలో ఉంచుతూ నోటిఫికేషన్ జారీ చేయకుండా రిజిస్ట్రేషన్‌ను అడ్డుకునే అధికారం అధికారులకు లేదు'అని వెల్లడించారు. ప్రభుత్వం తరఫున జీపీ మురళీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'వెంకటరామిరెడ్డి హక్కులు ఉన్నాయంటున్న భూమిపై ఇప్పటికే ప్రభుత్వానికి, ఇతర ప్రైవేట్ వ్యక్తులకు వివాదం నడుస్తోంది. ఆర్.వెంకటేశం సివిల్ కోర్టులో పిటిషన్ వేయగా, 1998లో సర్కార్‌కు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయి. అప్పీళ్లలోనూ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చాయి. ప్రస్తుతం సెకండ్ అప్పీల్ పెండింగ్‌లో ఉంది. వెంకటరామిరెడ్డి.. ప్రతివాదులు, పిటిషన్ల పేర్లు మారుస్తూ పిటిషన్లపై పిటిషన్లు వేస్తూ 'ఫోరం హంటింగ్'(జడ్జీలు మారినప్పుడల్లా కొత్తగా పిటిషన్లు వేయడం)కు పాల్పడుతూ న్యాయ ప్రక్రియతోపాటు కోర్టు విలువైన సమయాన్ని వృథాచేస్తున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం కోసం 2022, డిసెంబర్‌లో పిటిషన్ వేసి 2023లో మార్చిలో ఉపసంహరించుకున్నారు. మళ్లీ 2023లో మరో పిటిషన్ వేసి 2024లో ఉపసంహరించుకున్నారు. ఇలా కిందికోర్టులోనూ పిటిషన్లు వేస్తూ అనుకూల ఉత్తర్వుల కోసం ప్రయత్నించారు. అసలు ఈ భూ వివాదం ఆర్.వెంకటేశం, ప్రభుత్వానికి మధ్య మాత్రమే ఉంది'అని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వెంకటరామిరెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పిటిషనర్ల కారణంగా న్యాయమూర్తులపై ఒత్తిడి పెరిగి అసలైన బాధితుల పిటిషన్లపై దృష్టి సారించే పరిస్థితి తగ్గిపోతుందన్నారు. న్యాయవ్యవస్థను తప్పుడు మార్గంలో వినియోగించుకునేందుకు యత్నించిన వెంకటరామిరెడ్డికి కఠిన శిక్ష విధిస్తేనే భవిష్యత్‌లో ఇలాంటివి అడ్డుకోగలుగుతామని అభిప్రాయపడ్డారు. రూ.కోటి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయండి

- కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగింతపై ఏపీ, కేంద్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించిన అంశంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌పై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రం, ఏపీ ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేగాక కౌంటర్ దాఖలైన వారం రోజుల్లో రీజాయిండర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. మంగళవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అయితే తెలంగాణ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. కాగా గత విచారణ సందర్భంగా జీవో 34, విద్యుత్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి తదితర అంశాలతో కూడిన సమగ్ర నివేదిక తెలంగాణ ప్రభుత్వం సమర్పించాలన్న ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ సమర్పించింది. దీంతో మంగళవారం విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ అఫిడవిట్‌పై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ, కేంద్ర ప్రభుత్వాలను జస్టిస్ అభయ్ ఓకా ధర్మాసనం ఆదేశించింది. కాగా ఈ వ్యవహారంలో తదుపరి విచారణ ఏప్రిల్ 15న జరిగే అవకాశముంది.

వంశీరాం బిల్డర్స్‌పై ఎమ్మెల్యే ఫిర్యాదు అందలేదు

- ప్రజాప్రతినిధులు ఇచ్చే వాటికి ప్రాధాన్యం ఇస్తాం : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



సాక్షి, హైదరాబాద్: వంశీరాం బిల్డర్స్ చేపట్టిన మ్యాన్‌హటన్ ప్రాజెక్టుకు సంబంధించి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఇటీవల హైడ్రాను ఉద్దేశించి ఎమ్మెల్యే కొన్ని వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో రంగనాథ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'అనిరుధ్‌రెడ్డి నుంచి హైడ్రాకు గత ఏడాది ఆగస్టు 18, డిసెంబర్ 21 తేదీల్లో రెండు ఫిర్యాదులు అందాయి. ఖాజాగూడలోని తౌతానికుంటలో నీరు నిలిచిపోవడంతో గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి నీరు చేరుతోందనేది ఒకటి, ఆ కుంట నిండిన తర్వాత వరద నీరు భగీరథమ్మ చెరువుకు వెళ్లట్లేదని రెండోది. వీటిని పరిగణనలోకి తీసుకున్న నేను స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నాను. వాస్తవాల ఆధారంగా భగీరథమ్మ చెరువులో ఆక్రమణలను గత ఏడాది డిసెంబర్ చివరివారంలో తొలగించాం. వంశీరాం మ్యాన్‌హట్టన్ ప్రాజెక్టుపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నుంచి హైడ్రాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. దీనిపై ఏమైనా ఫిర్యాదు ఉంటే వాట్సాప్‌లో అయినా పంపినా పరిశీలిస్తాం. ప్రజాప్రతినిధులు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఉంటుంది. హైడ్రా పేరుతో దందాలు చేసిన పలువురిపై ఇప్పటికే కేసులు పెట్టాం. హైడ్రా నోటీసులు ఇచ్చి ఆపై లావాదేవీలు చేస్తున్నట్టు ఫిర్యాదులుంటే ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన దృష్టికి లేదా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి'అని రంగనాథ్ ఆ లేఖలో పేర్కొన్నారు.

రూ.3.05 లక్షల కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

చెబుతున్నాయి. ఆరు గ్యారంటీల అమలుతోపాటు అభివృద్ధి, సంక్షేమం సమన్వయంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగా ఈ ప్రతిపాదనలు ఉంటాయని పేర్కొంటున్నాయి. ఆరు గ్యారంటీల్లో ఒకటైన సామాజిక పింఛన్ల పెంపు ద్వారా ఏటా రూ.3,500 కోట్ల మేర అదనపు భారం పడుతుందని, ఈ మేరకు పింఛన్ల బడ్జెట్ పెంచుతారని సమాచారం. ఇక సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.5వేల కోట్లు, రాజీవ్ యువ వికాసం కోసం రూ.6వేల కోట్లు, రేషన్ షాపుల్లో సన్నబియ్యం పథకానికి రూ.5వేల కోట్ల వరకు కొత్తగా ప్రతిపాదించే అవకాశాలు ఉన్నాయి. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాల కొనసాగింపునకు అవసరమైన మేర నిధులు కేటాయించనున్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద జనాభా ప్రాతిపదికన మొత్తం బడ్జెట్‌లో 18శాతం మేర ప్రతిపాదిస్తారని సమాచారం. రైతు భరోసాకు రూ.18వేల కోట్లు, పంటల బీమా ప్రీమియం కోసం రూ. 5 వేల కోట్లను ప్రతిపాదించే అవకాశం ఉంది. రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణ, మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ పథకాలకు సంబంధించి రాష్ట్రం భరించాల్సిన మొత్తాన్ని కూడా బడ్జెట్లో చూపించనున్నారు. గతంలో చేసిన అప్పులు తీర్చేందుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 36వేల కోట్ల వరకు ప్రతిపాదించగా.. ఈసారి దీన్ని రూ.65 వేల కోట్లవరకు ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రుణాలు, కేంద్ర నిధులపై ఆశలు!

బడ్జెట్ రాబడుల్లో భాగంగా రుణ సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ చేయనుంది. రూ.17 లక్షల కోట్ల వరకు జీఎస్‌డీపీ నమోదవుతుందనే అంచనాలు, తీరుతున్న గత అప్పుల ప్రాతిపదికన రూ.65 వేల కోట్ల వరకు కొత్తగా రుణాలు ప్రతిపాదించే అవకాశముంది. కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.29వేల కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.20వేల కోట్ల వరకు వస్తాయని ప్రభుత్వం చూపెట్టనుంది. సొంత పన్ను రాబడుల పద్దును రూ.1.50లక్షల కోట్లకు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.38లక్షల కోట్ల వరకు పన్ను రాబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసుకోగా.. జనవరి నాటికి రూ.1.12 లక్షల కోట్ల వరకు వచ్చాయి. చివరి రెండు నెలల్లో మరో రూ.25 వేల కోట్ల వరకు సమకూరే చాన్స్ ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ పన్ను రాబడులు పెరుగుతాయనే అంచనాలతో.. ఈ పద్దును రూ.1.50 లక్షల కోట్లుగా చూపెట్టవచ్చని అంచనా. పన్ను రాబడులకు సంబంధించి.. స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్ శాఖలకు ఈసారి భారీ టార్గెట్ ఇచ్చే అవకాశాలున్నాయనే చర్చ ఆర్థిక శాఖ వర్గాల్లో జరుగుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ ఆదాయం మరో రూ.5 వేల కోట్లు అదనంగా వస్తుందని.. భూముల విలువల సవరణ వంటి కార్యక్రమాల ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ పద్దు రూ.20 వేల కోట్లు దాటవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి. భూముల అమ్మకాల ద్వారా పన్నేతర ఆదాయాన్ని కూడా భారీగా చూపెట్టవచ్చని సమాచారం.

రూ.లక్ష కోట్ల నుంచి మూడు లక్షల కోట్ల దాకా..!

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఇప్పటివరకు 12 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో 2014–15 సంవత్సరానికి గాను 10 నెలల కాలానికి బడ్జెట్ పెట్టగా.. 2024–25లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్‌తో పాటు పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2014–15లో నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ రాష్ట్ర తొలి బడ్జెట్‌ను రూ.లక్ష కోట్లతో ప్రవేశపెట్టారు. తర్వాతి నాలుగేళ్లలో బడ్జెట్ పరిమాణం రూ.1.75 లక్షల కోట్ల వరకు చేరింది. 2019–20లో కరోనా ప్రభావంతో బడ్జెట్‌ను తగ్గించి రూ.1.46లక్షల కోట్లుగా ప్రతిపాదించారు. తర్వాతి రెండేళ్లలోనే ఏకంగా రూ.85 వేల కోట్ల మేర బడ్జెట్ పెరిగి రూ.2.30లక్షల కోట్లకు చేరింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.2.90లక్షల కోట్లుగా ఉన్న బడ్జెట్ 2024–25లో రూ.2.91లక్షల కోట్లుగా ప్రతిపాదించారు. అంతకుముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ (2024–25) బడ్జెట్‌లో అంచనా వ్యయాన్ని రూ. 2.75 లక్షల కోట్లుగానే ప్రతిపాదించడం గమనార్హం.

తెలంగాణ బడ్జెట్ ప్రస్థానం ఇలా...!

సంవత్సరం	ప్రతిపాదిత బడ్జెట్ (రూ. కోట్లలో)
2014-15	1,00,637.96
2015-16	1,15,689
2016-17	1,30,415.87
2017-18	1,49,616
2018-19	1,74,453.84
2019-20	1,46,492.30
2020-21	1,82,914.42
2021-22	2,30,825.96
2022-23	2,56,858.51
2023-24	2,90,296
2024-25	2,91,059

తెలంగాణలో పెట్టుబడులకు రష్యా ఆసక్తి

- రాష్ట్రంలో అనుకూలతలను వివరించిన మంత్రి శ్రీధర్‌బాబు



మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైన రష్యా ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రష్యా ఆసక్తి చూపిస్తోంది. మంగళవారం ఆ దేశ ప్రతినిధులు శాసనసభ సమావేశ మందిరంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని ఈ సందర్భంగా మంత్రి వారికి తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పారిశ్రామికవేత్తలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను మంత్రి వివరించారు. గ్లోబల్ కేపిటల్ ఆఫ్ ఏఐగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టులో రష్యా కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చొరవ చూపాలని ప్రతినిధులను కోరారు. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ప్రపంచస్థాయి నిపుణులను తయారుచేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ఐటీ, ఇన్నోవేషన్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఇతర అంశాల్లో రష్యా ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి వెల్లడించారు. పౌర సేవలను ప్రజల ముంగిటకు చేర్చేందుకు రష్యాలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులపై అధ్యయనం చేస్తామని చెప్పారు. సమావేశంలో రష్యా ప్రభుత్వ ప్రతినిధులు లిడ్‌మిలా ఒగారోడోవా, డిమిత్రీ స్టారోస్టిన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రశ్న, జవాబు పత్రాలకు క్యూఆర్ కోడ్

- తొలిసారి పదో తరగతి పరీక్షల్లో అమలు
- పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి: ఎస్సెస్సీ బోర్డు



పదోతరగతి జవాబు పత్రాల బుక్‌లెట్ పై క్యూఆర్ కోడ్

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట)/సాక్షి, హైదరాబాద్: ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జవాబు పత్రాలకు బదులుగా విద్యార్థులకు బుక్‌లెట్‌ను అందించనున్నారు. భౌతిక–రసాయనశాస్త్రం, జీవశాస్త్రాలకు 12 పేజీల చొప్పున జవాబు బుక్‌లెట్ ఉండగా, మిగతా సబ్జెక్టులకు 24 పేజీల జవాబు బుక్‌లెట్‌ను తయారుచేశారు. ఇందులో భాగంగా ప్రతి ప్రశ్నపత్రం, జవాబు పత్రంపై క్యూఆర్ కోడ్‌ను రూపొందించారు. ఒక వేళ ప్రశ్నపత్రం లీక్ అయినా, ఏ సెంటర్ నుంచి ప్రశ్నపత్రం లీక్ అయ్యిందో తెలిసే అవకాశం ఉంటుంది. ఏ విద్యార్థికి సంబంధించిన ప్రశ్నపత్రం ఏ పరీక్ష సెంటర్ నుంచి బయటకు వచ్చిందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో పాటు విద్యార్థులు జవాబు పత్రాలు ఒకరికొకరు మార్చుకోకుండా వీలవుతుంది. విదార్థులు రీవాల్యుయేషన్ కోరితే జవాబు పత్రాల బుక్‌లెట్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా విద్యార్థికి తన జవాబు పత్రాలను జిరాక్స్ ఇచ్చే వెసులుబాటు ఉంటుంది. ఈ క్యూఆర్ కోడ్‌లో విద్యార్థికి సంబంధించిన వివరాలుంటాయి. 2024–25 విద్యాసంవత్సరం పదవ తరగతి పరీక్షలకు తొలిసారి రాష్ట్ర విద్యాశాఖ ప్రశ్నపత్రాలకు, జవాబు బుక్‌లెట్‌లకు క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసింది.

5,09,403 మంది విద్యార్థులు.. 2,650 కేంద్రాలు

టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎస్సెస్సీ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. పరీక్షకు 5,09,403 మంది రిజిస్టర్ చేసుకున్నారని, వీరిలో బాలురు 2,58,895 మంది, బాలికలు 2,50,508 మంది ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 4 వరకు జరిగే పరీక్షలకోసం 2,650 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 2,650 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 2,650 మంది డిపార్ట్‌మెంట్ స్టాఫ్, 28,100 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల విధుల్లో ఉంటారని ఆయన వివరించారు. హాల్‌టికెట్లు ఆయా స్కూళ్లకు పంపామని తెలిపారు. పరీక్ష హాల్‌లోకి హాల్‌టికెట్, పరీక్ష ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్, షార్ప్‌నర్, ఎరైజర్, జామెట్రీ బాక్సులను మాత్రమే అనుమతిస్తారన్నారు.

మేడిగడ్డ 'డ్రోన్' కేసులో తీర్పు రిజర్వు

- కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టులో ముగిసిన వాదనలు

సాక్షి, హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ఇతర నాయకులపై నమోదైన కేసులో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. తుది ఉత్తర్వులు వెలువడే వరకు కేటీఆర్ సహా ఇతర నాయకులను అరెస్టు చేయొద్దన్న మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ట్రయల్‌కోర్టులో జరిగే విచారణ హాజరు నుంచి కూడా కేటీఆర్‌కు మినహాయింపు ఇచ్చిన ఉత్తర్వులూ.. తీర్పు వచ్చే వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. '2024, జూలై 26న మేడిగడ్డ బరాజ్‌ను కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్ సందర్శించారు. ఎటువంటి సమాచారం, అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరించారు'అని మేడిగడ్డ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, బీఆర్ఎస్ నేతలపై మహదేవ్‌పూర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎలాంటి తప్పు చేయకున్నా తప్పుడు కేసు నమోదు చేశారని, విచారణ సహా తదుపరి చర్యలు నిలిపివేయడంతోపాటు ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పోలీసుల తరఫున పీపీ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. డ్రోన్ ఎగురవేయడంతో మేడిగడ్డ రిజర్వాయర్‌కు భవిష్యత్‌లో ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. డ్రోన్స్ ఎగరేసేందుకు వీలు లేకుండా మేడిగడ్డను నిషేధిత ప్రాంతంలో చేర్చారని చెప్పారు. పిటిషనర్ న్యాయవాది టీవీ రమణారావు వాదనలు వినిపిస్తూ.. ఏదైనా ప్రాంతాన్ని నిషేధిత జాబితాలో చేర్చాలంటే చట్ట ప్రకారం కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. కేంద్రం నోటిఫికేషన్ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత ప్రాంతంగా పేర్కొనడం చెల్లదని వెల్లడించారు. విచారణ సందర్భంగా పీపీ తీరుపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కేంద్రం నోటిఫికేషన్ వెలువరించిన ప్రతిని అందజేయాలని పీపీ కోరారు. మేడిగడ్డను నిషేధిత ప్రాంత జాబితాలో చేర్చాలని కేంద్రాన్ని కోరామని బదులివ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయకుండా నిషేధిత ప్రాంతంగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనల తర్వాత తీర్పును రిజర్వు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతోపాటు మరో మూడు కేసులను సవాల్ చేస్తూ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్లలో వాదనలను న్యాయమూర్తి వాయిదా వేశారు.

'మేడిగడ్డ' కేసు.. మళ్లీ భూపాలపల్లి కోర్టుకు

- చట్టప్రకారం విచారణ చేపట్టాలని జిల్లాకోర్టుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: 'మేడిగడ్డ'అంశంపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేసిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌లకు హైకోర్టులో ఎలాంటి ఊరట లభించలేదు. రివిజన్ పిటిషన్ విచారణార్హమేనని.. చట్టప్రకారం విచారణ చేపట్టాలని జిల్లా కోర్టును ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపేలా పోలీసులు ఆదేశించాలని కోరుతూ 2023, నవంబర్ 7న కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు మరో ఆరుగురిపై భూపాలపల్లి ప్రధాన మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో భూపాలపల్లికి చెందిన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇది తమ పరిధిలోకి రాదంటూ 2024, జనవరి 12న పిటిషన్‌ను కొట్టివేశారు. దీనిపై భూపాలపల్లి జిల్లా కోర్టును రామలింగమూర్తి ఆశ్రయించగా, సెషన్స్ జడ్జి విచారణ చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్, మజీ మంత్రి హరీశ్‌లు సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ గతనెల తీర్పు రిజర్వు చేసి మంగళవారం తుది ఉత్తర్వులు వెలువరించారు. పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. చట్టప్రకారం రివిజన్ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని భూపాలపల్లి కోర్టును ఆదేశించింది.

న్యూస్‌మేకర్

వెల్‌కమ్ సునీత

వినోదం కోసం నిర్మించే 'బిగ్‌బాస్' షోను మనం ఫాలో అయినట్లుగా అంతరిక్షంలో చిక్కుకుపోయిన సునీత విలిమయ్స్ వార్తలు ఫాలో అయ్యామా? 60 ఏళ్ల వయసులో ఆమె ఏం చెప్పడానికి అంతరిక్షంలో పరిస్థితులను ధిక్కరించి చిర్నవ్వును నిలబెట్టుకుంది? 'నీకేం రాదు ఊరుకో' అని ఇకపై స్త్రీలతో ఎవరూ అనకూడదు. సైకిల్ నుంచి స్పేస్ స్టేషన్ వరకు వారు రిపేర్ చేయగలరు. వెల్‌కమ్ సునీతా. నీ విజయం మాకు గర్వకారణం...

సునీత విలియమ్స్

అంతరిక్షాన్ని జయించి సగర్వంగా భూమిని తాకనున్న మహిళ.



పదిరోజుల ముందు మహిళా దినోత్సవం చేసుకున్నాం కదా. ఆ దినం వస్తుంది అంటేనే నాకు భయం వేస్తుంది. మహిళకు పది, పదహారు చేతులు పెట్టి ఓ చేతిలో కంప్యూటర్, ఓ చేతిలో పెన్ను, పుస్తకం, ఓ చేతిలో చీపురు కట్ట, ఇంకో చేతిలో అట్లకాడ; ఆడాళ్ళు ఏ పనైనా చేసేస్తారు, చేసెయ్యాలి; కానీ ఎంత గొప్ప పనులు చేసినా డిఫాల్ట్‌గా అట్లకాడ లేదా పప్పు గరిట లేనిదే స్త్రీ శక్తికి పరిపూర్ణత రాదు అని సందేశం ఇస్తారు. ఈ తలతిక్క వేడుకల మధ్యలో సునీత విలియం జీవన ప్రయాణం, వ్యోమగామిగా ఆమె సాధించిన విజయాలు, అంతరిక్ష నడకలు, నాసాకి చేసిన కృషి గురించి గుర్తు చేసుకోవడం ఒక ఊరట. స్టెమ్ రంగాలలో మహిళల విజయాలకు స్ఫూర్తిమంతమైన వేడుక.

1965లో అమెరికాలో పుట్టిన సునీత నేపథ్యం రీత్యా, తండ్రి దీపక్ పాండ్యా గుజరాతీ కావడం భారతీయులకు ఆమెను దగ్గర చేసే అంశం కాగా సునీత విజయాలు తేదీలతో, ప్రాంతాలతో సంబంధం లేకుండా ప్రపంచ మహిళలంతా ఉత్సవాలు చేసుకోవలసిన సందర్భం. సునీత తొమ్మిదిసార్లు; అరవై గంటలకన్నా ఎక్కువ సమయం స్పేస్ వాక్ చేశారు. స్పేస్ వాక్ చేసిన మహిళలందరిలో 'ఎక్కువ సమయం' రికార్డ్ ఆమెదే. భారత ప్రభుత్వం ఇచ్చిన పద్మభూషణ్, గుజరాత్ టెక్నలాజికల్ యునివర్సిటీ గౌరవ డాక్టరేట్, విశ్వ గుజరాత్ సొసైటీ వారి సర్దార్ వల్లభభాయ్ పటేల్ విశ్వప్రతిభ అవార్డుతో పాటు, రష్యా ప్రభుత్వం మెడల్ ఫర్ మెరిట్ ఇన్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్, అమెరికన్ డిఫెన్స్ సర్వీస్ సుపీరియర్ మెడల్ లాంటి లెక్కకు మిక్కిలి అవార్డులు ఆమె ఖాతాలో చేరి తమ గౌరవాన్ని పెంచుకున్నాయి.

సునీత నౌకాదళంలో డైవింగ్ ఆఫీసర్ గా పనిచేశారు. ఆమె 2770 కన్నా ఎక్కువ గంటలు విమానాలు నడిపారు. నాసాలో అంతరిక్ష ప్రయాణానికి సంబంధించిన శిక్షణ తీసుకున్నారు. 2006-07లో STS -116 మిషన్ ద్వారా మొదటిసారి ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కి వెళ్లి అక్కడ 195 రోజులు గడిపారు. ఆ తర్వాత 2012లో ఎక్స్‌పెడిషన్ 32/33లో మరొకసారి అంతరిక్షం చేరుకుని, బోలెడు ప్రయోగాలు చేశారు. ఇంకా చాలా చాలా. గత జూన్‌లో స్వల్పకాల మిషన్ కోసం అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు కానీ, బోయింగ్ స్టార్‌లైనర్ అంతరిక్ష నౌకలో లోపాలు తలెత్తడంతో అక్కడే దీర్ఘకాలం చిక్కుకుపోయినా మొక్కవోని ధైర్యం ప్రదర్శించి భూమికి వెనుతిరిగారు.



ISS కమాండర్ సునీత న్యూస్ విన్నప్పుడు నాకు అనేక విషయాలు ఆలోచనకు వచ్చాయి. మానవ జాతికి పనికి వచ్చే పరిశోధనల కోసం ఆస్ట్రోనాట్స్ అంతరిక్షానికి వెళతారు. అదే క్రమంలో సునీత స్పేస్‌స్టేషన్‌లో చిక్కుకుని పోతే భూమ్మీద కులాసా జీవితం గడిపే మనం ఎంతమాత్రం వారి గురించి తలచుకున్నాం? వినోదంలో భాగంగా ఒక హౌస్‌లో కొందరు చేసే అల్లరి, ఆటపాటలు, న్యూసెన్స్ గొడవలు చూపిస్తే, ఎందుకూ పనికిరాని వాటిని ఆసక్తితో చూస్తూ వుంటాం. సునీత అంతరిక్షంలో గడిపిన సమయంపై టీవీలో వస్తే ఆ సమాచారానికి, ముఖ్యంగా మన ప్రాంతంలో టీఆర్పీ రేటింగ్స్ ఏ మేరలో ఉంటాయో! మొత్తంగా మన ఆసక్తులను పునర్ నిర్వచించమని, వాటిని పనికొచ్చే కార్యక్రమాల్లో పెట్టమని సునీత ఇవాళ మనకు సందేశం ఇస్తోంది. సునీత, అరవై ఏళ్లకు దగ్గర పడుతున్నది. ఈ దశలో చాలామంది ఆడవాళ్ళు పోస్ట్ మెనోపాజ్ సమస్యలను ఎదుర్కొంటూ ఇవాళ బాగా గడిస్తే చాలు, ఇంట్లో పనులు అవసరం అయినంత మేర చేస్తే చాలు, ఆఫీసులో అక్షింతలు పడకుండా బైటపడితే చాలు అనుకుంటారు. కానీ ఈ దశ మరింత ఉత్పాదక అభివృద్ధికి అడ్డంకి కాదు అని సునీత మనతో చెబుతోంది. సైకిల్ మెకానిజం సైతం మగవారి డొమైన్‌గా పరిగణన చేసే మన సమాజంలో, కృషి, పట్టుదలకి తోడు అవకాశం కల్పిస్తే మహిళ ఎయిర్ మెకానిక్ కావడం సాధ్యమే అని సునీతని చూస్తే అర్థం అవుతోంది.

- డాక్టర్ ఎం.ఎస్.కె. కృష్ణజ్యోతి,
ప్రొఫెసర్, రచయిత్రి



గురుత్వాకర్షణ లేని కురుల అందం!

కొన్ని రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్...

'మీ జుట్టు బాగుంది. అందంగా, దృఢంగా ఉంది. నేనేమీ జోక్ చేయడం లేదు. ఇది నిజం' అని సునీతా విలియమ్స్ జుట్టు గురించి ప్రశంసలతో ముంచెత్తాడు.

జుట్టు అందం గురించి ప్రశంసలు వినడం సాధారణ విషయమే అయినా... అంతరిక్షంలో జుట్టును అందంగా, శుభ్రంగా కాపాడుకోవడం ఆషామాషీ విషయం కాదు!

భూమిపై ఉన్న గురుత్వాకర్షణ శక్తి వల్ల తల స్నానం చేయడం అనేది మనకసలు సమస్య కాదు. తలకు కాస్తంత షాంపు రుద్దుకొని షవర్ కింద నిలబడితే సరిపోతుంది.

కాని అంతరిక్షంలో అలా కాదు.

జుట్టు శుభ్రం చేసుకోవడం వ్యోమగాములకు కష్టమైన పని,

దీనికి కారణం స్పేస్‌స్టేషన్‌లో గురుత్వాకర్షణ శక్తి లేకపోవడం.

నాసాకు చెందిన ఆస్ట్రోనాట్ కరెన్ నైబర్గ్ అంతరిక్షంలో జుట్టు ఎలా శుభ్రం చేసుకుంటారో ఒక వీడియోలో చూపించింది. ఈ జీరో గ్రావిటీ హెయిర్ వాషింగ్ ప్రాసెస్ ఆసక్తికరంగా ఉంది.

'హెయిర్ వాష్ చేసుకోవడానికి నేను వీటిని ఉపయోగిస్తాను' అంటూ గోరు వెచ్చని నీటి పాకెట్, షాంపూ బాటిల్, దువ్వెన, అద్దం, వైట్ టవల్ చూపించింది.

మొదట నీళ్లను తలపై స్ప్రే చేసుకుంది. దువ్వెనతో తల వెంట్రుకలను పైకి దువ్వడం మొదలుపెట్టింది. వెంట్రుకలు కుదురుగా ఉండకుండా వివిధ దిశలలో ఎగురుతూనే ఉన్నాయి. ఆ తరువాత షాంపూ రాసుకుంది. మళ్లీ తల వెంట్రుకలను పైకి దువ్వింది. తరువాత టవల్‌తో తల క్లీన్ చేసుకుంది. మళ్లీ తలపై వాటర్ స్ప్రే చేసి దువ్వెనతో పైకి దువ్వింది, టవల్‌తో తుడుచుకుంది.

'శుభ్రం చేసుకునేటప్పుడు జుట్టును సరిగ్గా పట్టుకోవడం కష్టమవుతుంది' అంటుంది నైబర్గ్.

నైబర్గ్ తన జుట్టును స్థిరమైన స్థితిలో ఉంచడానికి పడుతున్న కష్టం మనకు వీడియోలో కనిపిస్తుంది. దువ్వుతున్నప్పుడు ఆమె జుట్టు వివిధ దిశలలో ఎగురుతుంటుంది.


ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్(ఐఎస్‌ఎస్) లోపల ఎయిర్ ఫ్లో తలపై తేమను ఆవిరి చేయడానికి ఉపయోగపడుతుంది. బ్లో డ్రైయర్‌ల అవసరం ఉండదు.

చాలాసార్లు వ్యోమగాములు హెల్మెట్ లేదా హెడ్‌గేర్‌లను ధరిస్తారు. ఇది నెత్తిమీద గాలి ప్రసరణ (ఎయిర్ సర్క్యులేషన్)ను బ్లాక్ చేస్తుంది. జుట్టును ఫ్రీగా వదిలేయడం వల్ల చల్లగా, సౌకర్యవంతంగా ఉంటుంది.

నిరంతరం బ్రష్ చేయడం వల్ల కూడా జుట్టును ముడి వేయాల్సిన అవసరం ఉండదు.

భూమిమీద తల వెంట్రుకలు బుద్ధిగా మన మాట వింటాయి. అంతరిక్షంలో మాత్రం 'నా ఇష్టం' అన్నట్లుగా ఉంటాయి. అయితే వాటి ఇష్టం వ్యోమగాములకు కష్టం కాదు. చాలామంది మహిళా వ్యోమగాములు తమ జుట్టును ఫ్రీగా వదిలేయడాన్ని ఎంజాయ్ చేస్తారు. భూమిపై మాదిరిగా తల వెంట్రుకలు ముఖంపై పడవు కాబట్టి వారికి ఎలాంటి అసౌకర్యమూ ఉండదు.

ఆమె ఇష్టమే మాకు ఆనందం



సునీత విలియమ్స్‌కు స్పేస్ సెంటరే కుటుంబం అంటారు ఆమె ఫ్యామిలీ మెంబర్స్. ఆమెకు ఏది ఇష్టమో తమకు అదే ఇష్టం అని చెబుతారు. తండ్రి దీపక్ పాండ్యా, తల్లి ఉర్సులిన్ బోనీ పాండ్యా వారి ముగ్గురు సంతానంలో సునీత చిన్నది. అన్నయ్య జె.థామస్‌తో పాటు అక్క దీనా ఆనంద్ ఉన్నారు. అమెరికాలోనే జన్మించిన సునీత చదువు అంతా అక్కడే సాగింది. చదువు పూర్తయ్యాక తండ్రి దీపక్ పాండ్యా సూచనలతో అమెరికన్ నేవీలో జాయిన్ అయ్యారు. నేవీలో పనిచేస్తున్న సమయంలోనే మైఖేల్ జె.విలియమ్స్‌తో పరిచయం స్నేహంగా మారింది. వివాహ బంధంతో ఒక్కటై 20 ఏళ్లుగా కలిసి జీవిస్తున్నారు. టెక్సాస్‌లోని హ్యూస్టన్ శివారులో నివసిస్తున్నారు. ఈ జంటకు పిల్లలు లేరు. ఒక అమ్మాయిని దత్తత తీసుకోవాలని ఉందని చెప్పే సునీతకు పెంపుడు కుక్క గార్బీ అంటే చాలా ఇష్టం. గార్బీతో ఉన్న ఫొటోలను సునీత తరచు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఉంటుంది. 2006లో మొదటిసారి తనతో పాటు భగవద్గీతను అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లింది. 2012లో ఓం సింబల్ తీసుకెళ్లినట్టు చెప్పిన సునీత గణేష్ విగ్రహాన్ని ఎప్పుడూ తనకు తోడుగా తీసుకెళుతుందట. సునీత విశ్వాసాలకు విలియమ్స్ మద్దతు ఇస్తాడు.

తల్లి బోనీ పాండ్యా కూతురి గురించి వివరిస్తూ 'ఆమె సుదీర్ఘ కాలం అంతరిక్షంలో ఉండటంపై మాకు ఎలాంటి ఆందోళన లేదు. విధి నిర్వహణలో భాగంగా కష్టపడి పనిచేస్తుంది. కూతురి నుండి చాలా కాలం దూరంగా ఉండటం మొదట్లో కష్టమయ్యేది. కానీ, ఇప్పుడు అది అలవాటయ్యింది. తను తనకు ఇష్టమైనది చేస్తోంది. అలాంటప్పుడు నేను బాధపడటం అంటూ ఉండదు. తన ప్రయత్నాల్లో తను ఉన్నందుకు సంతోషంగా ఉంది. నేను ప్రత్యేకించి ఆమెకు ఎటువంటి సలహాలు ఇవ్వను. ఎందుకంటే, ఏం చేయాలో తనకే బాగా తెలుసు. అంతా సవ్యంగానే జరుగుతుంది' అని ధీమాను వ్యక్తం చేస్తారు ఆమె తల్లి బోనీ పాండ్యా.

హ్యూమన్ మిషన్

స్పేస్ ట్రావెల్ టాస్క్ ముందు పురుషులకే పరిమితమై దాన్ని 'మ్యాన్ మిషన్'గా వ్యవహరించే వాళ్లు. కానీ ఆస్ట్రనాట్స్‌కిచ్చే ట్రైనింగ్‌లో ఆడ, మగ అనే తేడా ఉండదు. ఇద్దరూ ఒకేరకమైన శక్తితో ఉంటారు. ఇంకా చెప్పాలంటే శారీరకంగా, మానసికంగా పురుషుల కన్నా స్త్రీలే బెటర్. అందుకే ఇప్పుడు దాన్ని 'హ్యూమన్ మిషన్' పేరుతో జెండర్ న్యూట్రల్ చేశారు. మానసికంగా, శారీరకంగా స్ట్రాంగ్‌గా ఉన్న వాళ్లనే స్పేస్‌కి సెలెక్ట్ చేసుకుంటారు. టెక్నికల్ ప్రాబ్లమ్స్ దగ్గర్నుంచి అక్కడ పరిస్థితి, అనుకోని అవాంతరాలను ఎదుర్కోవడం వరకు ట్రైనింగ్ చాలా టఫ్‌గా ఉంటుంది. ఆస్ట్రనాట్ సేఫ్టీ అనేది చాలా ముఖ్యం. అందుకే ఒకవేళ మిషన్ ఫెయిలైతే స్పేస్‌షిప్ నుంచి ఎలా తప్పించుకోవాలో కూడా శిక్షణ ఇస్తారు. ఇదీ వాళ్ల మానసిక, శారీరక దారుఢ్యం మీదే ఆధారపడి ఉంటుంది. వీటన్నిటిలో సునీతా విలియమ్స్ పర్‌ఫెక్ట్. కాబట్టే స్పేస్ స్టేషన్‌కి వెళ్లారు. అయితే ఎనిమిది రోజులు మాత్రమే ఉంటామనే మైండ్‌సెట్‌తో వెళ్లిన వాళ్లు తొమ్మిది నెలలు ఉండిపోవాల్సి వచ్చింది. అలా స్పేస్ స్టేషన్‌లో చిక్కుకుపోయిన విలియమ్స్, మరో ఆస్ట్రనాట్‌ను నాసా వాళ్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తునే ఉన్నారు. ఆహారం దగ్గర్నుంచి వాళ్ల అవసరాలన్నీ కనిపెట్టుకున్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌కి సంబంధించి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చారు. అందుకే వాళ్లక్కడ క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజెస్ చేశారు. వాళ్లు తమ హెల్త్ కండిషన్స్‌ను చెక్ చేసుకునేందుకు కావల్సిన సౌకర్యాలన్నీ స్పేస్ స్టేషన్‌లో ఉన్నాయి. నాసా డాక్టర్స్ సలహాలు, సూచనల మేరకు వాళ్లు తమ హెల్త్ కండిషన్స్‌ను చెక్ చేసుకుంటూ ఉన్నారు. మూడు నెలలకోసారి ఫుడ్, మెడిసిన్స్‌ను స్పేస్ స్టేషన్‌కి పంపారు. వాళ్ల మానసిక స్థితిని కూడా ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ మనోస్థైర్యం కోల్పోకుండా చూసుకున్నారు.

స్విమ్మింగ్ పూల్... లిక్విడ్ ఫుడ్

తొమ్మిది నెలలు భారరహిత స్థితికి అలవాటు పడిన వాళ్లు ఇప్పుడు ఒక్కసారిగా భూమి మీది వాతావరణంలో ఇమడలేరు. ఎముకలు, కండరాలు బలహీనమైపోతాయి. ఫ్యాట్ కనీస స్థాయికి తగ్గిపోయుంటుంది. భూమి మీదకు రాగానే ముందు వాళ్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఎముకలు, కండరాల పటుత్వానికి మెడిసిన్స్ ఇస్తారు. ఇన్నాళ్లూ భారరహిత స్థితిలో ఉండటం వల్ల వాళ్లు నిలబడలేరు.. కూర్చోలేరు.. పడుకోలేరు. అలా ఫ్లోటింగ్ స్థితిలోనే ఉండిపోతారు. అందుకే వాళ్లకు బెల్ట్ లాంటిది పెట్టి.. కూర్చోబెడతారు. దాని సాయంతోనే పడుకోబెడతారు. నిలబడ్డానికీ అలాంటి సపోర్ట్‌నే ఏర్పాటు చేస్తారు. ఈ వాతావరణానికి వీలైనంత త్వరగా అలవాటుపడేందుకు ఎక్కువ సమయం వాళ్లను స్విమ్మింగ్ పూల్‌లో ఉంచుతారు. నీళ్లలో తేలుతూ స్పేస్‌లో ఉన్నట్టే ఉంటుంది కాబట్టి.. వాళ్లను వాళ్లు సంభాళించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. దాదాపు మూడు నెలల వరకు ఇలాంటి ప్రాసెసే ఉంటుంది. దాన్నుంచి వాళ్లు నెమ్మదిగా సాధారణ స్థితికి వస్తారు. ఆహారం విషయంలోనూ అంతే! కొన్నాళ్లపాటు స్పేస్‌లో తీసుకున్నట్టే సెమీ లిక్విడ్ ఫామ్‌లోనే ఫుడ్ ఇస్తారు.



- డాక్టర్ ఎస్వీ సుబ్బారావు,
సీనియర్ సైంటిస్ట్,
అసోసియేట్ డైరెక్టర్, రేంజ్ ఆపరేషన్, ఇస్రో

మా తరానికి స్ఫూర్తిప్రదాత



నేను స్టూడెంట్‌గా ఉన్నప్పటి నుంచి సునీతావిలియమ్స్ గురించి చదువుతూ పెరిగాను. సైంటిస్ట్ కావాలనుకునే మహిళల సంఖ్య తక్కువగా ఉన్న రోజుల్లో కల్పనా చావ్లా భారతీయ మహిళల్లో కొత్త ఆలోచన రేకెత్తించారు. సునీతా విలియమ్స్ అంతరిక్షంలో చేసిన పరిశోధనలు స్ఫూర్తినిచ్చాయి. మనదేశంలో అంతరిక్షం, పరిశోధన రంగాలను కెరీర్ ఆప్షన్స్‌గా ఎంచుకునే యంగ్ జనరేషన్ తయారైంది. మా తరం అలా తయారైనదే. సైంటిస్ట్‌గా సునీతావిలియమ్స్ ఒక రోల్‌మోడల్. అకుంఠిత దీక్ష, అంకిత భావంతో పని చేయడం, అంతరిక్ష పరిశోధనల ద్వారా కొత్త విషయాలను ఎక్స్‌ప్లోర్ చేయడంలో ఆమెకున్న ఆసక్తి, వాటిని ఛేదించడానికి చూపించే చొరవ అమోఘం. స్టెమ్ ఫీల్డ్‌లో భవిష్యత్తు తరాలు ఆమె అడుగుజాడల్లో నడుస్తాయి. మగవాళ్ల ఆధిపత్యం కొనసాగుతున్న రంగంలో మహిళ కూడా విజయవంతంగా రాణించగలరని సునీతా విలియమ్స్ తన పరిశోధనల ద్వారా నిరూపించారు.



- శరణ్య. కె. సైంటిస్ట్, బయోటెక్నాలజీ



బాల్యం నుంచి ధైర్యం ఎక్కువ

సునీత విలియమ్స్ తిరిగి భూమి పైకి వస్తున్న వార్త గురించి యావత్ ప్రపంచం స్పందన ఒకటే...

'చాలా సంతోషంగా ఉంది'

అయితే ఇండియాలోని ఆమె కజిన్ మాత్రం 'భయంగా ఉంది' అంటున్నాడు.

'వీలైనంత త్వరగా ఆమె భూమి మీదికి తిరిగి రావాలని కోరుకుంటున్నాను. ఎందుకో నాకు భయంగా ఉంది. ఆమె చక్కని ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నాం' అంటున్నాడు దినేష్ రావత్.

సుదీర్ఘమైన ప్రయాణం తరువాత భూమికి తిరిగి వస్తున్న సునీత విలియమ్స్ ఆ తర్వాత విపరీతమైన శారీరక మార్పులను ఎదుర్కొనే అవకాశం ఉందనే ఆందోళన నేపథ్యంలో ఆయన 'భయం' అనే మాట వాడాడు. సునీత విలియమ్స్ బాల్యాన్ని గుర్తు చేసుకున్నాడు.

'సునీత చిన్నప్పుడు మా దగ్గరికి వచ్చింది. నేను ఆమెను ఒంటె సవారీలకు తీసుకువెళ్లేవాడిని. సవారీ అయిపోయిన తరువాత కూడా దిగేది కాదు! సోమనాథ్ తీర్థయాత్రలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాం. సునీతకు చిన్నప్పటి నుంచి ధైర్యం ఎక్కువ. ఆమె తరచుగా నా చెయ్యి పట్టుకునేది. ఎందుకు ఇలా? అని అడిగితే నాన్నలా అనిపిస్తావు అని చెప్పింది' అంటూ ఆ జ్ఞాపకాల్లోకి వెళ్లాడు దినేష్ రావత్.

భూమికి తిరిగి వచ్చిన తరువాత... రివర్స్!

సునీత విలియమ్స్‌కు ఇష్టమైన సినిమా... టామ్ క్రూజ్ 'టాప్ గన్'. 'టాప్ గన్' కిక్‌తో జెట్‌లు నడపాలనుకుంది. హెలికాప్టర్ నడపాలనుకుంది. 'టెస్ట్ పైలట్ స్కూల్'కు హాజరై, ఆస్ట్రోనాట్స్‌తో మాట్లాడిన తరువాత తన మీద తనకు నమ్మకం వచ్చింది.

ఒకానొక సందర్భంలో అంతరిక్ష వాతావరణంలో ఉన్నవారిపై చోటు చేసుకునే ఆశ్చర్యాల గురించి ఇలా చెప్పింది... 'అంతరిక్షంలో శారీరక మార్పులు ఆసక్తికరంగా ఉంటాయి. నా జుట్టు, గోర్లు వేగంగా పెరగడాన్ని గమనించాను. ముఖంపై కొన్నిమడతలు తాత్కాలికంగా తొలగిపోతాయి. వెన్నెముకకు సంబంధించి కూడా మార్పులు చోటు చేసుకుంటాయి. అయితే భూమికి తిరిగి వచ్చిన తరువాత ఈ మార్పులు రివర్స్ అవుతాయి. వెన్ను కొద్దిగా నొప్పిగా ఉంటుంది' అని పేర్కొంది.



మెయిన్ 'డ్రా'కు ఆయుశ్ శెట్టి అర్హత

బాసెల్: స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ నుంచి ముగ్గురు క్రీడాకారులు ఆయుశ్ శెట్టి, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్, సతీశ్ కుమార్ కరుణాకరన్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ పోటీల్లో ఆయుశ్, శంకర్, సతీశ్ తాము ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి మెయిన్ 'డ్రా' బెర్త్‌లను దక్కించుకున్నారు. ఆయుశ్ తొలి రౌండ్‌లో 21-12, 21-15తో చోలన్ కయాన్ (ఇంగ్లండ్)పై, రెండో రౌండ్‌లో 21-6, 21-8తో రాఫెల్ గావోఇస్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. శంకర్ తొలి రౌండ్‌లో 21-13, 21-4తో యువెహాంగ్ వాంగ్ (ఇంగ్లండ్)పై, రెండో రౌండ్‌లో 21-7, 21-10తో తరుణ్ మన్నేపల్లి (భారత్)పై నెగ్గాడు. సతీశ్ తొలి రౌండ్‌లో 21-13, 21-9తో బ్రూనో కర్వాలో (పోర్చుగల్)పై, రెండో రౌండ్‌లో 19-21, 21-19, 21-16తో జస్టిన్ హో (మలేసియా)పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో భారత్‌కే చెందిన ఇషారాణి బారువా మెయిన్ 'డ్రా'కు చేరుకోగా... శ్రియాన్షి వలిశెట్టి విఫలమైంది. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఇషారాణి 21-16, 21-11తో రోసీ పాన్‌కసారి (ఫ్రాన్స్)పై గెలుపొందింది.

'సిక్సర్' కొట్టేదెవరో?

మరో 3 రోజుల్లో ఐపీఎల్

ఆరో టైటిల్ వేటలో ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్



సూర్య, తిలక్ వర్మ (ఫైల్)



జడేజా, అశ్విన్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభం నుంచి నిలకడ కొనసాగిస్తున్న ముంబై ఇండియన్స్ జట్టు ఆరోసారి ట్రోఫీ చేజిక్కించుకునేందుకు సిద్ధమవుతోంది. గత కొన్ని సీజన్‌లుగా పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న ముంబై ఇండియన్స్ ఈసారి మెరుగైన ప్రదర్శన చేయడమే లక్ష్యంగా సాగుతోంది. గత సీజన్ ఆరంభానికి ముందు ఫ్రాంచైజీకి ఐదు ట్రోఫీలు (2013, 2015, 2017, 2019, 2020) అందించిన 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మను కాదని... గుజరాత్ టైటాన్స్ నుంచి హార్దిక్ పాండ్యాను తీసుకొచ్చి సారథ్య బాధ్యతలు అప్పగించడం అభిమానులకు ఏమాత్రం రుచించలేదు. దీంతో సామాజిక మాధ్యమాల్లో ముంబై ఇండియన్స్ నిర్ణయాన్ని దుమ్మెత్తిపోసిన అభిమానులు... మైదానంలో హార్దిక్‌ను గేలి చేశారు. సొంత మైదానం వాంఖడేతో పాటు... దేశంలో ఎక్కడ మ్యాచ్ ఆడేందుకు వెళ్లినా... పాండ్యాకు ఇదే అనుభవం ఎదురైంది. దీంతో సహజంగానే డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం దెబ్బతింది. అదే మైదానంలో ప్రస్ఫుటమైంది. గత సీజన్‌లో 14 మ్యాచ్‌లాడిన ముంబై ఇండియన్స్ జట్టు కేవలం 4 విజయాలు మాత్రమే సాధించి 10 పరాజయాలతో పట్టికలో అట్టడుగున నిలిచింది. గత నాలుగు సీజన్లలో ఒక్కసారి (2023లో) మాత్రమే ముంబై జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరింది. 2022, 2024లో పట్టికలో కింది స్థానంతో లీగ్‌ను ముగించింది. అయితే అప్పటికీ ఇప్పటికీ జట్టులో ఎంతో తేడా కనిపిస్తోంది. ఏడాది వ్యవధిలో రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు ఐసీసీ టి20 ప్రపంచకప్‌తో పాటు, చాంపియన్స్ ట్రోఫీ చేజిక్కించుకుంది. ఈ రెండు విజయాల్లోనూ కీలకంగా నిలిచిన హార్దిక్ పాండ్యాను అభిమానులు తిరిగి అక్కున చేర్చుకున్నారు. దీనికి తోడు రోహిత్ వంటి అనుభవజ్ఞుడి సలహాలు, సూచనలు ఉంటే... పాండ్యా జట్టును మరింత ముందుకు తీసుకెళ్లడం ఖాయమే.

బుమ్రా ఫిట్‌నెస్ సాధించేనా!

ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా గాయపడ్డ భారత ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై ముంబై ఆందోళన చెందుతోంది. వెన్నునొప్పితో చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన ఈ ఏస్ పేసర్... ఐపీఎల్ తొలి దశ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండబోడని ఇప్పటికే ఫ్రాంచైజీ వెల్లడించింది. అయితే అతడి సేవలు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయనే దానిపై స్పష్టత లేదు. గతేడాది వేలంలో బుమ్రా, రోహిత్, హార్దిక్, సూర్యకుమార్‌తో పాటు హైదరాబాదీ ప్లేయర్ తిలక్ వర్మను ఫ్రాంచైజీ రిటైన్ చేసుకుంది. అందులో అత్యధికంగా బుమ్రాకు రూ. 18 కోట్లు కట్టబెట్టింది. యువ ఆటగాడు ఇషాన్ కిషన్‌ను వేలానికి వదిలేసిన ముంబై... ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, సాంట్నర్‌తో బౌలింగ్‌ను మరింత పటిష్టం చేసుకుంది. రోహిత్‌తో కలిసి దక్షిణాఫ్రికా ప్లేయర్ రికెల్టన్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. భారత ఆటగాళ్ల విషయంలో పటిష్టంగా కనిపిస్తున్న ముంబై ఇండియన్స్... విదేశీ ఆటగాళ్ల ఎంపిక మాత్రం కాస్త అనూహ్యంగా ఉంది. లోయర్ ఆర్డర్‌లో ధాటిగా ఆడగల విదేశీ పించ్ హిట్టర్ లోటు కనిపిస్తోంది. రూ.5 కోట్ల 25 లక్షలు వెచ్చించి 'రైట్ టు మ్యాచ్' ద్వారా తిరిగి దక్కించుకున్న నమన్ ధీర్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. బుమ్రా గైర్హాజరీలో బౌల్ట్, సాంట్నర్, దీపక్ చాహర్, కరణ్ శర్మ పై బౌలింగ్ భారం పెరగనుంది. ఆంధ్ర ఆటగాడు పెనుమత్స సత్యనారాయణ రాజు, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ జట్టులో ఉన్నా... వారికి మ్యాచ్ ఆడే అవకాశం దక్కడం కష్టమే.

ముంబై ఇండియన్స్ జట్టు: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), రోహిత్, సూర్యకుమార్, తిలక్, రాబిన్ మిన్జ్, రికెల్టన్, శ్రీజిత్ క్రిష్ణన్, జాకబ్స్, నమన్ ధీర్, జాక్స్, సాంట్నర్, అంగద్, విఘ్నేశ్, కార్బిన్, బౌల్ట్, కరణ్ శర్మ, దీపక్ చాహర్, అశ్వని కుమార్, టాప్లీ, వెంకట సత్యనారాయణ, అర్జున్ టెండూల్కర్, ముజీబ్, బుమ్రా.

అంచనా: ముంబై ఇండియన్స్ ఆటతీరు పరిశీలిస్తే... ఆడితే అందలం, లేకుంటే అట్టడుగు స్థానం అనేది సుస్పష్టం. గత నాలుగు సీజన్లలో కేవలం ఒక్కసారే ప్లే ఆఫ్స్‌కు చేరిన ముంబై... స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే ఈ సారి కూడా ప్లే ఆఫ్స్ చేరొచ్చు.



రోహిత్, హార్దిక్

ఐపీఎల్‌లో విజయవంతమైన జట్టుగా గుర్తింపు... హేమాహేమీలు ప్రాతినిధ్యం వహించిన ఫ్రాంచైజీగా రికార్డు... నైపుణ్యాన్ని వలవేసి పట్టే నేర్పరితనం... యువ ఆటగాళ్లకు అండగా నిలిచే యాజమాన్యం... వెరసి ఐపీఎల్ టోర్నీ చరిత్రలో 5 ట్రోఫీలు సాధించిన ముంబై ఇండియన్స్ జట్టు గత కొన్నాళ్లుగా స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోతోంది. రోహిత్ శర్మ నుంచి సారథ్య బాధ్యతలు హార్దిక్ పాండ్యాకు అప్పగించడంతో జట్టులో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అభిమానుల అసహనం, మాజీల రుసరుసలు, విశ్లేషకుల వెటకారాలతో గత సీజన్ గడిచిపోగా... 2024 ఐపీఎల్ తర్వాత భారత జట్టుకు రోహిత్ శర్మ 2 ఐసీసీ ట్రోఫీలు అందించాడు. ఈ రెండింట్లో హార్దిక్ కీలకపాత్ర పోషించడంతో సమస్య సమసిపోయినట్టైంది. మరి ఈ ఏడాదైనా ముంబై సమష్టిగా సత్తాచాటి మునుపటి జోరు సాగిస్తుందా చూడాలి!

ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టు ఏదైనా ఉందంటే... అది ముమ్మాటికీ చెన్నై సూపర్ కింగ్సే! ఇప్పటి వరకు 15 సీజన్‌లు ఆడిన చెన్నై జట్టు అందులో 10 సార్లు ఫైనల్‌కు చేరి ఐదుసార్లు ట్రోఫీ చేజిక్కించుకుంది. ఈ గణాంకాలు చాలు ఐపీఎల్‌లో చెన్నై జోరు ఏంటో చెప్పేందుకు. వికెట్ల వెనక ధోని మాయాజాలం... కాన్వే, రచిన్ రవీంద్ర బ్యాటింగ్ సామర్థ్యం... శివమ్ దూబే, రవీంద్ర జడేజా ఆల్‌రౌండ్ మెరుపులు, అశ్విన్, పతిరణ బౌలింగ్ నైపుణ్యం ఇలా అన్నీ విభాగాల్లో పటిష్టంగా ఉన్న చెన్నై సూపర్ కింగ్స్... ఆరో కప్పు వేటకు సిద్ధమైంది. -సాక్షి క్రీడావిభాగం



ధోని, రుతురాజ్

సాధారణ ఆటగాడు సైతం... అసాధారణ ప్రదర్శన చేయడం... అప్పటి వరకు జట్టులో చోటు దక్కడమే కష్టమనుకున్న ప్లేయర్ సైతం... 'ఎక్స్' ఫ్యాక్టర్‌గా మారడం... చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో నిత్యకృత్యం. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవడంలో చెన్నైని మించిన జట్టు లేదనడంలో అతిశయోక్తి లేదు. ఇప్పటి వరకు 5 సార్లు (2010, 2011, 2018, 2021, 2023) ఐపీఎల్ ట్రోఫీ చేజిక్కించుకున్న సూపర్ కింగ్స్ మరో 5 సార్లు (2008, 2012, 2013, 2015, 2019) రన్నరప్‌గా నిలిచింది. గతేడాదే రుతురాజ్ గైక్వాడ్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించిన ఫ్రాంచైజీ... అతడితో పాటు రవీంద్ర జడేజాకు రూ. 18 కోట్లు ఇచ్చి అట్టిపెట్టుకుంది. పతిరణను రూ. 13 కోట్లు, శివమ్ దూబేను రూ. 12 కోట్లు వెచ్చించి రిటైన్ చేసుకుంది. అంతర్జాతీయ మ్యాచ్ ఆడి ఐదేళ్లు దాటిపోయిన మహేంద్రసింగ్ ధోనిని రూ. 4 కోట్లకు కొనసాగించింది. వీరితో పాటు రచిన్ రవీంద్రను రూ. 4 కోట్లతో 'రైట్ టు మ్యాచ్' ద్వారా తిరిగి సొంతం చేసుకుంది. ఇక సుదీర్ఘ కాలం తర్వాత రవిచంద్రన్ అశ్విన్‌ను తిరిగి కొనుగోలు చేసుకుంది. మరి గత కొంత కాలంగా నిలకడగా రాణించలేకపోతున్న సూపర్ కింగ్స్ ఈసారి ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

తలా... అన్నీ తానై!

అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అనంతరం కేవలం ఐపీఎల్ మాత్రమే ఆడుతున్న ధోని... ఈసారి కూడా జట్టును ముందుండి నడిపించనున్నాడు. పేరుకు రుతురాజ్ కెప్టెన్ అయినా... వికెట్ల వెనక నుంచి టీమ్‌కు దిశానిర్దేశం చేసేది ధోనినే అనడంలో సందేహం లేదు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడుతున్న ధోనీ గతేడాది బ్యాటింగ్ ఆర్డర్‌లో మరీ కింది స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. మరి ఈసారైనా అతని బ్యాట్ నుంచి మెరుపులు వస్తాయోమో చూడాలి. బ్యాటింగ్‌లో కాన్వే, రచిన్, దూబే, రుతురాజ్, జడేజా, ధోని కీలకం కానుండగా... పతిరణ, అశ్విన్, ఖలీల్ అహ్మద్, స్యామ్ కరన్ బౌలింగ్ బాధ్యతలు మోయనున్నారు. రచిన్, జడేజా, దూబే, దీపక్ హుడా, విజయ్ శంకర్, అశ్విన్, జేమీ ఓవర్టన్, సామ్ కరన్ ఇలా లెక్కకు మిక్కిలి ఆల్‌రౌండర్లు ఉండటం చెన్నైకి అదనపు బలం. ఆంధ్ర ఆటగాడు షేక్ రషీద్ జట్టులో ఉన్నా... అతడికి మ్యాచ్ ఆడే అవకాశం దక్కుతుందో లేదో వేచి చూడాలి.

చెన్నై జట్టు: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), మహేంద్రసింగ్ ధోని, కాన్వే, రాహుల్ త్రిపాఠి, షేక్ రషీద్, వన్ష్ బేడీ, సిద్ధార్థ్, రచిన్ రవీంద్ర, రవిచంద్రన్ అశ్విన్, విజయ్ శంకర్, స్యామ్ కరన్, అన్షుల్ కంబోజ్, దీపక్ హుడా, జేమీ ఓవర్టన్, కమలేశ్ నాగర్‌కోటి, రామకృష్ణ ఘోష్, రవీంద్ర జడేజా, శివమ్ దూబే, ఖలీల్ అహ్మద్, నూర్ అహ్మద్, ముకేశ్, గుర్‌జప్నీత్ సింగ్, నాథన్ ఎలీస్, శ్రేయస్ గోపాల్, పతిరణ.

అంచనా: ఐపీఎల్‌లో మిగిలిన జట్లతో పోల్చుకుంటే అత్యధిక మంది ఆల్‌రౌండర్లు అందుబాటులో ఉన్న చెన్నై స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే ఫైనల్ చేరడం పెద్ద కష్టం కాకపోవచ్చు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఈ తరం వాళ్లు కూడా చూడాలి


- నాగ్ అశ్విన్



''ఎవడే సుబ్రహ్మణ్యం' నాకు, విజయ్ దేవరకొండకి తొలి చిత్రం. స్వప్న, ప్రియాంక కూడా అప్పుడప్పుడే ఇండస్ట్రీకి వచ్చారు. నాని ఇంత మ్యాసీవ్ అవ్వలేదు. 2015 మార్చి 21న విడుదలైన మా సినిమా హిట్ అయింది. కానీ, ఇప్పుడు రిలీజ్ అయితే వచ్చేంత రీచ్ అప్పుడు వచ్చిందనుకోవడం లేదు. ఈ జనరేషన్ వాళ్లు కూడా ఈ సినిమాని చూసి ఎంతో కొంత లబ్ధి పొందుతారనే ఆలోచన అప్పటి నుంచే ఉండేది. ఎందుకంటే అప్పటికీ ఇప్పటికీ ప్రపంచమేం మారలేదు'' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ తెలిపారు. నాని హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎవడే సుబ్రహ్మణ్యం'. విజయ్ దేవరకొండ, రీతూ వర్మ, మాళవికా నాయర్ కీలక పాత్రలు పోషించారు. స్వప్నా దత్, ప్రియాంకా దత్ నిర్మించిన ఈ సినిమా విడుదలై (2015 మార్చి 21) పదేళ్లవుతోంది. పదేళ్ల సెలబ్రేషన్స్‌లో భాగంగా ఈ నెల 21న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. మంగళవారం ప్రెస్‌మీట్‌లో నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ''ఎవడే సుబ్రహ్మణ్యం' ఒక లవ్, అటాచ్‌మెంట్ ఉన్న అరుదైన సినిమా. పదేళ్లకు ముందు ఎంత రిలవెంట్‌గా ఉండేదో ఇప్పటికీ ఈ సినిమా అంతే రిలవెంట్‌గా ఉంటుందని భావిస్తున్నాను. ఇండస్ట్రీలో నాకు లవ్, అటాచ్‌మెంట్ ఉన్న మూడు నాలుగు సినిమాల్లో 'ఎవడే సుబ్రహ్మణ్యం' కూడా ఒకటి. ఈ మూవీకి సీక్వెల్ చేయలేం. కానీ ప్రీక్వెల్ రాయొచ్చు. 'ఎవడే సుబ్రహ్మణ్యం, మహానటి, కల్కి 2898 ఏడీ' సినిమాల్లో 'మహానటి' నాకు చాలా సంతృప్తి ఇచ్చింది. 'కల్కి 2' సినిమాని ఈ ఏడాది ఆఖరులో స్టార్ట్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు.

కూలీ కంప్లీట్

'కూలీ' సినిమా షూటింగ్ పూర్తయింది. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కూలీ'. ఈ చిత్రంలో నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతీహాసన్, షౌబిన్ షాహిర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఓ గెస్ట్ రోల్‌లో ఆమిర్ ఖాన్, స్పెషల్ సాంగ్‌లో పూజా హెగ్డే నటించారు. సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మించింది. కాగా ఈ సినిమా చిత్రీకరణ ముగిసిన విషయాన్ని 'ఎక్స్' వేదికగా ధృవీకరించారు మేకర్స్. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ మొదలయ్యాయి. ఈ చిత్రాన్ని ఈ ఏడాది దీపావళి సందర్భంగా రిలీజ్ చేయాలని అనుకుంటున్నారట. మరోవైపు రజనీకాంత్ హీరోగా 'జైలర్ 2' సినిమా షూటింగ్ ఇటీవల ప్రారంభమైన విషయం తెలిసిందే.



రజనీకాంత్



బాలకృష్ణ

హీరో బాలకృష్ణ కెరీర్‌లోని విజయవంతమైన చిత్రాల్లో 'ఆదిత్య 369' ఒకటి. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన సైన్స్ ఫిక్షన్ సినిమా ఇది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం 1991లో విడుదలై హిట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న రీ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''ఆదిత్య 369' చిత్రాన్ని 4కేలో డిజిటలైజ్ చేశాం. సౌండ్‌ని కూడా 5.1 క్వాలిటీలోకి మార్చాం.

ఏప్రిల్‌లో ఆదిత్య 369

34 ఏళ్ల క్రితం విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల్లో ఇప్పటికీ ఎంతో క్రేజ్ ఉంది. ఇప్పటి ట్రెండ్‌కి కూడా కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఈ చిత్రాన్ని నేను నిర్మించడానికి ఎంతో సహకరించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారికి రుణపడి ఉంటాను. ఈ మూవీని రీ రిలీజ్ చేస్తున్నామని చెప్పగానే బాలకృష్ణ, సింగీతం శ్రీనివాసరావుగార్లు ఎగ్జయిట్ అయ్యారు. ఇళయరాజాగారి సంగీతం, జంధ్యాలగారి మాటలు, పీసీ శ్రీరామ్, వీఎస్‌ఆర్ స్వామి, కబీర్ లాల్ ఛాయాగ్రహణం ఈ సినిమాని ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేశాయి. ఇప్పటి వరకు 15 సినిమాలు నిర్మించినప్పటికీ నాకు మంచి గుర్తింపుని, మా శ్రీదేవి మూవీస్ పేరును చరిత్రలో నిలిచిపోయేలా చేసిన చిత్రం 'ఆదిత్య 369'' అన్నారు.

మళ్లీ వచ్చార్రోయ్



'మ్యాడ్ స్క్వేర్' పోస్టర్

సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ హీరోలుగా నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రియాంకా జవాల్కర్, మురళీధర్ గౌడ్, డైరెక్టర్ కేవీ అనుదీప్ కీలక పాత్రలు పోషించారు. హీరోయిన్ రెబా మోనికా జాన్ ప్రత్యేక గీతంలో సందడి చేయనున్నారు. బ్లాక్‌బస్టర్ మూవీ 'మ్యాడ్'కి (2023) సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' రూపొందింది. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ చిత్రం నుంచి 'వచ్చార్రోయ్...' అంటూ సాగే మూడో పాటని విడుదల చేశారు. ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరచి, ఆలపించారు. కేవీ అనుదీప్ సాహిత్యం అందించారు. 'హే వచ్చార్రోయ్.. మళ్లీ వచ్చార్రోయ్... వీళ్లకి హారతి పట్టండ్రో, దారిలో బరాత్ కొట్టండ్రో...' అంటూ ఈ పాట సాగుతుంది. ''మ్యాడ్ స్క్వేర్' నుంచి ఇప్పటికే విడుదలైన 'లడ్డు గాని పెళ్లి', 'స్వాతి రెడ్డి' పాటల్లాగానే 'వచ్చార్రోయ్'కి కూడా అద్భుతమైన స్పందన వచ్చింది. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ త్రయం 'మ్యాడ్'కి మించి 'మ్యాడ్ స్క్వేర్'లో అల్లరి చేయబోతున్నారు'' అని చిత్ర బృందం పేర్కొంది.

మిస్టరీ... థ్రిల్



సుశాంత్

సుశాంత్ అనుమోలు హీరోగా పృథ్వీరాజ్ చిట్టేటి దర్శకత్వంలో ఓ సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. వరుణ్ కుమార్, రాజ్ కుమార్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మంగళవారం (మార్చి 18) సుశాంత్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మూవీ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రెండు విభిన్నమైన లుక్స్‌లో కనిపిస్తున్నారు సుశాంత్. ''తెలుగులో ఇదో కొత్త తరహా చిత్రం. ఇందులో ఎక్సార్సిస్ట్ (భూత వైద్యుడు)గా కనిపిస్తారు సుశాంత్. ఈ పాత్ర కోసం సుశాంత్ సరి కొత్తగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమాకి అనిరుధ్ కృష్ణమూర్తి స్క్రీన్‌ప్లే రాయడంతో పాటు పృథ్వీరాజ్ చిట్టేటితో కలిసి డైలాగ్స్ అందిస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: వైవీబీ శివసాగర్.

థియేటర్స్‌లో చూడాల్సిన చిత్రం ఇది

- సంతోష్ కల్వచెర్ల



జేమ్స్ వాట్ కొమ్ము, సంతోష్, సోనియా, క్రిషేకా, రతన్ రిషి

సంతోష్ కల్వచెర్ల, క్రిషేకా పటేల్ జంటగా నటించిన రొమాంటిక్ థ్రిల్లర్ మూవీ 'కిల్లర్ ఆర్టిస్ట్'. రతన్ రిషి దర్శకత్వంలో ఎస్‌జేకే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై జేమ్స్ వాట్ కొమ్ము నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. నైజాం ఏరియాలో ఈ సినిమాను మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ కల్వచెర్ల మాట్లాడుతూ– ''కిల్లర్ ఆర్టిస్ట్' థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా... ఓటీటీలో చూడాల్సినది కాదు. సురేష్ బొబ్బిలి అన్న తన మ్యూజిక్‌తో ఈ సినిమాకు ప్రాణం పోశారు. ఈ సినిమా సక్సెస్‌పై నమ్మకంతో ఉన్నాం'' అన్నారు. ''హత్య చేయడాన్ని కళగా భావించే ఓ వ్యక్తి కథ ఇది. ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌తో మొదలై, రొమాంటిక్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా టర్న్ తీసుకుంటుంది. మన సమాజంలో జరుగుతున్న ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా కథ రాసుకున్నాం. ఈ మర్డర్స్ చేస్తున్నది ఒకరా? లేక ఇద్దరా? అనే పాయింట్ ఆసక్తికరంగా ఉంటుంది. సెన్సార్ వారి సూచన మేరకు 'ఆర్టిస్ట్' టైటిల్‌ని 'కిల్లర్ ఆర్టిస్ట్'గా మార్చాం'' అని చెప్పారు రతన్ రిషి. ''ఆడియన్స్ సరికొత్త రొమాంటిక్ థ్రిల్లర్ సినిమా చూస్తారు. ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమానూ సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాం'' అని పేర్కొన్నారు జేమ్స్ వాట్.

నాన్నా మళ్లీ రావా...




సత్యప్రకాశ్, శిరీష

సత్యప్రకాశ్, ప్రభావతి, రిత్విక్, హారిక, శిరీష లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'నాన్నా మళ్లీ రావా..!'. నిర్దేశ్ దర్శకత్వంలో డా. ఉమారావు నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా ప్రివ్యూను ప్రదర్శించగా, వీక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా సత్యప్రకాశ్ మాట్లాడుతూ– ''ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు గ్లిజరిన్ పెట్టుకోకుండానే ప్రతి రోజూ లొకేషన్స్‌లో కన్నీళ్లు వచ్చేవి. ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తుంటాయి. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రంగా ఈ సినిమాను దర్శకుడు తీశాడు'' అని తెలిపారు. ''నాన్నంటే ప్రతి ఒక్కరికీ చెప్పుకోలేనంత భావోద్వేగం ఉంది. సినిమా ప్రివ్యూను చూసిన వీక్షకుల స్పందనను బట్టి ఓ మంచి సినిమా చేశామనే నమ్మకం కలిగింది'' అన్నారు నిర్దేష్. ''ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు నిజ జీవితంలో నాన్న పాత్ర ఎంత విలువైందో తెలిసింది'' అన్నారు రిత్విక్. ''సెన్సార్ పూర్తి కాగానే విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని తెలిపారు ఉమారావు.

కొత్త తెలుగు సినిమా చూడబోతున్నారు

- సుప్రీత్ సి. కృష్ణ



శాన్వీ, రాహుల్, సుప్రీత్, నిహాల్

హర్ష రోషన్, కార్తికేయ, స్టీవెన్ మధు, శాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ప్రధాన తారలుగా నటించిన చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ సి. కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిహాల్ కోదాటి మాట్లాడుతూ– ''ఇలాంటి చిన్న సినిమాకు ఆడియన్స్ సపోర్ట్ కావాలి. ఈ తరహా సినిమాలు విజయం సాధిస్తే కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలు చాలా వస్తాయి'' అన్నారు. ''ఈ నెల 21న ఓ కొత్త సినిమాను ఆడియన్స్ చూడబోతున్నారు. ఈ సినిమాలో హర్ష రోషన్ మంచి రోల్ చేశాడు. తప్పకుండా 'కోర్ట్' (ఈ మూవీలో హర్ష ఓ కీలక పాత్ర చేశాడు) సినిమా సక్సెస్ ఈ సినిమాపైనా రిఫ్లెక్ట్ అవుతుందని ఆశిస్తున్నా'' అని చెప్పారు సుప్రీత్ సి. కృష్ణ ''ఫ్యాంటసీ థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన ఈ మూవీ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుందనే నమ్మకం ఉంది'' అని తెలిపారు రాహుల్ రెడ్డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,131	75,301
నిఫ్టీ ▲	326	22,834

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	17,498	▼	312
డోజోన్స్	41,529	▼	312
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,705	▲	25
డాక్స్	23,381	▲	226
షాంఘై	3,430	▲	4
నికాయ్	37,845	▲	449

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	88,354	▲	253
బంగారం (99.5 స్వచ్ఛత)	88,000	▲	252
వెండి (కిలో)	1,00,400	▲	633

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	86.50	87.52
£	బ్రిటన్ పౌండ్	111.10	113.98
€	యూరో	93.33	96.00
¥	జపాన్ ఎన్ (100)	57.79	59.27
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.92	56.17
S$	సింగపూర్ డాలర్	62.84	67.52
SAR	సౌదీ రియాల్	22.25	23.80
UAE D	యూఏఈ దిర్హామ్	22.74	24.52
¥	చైనా యువాన్	11.12	12.95

ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ

హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటాపై కన్ను

- ఈ నెలాఖరులోగా చర్చల వివరాలు వెల్లడి



ముంబై: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) ఆరోగ్య బీమాలోకి ప్రవేశిస్తోంది. ఇందుకు వీలుగా స్టాండెలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటా కొనుగోలు చేయనున్నట్లు ఎల్ఐసీ సీఈవో సిద్ధార్థ మొహంతీ పేర్కొన్నారు. రానున్న రెండు వారాల్లోగా డీల్ కుదుర్చుకోనున్నట్లు తెలియజేశారు. చర్చలు తుది దశకు చేరడంతో మార్చి 31కల్లా వివరాలు వెల్లడికానున్నట్లు తెలియజేశారు. ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ ప్రవేశించడం సాధారణ అంశమేనని ఇక్కడ జరిగిన జీసీఏ25 వేడుక సందర్భంగా పేర్కొన్నారు. అయితే లక్షిత కంపెనీలో నియంత్రిత లేదా 51 శాతం లేదా అంతకుమించిన వాటా కొనుగోలు చేయబోమన్నారు. ఎంత వాటా సొంతం చేసుకునేదీ టార్గెట్ కంపెనీ విలువ, ఎల్ఐసీ బోర్డు నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని తెలియజేశారు. ప్రస్తుతం జీవిత బీమా కంపెనీలను ఆసుపత్రి ఖర్చులు, ఇతర వ్యయాలను కవర్ చేసే ఆరోగ్య బీమా పాలసీలు ఆఫర్ చేసేందుకు అనుమతించని కారణంగా ఎల్ఐసీ వాటా కొనుగోలుకి ప్రాధాన్యత ఏర్పడింది. అయితే బీమా కంపెనీలకు కాంపోజిట్ లైసెన్స్‌ను జారీ చేయాలన్న ప్రతిపాదన లున్నప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ ఈ అంశంపై ఎలాంటి ప్రస్తావన తీసుకురాని సంగతి తెలిసిందే.

మణిపాల్‌సిగ్నా కొనుగోలు?

హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ మణిపాల్‌సిగ్నాలో వాటా కొనుగోలుకి ఎల్ఐసీ చర్చలు నిర్వహిస్తున్నట్లు కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. రూ. 4,000 కోట్ల విలువలో డీల్ కుదుర్చుకోనున్నట్లు అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో ఎల్ఐసీ స్టాండెలోన్ ఆరోగ్య బీమా కంపెనీలో ప్రస్తావించదగ్గ స్థాయిలో వాటా కొనుగోలుకి చర్చలు చేపట్టినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. అయితే ఎలాంటి ఒప్పందమూ కుదుర్చుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకు బోర్డు నిర్ణయాలుసహా వివిధ అంశాలు ప్రభావం చూపనున్నట్లు తెలిపింది.

100 ఏళ్ల ప్రభుత్వ బాండ్లు కావాలి..

దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్ల(జీసెక్‌లు) జారీకి అనుమతించమంటూ జీవిత బీమా పీఎస్‌యూ ఎల్ఐసీ ఆర్‌బీఐని కోరింది. 100 ఏళ్ల కాలపరిమితిగల బాండ్ల జారీకి విజ్ఞప్తి చేసింది. తద్వారా దీర్ఘకాలిక బాండ్లలో పెట్టుబడి అవకాశాలకు వీలుంటుందని ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతీ పేర్కొన్నారు. 20–30 ఏళ్ల బాండ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఆర్‌బీఐ 40 ఏళ్ల కాలపరిమితికీ అనుమతిస్తున్నట్లు తెలియజేశారు. ఈ బాటలో 50 ఏళ్లు, 100 ఏళ్ల బాండ్లనూ అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఈ అంశంపై ఆర్‌బీఐతో ఎప్పటికప్పుడు చర్చలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంశాన్ని ఆర్‌బీఐ పరిశీలిస్తున్నట్లు తెలియజేశారు. ప్రపంచ మార్కెట్లలో పలు దేశాలు 100 ఏళ్ల గడువుతో బాండ్ల జారీని చేపడుతున్నట్లు ప్రస్తావించారు. సెకండరీ మార్కెట్‌లో పరిమిత డిమాండ్, తక్కువ లిక్విడిటీ కారణంగా భారత్‌సైతం ఈ తరహా బాండ్లకు తెరతీయవలసి ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. జీసెక్‌లలో ఎల్ఐసీ భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తెలియజేశారు.

రూ.91,000 దాటిన బంగారం

- 10 గ్రాములకు రూ.500 ప్లస్
- ఢిల్లీలో రూ.91,250కు చేరిక
- అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ 3,047 డాలర్లు; 40 డాలర్లు జంప్



న్యూఢిల్లీ: పసిడి మరో కొత్త గరిష్టాన్ని తాకింది. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.500 లాభపడడంతో రూ.91,250 స్థాయికి చేరింది. అంతకుముందు రోజు సైతం బంగారం రూ.1,300 ర్యాలీ చేయడం తెలిసిందే. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.450 లాభపడి రూ.90,800 స్థాయికి చేరింది. ''అంతర్జాతీయ మార్కెట్‌తోపాటు దేశీ మార్కెట్లోనూ బంగారం రికార్డు నూతన గరిష్టాలను తాకింది. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలపై నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో సురక్షిత సాధనంగా బంగారం ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఇటీవలి అమెరికా ఆర్థిక గణాంకాలు సైతం యూఎస్ ఫెడ్ ఈ ఏడాది ఒకటి కంటే ఎక్కువ సార్లు వడ్డీ రేట్లను తగ్గించొచ్చన్న అంచనాలను పెంచినట్టు చెప్పారు. ఇది కూడా బంగారానికి మద్దతునిచ్చేదిగా పేర్కొన్నారు. మరో వైపు ఢిల్లీ మార్కెట్లో వెండి కిలో ధర ఫ్లాట్‌గా రూ.1,02,500 వద్ద ట్రేడ్ అయింది. ఎంసీఎక్స్ మార్కెట్లో బంగారం ఫ్యూచర్స్ కాంట్రాక్టు (10 గ్రాములు) రూ.649 లాభపడి రూ.88,672కు చేరుకుంది. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్ మార్కెట్లో పసిడి ఔన్స్‌కు 40 డాలర్లు లాభపడి 3,047 డాలర్ల నూతన గరిష్టాలకు చేరుకుంది. అమెరికాలో మాంద్యం రావొచ్చన్న అంచనాల నేపథ్యంలో బంగారం రికార్డు గరిష్టాలకు చేరినట్టు అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు.

ఆల్ఫాబెట్ చేతికి విజ్

32 బిలియన్ డాలర్ల డీల్



న్యూయార్క్: టెక్ దిగ్గజం గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ తాజాగా సైబర్‌సెక్యూరిటీ స్టార్టప్ సంస్థ విజ్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకోసం 32 బిలియన్ డాలర్లు వెచ్చించనుంది. క్లౌడ్ కంప్యూటింగ్ మార్కెట్లో అమెజాన్, మైక్రోసాఫ్ట్‌తో పోటీపడేందుకు గూగుల్‌కి ఇది తోడ్పడనుంది. విజ్ నాలుగేళ్ల క్రితం ప్రారంభమైంది. డేటా సెంటర్లలో నిక్షిప్తమైన సమాచారం, చోరీకి గురి కాకుండా ఉపయోగపడే సెక్యూరిటీ సాధనాలను రూపొందిస్తోంది. 2025లో ఇప్పటివరకు, అలాగే గూగుల్ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఒప్పందం కావడం కావడం గమనార్హం. క్లౌడ్ సెక్యూరిటీ విభాగాన్ని పటిష్టం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తెలిపారు.

సెన్సెక్స్ 1,131 పాయింట్లు ర్యాలీ

- సానుకూల జాతీయ, అంతర్జాతీయ సంకేతాల ప్రభావం
- 2 రోజుల్లో రూ.8.67 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద



ముంబై: జాతీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాల ప్రభావంతో మంగళవారం దేశీయ స్టాక్ సూచీలు ఒకటిన్నర శాతం ర్యాలీ చేశాయి. అమెరికా కరెన్సీ డాలర్ బలహీనత, క్రూడాయిల్ ధరలు దిగిరావడం వంటి అంశాలూ కలిసొచ్చాయి. అధిక వెయిటేజీ ఐసీఐసీఐ బ్యాంకు(3%), ఎల్అండ్‌టీ(3%), ఎంఅండ్ఎం(3%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 1,131 పాయింట్లు పెరిగి 75వేల స్థాయి పైన 75,301 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 326 పాయింట్లు బలపడి 22,834 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా రెండోరోజూ లాభాల ముగింపు. అలాగే ఫిబ్రవరి 4న తర్వాత సూచీలకిదే అతిపెద్ద ర్యాలీ.

→ సూచీల వారీగా అత్యధికంగా రియల్టీ ఇండెక్స్ 3% పెరిగింది. ఇండస్ట్రియల్స్ 2.75%, క్యాపిటల్ గూడ్స్ (2.5%), ఆటో, విద్యుత్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్ ఇండెక్సులు 2% లాభపడ్డాయి. అలాగే బీఎస్ఈ స్మాల్, మిడ్ సూచీలు వరుసగా 2.7%, 2.1 శాతం చొప్పున పెరిగాయి.

→ రెండు రోజుల వరుస లాభాలతో స్టాక్ మార్కెట్లో రూ.8.67 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.399 లక్షల కోట్లకు చేరుకుంది.

→ మార్కెట్ ర్యాలీలో భాగంగా ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేరు రికార్డు కనిష్టం(రూ.46.32) నుంచి బౌన్స్‌బ్యాక్ అయ్యింది. మార్కెట్ ముగిసే సరికి 12.50% పెరిగి రూ.52.80 వద్ద స్థిరపడింది.

→ డాలర్ మారకంలో రూపాయి విలువ మూడోరోజూ బలపడింది. 25 పైసలు పెరిగి 86.56 వద్ద ముగిసింది. అమెరికా కరెన్సీ డాలర్ బలహీనత, ఈక్విటీ మార్కెట్ ర్యాలీ దేశీయ కరెన్సీకి దన్నుగా నిలిచాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..	
దివ్యాంగులకు కంపెనీల రెడ్ కార్పెట్	పెరగనున్న బెంజ్, కియా కార్ల ధరలు

అయిదు నిమిషాల్లోనే వాహనాలకు చార్జింగ్!

- అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ సిస్టంను ఆవిష్కరించిన బీవైడీ
- చైనాలో 4,000 స్టేషన్ల ఏర్పాటు యోచన



బ్యాంకాక్: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడానికి పెద్ద అవరోధంగా ఉంటున్న చార్జింగ్ సమస్యను పరిష్కరించే దిశగా చైనా దిగ్గజం బీవైడీ తాజాగా ఫ్లాష్ చార్జర్లను రూపొందించింది. దాదాపు బంకులో పెట్రోల్ పోయించుకోవడానికి పట్టేంత వ్యవధిలోనే అత్యంత వేగంగా చార్జింగ్ పూర్తయ్యేలా అల్ట్రాఫాస్ట్ ఈవీ చార్జింగ్ సిస్టంను ఆవిష్కరించినట్లు కంపెనీ వెల్లడించింది. దీనితో అయిదు నుంచి ఎనిమిది నిమిషాల్లోనే వాహనం పూర్తిగా చార్జ్ అవుతుందని పేర్కొంది. చైనావ్యాప్తంగా 4,000 పైగా చార్జింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్లు బీవైడీ వివరించింది. చార్జింగ్ మౌలిక సదుపాయాలు అంతగా లేకపోవడం, చార్జ్ చేసేందుకు చాలా సమయం పట్టేస్తుండటం, రేంజి (మైలేజీ) పరిమిత స్థాయిలోనే ఉండటం వంటి అంశాలే ఈవీల వినియోగానికి సవాళ్లుగా ఉంటున్న నేపథ్యంలో బీవైడీ ఫాస్ట్ చార్జర్లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమ 1 మెగావాట్ ఫ్లాష్ చార్జర్లు 5 నిమిషాల్లోనే 400 కి.మీ. సరిపడేంత చార్జింగ్‌ను అందిస్తాయని బీవైడీ పేర్కొంది. బీవైడీ ఉపయోగించే బ్లేడ్ లిథియం–అయాన్ ఫాస్ఫేట్ బ్యాటరీలు ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన, సమర్థవంతమైన బ్యాటరీలని, పోటీ సంస్థ టెస్లా కూడా కొన్ని మోడల్స్‌లో వీటిని ఉపయోగిస్తోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. బీవైడీ గతేడాది 17,77,965 ఈవీల విక్రయాలతో టెస్లాను (17,73,443 యూనిట్లు) అధిగమించింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

జాబ్ పాయింట్



ఏపీ డీఎంఈలో 1183 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లోని వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1183.
» **అర్హత:** మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(ఎండీ /ఎంఎస్ /ఎంసీహెచ్ /డీఎం/ఎండీఎస్) ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 44 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.97,750 ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.03. 202 5.
» **వెబ్‌సైట్:** https://dme.ap.nic.in/

ఏపీఎస్ఎఫ్‌సీ, విజయవాడలో 30 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎఫ్‌సీ).. ఒప్పంద ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ డివిజన్ ఆఫీస్‌లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
» **విభాగాల వారీగా ఖాళీలు:** ఫైనాన్స్–15, టెక్నికల్–08, లీగల్–07.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ /సీఎంఏ/ఎంబీఏ /పీజీడీఎం(ఫైనాన్స్), బీటెక్, లా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్(ఎంఎస్ ఆఫీస్) పరిజ్ఞానం, ఉద్యోగానుభవం ఉండాలి. ఇంగ్లిష్, తెలుగులో రాయడం, మాట్లాడటం వచ్చి ఉండాలి. ఆంధ్రప్రదేశ్ లోకల్ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
» **వేతనం:** నెలకు రూ.35,000.
» **వయసు:** 31.01.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.04.2025.
» **పరీక్ష తేది:** మే నెలలో
» **వెబ్‌సైట్:** https://esfc.ap.gov.in/

బీఈఎల్, బెంగళూరులో 57 ఉద్యోగాలు


టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 57.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీసీఏ, బీఈడీ, బీఎస్సీ, డిప్లొమా, బీ.ఎల్.ఐబీ, సీఏ, ఐసీడబ్ల్యూఏ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది సెక్రటరీ, బీఈఈఐ బెల్ హైస్కూల్ బిల్డింగ్, జలహళ్లి పోస్ట్, బెంగళూరు–560013 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 01.04.2025.
» **వెబ్‌సైట్:** https://bel-india.in/

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్ట్స్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

విదేశీ విద్యకు.. స్కాలర్‌షిప్స్ ఊతం!

» ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్న ఉపకార వేతనాలు
» అకడమిక్ రికార్డ్, ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్స్



బీఏ, బీకాం మొదలు బీటెక్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల వరకూ.. నేడు ఎక్కువ మంది భారతీయ విద్యార్థుల లక్ష్యం.. విదేశాల్లో ఉన్నత విద్య! ఫారిన్ వర్సిటీల్లో చదువు పూర్తి చేసుకుని.. అంతర్జాతీయ అవకాశాలు అందుకోవాలనే అభి లాష!! కాని రూ.లక్షల్లో ఫీజులు, ఇతర భారీ వ్యయాల కారణంగా విదేశీ విద్య అవకాశాలు వచ్చినా ఎంతో మంది వదులుకుంటున్న వైనం. ఇలాంటి వారికి ఆర్థిక భారం నుంచి ఉపశమనం కల్పిస్తున్నాయి.. స్కాలర్‌షిప్స్! విదేశీ యూనివర్సిటీల్లో స్ప్రింగ్ సీజన్ అడ్మిషన్‌ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో.. స్టడీ అబ్రాడ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన స్కాలర్‌షిప్‌ల వివరాలు..

ఫుల్‌బ్రైట్ స్కాలర్స్‌షిప్స్

మన దేశ విద్యార్థులు తొలి గమ్యంగా భావించే అమెరికాలోని యూనివర్సిటీల్లో చేరే వారికి ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్స్ అందుబాటులో ఉన్నాయి. ఆర్ట్స్, ఎకనామిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/స్టడీస్, హయ్యర్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్నేషనల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ హెల్త్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ఉమెన్స్ స్టడీస్/జండర్ స్టడీస్ తదితర విభాగాల్లో పీజీ, ఆపై స్థాయి కోర్సుల్లో చేరిన వారు ఈ స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఎంపికైన వారికి కోర్సు వ్యవధిలో ఒకసారి స్వదేశానికి వచ్చి వెళ్లేందుకు విమాన ఛార్జీలు, నివాస ఖర్చులు, ట్యూషన్ ఫీజు ఫండింగ్ వంటివి లభిస్తాయి.

» **వివరాలకు వెబ్‌సైట్:** www.usief.org.in/Fullbright-Nehru-Fellowships. aspx

క్వాడ్ ఫెలోషిప్ ఫర్ స్టెమ్ కోర్సెస్

క్వాడ్ దేశాల కూటమి ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ సదుపాయం ఇది. క్వాడ్ కూటమిలోని ఆస్ట్రేలియా, భారత్, జపాన్, అమెరికా దేశాలకు చెందిన వంద మంది విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్స్ అందిస్తారు. అమెరికాలోని యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాలకు సంబంధించి పీజీ కోర్సులు చేసే వారు ఈ క్వాడ్ ఫెలోషిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారికి రూ.50 వేల డాలర్ల ఏక మొత్తం ఆర్థిక సహాయం లభిస్తుంది. నీడ్ బేస్డ్ విధానంలో కోర్సులు పూర్తి చేసుకునేందుకు అయ్యే వ్యయంలో భాగంగా మరో 25 వేల డాలర్లు అందిస్తారు. దీని కోసం అభ్యర్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

» **వివరాలకు వెబ్‌సైట్:** https://www.quadfellowship. org/

నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ ఫర్ ఎస్సీ క్యాండిడేట్స్

దేశంలో ఎస్సీ కేటగిరీలకు చెందిన అల్పాదాయ వర్గాల విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం.. నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్. ఎస్సీ/ఎస్టీ, వ్యవసాయ కూలీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు, డినోటిఫైడ్, సంచార, పాక్షిక సంచార జాతులు, సంప్రదాయ కళాకారుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ లేదా పీజీ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, విదేశాల్లో పీజీ లేదా పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకుని ఉండాలి. ఇలా దరఖాస్తు చేసుకున్న వారికి 125 స్కాలర్‌షిప్స్ అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఎస్సీలకు–115, సంచార, పాక్షిక సంచార జాతుల వారికి–06, భూమిలేని వ్యవసాయ కూలీలకు, సంప్రదాయ కళాకారులకు–04 స్కాలర్‌షిప్స్‌ను కేటాయిస్తారు. ఎంపికైన వారికి పీజీ కోర్సులో చేరితే మూడేళ్ల పాటు, పీహెచ్‌డీ చేసే వారికి నాలుగేళ్ల కాలానికి స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేస్తారు. ట్యూషన్ ఫీజు, మెయింటనెన్స్ అలవెన్స్, అత్యవసర ఖర్చులు, వీసా ఫీజు, ఎక్విప్‌మెంట్ అలవెన్స్, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం తదితర ఖర్చుల కోసం ఈ స్కాలర్‌షిప్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తారు.

» **వెబ్‌సైట్:** https://nosmsje. gov.in

ఏడీబీ జపాన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

జపాన్‌లోని యూనివర్సిటీల్లో ప్రవేశం ఖరారు చేసుకున్న భారతీయ విద్యార్థులకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ పథకం.. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్–జపాన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్. ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇతర అభివృద్ధి సంబంధిత విభాగాల్లో ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఇవి లభిస్తాయి. ఎంపికైన వారికి పూర్తి స్థాయి ట్యూషన్ ఫీజు, హౌసింగ్ అలవెన్స్, బుక్స్ అలవెన్స్, ట్రావెల్ ఎక్స్‌పెన్సెస్ అందుతాయి. అభ్యర్థులు తాము ప్రవేశం ఖరారు చేసుకున్న యూనివర్సిటీలో అడ్మిషన్ తేదీ ప్రారంభానికి కనీసం ఆరు నెలల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

» **వివరాలకు వెబ్‌సైట్:** www.adb.org

టోఫెల్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

ప్రముఖ లాంగ్వేజ్ టెస్టింగ్ ఏజెన్సీ ఈటీఎస్ టోఫెల్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ అందిస్తోంది. ఏ దేశంలో ప్రవేశం ఖరారు చేసుకున్నా.. ఈ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్‌గా 80 శాతం పైగా మార్కులు, టోఫెల్‌లో సదరు యూనివర్సిటీ పేర్కొన్న స్కోర్ సాధించిన విద్యార్థులు అర్హులు.

» **వివరాలకు వెబ్‌సైట్:** https://www.ets.org/toefl/grants/

బ్రిటిష్ కౌన్సిల్ ఐఈఎల్‌టీఎస్ అవార్డ్స్

బ్రిటిష్ కౌన్సిల్.. ఐఈఎల్‌టీఎస్ స్కోర్ ఆధారంగా అందిస్తున్న స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ ఇది. ఐఈఎల్‌టీఎస్ జాయింట్ ఫండెడ్ రీసెర్చ్ ప్రోగ్రామ్ పేరుతో అందిస్తున్న ఈ స్కాలర్‌షిప్స్‌ను బ్రిటిష్ కౌన్సిల్, ఐడీపీ, ఐఈఎల్‌టీఎస్ ఆస్ట్రేలియా సహకారం అందిస్తాయి. ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు నిమిత్తం రూ.మూడు లక్షల స్కాలర్‌షిప్ లభిస్తుంది.

» **వివరాలకు వెబ్‌సైట్:** https://www.ielts.org/for-researchers/grants-and-awards

ఛార్లెస్ వాలెస్ ఇండియా ట్రస్ట్ స్కాలర్‌షిప్స్

యూకేలో పీజీ, ఆపై స్థాయి కోర్సుల అభ్యర్థులకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ ఇది. విద్యార్థులకు ఎంపిక చేసుకున్న కోర్సు మేరకు ఏడాదికి గరిష్టంగా 1400 పౌండ్ల స్కాలర్‌షిప్ లభిస్తుంది.

» **వివరాలకు వెబ్‌సైట్:** https:// www. britishcouncil.in/ study-uk/scholarships/ charles-wallace-india-trust-scholarships

డీఏఏడీ స్కాలర్‌షిప్స్

జర్మనీలో ఇంజనీరింగ్, సైన్స్ రంగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టోరల్, పోస్ట్ డాక్టోరల్ స్టడీస్ అభ్యర్థులకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ పథకం ఇది. దీన్ని జర్మన్ అకడమిక్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ మేరకు అందిస్తారు. ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు, నివాస ఖర్చుల మొత్తానికి స్కాలర్‌షి ప్ లభిస్తుంది.

» **వివరాలకు వెబ్‌సైట్:** https://www. daad.in/en/

ఎరాస్మస్ ముండస్

యూరోపియన్ యూనియన్ దేశాల్లో పీజీ, పీహెచ్‌డీలో చేరాలనుకునే వారికి అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్.. ఎరాస్మస్‌ముండస్. ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు, నివాస వసతి, మెడికల్ అలవెన్స్, ఇన్సూరెన్స్ తదితర ఖర్చుల మొత్తానికి సరిపడే విధంగా ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుంది.

» **వివరాలకు వెబ్‌సైట్:** eacea. europa.eu/ erasmus_mundus/funding/

కామన్వెల్త్ స్కాలర్‌షిప్స్ - యూకే

కేంద్ర ప్రభుత్వ పరిధిలో అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ పథకం ఇది. కామన్వెల్త్ సభ్య దేశాల్లో చదవాలనుకునే వారు ఈ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవచ్చు. మాస్టర్స్ స్థాయిలో ఒక ఏడాది, పీహెచ్‌డీ స్థాయిలో మూడేళ్లు స్కాలర్‌షిప్ లభిస్తుంది. అర్హులైన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు, నివాస వ్యయాలకు సరిపడ మొత్తంలో ఆర్థిక తోడ్పాటు లభిస్తుంది.

» **వివరాలకు వెబ్‌సైట్:** mhrd. gov.in/ scholarships

స్టడీ అబ్రాడ్ స్కాలర్‌షిప్.. నిబంధనలు:

» అకడమిక్ అర్హతల సర్టిఫికెట్లు తప్పనిసరి.
» అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్ ఉండాలి.
» అధికారిక టెస్ట్(టోఫెల్, జీఆర్ఈ, ఐఈఎల్‌టీఎస్, జీమ్యాట్, శాట్ తదితర) స్కోర్లు.
» అడ్మిషన్ పొందిన యూనివర్సిటీ నుంచి రిఫరెన్స్ లెటర్.
» స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్.
» యూనివర్సిటీలు అందించే స్కాలర్‌షిప్‌లకైతే ప్రతి సెమిస్టర్‌లో నిర్దిష్ట జీపీఏ లేదా పర్సంటేజ్‌తో ఉత్తీర్ణత తప్పనిసరి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్

జస్ట్ రూ.50 కోట్లు!!



మనకు జస్ట్ కాకపోవచ్చు కానీ బెంగళూరుకు చెందిన ప్రముఖ డాగ్ బ్రీడర్ ఎస్.సతీశ్ మాత్రం జస్ట్ రూ.50 కోట్లేగా అని అనుకున్నారు. వెంటనే డబ్బులిచ్చేసి.. కొనేశారు.



దీని పేరు చెప్పలేదు కదూ.. ఒకామి.. వినడానికి చైనా, జపానోళ్ల పేరులాగా ఉంది గానీ.. ఇది పుట్టింది మాత్రం అమెరికాలో.. తోడేలు, కాకేషన్ షెపర్డ్ జాతి కుక్క క్రాస్ బ్రీడ్. ఇలా చేయడం ఇదే ఫస్ట్ టైమట. అందుకే ఇంత రేటు అని చెబుతున్నారు. ఏదైతేనేం ఇప్పుడిది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కుక్క. వయసు కేవలం 8 నెలలు.. బరువు మాత్రం ఇప్పటికే 75 కిలోలు ఉంది. అంటే.. ఒకామి మన మీద ఒక్కసారి పడిందంటే.. కాలో చేయో విరగాల్సిందే.

మమ్మీ, డాడీ సంగతి..

తోడేలు ఎంత క్రూరమైనదో మనకు తెలిసిందే. ఇక కాకేషన్ షెపర్డ్ జాతి కుక్కల గురించి చెప్పాలంటే.. శీతల దేశాల్లో ఉండే ఈ శునకాలు చాలా బలంగా ఉంటాయి. గొర్రెలు, పశువుల మందలను తోడేళ్ల బారి నుంచి కాపాడటానికి వీటిని వాడతారు. ఈ లెక్కన.. ఈ రెండింటినీ మిక్సీలో వేసి తీసినట్లు ఉండే ఒకామి.. ఇంకెంత స్పెషలో చూడండి మరి.. రోజుకు కనీసం 3 కిలోల చికెన్ తిననిదే నిద్ర కూడా పోదట.

ఇంత డబ్బిచ్చి ఎందుకు కొన్నట్లు..

సతీశ్.. 1990 నుంచి ఈ డాగ్స్ బ్రీడింగ్ బిజినెస్‌లో ఉన్నారు. ఆయన దగ్గర 150 రకాల జాతుల కుక్కలు ఉన్నాయట. ఇవి చాలా పోటీల్లో పాల్గొని.. ప్రైజులు గెలుచుకున్నాయి. గత పదేళ్ల నుంచి బ్రీడింగ్‌ను ఆపేసిన సతీశ్.. ఇలాంటి అరుదైన కుక్కలను కొని.. వాటిని షోలలో ప్రదర్శించడం ద్వారా సంపాదిస్తున్నారు. 30 నిమిషాలకు రూ.2.5 లక్షలు చార్జ్ చేస్తారు. గతేడాది కూడా ఆయన పాండాలా కనిపించే చౌచౌ జాతి కుక్కను.. జస్ట్ రూ.29 కోట్లే కదా అని కొన్నారు. 'వీటిని చూడటానికి చాలా మంది ఆసక్తి చూపుతారు. టికెట్లు కొనుక్కొని మరీ వస్తారు. సెల్ఫీలు తీసుకుంటారు. నేను, నా డాగ్స్ సినిమా యాక్టర్లలాగా బాగా పాపులర్ అయి పోయాము' అని సతీశ్ చెప్పారు. 7 ఎకరాల ఫామ్‌హౌస్‌లో ఈ శునకాలు ఉంటాయి. ఖరీదైనవి కావడంతో ఎవరూ ఎత్తుకుపోకుండా సీసీటీవీ పహారా ఉంటుంది. కుక్కల సంరక్షణ బాధ్యతలను చూసుకోవడానికి ఆరుగురు సిబ్బంది ఉంటారు. కనకపు సింహాసనం వేయలేదు కానీ.. దాదాపుగా అలాంటి సదుపాయాలే ఉంటాయి.

రేయ్.. ఎవర్రా అంది.. ఛీ కుక్క బతుకని..

– సాక్షి సెంట్రల్ డెస్క్

ఉడుకుతున్న తెలంగాణ

రాష్ట్రమంతటా.. పెరిగిన ఎండల తీవ్రత

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. మంగళవారం ఏకంగా 25 జిల్లాల్లో నలభై డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా కుమురంభీం జిల్లా వంకులంలో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ పిప్పల్‌దరి, ములుగు జిల్లా ఘనపూర్, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో 41.2, నిజామాబాద్ జిల్లా మంచిప్పలో 41.1, నిర్మల్ జిల్లా కుబీర్‌లో 41, నల్లగొండ జిల్లా పద్మట్‌పల్లిలో 40.9,



వనపర్తి జిల్లా కనాయపల్లిలో 40.8, భద్రాచలంలో 40.7 డిగ్రీలు, హైదరాబాద్ మెట్టుగూడలోనూ 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సాధారణం కంటే 1 నుండి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు రాత్రి వేళల ఉష్ణోగ్రతలు సైతం తక్కువగా నమోదవుతున్నాయి. రాత్రి వేళల్లోనూ చలి తగ్గలేదు. ఆదిలాబాద్ జిల్లాలో 19.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది.

యాదగిరీశుడి సేవలో మిస్ వరల్డ్

సంప్రదాయ చీరకట్టులో వచ్చిన క్రిస్టినా పిష్కోవా

యాదగిరిగుట్ట/ సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని 2024 మిస్ వరల్డ్ (ప్రపంచ సుందరి) క్రిస్టినా పిష్కోవా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఈవో భాస్కర్‌రావు ఆమెకు స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ ప్రతిష్టాలంకార మూర్తులను పిష్కోవా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. శ్రీస్వామిని దర్శించుకున్న పిష్కోవాకు ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదంతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అంతకు ముందు ప్రధానాలయానికి ఈశాన్య దిశలో ఉన్న అఖండ జ్యోతి వద్ద, క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి ఆమె పూజలు చేశారు. ఆలయాన్ని సందర్శించడం సంతోషంగా ఉందని తెలిపారు. కాగా ప్రపంచ సుందరి క్రిస్టినా పిష్కోవా సంప్రదాయ రీతిలో చీరకట్టులో రావడం అందరినీ ఆకర్షించింది.

యాదగిరిగుట్టకు ప్రపంచస్థాయిలో ప్రాచుర్యం

త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీల ప్రమోషన్ కార్యక్రమం ప్రారంభమైంది. మంగళవారం యాదాద్రిని క్రిస్టినా పిష్కోవా సందర్శించారు. మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా



ప్రపంచంలో ఆమె సందర్శించిన ప్రాంతాలను డాక్యుమెంటరీ చేస్తున్నారు. తద్వారా ఈ దేవాలయానికి ప్రపంచవ్యాప్తంగా మరింత ప్రాచుర్యం దక్కుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆమె సందర్శించిన ప్రాంతాల డాక్యుమెంటరీని మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా ప్రదర్శిస్తారు. నూతన టూరిజం పాలసీలో భాగంగా గుర్తించిన ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. ఈ జాబితాలో యాదగిరిగుట్ట, భువనగిరి కోట, బస్వాపూర్ రిజర్వాయర్, కొలనుపాక దేవాలయం, మహాదేవపురం ఉన్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
బుధవారం। 19-3-2025

‘చదివింపులు’ పెరగాలి!

- పాఠశాల విద్యకు ఏటా అరకొరగానే కేటాయింపులు
- రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం ఉండాలంటున్న నిపుణులు
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెంపునకు డబ్బుల కొరత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో పాఠశాల విద్యకు కేటాయింపులు పెంచాలనే డిమాండ్ వినిపిస్తోంది. రాష్ట్ర బడ్జెట్ రూ.3లక్షల కోట్లు దాటుతోంది. ఇందులో విద్యారంగానికి కనీసం 15 శాతం కేటాయింపులు ఉండాలన్నది ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, విద్యారంగ నిపుణుల డిమాండ్. రాష్ట్ర అవతరణ నుంచి కేటాయింపులు గరిష్టంగా 7 శాతం దాటడం లేదు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, కొత్త టీచర్ల నియామకాలు చేపట్టాలన్నా, నిధుల కొరత అడ్డంకిగా మారుతుందన్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించాల్సి ఉంది. విద్యారంగానికి నిధులు పెంచాలని రాష్ట్ర విద్యా కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. నిధులు పెంచి విద్యారంగ సంస్కరణలు చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం కూడా అభిప్రాయపడింది.

ఎక్కువ భాగం వేతనాలకే చెల్లు

రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే కేటాయింపుల్లో సింహభాగం టీచర్లు, ఇతర సిబ్బంది వేతనాలకే ఖర్చవుతోంది. ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం వెనుకబడి ఉందని కేంద్ర విద్యాశాఖ తన నివేదికలో స్పష్టం చేసింది. ఇప్పటికే పేద విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు సకాలంలో పంపిణీ చేయడానికి ఇబ్బందులు తప్పడం లేదు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లనూ తీర్చిదిద్దుతామని చెప్పి మన ఊరు–మనబడి కార్యక్రమం చేపట్టినా తొలి దశలోనే నిధుల కొరత ఎదురైంది.

తగ్గుతున్న ప్రవేశాలు

కోవిడ్ కాలంలో మినహా ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు ఏటా పడిపోతున్నాయి. రాష్ట్రంలో 11,067 గుర్తింపు పొందిన ప్రైవేట్ స్కూళ్లున్నాయి. చిన్న స్కూళ్లలో ఫీజులు రూ.30 నుంచి రూ.40 వేల మధ్య ఉంటున్నాయి. కార్పొరేట్ స్కూళ్లలో రూ.లక్షల్లో ఉంటున్నాయి. అయినా మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేట్ స్కూళ్లను ఆశ్రయించడానికి కారణం.. ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యత కొరవడటమేనని విద్యారంగ నిపుణులు అంటున్నారు. వాస్తవానికి సర్కారీ స్కూళ్లలో నాణ్యమైన బోధకులే ఉన్నారు. కానీ బోధన విధానం సరైన రీతిలో ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే విద్యారంగానికి కేటాయింపులు పెంచాల్సిన అవసరముంది.

టీచర్లు ఏరి.. సదుపాయాలెక్కడ ?

ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ 18 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా స్కూళ్లలో సబ్జెక్టు టీచర్లే లేరు. 602 మండలాల్లో కేవలం 17 చోట్ల మాత్రమే రెగ్యులర్ ఎంఈఓలు ఉన్నారు. 6 వేల పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. విద్యావలంటీర్ల నియామకంపైనా పాఠశాల విద్యాశాఖ దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా బోధన అరకొరగా ఉంటోందన్న ప్రచారం.. విద్యార్థులను ప్రైవేట్ బాట పట్టిస్తోంది.

నిధులు పెంచాలి

పాఠశాల విద్యకు నిధులు పెంచాలి. మౌలిక వసతులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీపడే శక్తి సామర్థ్యాలున్నా, అవసరమైన వసతులు లేకపోవడమే సమస్యగా మారింది.

– పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

15 శాతం నిధులైనా ఇవ్వాలి

విద్యకు కేవలం 7 శాతం నిధులే ఇస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో కూడా 13 శాతం నిధులిస్తున్నారు. 90 శాతం బడుగు,బలహీన వర్గాల విద్యార్థులున్న తెలంగాణలో విద్యారంగానికి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తోంది.

– మాచర్ల రాంబాబు, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

కేటాయింపులతో సంస్కరణలు

పాఠశాల విద్యలో సంస్కరణలు అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. దీనిని స్వాగతిస్తున్నాం. అయితే క్షేత్ర స్థాయిలో అవసరాలు ఏంటి? ఏమేం సమకూర్చాలనే దానిపై ఫోకస్ పెట్టాలి. ఇది జరగాలంటే నిధులు పెంచాలి.

– రాజగంగారెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రావతరణ నుంచి పాఠశాల విద్యకు బడ్జెట్ కేటాయింపులు

సంవత్సరం	కేటాయింపులు (రూ. కోట్లల్లో)	ఖర్చు చేసింది (రూ. కోట్లల్లో)
2015-16	8,561.61	7,974.81
2016-17	7,787.32	8,834.46
2017-18	8,744.14	9,411.44
2018-19	9,425.20	9,172.27
2019-20	7,781.57	9,196.96
2020-21	9,486.59	8,688.55
2021-22	10,205.40	8,999.27
2022-23	12,528.51	11.115.07
2023-24	14,488.24	11,201.09
2024-25	17,931.42	(ఇంకా లెక్కలు రాలేదు)

చేవెళ్ల డిక్లరేషన్‌కు కట్టుబడే ఎస్సీ వర్గీకరణ

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: చేవెళ్ల డిక్లరేషన్‌కు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించిందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద స్వీట్లు పంచి అనంతరం మీడియాతో మాట్లాడారు. యావత్తు మాదిగ జాతి మరచిపోని విధంగా, సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి కమిటీ వేసి చిత్తశుద్ధితో బిల్లును ఆమోదించామన్నారు. దీని వెనుక సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి ఉందని, ఆయన 35 లక్షల మాదిగల గుండెల్లో నిలిచిపోతారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కులగణన చేపడుతామని ఏఐసీసీ అగ్రనేత మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ చెప్పిన మాటకు కట్టుబడి బిల్లు ప్రవేశపెట్టామని చెప్పారు. అలాగే యాదగిరిగుట్టకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఎం మంచి నిర్ణయం తీసుకున్నారని, యాదగిరి గుట్టకు పూర్వ వైభవం తేవడానికి చేస్తున్న కృషి ఇది అని పేర్కొన్నారు.

లంబాడాలకు కాంగ్రెస్ ప్రాధాన్యమిస్తుంది: బాలూనాయక్



సాక్షి, హైదరాబాద్: లంబాడా సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యమిస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే ఎన్.బాలూనాయక్ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో ఇష్టాగోష్టి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో లంబాడాలకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రివర్గంలో లంబాడాలు గతంలోనూ ఉన్నారని, రాబోయే రోజుల్లో తమ సామాజికవర్గానికి మంత్రి పదవి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ కేబినెట్‌లో కూడా లంబాడాలున్నారన్న తన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని బాలూనాయక్ విమర్శించారు.

కులగణన చట్టబద్ధతతో బీసీ రాజ్యాధికార సాధనకు తొలిమెట్టు

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనను చట్టబద్ధం చేయడం బీసీ రాజ్యాధికార సాధనకు తొలిమెట్టు అని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ పేర్కొన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు అసెంబ్లీలో ఆమోదింపజేసి చట్టబద్ధత కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో బీసీ సంఘాలు, ప్రజా సంఘాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి సురేశ్ హాజరై మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ బిల్లును '9'వ షెడ్యూల్లో చేర్చటానికి అవసరమైన రాజ్యాంగ సవరణను సాధించటానికి త్వరలోనే బీసీరాజ్యాధికార సమితి క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన యువ నాయకత్వ కమిటీలను కలుపుకొని ఢిల్లీలో భారీ బహిరంగ ధర్నాను నిర్వహించనున్నట్టు చెప్పారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డుపడే పార్టీలు, వ్యక్తులను బీసీ ద్రోహులుగా పరిగణిస్తామని సురేశ్ హెచ్చరించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

సీఎంకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కమిటీ వినతి

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య బీమా పథకం, అక్రెడిటేషన్ కార్డులు, పెన్షన్ పథకం, మహిళా జర్నలిస్టులకు రాత్రి సమయంలో రవాణా సౌకర్యం, అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలకు ఎస్ప్యానల్‌మెంట్ తదితర డిమాండ్లను విన్నవించింది. సీఎంను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

యునైటెడ్ పూలే ఫ్రంట్ వినతి

సాక్షి, హైదరాబాద్: బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదించామని చేతులు దులిపేసుకోకుండా.. రిజర్వేషన్లు సంపూర్ణంగా అమలయ్యేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీ సంఘాల నేతలు, యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు కోరారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత పోరాటం ఫలితంగానే ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెట్టిందని ఫ్రంట్ కో–కన్వీనర్ బొల్లా శివ శంకర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత నివాసం వద్ద భారీగా బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు.

హెచ్‌సీయూ భూముల అమ్మకం ఉపసంహరించాలి

బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల అమ్మకం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించేందుకు ఉస్మానియా యూనివర్సిటీలో విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కోరారు. ఆర్థిక సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సింది పోయి, భావితరాలకు ఉపయోగపడాల్సిన వర్సిటీ భూములను తెగనమ్మి పబ్బం గడుపుకోవాలని చూడటం సరికాదన్నారు. మంగళవారం కాసం మీడియాతో మాట్లాడుతూ ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయడమేనని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ క్యాంపస్ పరిధిలోని 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీ వద్ద నిరసన నిర్వహించిన బీజేవైఎం నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. దేశంలోనే నాలుగవ స్థానంలో ఉన్న హెచ్‌సీయూని 'లంగ్స్ ఆఫ్ హైదరాబాద్'గా పిలుస్తారని, ఈ వర్సిటీలో మష్రూమ్ రాక్, పికాక్ లేక్ ప్రకృతి సంపదగా ఉన్నాయని కాసం తెలిపారు.

15 మంది డీఎస్పీలకు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15 మంది డీఎస్పీ (సివిల్)లకు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు పదోన్నతులు పొందిన అధికారులందరినీ వారి ప్రస్తుత పోస్టుల నుంచి బదిలీ చేశారు. అందరినీ డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో సూచించారు.

టీజీఈఏపీసెట్‌కు 1,36,425 దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీసెట్)కు ఆన్‌లైన్ దరఖాస్తులు మంగళవారానికి 1,36,425 వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగానికి 98046, అగ్రి, ఫార్మసీకి 38273, రెండు విభాగాలకు 106 దరఖాస్తులు అందాయని ఈఏపీ సెట్ కో–కన్వీనర్, జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

కేరళ ఎమ్మెల్యేలకు ‘కోమటిరెడ్డి’ ఇంటి భోజనం

హాజరైన భట్టి, వివేక్ తదితరులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభను మంగళవారం సందర్శించిన ఇద్దరు కేరళ ఎమ్మెల్యేలకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన ఇంటి నుంచి భోజనం తెప్పించారు. అసెంబ్లీ లాబీల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్‌లు కూడా కేరళ ఎమ్మెల్యేలతో కలిసి భోజనం చేశారు. కాగా, మధ్యాహ్న భోజనం ఏర్పాటుపై ఎమ్మెల్యేల మధ్య సరదా సంభాషణ జరిగింది. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి నివాసానికి వెళ్లినప్పుడు.. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అక్కడ భోజనం చేశారని, ఈ సందర్భంగా.. ఆయన మంచి భోజనం తినిపిస్తానని భట్టికి చెప్పారని.. ఆ మేరకు ప్రత్యేక భోజనం తెప్పించారని వ్యాఖ్యానించారు. మధ్యాహ్న భోజనానికి జడ్చర్ల ఎమ్మెల్యే జె.అనిరుధ్ రెడ్డి కూడా హాజరయ్యారు.

బిల్డర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు

- సోషల్ మీడియా దుర్వినియోగం.. జీహెచ్‌ఎంసీ సిబ్బందిలో వణుకు
- శాసనసభ జీరోఅవర్‌లో దానం నాగేందర్ ఆరోపణ
- సమస్యల చిట్టా విప్పిన నగర, జిల్లాల ఎమ్మెల్యేలు



సాక్షి, హైదరాబాద్: నగరంలో కొందరు సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ.. బిల్డర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆరోపించారు. వీరంటే జీహెచ్‌ఎంసీ సిబ్బంది వణికిపోతున్నారని, అందరూ కూర్చుని కాంప్రమైజ్ అవుతుండడంతో.. అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. శాసనసభలో మంగళవారం జరిగిన జీరోఅవర్‌లో 'దానం'మాట్లాడారు. తన ప్రమేయం లేకుండా.. తన నియోజకవర్గంలోని ఈద్గా మైదానంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. దీంతో తాను వెళ్లి.. సబ్ స్టేషన్‌కు వేసిన పునాదులను కూల్చివేశానన్నారు. తన క్యాంపు కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరినా కేటాయించడం లేదని 'దానం' విమర్శించారు.

- అంబర్‌పేటలో రూ.400 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మించగా, సీఎంకు సమయం లేక ఇంకా ప్రారంభించలేదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఫ్లైఓవర్‌కు సమాంతరంగా సర్వీసు రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మూసారాంబాగ్ ఫ్లైఓవర్ నిర్మాణం నత్తనడకన సాగుతోందని, వేగం పెంచాలని విజ్ఞప్తి చేశారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ 15 నెలలుగా తమ నియోజకవర్గాల్లో ఎలాంటి పనులకు అనుమతులు ఇవ్వడం లేదని ఆరోపించారు.
- ఎల్బీనగర్ నియోజకవర్గంలో హుడా ఆమోదించిన లేఅవుట్‌లో 44 కాలనీలు ఏర్పాటు కాగా, ఆ తర్వాత ఆ స్థలం ప్రభుత్వానిదని పేర్కొంటూ రిజిస్ట్రేషన్లు ఆపేశారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 118 కింద ఈ స్థలాలను క్రమబద్ధీకరించి కన్వేయన్స్ డీడ్స్ జారీ చేసిందని చెప్పారు. ఎన్నికలు రావడంతో కొందరికి ఇవ్వలేకపోయిందన్నారు. మిగిలిన వారికి సైతం కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వడంతో పాటు నిషేధిత జాబితాల నుంచి ఈ స్థలాలను తొలగించాలని కోరారు. ఈ సమస్యను గతంలో సైతం తన దృష్టికి తీసుకువచ్చారని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బదులిచ్చారు.
- నగరంలోని బస్తీ దవాఖానాల్లో వైద్యులు, అత్యవసర మందులు లేవని యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ తెలిపారు. రక్త పరీక్షలు సైతం జరపడం లేదని పేర్కొన్నారు. అలాంటప్పుడు బస్తీ దవాఖానాలకు ప్రజలు ఎందుకు వెళ్లాలని ఆయన ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలానికి తక్షణమే ఎన్‌వోసీ జారీ చేయాలని జీహెచ్‌ఎంసీని కోరారు.
- ప్రకాశ్‌నగర్, ఇతర కాలనీల ప్రజలు అటవీ భూముల్లో ఇళ్లు కట్టుకుని ఉంటున్నారని, వారికి పట్టాలు ఇవ్వాలని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.
- తన నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలకు టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.15 కోట్లు రావలసి ఉండగా, ఇవ్వడం లేదని కోరుట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. మెట్‌పల్లి ఆస్పత్రి నిర్మాణానికి కూడా నిధులు ఇవ్వాలని కోరారు. మునిపేటలో రుణమాఫీ జరగని 330 మంది రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తే అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు.
- నాగర్‌కర్నూల్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మించాలని, సాంకేతిక విద్య కళాశాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కె.రాజేశ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.
- సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాల మధ్య ఉన్న తన నియోజకవర్గం.. గత బీఆర్‌ఎస్ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని మానకొండూరు ఎమ్మెల్యే కె.సత్యనారాయణ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆట పాటలు, ఎగరడం, దూకడానికే పరిమితమయ్యారని, నియోజకవర్గానికి ఏమీ చేయలేదని విమర్శించగా, బీఆర్‌ఎస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. కేవలం 24 ఎకరాలు సేకరిస్తే 10వ ప్యాకేజీ పనులు పూర్తయ్యేవని, బాలకిషన్ ప్రజలను రెచ్చగొట్టి పనులు జరగకుండా చేశారని ఆరోపించారు. సత్వరం భూసేకరణ పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.
- ఆసిఫాబాద్ నియోజకవర్గం ఉండి గ్రామంలో రూ.8.5 కోట్లతో మంజూరైన వంతెన నిర్మాణ అంచనాలు రూ.14.4 కోట్లకు పెరిగాయని, నిధులు మంజూరు చేసి సత్వరం పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి విజ్ఞప్తి చేశారు. లక్మాపూర్ వంతెనను కూడా పూర్తిచేయాలని, ఆసిఫాబాద్ నుంచి అస్మాపూర్ వరకు రోడ్డు వేయాలని కోరారు.
- నారాయణపేట నియోజకవర్గం కోయిల్‌కొండ నియోజకవర్గంలో బీసీ వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి విజ్ఞప్తి చేశారు. ధన్వాడలో డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.
- నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో నిర్మాణం పూర్తయిన 396 ఇళ్లతో పాటు నిర్మాణం ఆగిపోయిన 252 ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే డి.సూర్యనారాయణ గుప్తా విజ్ఞప్తి చేశారు.
- మిర్యాలగూడను స్పెల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. తన నియోజకవర్గంలో రైస్ మిల్లులు ఎక్కువగా ఉండగా, విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం కింద భూములు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.



‘నిప్పులపై’ నీళ్లు

ఎండలు పెరగడంతో.. ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యాన చుట్టుపక్కల రహదారులపై ట్యాంకర్లతో నీరు చల్లిస్తున్నారు. మరో పక్క మార్కెట్‌కు తీసుకొచ్చే మిర్చి ఘాటుతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యాన మార్కెట్ చుట్టుపక్కల వీధుల్లో రెండు ట్యాంకర్లతో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరం నీటిని పిచికారీ చేయిస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



మలమల మాడి.. మర్రినీడకు చేరి

ఇటు పెద్దపల్లి, అటు జగిత్యాల జిల్లాల సరిహద్దుల్లోని రాజారాంపల్లి గ్రామంలో నిర్వహించే ఎద్దుల అంగడి (వారపు సంత)కి ఉత్తర తెలంగాణలోనే ప్రత్యేకత ఉంది. ప్రతీ మంగళవారం జరిగే సంతలో అన్నిరకాల జాతుల ఎద్దులు, గేదెలు, గొర్రెలు, మేకల క్రయవిక్రయాలు జోరుగా సాగుతాయి. మంగళవారం ఎండ తీవ్రత తాళలేక వేలాది పశువులు, జీవాలు ఇలా మర్రిచెట్టు నీడన సేదదీరడం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా...

గవర్నర్‌కు లోకాయుక్త వార్షిక నివేదిక



కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త వార్షిక నివేదిక–2024ను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సమర్పించినట్లు ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజని తెలిపారు. మంగళవారం ఆమె కర్నూలులోని లోకాయుక్త ఆఫీసులో వార్షిక నివేదికలో పొందుపరచిన వివిధ అంశాలను వివరించారు.

ఎమ్మెల్యేలకు ఐప్యాడ్‌లు

సాక్షి, అమరావతి: బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆర్థిక శాఖ తరఫున శాసనసభ సభ్యులందరికీ లేటెస్ట్ ఐప్యాడ్‌లు అందజేస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంగళవారం ప్రకటించారు. విధుల నిర్వహణలో సభ్యులకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.

ఏపీ క్రియేటివ్, కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్‌కు జీతభత్యాలు ఖరారు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రియేటివ్–కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వికి నెలకు రూ.2,77,500 జీతభత్యాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు మంగళవారం పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్‌ను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం సచివాలయంలో ఆవిష్కరించారు. సంస్థాగతంగా విద్యుత్ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పశువైద్యసేవలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

సాక్షి, అమరావతి: సంచార పశువైద్యసేవల్లో ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పశుసంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర నాయుడు హెచ్చరించారు. అలా జరిగితే టోల్ ఫ్రీ నం.1962కు ఫిర్యాదు లేదా సమీప పశువైద్యాధికారికి సమాచారం ఇవ్వాలని మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

విధుల్లో చేరని ఇద్దరు ఈఈలపై సస్పెన్షన్ వేటు

సాక్షి, అమరావతి: బదిలీ చేసిన ప్రాంతాల్లో విధుల్లో చేరని ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల(ఈఈలు)ను సస్పెండ్ చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా సీఈ (ప్రాజెక్ట్స్) కార్యాలయంలో డిప్యూటీ సీఈగా పనిచేస్తున్న ఈఈ ఎస్.లక్ష్మీనాయక్‌ను, తెనాలిలో కృష్ణా డెల్టా వెస్ట్రన్ కెనాల్ డివిజన్‌లో ఈఈగా పనిచేస్తున్న శంభారపు మల్లికార్జునను డ్యామ్ మెయింటెనెన్స్ సర్కిల్(కర్నూలు)కు బదిలీ చేస్తూ గత సెప్టెంబరు 22న ఉత్తర్వులు జారీ చేశారు. కానీ.. వారిద్దరూ విధుల్లో చేరలేదు. దీంతో నిబంధన ప్రకారం వారిపై సస్పెన్షన్ వేటు వేశారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌లో భారీ పెట్టుబడులే లక్ష్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌లో భారీ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీ కార్యదర్శి చైర్‌పర్సన్‌గా ఉండే ఈ కమిటీలో వివిధ ఐటీ కంపెనీలకు చెందిన ప్రతినిధులు సభ్యులుగా మొత్తం 12 మందితో 'ఏపీ క్వాంటమ్ కంప్యూటింగ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ'ని ఏర్పాటు చేసింది.

గ్రీష్మ రాజీనామా

సాక్షి, అమరావతి: ఏపీ మహిళా కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి కావలి గ్రీష్మ రాజీనామా చేశారు. ఇటీవల ఆమె ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 9న ఆమె తన పదవికి రాజీనామా పత్రాన్ని సమర్పించడంతో ప్రభుత్వం ఆమోదించింది.

పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేస్తాం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఆట మైదానాల్లో పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేస్తామని క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం శాసన మండలిలో తెలిపారు. మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో పీడీఎఫ్ సభ్యుల ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

తుంగభద్ర ఎగువ కాలువ మరమ్మతులకు రూ.33.89 కోట్లు

సాక్షి, అమరావతి: తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు రూ.33.89 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతి ఇస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

విశాఖలో ప్రకృతి వైద్యం, యోగా కళాశాలకు ఆమోదం

వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ : విశాఖపట్నంలో ప్రకృతి వైద్యం, యోగా వైద్య కళాశాల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ప్రతాపరావు జాధవ్ తెలిపారు. దేశంలో ఆయుష్ సంస్థల వివరాలు, ఏపీలో ఏర్పాటు చేయబోయే కళాశాలలపై వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. 2023, ఏప్రిల్ 1వ తేదీ నాటికి దేశంలో 942 ఆయుష్ కళాశాలలు ఉన్నట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదన మేరకు ఆయుష్ మంత్రిత్వ శాఖ విశాఖపట్నంలో ప్రకృతివైద్యం, యోగా వైద్య కళాశాలకు ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి వివరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాల లేమి..



దేశంలో ఇప్పటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా వైద్య సదుపాయాలు, వసతులు, మందులు లేవని వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబురావు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం రాజ్యసభలో వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ పనితీరుపై జరిగిన చర్చలో పాల్గొన్న ఎంపీ గొల్ల బాబురావు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోనూ గతంలో ఇలాంటి పరిస్థితే ఉండేదని.. అయితే 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 'అందరికీ వైద్యం' పేరుతో రాష్ట్రంలో ప్రాథమిక వైద్యరంగాన్ని బలోపేతం చేశారని వివరించారు. అంతేగాక దేశంలోని ప్రతీ ప్రాంతంలో ఎయిమ్స్ వంటి పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ పథక ప్రయోజనాలను రూ.5 లక్షల కంటే ఎక్కువకు పెంచాలని కోరారు.

ఏపీలో 19,434 క్యాన్సర్ రోగులు..

ఏపీలో 19,434 గర్భాశయ క్యాన్సర్ రోగులున్నట్లు కేంద్రం పేర్కొంది. వీరికి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాధవ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎంపీ గొల్ల బాబురావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాత పూర్వకంగా సమాధానమిచ్చారు.

26.07 కోట్ల క్రెడిట్ కార్డుల బకాయిలు..



దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో క్రెడిట్ కార్డు బకాయిలున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎంపీ పరిమళ్‌నత్వానీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. 2021–24 మధ్య 26.07కోట్ల మంది ఖాతాదారులు బకాయి ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా వివరాలు ఆర్‌బీఐ ఇవ్వని కారణంగా వెల్లడించలేకపోతున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు.

సైబర్ నేరాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు

వెల్లడించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర హోంశాఖ పటిష్టమైన చర్యలు చేపడుతున్నదని ఆ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. బాధితుల నుంచి స్వీకరిస్తున్న ఫిర్యాదులపై కేసులను నమోదు చేస్తూ ఎప్పటికప్పుడు ఆ కేసుల పరిష్కారానికి పోలీసు వ్యవస్థ కృషి చేస్తోందన్నారు. మూడేళ్ల వ్యవధిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సైబర్ నేరాలపై 36,739 కేసులు నమోదయినట్లు మంగళవారం లోక్‌సభ వేదికగా బండి సంజయ్ వెల్లడించారు. దేశంలోని అన్ని రకాల సైబర్ నేరాలను అరికట్టేందుకు హోంశాఖ 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్' (ఐ4సీ) ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏపీకి రూ.1,036 కోట్ల ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు..



రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) నుంచి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర వాటాగా రూ.1,036 కోట్లు, తెలంగాణకు రూ.416.8కోట్లు ఇచ్చినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని 'ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్‌టీం' (ఐఎంసీటీ) ఇచ్చిన అంచనాల మేరకు ఆ నిధులను ఇచ్చారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న ఎన్‌డీఆర్‌ఎఫ్ నుంచి ఏపీకి రూ.608.08కోట్లు, తెలంగాణకు రూ.231.75కోట్లు ఇచ్చినట్లు తెలిపారు.

ఏపీలో 4.33లక్షల పీఎంఎంకేఎస్‌వై లబ్ధిదారులు..



ఆంధ్రప్రదేశ్‌లో 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన' (పీఎంఎంఎస్‌వై) పథకం కింద 4.33లక్షల మంది లబ్ధిదారులున్నట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ తెలిపారు. ఈ మేరకు 'నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫాం' కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. వీరికి ఆయా పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనాన్ని కేంద్రం అందిస్తోందని వివరించారు.

తిరుపతి జిల్లాలో 20,819 హెక్టార్లలో మైక్రో–ఇరిగేషన్ అమలు..



తిరుపతి జిల్లాలో 20,819 హెక్టార్లలో మైక్రో–ఇరిగేషన్ అమలు చేశారని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మైక్రో ఇరిగేషన్ అమలు, తిరుపతి జిల్లాలో సాధించిన పురోగతి, లబ్ధిదారులు తదితర వివరాలపై లోక్‌సభలో వైఎస్సార్‌ సీపీ తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నించారు. దీనిపై కేంద్రమంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం 2015–16 నుంచి దేశవ్యాప్తంగా అమలులో ఉందని తెలిపారు. సన్న, చిన్నకారు రైతులకు 55% సబ్సిడీ, ఇతర రైతులకు 45% సబ్సిడీ అందిస్తున్నామని పేర్కొన్నారు. 2015–16 నుంచి ఇప్పటి వరకు తిరుపతి జిల్లాలో 19,272 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారని తెలిపారు.

మీడియా పాయింట్

చట్ట సభల్లో అబద్ధాలు చెబుతున్న కూటమి ప్రభుత్వం: రమేష్ యాదవ్, ఎమ్మెల్సీ



సాక్షి, అమరావతి: దేవాలయంగా భావించే చట్ట సభల్లో కూటమి ప్రభుత్వం అబద్ధాలు చెబుతోంది. 50 ఏళ్ల పైబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెన్షన్లు ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పారు. ఎప్పుడు ఇస్తారని అడిగాం. 12,09,732 మందికి ఇస్తున్నామని చెప్పారు. 54 లక్షలున్న పింఛన్లు జగన్ హయాంలో 2024 మార్చి నాటికి 65 లక్షలకు చేరాయి. దాదాపు 13 లక్షల పింఛన్లు పెంచారు. 2025 ఫిబ్రవరి 1 నాటికి మొత్తంలో 63 లక్షలకు పడిపోయాయి. పోనీ అదే లెక్క అనుకున్నా 50 ఏళ్ల పైబడిన వారికి పెన్షన్లు ఇస్తున్నామని కూటమి ప్రభుత్వం చెప్పడం పచ్చి అబద్ధం.

మళ్లీ జగన్ రావాల్సిందే: కేఆర్‌జే భరత్, ఎమ్మెల్సీ



2024–25లో దీపం–2, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం అమలు చేస్తున్నామని చెప్పారు. మళ్లీ వాళ్లే అన్నదాత సుఖీభవకు రూ.6,300 కోట్లు, తల్లికి వందనంకు రూ.4,700 కోట్లు ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేస్తామన్నారు. అమలు చేసేస్తున్నామని ఓసారి అంటున్నారు. మళ్లీ త్వరలో అమలు చేస్తామంటున్నారు. అంటే కూటమి నేతలకే దీనిపై స్పష్టత లేదు. పథకాల అమలుకు సమయం కావాలంటున్నారు. వైఎస్ జగన్ తెచ్చిన ఆర్బీకే వ్యవస్థకు పేరు మార్చారు. జగనన్నతోనే బీసీలకు న్యాయం జరుగుతుంది. మళ్లీ జగనన్న వస్తేనే పథకాలు అమలవుతాయి. కూటమి ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. జగన్ వెంట నడిచేందుకు జనం సిద్ధంగా ఉన్నారు.

విద్య, వైద్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారు: నర్సు రామారావు, ఎమ్మెల్సీ



కూటమి పాలనలో విద్య, వైద్య వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ ఈ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్ళే పేదల నుంచి యూజర్ చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించారు. వైఎస్ జగన్ ప్రభుత్వ వైద్యాన్ని పేదలకు మరింత చేరువ చేయాలని మెడికల్ కాలేజీలు తీసుకొస్తే.. వాటినీ ప్రైవేటుకు అప్పజెప్పున్నారు. లోకేశ్ అసమర్థత వల్ల మొత్తం విద్యా వ్యవస్థే దెబ్బతింటోంది. వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం, ఐబీ, సీబీఎస్‌సీ సిలబస్, డిజిటల్ క్లాస్ రూమ్‌ల విధానం, టోఫెల్ శిక్షణ, ట్యాబ్‌ల పంపిణీ, సబ్జెక్టు టీచర్ కాన్సెప్టు ఇలా ప్రతి దాన్నీ లోకేశ్ పనికట్టుకుని నాశనం చేస్తున్నారు. చదువులను ప్రోత్సహించడానికి వైఎస్ జగన్ అమలు చేసిన అమ్మ ఒడి పథకాన్నీ నీరుగారుస్తున్న ఘనుడు లోకేశ్.

ఓఎన్‌డీసీ ద్వారా చిరుధాన్యాలకు గిట్టుబాటు ధర

వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: ఆన్‌లైన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)లో నమోదు చేసుకోవడం ద్వారా చిరుధాన్యాలు సాగు చేసిన రైతుల పంట ఉత్పత్తులను తమకు నచ్చిన చోట, నచ్చిన వ్యాపారులకు, గిట్టుబాటు ధరకు విక్రయించుకునే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు తెలిపారు. జాతీయ ఆహార, పోషక భద్రతా పథకంలో భాగంగా 'చిరుధాన్య పంటల సాగు, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో సైతం మంచి డిమాండ్ ఉన్న చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. రాగుల పంట విస్తీర్ణం, ఉత్పత్తి పెంచే దిశగా పరిశోధన, విస్తరణ విభాగాలు కృషి చేయాలన్నారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరగకపోవడానికి కారణాలు అన్వేషించి, తగిన పరిష్కారం చూపాలని కోరారు. ఈ–మార్కెటింగ్ వ్యవస్థపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. మెషిన్ కోత కారణంగా పంట ఉత్పత్తుల్లో పంటకోత వ్యర్థాలు కలిసిపోతుండటంతో రైతులు మార్కెట్ ధర పొందలేకపోతున్నారని తిరుపతి పరిశోధన స్థానం శాస్త్రవేత్త కరీముల్లా తెలిపారు. యంత్రాలతో కోతకు ముందే పంటలో కలుపు తీస్తే ఈ సమస్యను అధిగమించవచ్చునని ఆయన చెప్పారు.

వంశీమోహన్‌కు ఏప్రిల్ 1 వరకు రిమాండ్

స్థల వివాదం కేసులో గన్నవరం కోర్టు ఆదేశం

గన్నవరం : కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీసులు నమోదుచేసిన స్థల వివాదం కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు ఏప్రిల్ 1 వరకు గన్నవరం కోర్టు రిమాండ్ విధించింది. తొలుత ఈ కేసు నిమిత్తం పోలీసులు వంశీమోహన్‌ను విజయవాడ జిల్లా కోర్టు నుంచి పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. వివరాలివీ..

తేలప్రోలుకు చెందిన శనగల శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2016లో జరిగిన స్థల వివాదం కేసులో ఆత్కూరు పోలీసులు వంశీని ఏ1 నిందితుడిగా చేర్చారు. కానీ, ప్రస్తుతం గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో వంశీమోహన్ విజయవాడ జిల్లా కోర్టులో రిమాండ్‌లో ఉన్నారు. దీంతో పీటీ వారెంట్‌పై ఆయన్ను మంగళవారం గన్నవరం 8వ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ఏప్రిల్ 1 వరకు ఆయనకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి బి. శిరీష ఆదేశాలు జారీ చేశారు. అయితే, గతంలో కోర్టు ఆదేశించినప్పటికీ జిల్లా జైలులో సరైన వసతులు కల్పించడంలేదని వంశీమోహన్ న్యాయాధికారి దృష్టికి తెచ్చారు. అనారోగ్య సమస్యల దృష్ట్యా కనీసం కూర్చునేందుకు జైలులో కుర్చీ అయినా కల్పించాలని ఆయన కోరారు. ఈ విషయాలను జైలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైతే పిటిషన్ రూపంలో దాఖలు చేయాలని న్యాయాధికారి సూచించారు. అనంతరం.. వంశీని రిమాండ్ నిమిత్తం తిరిగి విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం అమలు చేస్తున్నారట!

- శాసన సభకు ప్రభుత్వం లిఖిత పూర్వక సమాధానం
- వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చిన ఆర్థిక మంత్రి

సాక్షి, అమరావతి: అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అమలు చేస్తున్నట్టు కూటమి ప్రభుత్వం ప్రకటించుకుంది. ఈ మేరకు శాసన సభ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. అధికార కూటమి పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్ సిక్స్ హామీల అమలుపై వైఎస్సార్‌సీపీ సభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, దాసరి సుధ, బి. విరూపాక్షి, తాటిపర్తి చంద్రశేఖర్, ఎం. విశ్వేశ్వరరాజు అడిగిన ప్రశ్న మంగళవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో చర్చకు వచ్చింది. సూపర్ సిక్స్ కింద అమలు చేస్తున్న పథకాల వివరాలేమిటి అన్న ప్రశ్నకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ లిఖితపూర్వక సమాధానమిస్తూ.. దీపం 2.0, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అమలు చేస్తున్న పథకాలుగా పేర్కొన్నారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు ఆ పథకాల కోసం మంజూరు చేసిన, ఖర్చు చేసిన వివరాలు తెలపాలన్న ప్రశ్నకు... 'దీపం–2 పథకానికి 2024– 25 బడ్జెట్‌లో రూ. 895 కోట్లు సమకూర్చి, ఆ మొత్తాన్ని విడుదల చేశాం. 2025–26 బడ్జెట్ అంచనాల కింద రూ. 2,601 కోట్ల మొత్తాన్ని దీపం –2 పథకానికి కేటాయించాం. అన్నదాత సుఖీభవ పథకానికి 2025–26 బడ్జెట్ అంచనాల కింద రూ. 6,300 కోట్ల మొత్తాన్ని కేటాయించాం. తల్లికి వందనం పథకానికి 2025–26 బడ్జెట్ అంచనాల కింద రూ. 9,407 కోట్ల మొత్తాన్ని కేటాయించాం' అని వెల్లడించారు. మూడో ప్రశ్నగా పథకంవారీగా లబ్ధిదారుల వివరాలు కోరగా.. 2025 మార్చి 10వ తేదీ వరకు దీపం –2 పథకం ద్వారా 93.51 లక్షల మంది ఈ పథకాన్ని వినియోగించుకున్నారని మంత్రి పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాల విధివిధానాలు, లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ ప్రాసెస్‌లో ఉందని పేర్కొన్నారు.

23 నుంచి దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా

సాక్షి, అమరావతి: ఘనమైన ఉద్యమ చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించడమే లక్ష్యంగా శత వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా వెల్లడించారు. ఆయన మంగళవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించిన 1925 డిసెంబర్ 26 నుంచి కొనసాగిన అనేక ఉద్యమాలు, కీలక ఘట్టాలను వివరించారు. డిసెంబరు 26న సీపీఐ శత వార్షికోత్సవాల ముగింపు సభ తెలంగాణలోని ఖమ్మంలో నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా రాజకీయ అజెండాతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పోలీసుల పహారాలో ఛత్తీస్‌గఢ్ ఉందని రాజా ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కనుసన్నల్లో ఆపరేషన్ 'కగార్' పేరుతో మావోయిస్టుల అణచివేత ముసుగులో భద్రతా దళాలు అమాయక గిరిజనులపై దాడులకు తెగబడుతున్నాయని దుయ్యబట్టారు. మోదీ ప్రజావ్యతిరేక విధానాలపై అన్ని లౌకిక పార్టీలను కలుపుకొని పోరాటాలకు సమాయత్తమవుతామని తెలిపారు. సునీతా విలియమ్స్ 9 నెలల తర్వాత భూమిపైకి తిరిగి రావడం శుభ పరిణామమని హర్షం వ్యక్తంచేశారు. శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొన్నారు.

దళిత, హరిజన పదాలు వాడకూడదు

శాసన సభలో మంత్రి డోలా వెల్లడి



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 'దళిత', 'హరిజన' పదాలను వాడకూడదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మంగళవారం శాసన సభ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో తెలిపారు. దళిత, హరిజన పదాల వాడకాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం కూడా మెమో విడుదల చేసినట్టు చెప్పారు.

పురుషుల స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు కేంద్ర కార్యక్రమం

మహిళల స్వయం సహాయక సంఘాల తరహాలోనే పురుషుల సంఘాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మంత్రి నారాయణ తెలిపారు. ముందస్తుగా దేశమంతటా 25 నగరాల్లో వీటిని ఏర్పాటు చేసిందని, వీటిల్లో విజయవాడ, విశాఖపట్నం కూడా ఉన్నాయని చెప్పారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాలలో సభ్యుల ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటివరకు 818 పురుషుల గ్రూపులు ఏర్పాటైనట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటుపై సంబంధిత మంత్రితో మాట్లాడతానని అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి దేశంలోని అన్ని నగరాల్లో ఈ కార్యక్రమం అమలు చేయాలన్న ప్రతిపాదన కేంద్రం వద్ద ఉందని తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 51 లక్షల లావాదేవీలు

- జూన్ నాటికి మరో 300 సేవలు.. త్వరలో టీటీడీ సేవలు కూడా
- శాసన సభలో మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర పేరుతో ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటికే 51 లక్షలకు పైగా లావాదేవీలు జరిగాయని మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ శాసన సభలో ప్రకటించారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై మంగళవారం శాసనసభలో జరిగిన లఘు చర్చలో మంత్రి మాట్లాడుతూ.. దీని ద్వారా జూన్ నాటికి మరో 300 సేవలను అందుబాటులోకి తెస్తామని, త్వరలోనే టీటీడీ సేవలను కూడా అందిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారు కూడా సులభంగా వినియోగించుకునేలా వంద రోజుల్లో మనమిత్ర 2.0 వెర్షన్‌తో చాట్‌బోట్, ఏఐ ద్వారా వాయిస్ ఎనేబుల్డ్ సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ విధానంలో ఎక్కడా వ్యక్తిగత డేటా మెయింటెయిన్ చేయడంలేదని, పూర్తిగా ఎన్‌స్క్రిప్ట్ కోడ్ ద్వారా ప్రభుత్వ విభాగాల్లోని డేటాను ఆధార్ బేస్ అథెంటికేషన్ ఓటీపీ ద్వారా తీసుకుంటున్నామని చెప్పారు. వ్యక్తిగత సమాచారానికి భద్రతపై అపోహలు వద్దని అన్నారు. ట్యాంపరింగ్‌కు ఆస్కారం లేకుండా క్యూఆర్ కోడ్ ఎనేబుల్డ్ సర్టిఫికెట్లు అందజేస్తున్నామని, దీనివల్ల డబ్బు కూడా ఆదా అవుతుందని చెప్పారు. వాట్సాప్ ద్వారా జారీ చేసే సర్టిఫికెట్లకు చట్టపరమైన గుర్తింపు లభించేలా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సవరణ బిల్లును కూడా తీసుకొస్తామని చెప్పారు. జనవరి 2025 నుంచి ఇప్పటివరకు అన్ని విభాగాల్లో జీ టు సీ (గవర్నమెంట్ టు సిటిజన్స్) లావాదేవీలు 1.23 కోట్లు జరగ్గా.., అందులో 41.4 శాతం వాట్సాప్ ద్వారా అందించినవని అన్నారు. త్వరలోనే మీ సేవా కేంద్రాలకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

● నర్సింగ్ ఉద్యోగార్థులకుజర్మన్ భాషపై 24 నుంచి శిక్షణ

సాక్షి, అమరావతి: జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతకు సీడాప్ జర్మనీ భాషతో పాటు నైపుణ్య శిక్షణ ఇవ్వనుంది. బీఎస్సీ, ఎంఎస్సీ నర్సింగ్ అర్హత కలిగి, 20 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులు. 24 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని ఆసక్తిగల వారు 9963074879, 9492719843, 7288873337 నంబర్లలో సంప్రదించాలని కోరింది.

● వచ్చేనెల్లో కార్యదర్శులకు కంప్యూటర్ ప్రావీణ్య పరీక్ష

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు కంప్యూటర్ ప్రావీణ్య పరీక్షకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చేనెల 12, 13 తేదీల్లో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

● వైద్య పోస్టుల భర్తీకి 26న వాకిన్ ఇంటర్వ్యూ

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో 146 సూపర్‌స్పెషాలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఈనెల 26న వాకిన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం రెండు వరకూ వాకిన్ ఇంటర్వ్యూ ఉంటుంది. అర్హతలు ఇతర వివరాల కోసం వైద్యులు https:// dme. ap. nic. in, https:// apmsrb. ap. gov. in/ msrb/. వెబ్ సైట్‌ను సందర్శించవచ్చు.

● రాజమహేంద్రవరంలో ఫారెస్ట్ అకాడమీ

సాక్షి, అమరావతి: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని దివాన్ చెరువు సమీపంలో రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీని నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటవీ శాఖ ఉద్యోగులు వన్య ప్రాణి సంరక్షణపై శిక్షణ పొందేందుకు అనువైన వాతావరణం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశించారు.

ప్రభుత్వ విభాగాల విద్యుత్ బకాయిలపై సర్‌చార్జీల రద్దు

- ప్రభుత్వ ప్రతిపాదనకు ఏపీఈఆర్‌సీ ఆమోదం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు 2024–25 ఆర్థిక సంవత్సరంలో వినియోగించుకున్న విద్యుత్ బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కంలు) విధించిన సర్‌చార్జీలను రద్దు చేసేందుకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరంలో డిస్కంలకు దాదాపు రూ.4,782.33 కోట్ల విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా విభాగాల నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలను విడుదల చేయాలని ఇటీవల ప్రభుత్వాన్ని డిస్కంలు అభ్యర్థించాయి. అయితే, 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా విధించిన అన్ని సర్‌చార్జీలను మాఫీ చేయాలని ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా ఏపీఈఆర్‌సీని ప్రభుత్వం కోరింది. మొత్తం ప్రస్తుత వినియోగ (సీసీ) చార్జీలు రూ.3,176.52 కోట్లు కాగా, సర్‌చార్జీలు (డీపీఎస్) రూ.1,605.80 కోట్లు అని తెలియజేసింది. ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ఏపీఈఆర్‌సీ... రూ.1,605.80 కోట్ల సర్‌చార్జీలను మాఫీ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. మిగతా బకాయిలను ఈ ఏడాది ఏప్రిల్ 17 తేదీ నాటికి పూర్తిగా చెల్లించేలా వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని అమలులోకి తెస్తున్నట్లు వెల్లడించింది.

28న విద్యుత్ ఒప్పందాలపై ఆందోళనలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



అనంతపురంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి/అనంతపురం అర్బన్: రైతులకు నష్టం కలిగించేలా, వినియోగదారులపై భారం మోపేలా ఉన్న పునరుత్పాదక విద్యుత్ ఒప్పందాలను పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. ఆయన మంగళవారం అనంతపురంలో విలేకరులతో మాట్లాడుతూ పునరుత్పాదక విద్యుత్ ఒప్పందాల్లో రైతులకు భద్రత కల్పించే చర్యలు లేవని తెలిపారు. రైతుల నుంచి కంపెనీలు తీసుకున్న భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణం తీసుకుని ఎగ్గొడితే... ఆ నష్టాన్ని రైతులు భరించే విధంగా ఒప్పందాలు ఉన్నాయన్నారు. అదానీతో గత ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలపై ప్రతిపక్షంలో ఉండగా కోర్టులో కేసు వేసిన ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కాగా, విజయవాడలో డప్పు కళాకారులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఖండించారు.

ఫార్మా బాధితులను ఆదుకోవాలి

అనకాపల్లి జిల్లా పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో పరిశ్రమలకు ఆనుకొని ఉన్న కాలుష్య బాధిత తాడి గ్రామ ప్రజలకు భూసేకరణ చట్టం–2013 ప్రకారం ఇళ్లు, భూములకు పరిహారం, మేజర్లకు ప్యాకేజీ చెల్లించి, సురక్షిత ప్రాంతానికి తరలించి పునరావాసం కల్పించాలని వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన మంగళవారం సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు.

సాగుబడి
ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 18 నుంచి


తన వెదురు తోటలో శివాజీ రాజ్‌పుట్

ఎదురు లేని వెదురు

25 ఎకరాలు ఏటేటా రూ.25 లక్షలు!

వెదురు.. గ్రీన్ గోల్డ్.. అవును! ఈ విషయంలో మీకేమైనా సందేహం ఉందా? అయితే.. శివాజీ రాజ్‌పుట్ అనే అద్భుత ఆదర్శ వెదురు రైతు విశేష కృషి గురించి తెలుసుకోవాల్సిందే.

మహారాష్ట్రలోని ధూలే జిల్లాకు చెందిన శివాజీ 25 ఎకరాల్లో వెదురును చాలా ఏళ్ల నుంచి సాగు చేస్తూ ప్రతి ఏటా రూ. 25 లక్షలను సునాయాసంగా ఆర్జిస్తున్నారు. తనకున్న 50 ఎకరాల పొలంలో పాతిక ఎకరాల్లో 16 రకాల వెదురు తోటను పెంచుతున్నారు. మిగతా 25 ఎకరాలను ఇతర రైతులకు కౌలుకు ఇచ్చారు. వెదురు సాగులో కొద్దిపాటి యాజమాన్య చర్యలు తప్ప చీకూ చింతల్లేవు, పెద్దగా కష్టపడాల్సిందేమీ ఉండదు. ఏటేటా నిక్కచ్చిగా ఆదాయం తీసుకోవటమే అంటున్నారు శివాజీ. వెదరు సాగు ద్వారా పర్యావరణానికి బోలెడంత మేలు చేస్తున్న ఈ ఆదర్శ రైతు ఉద్యమ స్ఫూర్తితో బంజరు, ప్రభుత్వ భూముల్లో విరివిగా మొక్కలు నాటటం ద్వారా పర్యావరణానికి మరెంతో మేలు చేస్తున్నారు. ఆయన నాటిన 7 లక్షల చెట్లు ఆయన హరిత స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తూ ఆయనకు 30కి పైగా పర్యావరణ పరిరక్షణ పురస్కారాల పంట పండించాయి! ఇందిరా ప్రియదర్శిని వృక్షమిత్ర, యుఎస్ఏ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ వంటి పురస్కారాలు ఆయనకు లభించాయి. పెద్ద కమతాల్లో వెదురు సేద్యానికి సంబంధించి శివాజీ రాజ్‌పుట్ అనుభవాలు రైతులకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

శివాజీ రాజ్‌పుట్ వయసు 60 ఏళ్లు. వినూత్న రీతిలో వెదరును సాగు చేయటం ద్వారా, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయటం ద్వారా ఆయన తన జీవితాన్ని ఆకుపచ్చగా మార్చుకోవటమే కాదు ఇతరుల జీవితాలను కూడా ఆకుపచ్చగా మార్చుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు పాతికేళ్లగా విశేష కృషి చేస్తున్న శివాజీ గత ఆరేళ్లగా వెదురు తోటను సాగు చేస్తున్నారు. వాతావరణ ప్రతికూలతలను తట్టుకొనేలా వ్యవసాయాన్ని కొనసాగించటంలో, పర్యావరణ పరిరక్షణ కృషిలో, గ్రామీణాభివృద్ధి రంగంలో మహారాష్ట్రలో ఇప్పుడాయన ఒక మేరు పర్వతం అంటే అతిశయోక్తి కాదు. ఆయన చేస్తున్న కృషి భూతాపోన్నతిని తగ్గించడానికి ఎంతగానో దోహదపడుతోంది.

వెదురు సాగుకు శ్రీకారం..

రాజ్‌పుట్ గతంలో అందరు రైతుల మాదిరిగానే ఒకటో రెండో సీజనల్ పంటలను రసాయనిక వ్యవసాయ పద్ధతిలో పండించే వారు. అయితే, భారీ వర్షాలు, పెను గాలులు, కరువు వంటి విపరీత ప్రతికూల వాతావరణ పరిస్థితుల మూలంగా అనిశ్చితిలో కొట్టుమిట్టాడేవారు. 'భారీ వర్షాలు, పెను గాలులు, కరువు వంటి విపత్తులు వచ్చిపడినప్పుడు సాధారణ పంటలు సాగు చేస్తున్నప్పుడు ఒక్కోసారి పంట పూర్తిగా దెబ్బతినిపోయేది. కానీ, వెదురు తోట అలాకాదు. నాటిన ఒక సంవత్సరం తర్వాత నుంచి ఆదాయం వస్తూనే ఉంటుంది. ఏటేటా నిరంతరం పెట్టుబడుల అవసరమే ఉండదు..'అంటారు శివాజీ.

సాధారణ పంటల సాగును చుట్టుముట్టిన అనిశ్చితే తనను నిశ్చింతనిచ్చే వెదరు సాగువైపు ఆకర్షించిందంటారాయన. ఆయనకు 50 ఎకరాల భూమి ఉంది. 25 ఎకరాలను కౌలుకు ఇచ్చి, 25 ఎకరాల్లో వెదురు నాటారు. ఈ నిర్ణయమే తన వ్యవసాయాన్ని మేలి మలుపు తిప్పింది. 'వెదురు సాగులో విపరీత వాతావరణ పరిస్థితుల్లోనూ ఆందోళన చెందాల్సిందేమీ ఉండదు. వెదురు మొక్కలు వేరూనుకొనే వరకు మొదటి ఏడాది కొంచె జాగ్రత్తగా చూసుకోవాలి. ఆ తర్వాత పెద్ద పని గానీ, పెట్టుబడి గానీ అవసరం ఉండదు. మొదటి ఏడాది తర్వాత నేను పెద్దగా పెట్టిన ఖర్చేమీ లుదు. కానీ, ఏటా ఎకరానికి రూ. లక్ష ఆదాయం వస్తోంది. వెదురు తోట ద్వారా నాకు ఏటేటా రూ. 25 లక్షల ఆదాయం వస్తోంది..' అంటారు శివాజీ గర్వంగా!

వెదురు: ఆకుపచ్చని బంగారం

వెదరుకు ఆకుపచ్చని బంగారం అని పేరు. ఈ తోట సాగులో అంత ఆదాయం ఉంది కాబట్టే ఆ పేరొచ్చింది. 'ఈ భూగోళం మీద అతి త్వరగా



పెరిగే చెట్టు వెదురు! పర్యావరణానికి ఇది చేసే మేలు మరేఇతర చెట్టూ చెయ్యలేదు. ఇది 24 గంటల్లో 47.6 అంగుళాల ఎత్తు పెరుగుతుంది. ఇతర చెట్ల కన్నా 35% ఎక్కువ కార్బన్ డయాక్సయిడ్‌ను పీల్చుకొని 30% అదనంగా ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. భూతాపోన్నతిని ఎదుర్కొనే కృషిలో ఇందుకే వెదురు అతికీలకంగా మారింది' అని వివరించారు శివాజీ.

బహుళ ప్రయోజనకారి కావటం అనే మరో కారణం వల్ల కూడా వెదురు సాగు విస్తృతంగా వ్యాపిస్తోంది. రాజ్‌పుట్ తన తోటలో 19 రకాల వెదురును సాగు చేస్తున్నారు. ఒక్కో రకం వెదురు ఒక్కో పనికి ఎక్కువగా ఉపయోగపడుతుంది. అగరొత్తుల ఉత్పత్తి ఉపయోగపడేది ఒకటైతే, బొగ్గు తయారీకి మరొకటి, బయోమాస్ ఇంధనం ఉత్పత్తికి మరొకటి.. ఇలా ఒక్కో రకం ఒక్కో పనికి ఎక్కువగా పనికొస్తాయి. 'వెదురు బొంగులు, ఆకులు పెల్లెట్లు తయారు చేస్తారు. పొడర్లు బయోమాస్ ఇంధన ఉత్పత్తికి వాడుతారు. ఈ ఉత్పత్తులు పర్యావరణ హితమైనవి. సాధారణ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా వాడదగినవి అంటారు శివాజీ. వెదురును సాగు చేయటం దగ్గరే ఆయన ఆగిపోవటం లేదు. వెదురు బొంగులతో ఫర్నీచర్‌ను, అగరొత్తులను కూడా తానే తయారు చేయాలన్నది ఆయన సంకల్పం.

సుస్థిర జీవనోపాధిని అందించగలిగిన వెదురు సాగు ప్రయోజనాల గురించి ఆయన ఇతర రైతులను చైతన్యవంతం చేస్తున్నారు. '136 రకాల వెదురు వంగడాలు ఉన్నాయి. వాటిల్లో 19 రకాలను నేను సాగు చేస్తున్నా. ప్రతి రకానికి ప్రత్యేక లక్షణాలు, ఉపయోగాలు ఉన్నాయి. రకాన్ని బట్టి వెదురు బొంగుల బలం, బరువు ఆధారపడి ఉంటాయి. మన అవసరాన్ని బట్టి ఏ రకాలు కావాలో ఎంపిక చేసుకొని నాటుకోవటం ఉత్తమం' అనేది ఆయన సూచన. ఆచరణాత్మకంగా ఉండే ఆయన సూచనలు ఇతర రైతులను అనుసరించేలా చేస్తున్నాయి. మహరాష్ట్ర ప్రభుత్వం నుంచ వనశ్రీ పురస్కారంతో పాటు ఇందిరా ప్రియదర్శిన వృక్షమిత్ర అవార్డు వంటి మొత్తం 30 వరకు అవార్డులు ఆయనను వరించాయి. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని పొదుపుగా వాడుకోవటం వీలుకావటంతో పాటు వెదురు మొక్కలు ఏపుగా పెరగానికి కూడా ఇది ఉపయోగపడిందంటారాయన.

ఇతర రైతులకు ప్రేరణ

రాజ్‌పుట్ వెదురు తోట విజయగాథతో ప్రేరణ పొందిన రైతులు పలువురు ఆయనను అనుసరిస్తున్నారు. ధులే జిల్లాలోని షిర్పూర్ తాలూకాలో ఆయన సూచనల ప్రకారం 250 ఎకరాలకు వెదురు తోటలు విస్తరించాయి. పేపరు ఉత్పత్తికి వెదురు ఉపయోగపడుతుంది. స్థానికులకు, గ్రామీణ జనసముదాయాలకు వెదరు సాగు చక్కటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నదంటారాయన. భూమిని పర్యావరణానికి అనుగుణంగా వినియోగించడాన్ని ప్రోత్సహించదలిస్తే వెదురును విస్తృతంగా సాగు చేయించాలని సూచిస్తున్న రాజ్‌పుట్ వెదురు భవిష్యత్తు చాలా మెరుగ్గా ఉంటుందన్నారు. ఆయన 7 లక్షలకు పైగా ఇతరత్రా మొక్కలు నాటించటం వల్ల ఆ ప్రాంతంలో జీవవైవిధ్యం పెరిగింది. భూగర్భ జలమట్టం పూర్వస్థితికి పెరిగింది. వర్షానికి మట్టి కొట్టుకుపోవటం తగ్గింది. వన్యప్రాణులకు ఆవాసాలు పెరిగాయి.


తోటి రైతులను చైతన్యపరుస్తున్న శివాజీ రాజ్‌పుట్

వనశ్రీ ఆక్సిజన్ పార్కు

వనశ్రీ ఆక్సిజన్ పార్క్‌ను రాజ్‌పుట్ మూడేళ్ల క్రితం నిర్మించారు. చనిపోయిన తమ ప్రియతముల గౌరవార్థం ఇటువంటి వనశ్రీ ఆక్సిజన్ పార్కులు ప్రారంభించాలని ఆయన పిలుపునిచ్చారు. 'నా ప్రియతముల పుట్టిన రోజున మొక్కలు నాటుతున్నా. ఇతరులను కూడా ఇదే కోరుతున్నా' అన్నారాయన. వెదురు సాగు భవిష్యత్తు తరాల బాగు కోసం, బంగారు భవిష్యత్తు కోసం మనం ఇప్పుడు పెట్టే తెలివైన పెట్టుబడే అంటారాయన.

నిర్వహణ: పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్

స్ప్రే డ్రైడ్ అవొకాడో పౌడర్

టెక్నాలజీ



అవొకాడో పండులో పోష్టిక విలువలతో పాటు ఔషధ విలువలు కూడా మెండుగా ఉన్నాయి. ఇది సీజనల్ ఫ్రూట్. కొద్ది నెలలే అందుబాటులో ఉంటుంది. ఏడాది పొడవునా అందుబాటులో ఉండదు కాబట్టి, పొడిగా మార్చి పెట్టుకుంటే.. ఏడాదంతా వాడుకోవచ్చు.

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టీకల్చరల్ రీసెర్చ్ పండ్ల పరిశోధనా విభాగం అధిపతి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. జి. కరుణాకరన్, తదితర శాస్త్రవేత్తలు అవొకాడోపై విస్తృత పరిశోధన చేస్తున్నారు. ఐఐహెచ్ఆర్ అవొకాడో పండును ప్రాసెసింగ్ చేసి స్ప్రే డ్రయ్యింగ్ పద్ధతిలో పొడిగా మార్చే సాంకేతికతను రూపొందించింది.

అత్యంత నాణ్యమైన అవొకాడో పొడిని ఉత్పత్తి చేయటం ఈ సాంకేతికత ద్వారా సాధ్యమవుతుంది. గది సాధారణ ఉష్ణోగ్రతల్లో నిల్వ చేస్తే ఈ పొడి మూడు నెలల పాటు నాణ్యత దెబ్బ తినకుండా ఉంటుంది.

అవొకాడో పండును ఏడాది పొడవునా నిల్వ చేయటం కష్టం. అయితే, ఈ పొడిని నిల్వ చేయటం, రవాణా చేయటం సులభం. ఈ ఉత్పత్తికి మన దేశంలో, విదేశాల్లో కూడా మంచి గిరాకీ ఉంది. రూపాయి పెట్టుబడి పెడితే 1.78 రూపాయల ఆదాయాన్ని పొందటానికి స్ప్రే డ్రయ్యింగ్ సాంకేతికత ఉపయోగపడుతుందని ఐఐహెచ్ఆర్ చెబుతోంది. ఆసక్తి గల ఆహార పరిశ్రమదారులు ఐఐహెచ్ఆర్‌కు నిర్దేశిత ఫీజు చెల్లించి ఈ సాంకేతికతను పొంది అవొకాడో పొడిని తయారు చేసి అనేక ఉత్పత్తుల్లో వాడుకోవచ్చు లేదా దేశ విదేశాల్లో విక్రయించుకోవచ్చు. ఇతర వివరాలకు.. ఐఐహెచ్ఆర్ వెబ్‌సైట్ చూడండి.

ఆహారమే ఆరోగ్యం! ఇంటి పంటలే సోపానం!!

ఇంటిని పచ్చని పంటలు, మొక్కలతో నందన వనంగా మార్చిన విశ్రాంత ప్రధానోపాధ్యాయిని

ఇంటి పంట

ఆహారమే ఆరోగ్యం అనే సూత్రాన్ని నమ్మి.. ఇంటినే ఆరోగ్య దాయక పంటలు, మొక్కలతో నందన వనంగా మార్చారు మచిలీపట్నానికి చెందిన ఓ విశ్రాంత ప్రధానోపాధ్యాయిని. ఆమే ఎండీ ముంతాజ్‌బేగం. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని హైనీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయినిగా 2019లో ముంతాజ్‌బేగం ఉద్యోగ విరమణ చేశారు. సేంద్రియ ఇంటిపంటల సాగు ద్వారా ఆరోగ్యకరమైన సమాజానికి దోహదం చేస్తుందని ఆమె ఆచరణాత్మకంగా చాటి చెబుతున్నారు. తాను మొదట ఆచరించి, తర్వాత ఇతరులకు చెప్పాలన్న వ్యక్తిత్వం ఆమెది. ఇంటి నుంచి వచ్చే చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేస్తూ మొక్కలకు వేసి పెంచుతూ అధిక ఫలసాయాన్ని పొందుతున్నారు.

మునగాకు, బెల్లం కలిపి నీళ్లలో నానబెట్టి మొక్కలకు పోయటం.. పొగాకును నీళ్లలో వేసి రెండు, మూడు రోజులు నానబెట్టి మొక్కల వేర్లకు వేస్తే మట్టి ద్వారా వచ్చే తెగుళ్లు నివారించవచ్చని ఆమె తెలిపారు. పెసలు, మినుము, ఉలవలు, బార్లీ, నువ్వులు నానబెట్టి గ్రైండ్ చేసి నీళ్లలో కలిపి మొక్క వేళలో వేస్తే, మంచి దిగుబడి వస్తుందని ఆమె చెబుతున్నారు. ఈ విధంగా చేస్తే మొక్కలకు వ్యాధి నిరోధక శక్తి కూడా పెరుగుతుందన్నారు. ఆరోగ్యదాయకంగా పెంచుకున్న కూరగాయలు, పండ్లు తింటే ప్రాణాంతక వ్యాధుల బారి నుంచి కూడా తప్పించుకోవచ్చని ఆమె ఘంటాపథంగా చెబుతున్నారు. సేంద్రియ ఇంటిపంటలు ఆరోగ్యకరమైన సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.


మిద్దెపై మొక్కలను పరిశీలిస్తున్న ముంతాజ్ బేగం



మానసిక, శారీరక ఆరోగ్యం

ముంతాజ్ ఇంటి ఆవరణలో, మిద్దెపై ఎన్నో రకాల కూరగాయలు, పండ్ల మొక్కలను సేంద్రియ పద్ధతుల్లో పెంచుతూ కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవటంతో పాటు ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. మొక్కలను సంరక్షిస్తే మానసిక, శారీరక ఆరోగ్యం పొందవచ్చునని ఆమె చెబుతున్నారు. మామిడి, జామ, అరటి, డ్రాగన్, చెర్రీ, వాటర్ యాపిల్, నేరేడు, అంజూర, ఫ్యాషన్ ఫ్రూట్, పీ నట్ బటర్, బొప్పాయి పండ్ల మొక్కలతో పాటు పాలకూర, చుక్కకూర, ఆకుకూరల మొక్కలతో పాటు వంగ, టమాట, అలసంద, మునగ, అరటి, మల్బరీ ఆకులతో పాటు వంద రకాల క్రోటన్స్‌ను ఆమె తమ ఇంటి ఆవరణలో, మేడపైన పెంచుతున్నారు.

– అంబటి శేషుబాబు, సాక్షి, చిలకలపూడి (మచిలీపట్నం).


ముంతాజ్‌బేగం ఇంటి మిద్దెపై పెంచిన పలు రకాల పంటలు, పూల మొక్కలు

మొక్కలే ప్రాణం.. ఇంటిపంటల ధ్యానం!

మొక్కలే ప్రాణంగా ప్రతి రోజు నా దినచర్య ఉంటుంది. రోజు మూడు, మూడున్నర గంటలు వీటి సంరక్షణ కోసం వెచ్చిస్తుంటాను. మొక్కలను సంరక్షిస్తే సమాజం ఆరోగ్యం బాగుంటుందని, భవిష్యత్తు మన చేతిలోనే ఉందనేది అందరికీ తెలియజేయాలనేదే నా తపన. ముఖ్యంగా కూరగాయలు, పండ్ల తొక్కలు, ఇతర సేంద్రియ చెత్తను మునిసిపాలిటీ వారికి ఇవ్వకుండా, ఇంటిపట్టునే కంపోస్టు ఎరువుగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నాను. నర్సరీ నుంచే పిల్లలకు మొక్కలను పెంచటంపై అవగాహన కల్పిస్తే మంచి భవిష్యత్తు సమాజాన్ని సృష్టించుకోవచ్చు.

– ఎండీ ముంతాజ్ బేగం,
ఇంటి పంటల సాగుదారు,
విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, మచిలీపట్నం

బిజినెస్ రీల్

ఏఐ సేవలపై గూగుల్ క్లౌడ్‌తో టెక్ మహీంద్రా జట్టు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా కంపెనీల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని వేగవంతం చేసే దిశగా సేవలు అందించేందుకు గూగుల్ క్లౌడ్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఐటీ సర్వీసుల సంస్థ టెక్ మహీంద్రా వెల్లడించింది. ఏఐ ఆధారిత సొల్యూషన్స్ మీద పెట్టే పెట్టుబడులపై గరిష్ఠ ప్రయోజనాలను పొందడంతో పాటు మౌలిక సదుపాయాలను, డేటా వ్యవస్థను ఆధునీకరించుకునేందుకు కంపెనీలకు తోడ్పాటు అందించడానికి ఈ ఒప్పందం సహాయపడుతుంది.

బ్రూక్‌ఫీల్డ్ కార్ప్ యూనిట్ల విక్రయం

బైరెట్ హోల్డింగ్స్‌లో 5.13 శాతం అమ్మకం

న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్టీ ట్రస్ట్(బైరెట్) యూనిట్ల హోల్డింగ్స్‌లో 5.13 శాతాన్ని యూఎస్ సంస్థ బ్రూక్‌ఫీల్డ్ కార్ప్ విక్రయించింది. బీఎస్ఈ బల్క్‌డీల్ వివరాల ప్రకారం ఒక్కో యూనిట్ రూ. 283 ధర చొప్పున రెండు సంస్థల ద్వారా 5.13 శాతానికి సమానమైన 3.12 కోట్ల యూనిట్లు అమ్మివేసింది. వీటి విలువ రూ. 883 కోట్లు. ఈ లావాదేవీ తదుపరి బ్రూక్‌ఫీల్డ్ యూనిట్ల హోల్డింగ్ 26 శాతానికి పరిమితమైంది. అయితే బైరెట్‌లో అతిపెద్ద వాటాదారుగా కొనసాగనుంది. కాగా.. 360 వన్ పోర్ట్‌ఫోలియో మేనేజర్స్, 360 వన్ ప్రైమ్ సంయుక్తంగా 1.18 కోట్ల యూనిట్లను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 334 కోట్లు వెచ్చించింది.

పూనావాలా ఫిన్ సీవీ రుణాలు

ద్వితీయ, తృతీయ పట్టణాలలో సేవలు



ముంబై: సెక్యూర్డ్ రుణాల బిజినెస్‌లోకి ప్రవేశించడం ద్వారా ఎన్‌బీఎఫ్‌సీ పూనావాలా ఫిన్‌కార్ప్ ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తోంది. దీనిలో భాగంగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలలో వాణిజ్య వాహన(సీవీలు) రుణాలు అందించనుంది. కొత్త, వాడుకలో ఉన్న వాహనాలకు రుణాలు సమకూర్చనుంది. తొలి దశలో భాగంగా టైర్-2, టైర్-3 మార్కెట్లలో ప్రవేశించనున్నట్లు వెల్లడించింది. 12 రాష్ట్రాలలోని 68 ప్రాంతాలలో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు తెలియజేసింది. తదుపరి దశలో 20 రాష్ట్రాలలో 400 ప్రాంతాలకు రుణ సర్వీసులను విస్తరించనున్నట్లు వివరించింది. చిన్న, తేలికపాటి, భారీ వాణిజ్య వాహన నిర్వాహకులకు అవసరాలకు అనుగుణమైన ఫైనాన్సింగ్ సొల్యూషన్లు సమకూర్చనున్నట్లు తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-3-2025

విశాఖ	415-00
చిత్తూరు	470-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	435-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ICICIBANK	1,311.50	3.35
LT	3,271.00	3.07
SHRIRAMFIN	641.95	3
M&M	2,785.00	2.95
TATAMOTORS	678.8	2.69

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJFINSV	1,846.50	-1.34
TECHM	1,432.90	-0.5
BHARTIARTL	1,632.00	-0.44
RELIANCE	1,239.95	0.09
BPCL	262.2	0.3

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,227
ఎన్ఎస్ఈ	89,219
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,54,689
ఎఫ్ఐఐ	+ 695
డీఐఐ	+ 2,535

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66.77	$ 67.37
బ్రెంట్	70.53	$ 71.07

దివ్యాంగులకు కంపెనీల రెడ్ కార్పెట్..

మూడేళ్లుగా 30-40 శాతం పెరిగిన జాబ్ పోస్టింగ్స్

- బీమా, ఉక్కు తదితర రంగాల్లో అవకాశాలు
- 2030 నాటికి మరింతగా హైరింగ్

కోల్‌కతా: సామాజిక బాధ్యత, వ్యాపార వ్యూహాల్లో భాగంగా దేశీ కంపెనీలు దివ్యాంగులకు (పీడబ్ల్యూడీ) ఉద్యోగావకాశాలు కల్పించడంపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. దీంతో ఉక్కు, మైనింగ్ రంగాల నుంచి బీమా రంగం వరకు వివిధ సెగ్మెంట్లలో ఈ విషయంలో సానుకూల ధోరణులు నెలకొన్నాయని విశ్లేషకులు, పరిశ్రమ వర్గాలు తెలిపాయి. గత మూడేళ్లుగా ఈ తరహా ఉద్యోగాలకు చెందిన పోస్టింగ్స్ 30-40 శాతం పెరగడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నాయి. తమ మొత్తం ఉద్యోగుల్లో కనీసం ఒక్క శాతం స్థాయిలోనైనా పీడబ్ల్యూడీలను నియమించుకోవాలన్న లక్ష్యాన్ని సాధించినట్లు ఫ్యూచర్ జనరాలీ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ అనూప్ రావు తెలిపారు. పాలసీని ఏదో నామమాత్రంగా కాకుండా అర్థవంతంగా, బాధ్యతాయుతంగా అమలు చేయాలనేది తమ ఉద్దేశమని ఆయన వివరించారు. గత ఏడాది కాలంగా కంపెనీ పీడబ్ల్యూడీ సిబ్బంది సంఖ్య 16 ప్రాంతీయ శాఖల్లో 16 నుంచి 41కి పెరిగింది. ఇందులో 22 శాతం మంది మహిళలు ఉన్నట్లు రావు చెప్పారు. 2023 ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 50 కంపెనీల్లో కేవలం ఏడు సంస్థల్లో మాత్రమే ఒక్క శాతం మేర పీడబ్ల్యూడీ ఉద్యోగులున్నారని గణాంకాలు చెబుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడు కంపెనీలలోనూ నాలుగు సంస్థలు ప్రభుత్వ రంగానికే చెందినవై ఉండటాన్ని చూస్తే సమ్మిళితత్వ లక్ష్య సాధనలో కార్పొరేట్లు మరింతగా పాలు పంచుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తోందని రావు చెప్పారు.

మరోవైపు, తమ సంస్థలో 50 మంది పైగా పీడబ్ల్యూడీ సిబ్బంది ఫ్రంట్ ఎండ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని వేదాంత చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ మధు శ్రీవాస్తవ చెప్పారు. పలువురు దివ్యాంగ ఇంటర్న్‌లకు కూడా అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. అలాగే, దివ్యాంగులకు అనువైన పరిస్థితులను కూడా కల్పిస్తున్నట్లు శ్రీవాస్తవ చెప్పారు. ఇందులో భాగంగా వారి కోసం ర్యాంప్‌లు, ప్రత్యేకంగా దారులు, బ్రెయిలీ ఆధారిత ఎలివేటర్లు, టెక్స్ట్-టు-స్పీచ్ సాఫ్ట్‌వేర్ మొదలైనవి అందుబాటులో ఉంచుతున్నామని శ్రీవాస్తవ పేర్కొన్నారు. ప్రధానంగా మైనింగ్, స్మెల్టింగ్ తదితర కార్యకలాపాలు నిర్వహించే తమ సంస్థలో పీడబ్ల్యూడీలను టెక్నికల్ విధుల్లోకి తీసుకోవడంలో సవాళ్లు ఉన్నప్పటికీ, నైపుణ్యాల్లో శిక్షణనిచ్చి వారికి కూడా వీలైన విభాగాల్లో చోటు కల్పించడంపై దృష్టి పెడుతున్నట్లు వివరించారు. ఇక, ఉక్కు దిగ్గజం టాటా స్టీల్‌లో 100 మంది పైగా దివ్యాంగ ఉద్యోగులు ఉన్నట్లు కంపెనీ ప్రతినిధి తెలిపారు. గత 2-3 సంవత్సరాలుగా వీరి సంఖ్య క్రమంగా పెరిగిందని వివరించారు. మరింత సమ్మిళిత వాతావరణాన్ని సృష్టించే దిశగా తమ హైరింగ్ విధానాల్లో గణనీయంగా మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. సృజనాత్మకత, కొత్త ఆలోచనలకు పెద్ద పీట వేస్తూ వ్యాపారాలను పటిష్ఠం చేసుకునేందుకు కూడా ఇలాంటి ప్రయత్నాలు దోహదపడగలవని ప్రతినిధి వివరించారు.



జూనియర్, మధ్య స్థాయికే పరిమితం..

దివ్యాంగుల నియామకాలు పెరుగుతున్నప్పటికీ వారి హైరింగ్ ప్రధానంగా జూనియర్, మధ్య స్థాయి ఉద్యోగాల్లోనే ఉంటోందని మానవ వనరుల సర్వీసుల సంస్థ ర్యాండ్‌స్టాడ్ ఇండియా ఓ నివేదికలో తెలిపింది. సీనియర్, మేనేజ్‌మెంట్ బాధ్యతల్లో వారికి ప్రాతినిధ్యం తక్కువగానే లభిస్తోందని వివరించింది. ప్రస్తుతం ఉద్యోగాల్లో పీడబ్ల్యూడీల వాటా అంచనాలకు తగ్గట్లుగా లేకపోయినా కంపెనీల ప్రాధాన్యతలు మారే కొద్దీ భవిష్యత్తులో దివ్యాంగులకు అవకాశాలు మరింతగా లభించగలవని సంస్థ ఎండీ పి.ఎస్. విశ్వనాథ్ తెలిపారు. డీఈఐ విధానాల అమలు పెరుగుతుండటంతో ప్రతిభావంతులైన పీడబ్ల్యూడీలను నియమించుకోవడంపై కంపెనీలు మరింతగా దృష్టి పెడుతున్నాయని వివరించారు.

డీఈఐ విధానాల దన్ను..

పర్యావరణ, సామాజిక, గవర్నెన్స్ (ఈఎస్‌జీ) అంశాల ఆధారిత హైరింగ్ పెరుగుతుండటం, పీడబ్ల్యూడీ ఉద్యోగాలు కల్పించే సంస్థలకు ప్రభుత్వం నుంచి పన్నుపరమైన ప్రయోజనాల్లాంటి ప్రోత్సాహకాలు లభిస్తుండటం తదితర పరిణామాలతో 2030 నాటికి ఉద్యోగుల్లో దివ్యాంగుల వాటా మరింతగా పెరగనుందని మానవ వనరుల సంస్థ ఫస్ట్ మెరీడియన్ గ్లోబల్ సర్వీసెస్ సీఈవో మన్‌మీత్ సింగ్ తెలిపారు. బడా కార్పొరేషన్లు మొదలుకుని స్టార్టప్‌ల వరకు అన్ని సంస్థలూ వైవిధ్యానికి పెద్ద పీట వేస్తున్నట్లు వివరించారు. ఐటీ, రిటైల్, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా) తదితర రంగాల్లో రిమోట్, హైబ్రీడ్ వర్క్ విధానాలకు ఆస్కారం ఉండటంతో ఆయా సెగ్మెంట్లలో పీడబ్ల్యూడీలకు మరిన్ని అవకాశాలు లభించవచ్చని పేర్కొన్నారు. దేశీయంగా 7 కోట్ల మంది పైగా దివ్యాంగులు ఉన్నట్లుగా నివేదికలు చెబుతున్నప్పటికీ వారి ఉద్యోగిత రేటు కేవలం 0.4 శాతంగానే ఉంటోందని సింగ్ చెప్పారు. నియంత్రణ సంస్థల నిబంధనలతో పాటు వైవిధ్యం, సమానత్వం, సమ్మిళితత్వ (డీఈఐ) విధానాలను కార్పొరేట్లు అమలు చేస్తుండటంతో పీడబ్ల్యూడీల నియామకాలు పెరుగుతాయని వివరించారు. కంపెనీలు పాటించే సంస్కృతే .. భాగస్వాములు, కస్టమర్లు, ఉద్యోగులు, మొత్తం వ్యాపార వర్గాల్లో వాటికి గుర్తింపుగా ఉంటోందని అంతర్జాతీయ టెక్నాలజీ, డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సేవల సంస్థ ఎస్ఎల్‌బీ సర్వీసెస్ సీఈవో సచిన్ అలగ్ చెప్పారు.

పెరగనున్న బెంజ్, కియా కార్ల ధరలు

ముంబై: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ఇండియా మరోసారి కార్ల ధరల పెంపునకు సిద్ధమైంది. యూరో మారకంలో రూపాయి విలువ బలహీనత కొనసాగితే ఏప్రిల్ నుంచి తమ మోడల్ కార్ల ధరలను పెంచే వీలుందని కంపెనీ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ తెలిపారు. ''యూరో పోలిస్తే రూపాయి మారకపు విలువ 90 స్థాయి వద్ద ఉన్నప్పుడు కార్ల ధరలు నిర్ణయించాము. ఇప్పుడు యూరో 95 స్థాయికి చేరుకుంది. గణనీయంగా పెరిగిన మారకపు విలువ ఏప్రిల్ నుంచి కార్ల ధరల పెంపునకు దారి తీయోచ్చు'' అన్నారు. ఈ జనవరిలో మెర్సిడెస్ కార్ల ధరలు పెంచిన సంగతి తెలిసిందే. టెస్లా రాకపై అయ్యర్ స్పందిస్తూ... కొత్త సంస్థ రాక ఎప్పుడూ మార్కెట్ వృద్ధికి తోడ్పడుతుంది. డిమాండ్ పెంచే సంస్థలను స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. గతేడాది మెర్సిడెస్ బెంజ్ ఇండియా రికార్డు స్థాయిలో 19,565 కార్లు విక్రయించింది. అంతకు ముందు ఏడాది(2023)లో 17,408 యూనిట్లను అమ్మింది.



అదే బాటలో కియా ఇండియా

కియా ఇండియా సైతం కారు ధరల్ని పెంచేందుకు సిద్ధమైంది. అధిక కమోడిటీ ధరలు, ఇన్‌పుట్ వ్యయాలు, సప్లై సంబంధిత ఖర్చుల కారణంగా అన్ని మోడళ్ల వాహన ధరలను 3% వరకు పెంచుతున్నట్లు ప్రకటన ద్వారా తెలిపింది. కొత్త ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. ''పెరిగిన వ్యయ భారం కస్టమర్లపై పడకుండా ఉండేందుకు వీలైనంత వరకు ప్రయత్నం చేసినప్పటికీ.. కొంత భారాన్ని మాత్రం కస్టమర్లకు బదిలీ చేయాల్సి వస్తోంది. అని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హర్‌దీప్ సింగ్ బ్రార్ తెలిపారు.

ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రయాణాలు మరింత భారం

భారీగా యూడీఎఫ్ పెంపు ప్రతిపాదనలు

ముంబై: వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ముంబై విమానాశ్రయం ద్వారా ప్రయాణాలు మరింత భారం కానున్నాయి. యూజర్ డెవలప్‌మెంట్ ఫీజును (యూడీఎఫ్) భారీగా పెంచేలా ఎయిర్‌పోర్ట్ ఆపరేటరు ఎంఐఏఎల్ ప్రతిపాదనలు చేయడమే ఇందుకు కారణం. వీటి ప్రకారం ఇంటర్నేషనల్ ప్యాసింజర్లకు యూడీఎఫ్ రూ. 187 నుంచి ఏకంగా రూ. 650కి పెరగనుంది. ప్రస్తుతం దేశీ ప్యాసింజర్లకు యూడీఎఫ్ లేకపోయినప్పటికీ ఇకపై వారిపై కూడా రూ. 325 మేర యూడీఎఫ్ వడ్డించనున్నారు. ప్రతిపాదిత టారిఫ్ కార్డును ఎయిర్‌పోర్ట్ ఎకనమిక్ రెగ్యులేటరీ అథారిటీ (ఏఈఆర్ఏ) అనుమతుల కోసం సంస్థ సమర్పించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నియంత్రణ సంస్థ నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రతిపాదనలు ఉన్నట్లు వివరించాయి. వీటిపై తుది నిర్ణయానికి ముందు ఎయిర్‌పోర్ట్ సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయాలు తీసుకునేందుకు ఏఈఆర్ఏ మార్చి 25న సమావేశం కానుంది. మరోవైపు, ఎయిర్‌లైన్స్‌కి భారీగా ఊరటనిచ్చే దిశగా ఏఈఆర్ఏ వెబ్‌సైట్ ప్రకారం 2024-2029 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలానికి ల్యాండింగ్, పార్కింగ్ చార్జీలను 35 శాతం తగ్గించేలా ఎంఐఏఎల్ ప్రతిపాదనలు సమర్పించింది. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల జాబితాలో రెండో స్థానంలో ఉండే ముంబై విమానాశ్రయాన్ని ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ఎంఐఏఎల్) నిర్వహిస్తోంది. ఇందులో అదానీ గ్రూప్‌నకు 74 శాతం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు 26 శాతం వాటాలు ఉన్నాయి. ముంబై ఎయిర్‌పోర్టులో ఏటా 5.5 కోట్ల మంది ప్రయాణికుల సామర్థ్యంతో రెండు టెర్మినల్స్ ఉన్నాయి.



విమానాశ్రయ మౌలిక సదుపాయాలను, సాంకేతికతను మెరుగుపర్చుకునేందుకు ప్రతిపాదిత ఫీజులు ఉపయోగపడతాయని ఎంఐఏఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం ఒక్కో ప్రయాణికుడిపై రాబడి (వైపీపీ) రూ. 285గా ఉండగా సుమారు రూ. 332కి (18 శాతం) పెరగనుంది. వచ్చే అయిదేళ్లలో విమానాశ్రయంపై ఎంఐఏఎల్ రూ. 10,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది.

మరిన్ని శాఖల్లో బంగారం రుణాలు

- మార్కెట్ వాటా పెంచుకుంటాం
- శ్రీరామ్ ఫైనాన్స్ డిప్యూటీ ఎండీ అన్నుసెల్వన్

చెన్నై: ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్ బంగారం రుణాల్లో తన మార్కెట్ వాటాను పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. బంగారం రుణాల మార్కెట్ వచ్చే ఐదేళ్లలో రెట్టింపు అవుతుందన్న అంచనాల నేపథ్యంలో.. మరిన్ని శాఖల్లో బంగారం రుణాలను ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ డిప్యూటీ ఎండీ అన్నుసెల్వన్ తెలిపారు. ''2024-25 మూడో త్రైమాసికంలో తమిళనాడులోని పలు ప్రాంతాల్లో శ్రీరామ్ ఫైనాన్స్ నిర్వహణలోని బంగారం రుణ ఆస్తులు (ఏయూఎం) గణనీయంగా పెరిగాయి. మరింత స్థిరీకరణతో రానున్న త్రైమాసికాల్లో మార్కెట్ వాటాను పెంచుకోవాలని అనుకుంటున్నాం. ఇందులో భాగంగా మరిన్ని శాఖలకు బంగారం రుణాల వ్యాపారాన్ని విస్తరించనున్నాం'' అని వివరించారు. బంగారం రుణాలకు డిమాండ్ పెరిగిందని.. వ్యక్తులు, చిన్న వ్యాపార సంస్థలు వేగంగా నిధులు కోరుకుంటున్నట్టు చెప్పారు. దీంతో సంఘటిత రంగంలో బంగారం రుణ వ్యాపారం మరింత విస్తరించనున్నట్టు తెలిపారు. తమ బంగారం రుణ కస్టమర్లలో ఎక్కువ మంది మధ్యతరగతి వారేనని, వేతన జీవులు, చిన్న వ్యాపారులు, గ్రామీణ ప్రాంతాల్లోని వర్తకులు ఇందులో ఉన్నట్టు చెప్పారు. ఏక మొత్తంలో రుణ చెల్లింపులు, మూడు నెలలకోసారి వడ్డీ చెల్లించడం, నెలవారీ ఈఎంఐ ఇలా పలు రూపాల్లో బంగారం రుణాలను ఆఫర్ చేస్తున్నట్టు తెలిపారు. వేగంగా రుణాలు జారీ చేసేందుకు వీలుగా ప్రక్రియలను ఆటోమేట్ చేసినట్టు పేర్కొన్నారు.



స్థానిక కరెన్సీల్లో ద్వైపాక్షిక లావాదేవీలు

బ్యాంక్ ఆఫ్ మారిషస్‌తో ఆర్‌బీఐ ఒప్పందం

ముంబై: సీమాంతర లావాదేవీలను భారతీయ రూపాయి (ఐఎన్ఆర్), మారిషస్ రూపీ (ఎంయూఆర్) కరెన్సీల్లో నిర్వహించే వ్యవస్థను రూపొందించే దిశగా బ్యాంక్ ఆఫ్ మారిషస్, రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. మార్చి 12న దీన్ని కుదుర్చుకున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఇరు దేశాల ఎగుమతిదారులు, దిగుమతిదారులు తమ తమ దేశీయ కరెన్సీల్లో ఇన్వాయిస్‌లను రూపొందించేందుకు, చెల్లింపులు జరిపేందుకు ఇది ఉపయోగపడనుంది. కరెంట్ అకౌంట్ లావాదేవీలు, నిర్దిష్ట క్యాపిటల్ అకౌంట్ లావాదేవీలు ఈ పరిధిలోకి వస్తాయి. దీనితో ఐఎన్ఆర్-ఎంయూఆర్ మార్కెట్ మరింత పెరుగుతుందని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. ఇరు దేశాల మధ్య చారిత్రక, సాంస్కృతిక బంధాలతో పాటు ఆర్థిక బంధం కూడా మరింత పటిష్ఠమయ్యేందుకు ఇది దోహదపడుతుందని వివరించింది.

రిలయన్స్ క్యాపిటల్ కొనుగోలు పూర్తి: ఐఐహెచ్ఎల్

నేడు యాజమాన్య బదలాయింపు

ముంబై: రిలయన్స్ క్యాపిటల్ (ఆర్‌క్యాప్) కొనుగోలు ప్రక్రియ పూర్తయినట్లు ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్ఎల్) చైర్మన్ అశోక్ హిందుజా వెల్లడించారు. బిడ్ మొత్తాన్ని రుణదాతల ఖాతాలోకి బదిలీ చేసినట్లు తెలిపారు. బుధవారం యాజమాన్య బదలాయింపు ఉంటుందని వివరించారు. ఈ డీల్‌పై దాదాపు మూడేళ్లుగా కసరత్తు చేస్తున్నట్లు హిందుజా పేర్కొన్నారు. ఆర్‌క్యాప్ వ్యాపారాన్ని సమీక్షించి, అవసరమైతే నిధులను సమకూర్చడంపై నిర్ణయం తీసుకుంటామని వివరించారు. చిన్నా చితకా అనుబంధ సంస్థలు 39-40 వరకు ఉన్నాయని, వాటిల్లో చాలా మటుకు సంస్థలను కొత్త మేనేజ్‌మెంట్ విక్రయించవచ్చని హిందుజా చెప్పారు. బ్రోకింగ్, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ వ్యాపారాన్ని మాత్రం అట్టే పెట్టుకుంటుందని వివరించారు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశాల ప్రకారం మూడేళ్ల పాటు అదే పేరుతో వ్యాపారాలను కొనసాగించవచ్చని, కానీ తమ సొంత ఇండస్‌ఇండ్ బ్రాండ్‌తో అనుసంధానించడంపై కసరత్తు చేస్తున్నామని హిందుజా చెప్పారు. అనుసంధానానికి 6-9 నెలల సమయం పట్టొచ్చని వివరించారు. చెల్లింపుల విషయంలో డిఫాల్ట్ కావడం, గవర్నెన్స్‌లో లోపాలు తదితర అంశాల కారణంగా రిలయన్స్ క్యాపిటల్‌ను 2021లో రిజర్వ్ బ్యాంక్ నియమించిన అడ్మినిస్ట్రేటర్ తన ఆధీనంలోకి తీసుకున్నారు. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ (సీఐఆర్‌పీ) కింద 2023 ఏప్రిల్‌లో రూ. 9,650 కోట్లు ఆఫర్ చేసి ఐఐహెచ్ఎల్ విజయవంతమైన బిడ్డరుగా నిల్చింది.



ఐపీవోకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ రెడీ

- ఇన్నోవిజన్‌కూ సెబీ ఓకే
- నీల్‌సాఫ్ట్ ప్రాస్పెక్టస్ వెనక్కి

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు రెండు కంపెనీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జాబితాలో వైట్‌గూడ్స్ దిగ్గజం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియాతో పాటు మానవ వనరులు, టోల్‌ప్లాజా నిర్వాహక సర్వీసుల సంస్థ ఇన్నోవిజన్ లిమిటెడ్ చేరాయి. రెండు కంపెనీలు 2024 డిసెంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి. కాగా.. టెక్నాలజీ ఆధారిత ఇంజినీరింగ్ సర్వీసులు, సొల్యూషన్లు అందించే నీల్‌సాఫ్ట్ ప్రాస్పెక్టస్‌ను సెబీ వెనక్కి పంపింది. డిసెంబర్‌లో కంపెనీ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేయగా.. కారణం వెల్లడించకుండా సెబీ రిటర్న్ చేసింది. ఇతర వివరాలు చూద్దాం..

15 శాతం వాటా

దక్షిణ కొరియా దిగ్గజం ఎల్‌జీ అనుబంధ సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు సన్నద్ధమవుతోంది. ఇందుకు ఇప్పటికే రోడ్‌షోలు ప్రారంభించగా.. తాజాగా సెబీ నుంచి అనుమతి పొందింది. ఐపీవోలో భాగంగా 15 శాతం వాటాకు సమానమైన 10.18 కోట్ల షేర్లను మాతృ సంస్థ విక్రయానికి ఉంచనుంది. తద్వారా సుమారు రూ. 15,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీవో పూర్తయితే కార్ల తయారీ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా తదుపరి దేశీయంగా లిస్టయిన రెండో దక్షిణ కొరియా దిగ్గజంగా ఎల్‌జీ నిలవనుంది. హ్యుందాయ్ గతేడాది అక్టోబర్‌లో లిస్టయింది. ఎల్‌జీ ఇండియా ప్రధానంగా వాషింగ్ మెషీన్లు, లెడ్ టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్స్ తదితర పలు కన్జూమర్ ప్రొడక్టులను విక్రయించే విషయం విదితమే. దేశీయంగా నోయిడా, పుణేలలో తయారీ యూనిట్లను కలిగి ఉంది.



రుణ చెల్లింపులకు: టోల్‌ప్లాజా మేనేజ్‌మెంట్ సర్వీసుల కంపెనీ ఇన్నోవిజన్ లిమిటెడ్ ఐపీవోలో భాగంగా రూ. 255 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు మరో 17.72 లక్షల షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా మానవ వనరులు, క్లయింట్లకు దేశవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ, టోల్ ప్లాజా మేనేజ్‌మెంట్ తదితర సర్వీసులు సమకూర్చుతోంది.

98 శాతం దీర్ఘకాలిక ఇన్వెస్టర్లే

ఎన్ఎస్ఈ సీఈవో చౌహాన్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశీ స్టాక్ మార్కెట్లో అత్యధిక శాతంమంది దీర్ఘకాలిక ఇన్వెస్టర్లేనని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఎండీ, సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ స్పష్టం చేశారు. మార్కెట్‌లో లావాదేవీలు నిర్వహించే 11 కోట్లమందిలో కేవలం 2 శాతమే డెరివేటివ్స్‌లో పాలు పంచుకుంటుంటారని వివరించారు. మార్కెట్ పార్టిసిపెంట్లలో 98 శాతంమంది దీర్ఘకాలానికి మదుపు చేసేవారేనని పేర్కొన్నారు. ఇది దేశీయంగా క్రమశిక్షణ కలిగిన పెట్టుబడుల పద్ధతిని సూచిస్తున్నట్లు తెలియజేశారు. వెరసి మెజారిటీ ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక పెట్టుబడులకే కట్టుబడుతుంటారని తెలియజేశారు. తద్వారా ఇటీవల సింగపూర్‌లో జరిగిన బృంద చర్చలో భారత స్టాక్ మార్కెట్లు ప్రధానంగా ఊహాజనిత(స్పెక్యులేటివ్) ట్రేడింగ్‌పైనే ఆధారపడి కదులుతుంటాయన్న అభిప్రాయాలకు చెక్ పెట్టారు. పెట్టుబడులులేని పెట్టుబడిదారీవిధానం ప్రాధాన్యత సంతరించుకుంటున్నట్లు చౌహాన్ పేర్కొన్నారు. ఈ అంశంపై ఇలా స్పందించారు. 'సంప్రదాయబద్ధంగా చూస్తే భారీ పెట్టుబడుల ద్వారా మాత్రమే సంపద సృష్టి జరుగుతుందన్నది వాస్తవమే అయినా ఇటీవల ఆధునిక సాంకేతికతలు రూల్స్‌ను తిరగరాస్తున్నాయి. ఏఐ, బ్లాక్‌చెయిన్, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ తదితరాలు కనీస పెట్టుబడితోనే వ్యాపార విస్తరణకు దారి చూపుతున్నాయి. వెరసి ఎకనామిక్ మోడల్ సంప్రదాయ పెట్టుబడి ఆవశ్యకత విధానాల నుంచి దూరం జరుగుతోందంటూ' వివరించారు.

టొరంట్ చేతికి గుజరాత్ టైటన్స్

ఐపీఎల్ ఫ్రాంచైజీలో 67 శాతం వాటా

న్యూఢిల్లీ: ఐపీఎల్ క్రికెట్ ఫ్రాంచైజీ గుజరాత్ టైటన్స్‌లో మెజారిటీ వాటా కొనుగోలును పూర్తి చేసినట్లు హెల్త్‌కేర్, ఎనర్జీ రంగ దిగ్గజం టొరంట్ గ్రూప్ తాజాగా పేర్కొంది. పీఈ సంస్థ సీవీసీకి చెందిన ఇరెలియా కంపెనీ పీటీఈ నుంచి 67 శాతం వాటాను సొంతం చేసుకున్నట్లు వెల్లడించింది. సుప్రసిద్ధ టీ20 క్రికెట్ లీగ్ ఐపీఎల్ కొత్త సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో వాటా కొనుగోలుకి ప్రాధాన్యత ఏర్పడింది. బీసీసీఐసహా అన్ని అవసరమైన అనుమతులూ ఇందుకు లభించినట్లు తెలియజేసింది. అయితే వాటా కొనుగోలు సంబంధిత ఫైనాన్షియల్ వివరాలు వెల్లడించలేదు.

మెస్సీ లేకుండానే...

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనా స్టార్ ప్లేయర్, కెప్టెన్ లయనెల్ మెస్సీకి తొడ కండరాల్లో గాయమైంది. ఫలితంగా 2026 ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా ఈ వారంలో ఉరుగ్వే, బ్రెజిల్ జట్లతో జరిగే మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్‌లో మెస్సీ ఇంటర్ మయామి క్లబ్ జట్టుకు ఆడుతున్నాడు. ఆదివారం అట్లాంటా యునైటెడ్ జట్టుతో జరిగిన మ్యాచ్ సందర్భంగా మెస్సీ గాయపడ్డాడు. దక్షిణ అమెరికా జోన్‌లో ప్రస్తుతం అర్జెంటీనా 25 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఈనెల 21న ఉరుగ్వేతో, 25న బ్రెజిల్‌తో అర్జెంటీనా తలపడుతుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే అర్జెంటీనా ప్రపంచకప్ బెర్త్‌ను ఖాయం చేసుకుంటుంది. ఈ రెండు మ్యాచ్‌లకు మెస్సీతోపాటు ఇతర అగ్రశ్రేణి ఆటగాళ్లు పాలో దిబాలా, మోంటియెల్, సెల్సో కూడా అర్జెంటీనాకు అందుబాటులో ఉండటం లేదు. 10 దేశాలు పోటీపడుతున్న దక్షిణ అమెరికా జోన్‌లో టాప్–6లో నిలిచిన జట్లు నేరుగా ప్రపంచకప్‌కు అర్హత పొందుతాయి. ఏడో స్థానంలో నిలిచిన జట్టుకు ప్లే ఆఫ్ మ్యాచ్ ఆడే అవకాశం లభిస్తుంది. మెస్సీ సారథ్యంలో అర్జెంటీనా జట్టు ఖతర్‌లో జరిగిన 2022 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచింది.




హారిక

హారిక ఖాతాలో తొలి విజయం

నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి చెస్ నాలుగో అంచె టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక తొలి విజయం నమోదు చేసుకుంది. మంగళవారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో హారిక 27 ఎత్తుల్లో ఓల్గా బడెల్కా (ఆస్ట్రియా)పై గెలుపొందింది. మరోవైపు భారత్‌కే చెందిన ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ తొలి పరాజయాన్ని చవిచూసింది. అనా ముజిచుక్ (ఉక్రెయిన్)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో దివ్య 66 ఎత్తుల్లో ఓడిపోయింది. ఏడుగురు గ్రాండ్‌మాస్టర్లు, ముగ్గురు అంతర్జాతీయ మాస్టర్లు (ఐఎం) తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీలో పోటీపడుతున్నారు. నాలుగో రౌండ్ తర్వాత హారిక 2.5 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో, దివ్య 1.5 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉన్నారు.



షఫాలీ 'హ్యాట్రిక్'

క్వార్టర్ ఫైనల్లో హరియాణా ● మహిళల అండర్-23 వన్డే ట్రోఫీ

హటి: డాషింగ్ బ్యాటర్ షఫాలీ వర్మ జాతీయ టోర్నీలో బంతితో మెరిసింది. మహిళల అండర్-23 వన్డే ట్రోఫీలో 'హ్యాట్రిక్' వికెట్లతో అదరగొట్టింది. దీంతో హరియాణా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో హరియాణా జట్టు 6 వికెట్ల తేడాతో కర్ణాటకపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు 49.3 ఓవర్లలో 217 పరుగుల వద్ద ఆలౌటైంది. ఇన్నింగ్స్ 44వ ఓవర్ వేసిన షఫాలీ వర్మ (3/20) ఐదో బంతికి సలోని (50 బంతుల్లో 30; 4 ఫోర్లు), ఆరో బంతికి సౌమ్య వర్మ (0)లను అవుట్ చేసింది. మళ్లీ 46వ ఓవర్ వేసిన ఆమె తొలి బంతికే నమిత డిసౌజా (1)ను బౌల్డ్ చేయడంతో 'హ్యాట్రిక్' పూర్తయ్యింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన హరియాణా 42 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసి గెలిచింది. ఓపెనింగ్ చేసిన షఫాలీ (18) తక్కువ స్కోరుకే పరిమితం కాగా, సోనియా (79 బంతుల్లో 66; 8 ఫోర్లు), తనీషా (77 బంతుల్లో 77 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలతో రాణించారు. ఇటీవలే ముగిసిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో షఫాలీ ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున విశేషంగా రాణించింది. అయితే ఫైనల్లో ఢిల్లీ మళ్లీ ఓడి వరుసగా మూడోసారి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ముంబై ఇండియన్స్ రెండో డబ్ల్యూపీఎల్ టైటిల్‌ను సాధించింది. ఈ సీజన్ లీగ్ టాప్ స్కోరర్లలో ఆమె 304 పరుగులతో నాలుగో స్థానంలో నిలిచింది. ఈమె కంటే ముందు వరుసలో నాట్ సివర్ (523), ఎలీస్ పెరి (372), హేలీ మాథ్యూస్ (307) ఉన్నారు. భారత బ్యాటర్లలో షఫాలీనే టాప్ స్కోరర్! గతేడాది టి20 ప్రపంచ కప్ అనంతరం జట్టులో స్థానం కోల్పోయిన ఆమె తిరిగి జాతీయ జట్టులోకి వచ్చేందుకు పట్టుదలగా రాణిస్తోంది.

'పెళ్లి కార్నర్'లో భారత హాకీ స్టార్లు

షట్లర్లు సైనా నెహ్వాల్–పారుపల్లి కశ్యప్, ఆర్చర్లు దీపిక కుమారి–అతాను దాస్, హాకీ క్రీడాకారులు మౌనిక–ఆకాశ్‌దీప్... ఇలా పెళ్లాడిన ప్లేయర్ల జాబితాలో కొత్తగా మహిళా డిఫెండర్ ఉదిత దుహాన్, పురుషుల ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్‌లు కూడా చేరనున్నారు. భారత ప్లేయర్ల పెళ్లి బాజా ఇప్పటికే మోగుతోంది. శుక్రవారం (21న) జరిగే వేడుకలో మన్‌దీప్–ఉదితలు వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు.

21న ఉదితను వివాహం చేసుకోనున్న మన్‌దీప్ సింగ్





జలంధర్: మైదానంలో గోల్స్ కోసం ప్రత్యర్థులతో పోరాడే భారత హాకీ ప్లేయర్లు మన్‌దీప్ సింగ్, ఉదిత దుహాన్‌లు కాసేపు పెనాల్టీ కార్నర్లు, పెనాల్టీ స్ట్రోక్‌లు పక్కనబెట్టి, చేతుల్లోని హాకీ స్టిక్‌లకు సెలవిచ్చి కళ్యాణ మాలలు పట్టుకునేందుకు సిద్ధమయ్యారు. జలంధర్ (పంజాబ్)కు చెందిన మన్‌దీప్... హిస్సార్ (హరియాణా) అమ్మాయి ఉదితతో కలిసి ఏడడుగులు నడువనున్నాడు. భారత హాకీకి రెండు కన్నుల్లాంటి పంజాబ్, హరియాణా రాష్ట్రాలకు చెందిన ప్లేయర్ల మధ్య ఈ నెల 21న అంగరంగ వైభవంగా వివాహ వేడుక జరుగనుంది. ఈ మేరకు ఇద్దరి ఇళ్లు, కళ్యాణశోభను సంతరించుకున్నాయి. వీళ్లిదరి పెళ్లికి సంబంధించిన ప్రి–వెడ్డింగ్ షూట్ ఫొటోల్ని సామాజిక సైట్లలో పోస్ట్ చేశారు. 27 ఏళ్ల ఉదిత 2017లో జాతీయ జట్టుకు ఎంపికైంది. డిఫెండర్‌గా 127 మ్యాచ్‌ల్లో కీలక పాత్ర పోషించింది. ప్రత్యర్థి స్ట్రయికర్లను గోల్స్ చేయకుండా నిరోధించే ఆమె 14 గోల్స్ కూడా చేసింది. 30 ఏళ్ల ఫార్వర్డ్ ప్లేయర్ మన్‌దీప్ 2013లో భారత్ తరఫున అంతర్జాతీయ హాకీలో ఆరంగేట్రం చేశాడు. 15 ఏళ్లుగా 260 మ్యాచ్‌లాడిన మన్‌దీప్ 120 గోల్స్‌తో సత్తాచాటుకున్నాడు. పంజాబ్ పోలీస్ శాఖలో అతను డీఎస్పీగా ఉన్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన భారత జట్టులో మన్‌దీప్ సభ్యుడు కాగా... త్రుటిలో కాంస్యం కోల్పోయి నాలుగో స్థానంతో తృప్తి పడిన మహిళల జట్టులో ఉదిత ఉంది. పెళ్లికి ముందరి సంగీత్ కార్యక్రమం నేడు జరుగనుంది. భారత పురుషులు, మహిళా జట్ల ప్లేయర్లు ఈ వేడుకలో గానబజానాతో హడావుడి చేయనున్నారు. 21న ఉదయం 9 గంటలకు సిక్కు మత సంప్రదాయం ప్రకారం పెళ్లి జరుగనుంది. అనంతరం మరుసటి రోజు ఘనంగా రిసెప్షన్ (విందు)కు హాకీ, ఇతర క్రీడా ప్రముఖులు హాజరుకానున్నారు.

మేలో పాకిస్తాన్‌లో బంగ్లాదేశ్ పర్యటన

కరాచీ: పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు ఈ ఏడాది మే నెలలో పాకిస్తాన్‌లో పర్యటించనుంది. ఈ టూర్ లో భాగంగా బంగ్లాదేశ్ జట్టు పాకిస్తాన్‌తో 3 టి20లు, 3 వన్డేలు ఆడనుంది. ఏప్రిల్ 11 నుంచి మే 18 వరకు పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 10వ సీజన్ జరగనుండగా... ఇది ముగిసిన అనంతరం బంగ్లాదేశ్‌తో పాక్ జట్టు మ్యాచ్‌లు ఆడనుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్ త్వరలోనే విడుదల కానుంది. లాహోర్, ముల్తాన్, ఫైసలాబాద్‌లో ఈ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం ఉంది. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా పాకిస్తాన్‌కు వచ్చిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చైర్మన్ ఫారూఖ్ అహ్మద్‌తో చర్చించిన అనంతరం ఇరు దేశాల బోర్డులు ఈ సిరీస్‌లకు పచ్చజెండా ఊపాయి. ద్వైపాక్షిక సిరీస్ కోసం చివరిసారిగా గతేడాది పాకిస్తాన్‌లో పర్యటించిన బంగ్లాదేశ్ జట్టు రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2–0తో క్లీన్ స్వీప్ చేసింది.

అందరి కళ్లు ఛెత్రిపైనే!

నేడు మాల్దీవులుతో మ్యాచ్‌లో పునరాగమనం



షిల్లాంగ్: అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు గుడ్‌బై చెప్పిన సునీల్ ఛెత్రి తిరిగి మైదానంలో దిగేందుకు సిద్ధమయ్యాడు. ఇందులో భాగంగా బుధవారం మాల్దీవులుతో జరిగే అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో టీమిండియా జెర్సీతో గోల్ కొట్టేందుకు సై అంటున్నాడు. 40 ఏళ్ల ఛెత్రి వీడ్కోలు అనంతరం టీమిండియా ప్రదర్శన పేలవంగా మారింది. దీంతో తిరిగి జట్టుకు సేవలందించేందుకు రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు మాజీ కెప్టెన్ ఇటీవలే ప్రకటించాడు. ఛెత్రి రాకతో భారత జట్టు బలం పెరిగింది. బుధవారం మాల్దీవులుతో జరిగే పోరులో అతనే ప్రధాన ఆకర్షణ కానున్నాడు. అందరికళ్లు అతనిపైనే కేంద్రీకృతం కానున్నాయి. నేడు మ్యాచ్ జరిగే వేదికపైనే బంగ్లాదేశ్‌తో ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయర్ పోరు కూడా జరుగనుంది. ఈ నేపథ్యంలో నేటి మ్యాచ్ భారత్‌కు ఏఎఫ్‌సీ ఈవెంట్‌కు సన్నాహకంగా ఉపయోగపడనుంది.

మహిళల ప్రపంచకప్ కోసం...

ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేసే పనిలో బీసీసీఐ



న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత్ ఆతిథ్యమివ్వబోయే మహిళల వన్డే ప్రపంచ కప్ కోసం ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేసేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఈ నెల 22న కోల్‌కతాలో బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం కానుంది. అదే రోజు అక్కడి ఈడెన్ గార్డెన్స్‌లో ఈ సీజన్ ఐపీఎల్ ఆరంభ మ్యాచ్ జరుగనుంది. ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడుతుంది. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందే బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ ఆర్గనైజింగ్ కమిటీపై కసరత్తు పూర్తి చేయనుంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పొగాకు, మద్యం ఉత్పాదనలకు సంబంధించిన ప్రకటనలు క్రికెట్ మైదానంలో నిషేధం, క్రిప్టో కరెన్సీపై గట్టి నిర్ణయం కూడా తీసుకుంటారు. ఈ ఏడాది అక్టోబర్‌లో వన్డే మెగా ఈవెంట్ జరగాల్సి ఉంది. ఈ కౌన్సిల్ అజెండాలో కమిటీ ఏర్పాటుతో పాటు మెగా ఈవెంట్ వేదికలపై కూడా చర్చించనున్నట్లు తెలిసింది. దీంతో పాటు 2025–26 దేశవాళీ సీజన్ షెడ్యూల్‌ను ఖరారు చేస్తారని, అలాగే భారత పర్యటనకు వచ్చే వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలతో ద్వైపాక్షిక సిరీస్ వేదికలపై కూడా అపెక్స్ కౌన్సిల్ చర్చించే అవకాశముందని బోర్డు వర్గాలు తెలిపాయి. పొగాకు, మద్యం ప్రకటనలపై ఇదివరకే ఐపీఎల్ సీజన్‌లో విధించిన నిషేధాన్ని బోర్డు అమలు చేయనుంది. టీమిండియా పురుషుల జట్టు వన్డే వరల్డ్‌కప్‌ను రెండుసార్లు గెలిచినప్పటికీ... భారత మహిళల జట్టుకు మాత్రం ఆ 'కప్' అందని ద్రాక్షే అయ్యింది. ఫైనల్ చేరిన రెండు సార్లు కూడా అమ్మాయిల జట్టు రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సేన కనీసం ఈ ఏడాదైన సొంతగడ్డపై ప్రపంచకప్ గెలిచి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతుందో చూడాలి!

అథ్లెట్ అర్చనపై నాలుగేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్ రేసుల్లో పాల్గొనే భారత అథ్లెట్ అర్చనా జాదవ్ డోపీగా తేలడంతో నాలుగేళ్ల నిషేధం విధించారు. ఈ మహిళా రన్నర్ నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకునట్లు పరీక్షల్లో తేలింది. గత డిసెంబర్‌లో పుణేలో జరిగిన 'హాఫ్ మారథాన్' సందర్భంగా ఆమె నుంచి రక్త మూత్ర నమూనాల్ని సేకరించి ల్యాబ్‌లో పరీక్షించగా నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు నివేదిక వచ్చింది. ఈ డోపింగ్ వ్యవహారంపై గత నెల 25న ప్రపంచ అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ)కు సంజాయిషీ ఇచ్చిన 20 ఏళ్ల అర్చన క్షమాపణలు కోరుతూ శిక్షకు సమ్మతించిది. దీంతో తదుపరి విచారణ, అప్పీల్ అవసరం లేకుండానే నిషేధాన్ని అమలు చేయనున్నారు. డోపింగ్ నిరోధక నిబంధనల్ని అతిక్రమించడంతో ఈ జనవరి 7 నుంచే ఆమెపై విధించిన సస్పెన్షన్ మొదలైందని ఏఐయూ ఒక ప్రకటనలో తెలిపింది. అర్చన 'బి' శాంపిల్ పరీక్ష నివేదికకు ముందే తన తప్పును ఒప్పుకుంది. అస్వస్థత నుంచి త్వరగా కోలుకునే ప్రయత్నంలో తీసుకున్న మందుల వల్లే ఇలా జరిగిందని ఆమె సంజాయిషీలో వివరించింది. అర్చనా జాదవ్ 10 వేల మీటర్లు, 3000 మీటర్లు, హాఫ్ మారథాన్ పరుగులో పాల్గొనడం ద్వారా వెలుగులోకి వచ్చింది. అర్చన గత ఏడాది జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 10 వేల మీటర్ల రేసులో ఐదో స్థానాన్ని దక్కించుకుంది. ఢిల్లీ హాఫ్ మారథాన్‌లో 13వ స్థానంలో, 2023లో జాతీయ అండర్–20 చాంపియన్‌షిప్‌లో 3000 మీటర్ల రేసులో 8వ స్థానంలో నిలిచింది.



వెల్‌డన్: ఇటలీలో ఇటీవల జరిగిన స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ వింటర్ గేమ్స్‌లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులతో మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలిశారు. ఈ సందర్భంగా భారత క్రీడాకారుల ప్రదర్శనపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వారి ప్రతిభతో దేశం గర్వపడేలా చేశారని ఆయన ప్రశంసించారు. స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ వింటర్ గేమ్స్‌లో భారత క్రీడాకారులు మొత్తం 33 పతకాలు సాధించారు.

సీఫెర్ట్, అలెన్ మెరుపులు

రెండో టి20లోనూ పాకిస్తాన్‌పై న్యూజిలాండ్ ఘనవిజయం


సీఫెర్ట్

డ్యునెడిన్ (న్యూజిలాండ్): ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన న్యూజిలాండ్ జట్టు... పాకిస్తాన్‌పై వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. 5 మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై గెలుపొందింది. గత మ్యాచ్‌లో పేలవ ఆటతీరు కనబర్చిన పాకిస్తాన్... ఈసారి కాస్త మెరుగైన ప్రదర్శన చేసినా... విజయం మాత్రం సాధించలేకపోయింది. ఫలితంగా ఆతిథ్య న్యూజిలాండ్ సిరీస్‌లో 2–0తో ముందంజ వేసింది. మైదానం చిత్తడిగా ఉండటంతో నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. కొత్త కెప్టెన్ సల్మాన్ ఆఘా (28 బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా... షాదాబ్ ఖాన్ (26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), షాహీన్ అఫ్రిది (22 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. హసన్ నవాజ్ (0), ఖుష్‌దిల్ షా (2), మొహమ్మద్ హారిస్ (11), ఇర్ఫాన్ ఖాన్ (11), అబ్దుల్ సమద్ (11) విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ, బెన్ సియర్స్, నీషమ్, ఇష్ సోధి తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 13.1 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టిమ్ సీఫెర్ట్ (22 బంతుల్లో 45; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు), ఫిన్ అలెన్ (16 బంతుల్లో 38; 1 ఫోర్, 5 సిక్స్‌లు) దంచికొట్టారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 4.4 ఓవర్లలోనే 66 పరుగులు జోడించి జట్టుకు మెరుగైన ఆరంభం అందివ్వడంతో ఛేదన సులువైంది. షాహీన్ అఫ్రిది తొలి ఓవర్‌ను మెయిడెన్ చేసిన అనంతరం తదుపరి 12 బంతుల్లో న్యూజిలాండ్ ఓపెనర్లు 7 సిక్సర్లు బాదడం గమనార్హం. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ 2–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో టి20 మ్యాచ్ శుక్రవారం ఆక్లాండ్‌లో జరుగుతుంది.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: హారిస్ (సి) డఫీ (బి) సియర్స్ 11; హసన్ (సి) చాప్‌మన్ (బి) డఫీ 0; సల్మాన్ (సి) చాప్‌మన్ (బి) సియర్స్ 46; ఇర్ఫాన్ ఖాన్ (సి) సియర్స్ (బి) సోధి 11; ఖుష్‌దిల్ షా (సి) మిచెల్ హే (బి) సోధి 2; షాదాబ్ ఖాన్ (సి) మిషెల్ (బి) డఫీ 26; అబ్దుల్ సమద్ (సి) మిషెల్ (బి) నీషమ్ 11; జహాందాద్ ఖాన్ (సి) ఫౌల్క్‌స్ (బి) నీషమ్ 0; షాహీన్ అఫ్రిది (నాటౌట్) 22; రవూఫ్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (15 ఓవర్లలో 9 వికెట్లకు) 135. వికెట్ల పతనం:** 1–1, 2–19, 3–50, 4–52, 5–76, 6–110, 7–111, 8–114, 9–135, **బౌలింగ్:** జేకబ్ డఫీ 3–0–20–2; ఫౌల్క్‌స్ 3–0–32–0; సియర్స్ 3–0–23–2; నీషమ్ 3–0–26–2; ఇష్ సోధి 2–0–17–2; బ్రేస్‌వెల్ 1–0–14–0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫెర్ట్ (సి) షాహీన్ అఫ్రిది (బి) అలీ 45; ఫిన్ అలెన్ (ఎల్బీ) (బి) జహాందాద్ ఖాన్ 38; చాప్‌మన్ (సి) జహాందాద్ (బి) ఖుష్‌దిల్ షా 1; మిషెల్ (సి) షాదాబ్ (బి) రవూఫ్ 14; నీషమ్ (సి) సమద్ (బి) రవూఫ్ 5; హే (నాటౌట్) 21; బ్రేస్‌వెల్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు: 8; **మొత్తం (13.1 ఓవర్లలో 5 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1–66, 2–87, 3–91, 4–97, 5–132. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 3–1–31–0; అలీ 2–0–34–1; ఖుష్‌దిల్ షా 3–0–16–1; రవూఫ్ 3–0–20–2; జహాందాద్ ఖాన్ 1.1–0–23–1; షాదాబ్ ఖాన్ 1–0–10–0.


రాష్ట్రపతిభవన్ ప్రాంగణంలోని అమృత్‌ఉద్యాన్ తోటను మంగళవారం సందర్శించాక రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఇతర సుప్రీంకోర్టు జడ్జీలు, వారి సతీమణులు

మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు తీసుకొస్తాం

రాజ్యసభలో మంత్రి నిర్మలా సీతారామన్ • కాంగ్రెస్ మణిపూర్‌ను గాలికొదిలేసిందన్న మంత్రి

న్యూఢిల్లీ: మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు అన్ని విధాలా సహకరిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మణిపూర్ బడ్జెట్‌పై జరిగిన చర్చకు మంత్రి రాజ్యసభలో మంగళవారం సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ డబుల్ ఇంజన్ సర్కారు మణిపూర్‌లో హింసను నిర్మూలించలేకపోయిందన్నారు. రాష్ట్రాన్ని ప్రధాని మోదీ సందర్శించకపోవడంపై ప్రతిపక్షాల విమర్శలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. గతంలో హింస జరిగినప్పుడూ ప్రధానులు మణిపూర్‌ను సందర్శించలేదన్నారు. 1993లో మణిపూర్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉండగా నాగాలు, కుకీల మధ్య ఘర్షణల్లో 750 మంది మరణించారని, 350 గ్రామాలను తగులబెట్టారని, అయినా అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావుగానీ, హోంమంత్రి శంకర్‌రావు చవాన్‌గానీ రాష్ట్రాన్ని సందర్శించలేదని చెప్పారు. మణిపూర్‌పై దృష్టి సారించడం లేదని ప్రతిపక్షాల విమర్శలనూ ఆమె తిప్పికొట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా బందులు, దిగ్బంధాలతో రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి జనం అల్లాడినా ఏ మంత్రి రాష్ట్రానికి వెళ్లలేదని గుర్తుచేశారు. కానీ, అక్కడ సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే కేంద్ర మంత్రులు రాష్ట్రంలో పర్యటించారని వెల్లడించారు. ప్రతిపక్షాల కంటే సున్నితంగానే ఆలోచిస్తున్నామని, దేశంలోని ప్రతిరాష్ట్రం గురించి శ్రద్ధ తీసుకుంటున్నామని వెల్లడించారు. మణిపూర్ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పూర్తి మద్దతునిస్తున్నామని తెలిపారు. శాంతి నెలకొల్పితే ఆర్థికంగా మెరుగుపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో చెదరుమదురు ఘటనలు మినహా.. మరణాలు, అగ్ని ప్రమాదాలు, కాల్పుల సంఘటనలు, నిరసనల కేసులు తగ్గుముఖం పట్టాయని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణకు 286 కంపెనీల సీఏపీఎఫ్, 137 కంపెనీల ఆర్మీ, అస్సాం రైఫిల్స్.. రాష్ట్ర పోలీసులతో కలిసి పని చేస్తున్నాయన్నారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్నారని, జాతీయ రహదారిపై స్వేచ్ఛగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మణిపూర్ బడ్జెట్ వివరాలను ఆమె సభకు వెల్లడించారు. ఒకరిపై ఒకరు వేలెత్తిచూపుతూ ఉంటే మణిపూర్‌కు ఎవరూ సాయం చేయరన్నారు.

మేకిన్ ఇండియా మంచి ఫలితాలను ఇస్తోంది

మేకిన్ ఇండియా పథకంపై ప్రతిపక్షాల విమర్శలను మంత్రి తోసిపుచ్చారు. మేకిన్ ఇండియా భారత రక్షణ రంగాన్ని నికర ఎగుమతిదారుగా మార్చిందని ఆమె చెప్పారు. తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని, అవి మంచి ఫలితాలను ఇస్తున్నాయని సీతారామన్ తెలిపారు. తన వాదనను బలపరిచే డేటాను సభకు తెలియజేశారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు మంచి ఫలితాలను ఇచ్చాయని, ఇప్పటివరకూ రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయని, 9.5 లక్షల మందికి ఉపాధినిచ్చాయని చెప్పారు.


రాజ్యసభలో మాట్లాడుతున్న నిర్మలా సీతారామన్

తృణమూల్ ఎంపీల వాకౌట్

మణిపూర్ బడ్జెట్‌పై చర్చలో భాగంగా మంత్రి ఇచ్చిన సమాధానంపై తృణమూల్ కాంగ్రెస్ అసంతృప్తిని వ్యక్తం చేసింది. మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ పార్టీ ఎంపీలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడారు. మణిపూర్ బడ్జెట్‌పై మంత్రి ఇచ్చిన సమాధానం కంటితుడుపుగా ఉందని ఎంపీ సుస్మితాదేవ్ అన్నారు. 22 నెలలుగా మణిపూర్ కాలిపోతుంటే అల్లర్లను ఆపడానికి ప్రధాని, హోంమంత్రి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.



‘ఉపాధి హామీ’ని ప్రభుత్వం నీరుగారుస్తోంది

- బడ్జెట్ కేటాయింపుల్లో కోత పెడుతున్నారు
- రాజ్యసభలో ప్రస్తావించిన సోనియా గాంధీ
- కనీస రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచాలని డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెచ్చిన ప్రతిష్టాత్మక మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ సర్కార్ నెమ్మదిగా నీరుగారుస్తోందని కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ విమర్శించారు. మంగళవారం రాజ్యసభలో జీరో అవర్‌లో ఉపాధిహామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు, దేశవ్యాప్తంగా అమలుతీరును సోనియా ప్రస్తావించారు. ‘మా ప్రభుత్వం 2005లో తెచ్చిన ఉపాధి హామీ చట్టం లక్షలాది మంది గ్రామీణ పేదలకు భరోసాగా నిలిచింది. అయితే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని క్రమపద్ధతిలో నిర్వీర్యంచేయడం చాలా ఆందోళనకరం. ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు రూ.86,000 కోట్ల వద్దే స్తబ్దుగా ఆగిపోయాయి. ఇది చాలా ఆందోళనకరం. ద్రవ్యోల్బణ సంబంధ సవరణల తర్వాత ఈ కేటాయింపుల్లో మరో రూ.4,000 కోట్లు తెగ్గోశారు. కేటాయించిన నిధుల్లో కేవలం 20 శాతం నిధులను మాత్రమే పాత బకాయిలు తీర్చేందుకు వినియోగించనున్నారు. ఇంత తక్కువ కేటాయింపులతో పాత బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారు?’’అని కేంద్రాన్ని ఆమె నిలదీశారు. తప్పనిసరిగా ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్లను అమలు చేయడం మానుకోవాలని, వేతన చెల్లింపులలో నిరంతర జాప్యాలను మానుకోవాలని, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతన రేట్లు పెంచాలని ఆమె ప్రభుత్వానికి సూచించారు.

ఉపాధి హామీ కూలీలకు రోజువారీ కనీస వేతనం రూ. 400కు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. ఉపాధి పథకాన్ని కార్యక్రమాన్ని కొనసాగించడానికి, విస్తరించడానికి నిధులను పెంచాలని ఆమె కోరారు. ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ మరియు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ వంటి తప్పనిసరి అవసరాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి కనీసం 150 రోజుల పని దొరికేలా చూడాలని కేంద్రాన్ని కోరారు. లక్షలాది మంది గ్రామీణ పేదలకు గౌరవప్రదమైన ఉపాధి, ఆర్థిక భద్రతను అందించే కార్యక్రమం కోసం ఈ చర్యలు అవసరమని సోనియా సూచించారు.

బెంగళూరులో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: అమెరికా బిలియనీర్ జార్జి సోరోస్‌కు చెందిన ప్రైవేట్ ఫండింగ్ ఏజెన్సీ ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్(ఓఎస్ఎఫ్), దాని పెట్టుబడుల సంస్థ ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఫండ్(ఈడీఎఫ్) నుంచి నిధులు స్వీకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థల కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ నిధుల విషయంలో చట్టాలను ఉల్లంఘించినట్లు చెబుతున్నారు. దర్యాప్తులో భాగంగా మంగళవారం బెంగళూరులోని 8 ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) నిబంధనలు ఉల్లంఘనకు గురయ్యాయని అధికారులు పేర్కొన్నారు. ఇండియాలో పని చేస్తున్న కొన్ని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలతోపాటు అస్పదా ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ అక్రమ మార్గంలో నిధులు పొందినట్లు వెల్లడించారు. గత దశాబ్ద కాలంలో ఇండియాలోని సంస్థలకు జార్జి సోరోస్ కంపెనీలు రూ.350 కోట్ల నిధులను ఎఫ్‌డీఐ రూపంలో అందజేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

వైష్ణోదేవి ఆలయంలో భద్రతా లోపం..

పిస్తోల్‌తో లోపలికి వెళ్లిన మహిళ

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని ప్రఖ్యాత మాత వైష్ణోదేవి ఆలయంలో భద్రతా లోపం బట్టబయలైంది. ఢిల్లీకి చెందిన జ్యోతి గుప్తా అనే భక్తురాలు తూటాలు లోడ్ చేసిన పిస్తోల్‌తో ఆలయంలోకి ప్రవేశించింది. చివరి నిమిషంలో గుర్తించిన భద్రతా సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. ఈ సంఘటన ఈ నెల 15వ తేదీన రాత్రి జ్యోతి గుప్తా పిస్తోల్‌తో ఆలయంలోకి ప్రవేశించింది. జ్యోతి రిటైర్డ్ పోలీసు కానిస్టేబుల్ అని గుర్తించారు. గర్భగుడి వద్దనున్న చెక్ పాయింట్ వద్ద తనిఖీ చేయగా పిస్తోల్, అందులో ఆరు తూటాలు లభించాయి. నిబంధనలు అతిక్రమించినందుకు జ్యోతి గుప్తాను అరెస్టు చేశారు.

కొనసాగిన అల్లర్లు

- నాగ్‌పూర్‌లో అర్ధరాత్రి వేళ మరిన్ని కొత్త ప్రాంతాలకు విస్తరణ
- పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ

నాగ్‌పూర్: మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని కూల్చాలంటూ మహారాష్ట్రలో విశ్వ హిందూ పరిషత్ ఇచ్చిన పిలుపుతో నాగ్‌పూర్‌లో సోమవారం మధ్యాహ్నం మొదలైన ఆందోళనలు అర్ధరాత్రికల్లా తీవ్రరూపం దాల్చాయి. తొలుత కేవలం నిరసన కార్యక్రమాలతో మొదలై చివరకు ఘర్షణలు, హింసాత్మక ఘటనకు దారితీశాయి. సోమవారం ఉదయం ఔరంగజేబు దిష్టిబొమ్మను బజరంగ్ దళ్ దగ్ధంచేస్తే అదే నిరసనల్లో ఒక వర్గానికి చెందిన మతగ్రంథాన్ని తగలబెట్టారన్న పుకార్లు వ్యాపించడంతో ఆ వర్గంవాళ్లు మధ్యాహ్నంవేళ పలు ప్రాంతాల్లో ఇళ్లపై దాడిచేయడం, పోలీసులపై రాళ్లు రువ్వడం, పోలీసులతో ఘర్షణ తదనంతర పరిణామాలతో సెంట్రల్ నాగ్‌పూర్‌లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అది సోమవారం అర్ధరాత్రికల్లా తీవ్రరూపం దాల్చింది. కోత్వాలీ, గణేష్‌పేట్, ఛిత్నీస్ పార్క్‌లలో చెలరేగిన అల్లర్లను సోమవారం రాత్రికల్లా పోలీసులు ఎలాగోలా అదుపులోతెచ్చారు. అయితే కొత్త ప్రాంతాల్లో అల్లర్లు ఒక్కసారిగా చెలరేగడంతో పరిస్థితి చేయిదాటిపోయింది. సోమవారం అర్ధరాత్రి వేళ పాత భండారా రోడ్‌లోని హన్సపురీ ప్రాంతంలో అల్లర్లు చోటుచేసుకున్నాయి. అల్లరి మూకలు పలు వాహనాలకు నిప్పుపెట్టాయి. కొన్ని ఇళ్లతోపాటు ఒక ఆస్పత్రికి నాశనంచేశారు. ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి 50కి పైగా ఆందోళనకారులను అరెస్ట్‌చేశామని నాగ్‌పూర్ పోలీస్ కమిషనర్ రవీందర్ కుమార్ సింఘాల్ చెప్పారు. మతవిశ్వాసాలను గాయపరిచారన్న ఫిర్యాదుతో మహారాష్ట్ర, గోవా ఇతర రాష్ట్రాల వీహెచ్‌పీ తాత్కాలిక కార్యదర్శి గోవింద్ షిండే, బజరంగ్‌దళ్ నేతలపై గణేష్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. అమోల్ ఠాక్రే, మహాజన్, తయానీ, రజత్ పురీ, సుశీల్, వృషభ్ ఆర్ఖేల్, శుభమ్, ముకేశ్‌ల పేర్లనూ అందులో చేర్చారు.

34 మంది పోలీసులకు గాయాలు

అల్లర్లను అదుపులోకి తెచ్చేందుకు రంగంలోకి దిగిన పోలీసులపైకి ఆందోళనకారుల రాళ్లు రువ్వారు. నిరసనకారులతో ఘర్షణలో 34 మంది పోలీసులు గాయపడ్డారు. వీరిలో ముగ్గురు డీసీపీలు ఉన్నారు. ఒక సీనియర్ పోలీసుఅధికారిపై ఒక ఆందోళనకారుడు గొడ్డలితో దాడికి యత్నించాడు. భల్దార్‌పురీ ఘటనలో ఐదుగురు పౌరులకు గాయాలయ్యాయి. వీరిలో ఒకరిని ఐసీయూలో చేర్పించారు. మరిన్ని ప్రాంతాలకు అల్లర్లు విస్తరించకుండా ఉండేందుకు కొత్వాలి, గణేష్‌పేట్, తెహసిల్, లకడ్‌గంజ్, పచ్‌పావోలీ, శాంతినగర్, సక్కర్‌దారా, నందన్‌వన్, ఇమామ్‌బడా, యశోధరా నగర్, కపిల్ నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో కర్ఫ్యూ విధించారు.

ప్రణాళికతో దాడి చేశారు: డిప్యూటీ సీఎం

‘‘మోమిన్‌పురీ, ఛిట్నీస్ నగర్, ఇతర ప్రాంతాల్లో ఒక వర్గంవారు పక్కా ప్రణాళికతో దాడులు చేశారు. దాడి చేసి ఇళ్లను ధ్వంసంచేశారు. సాధారణ ప్రజల ఇళ్లతోపాటు పోలీసు ఉన్నతాధికారులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. మత ఘర్షణలు జరగాలని కుట్ర పన్నారు. వీళ్లను ఊరికే వదిలిపెట్టం’’అని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అన్నారు. పుకార్లను నమ్మొద్దని, ప్రజలు శాంతంగా ఉండాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, నాగ్‌పూర్ నుంచి కేంద్రమంత్రి అయిన బీజేపీ నేత నితిన్ గడ్కరీ కోరారు. ఛావా సినిమా తర్వాత ఔరంగజేబు పట్ల ఒక వర్గంలో ఆగ్రహావేశాలు పెరిగాయని, తాజా అల్లర్లకు ఇది కూడా పరోక్ష కారణమని సీఎం అన్నారు.

న్యాయవ్యవస్థను బేఖాతరు చేయబోతున్నారా?

తాజా పరిణామంలో ట్రంప్ పాలనాయంత్రాంగం ధోరణిపై మొదలైన కొత్త అనుమానాలు

అమెరికా న్యాయవ్యవస్థ కంటే తమకు అసాధారణ అధికారాలు దఖలుపడ్డాయనే భావన డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగంలో గూడుకట్టుకుపోయిందనే వార్త ఇప్పుడు అమెరికాలో చర్చనీయాంశమైంది. సోమవారం యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జేమ్స్ ఇ.బోస్‌బర్గ్ ఇచ్చిన ఆదేశాలను ట్రంప్ సర్కార్ పూచికపుల్లలాగా తీసిపక్కన పడేయడమే ఇందుకు ప్రధాన కారణం. వలసదారులను వెనిజులాకు చెందిన నేరాల గ్యాంగ్ సభ్యులుగా ఆరోపిస్తూ దేశ బహిష్కరణ చేయడం సబబుకాదని జడ్జి బోస్‌బర్గ్ ఆగ్రహం వ్యక్తంచేయడం తెల్సిందే. ఎల్ సాల్వెడార్‌కు వలసదారులను విమానాల్లో తరలించడం తక్షణం ఆపేయాలని కేసు విచారణ సందర్భంగా ప్రభుత్వాన్ని జడ్జి ఆదేశించారు. అయితే ఆ సమయానికే రెండు విమానాలు బయల్దేరాయని, గాల్లో ఉన్నాయని ప్రభుత్వ న్యాయవాదులు చెప్పారు. అయితే విమానాలను వెంటనే వెనక్కి తిప్పాలని జడ్జి ఆదేశించారు. అయినాసరే ప్రభుత్వ న్యాయవాదులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరించడం వెనుక ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యధోరణి దాగుందని తెలుస్తోంది. పైగా దేశ అధ్యక్షుడి నిర్ణయాన్ని కేవలం ఒక జిల్లా జడ్జి ప్రశ్నించేంత సాహసం చేస్తారా? అన్న దురహంకారం అధికారయంత్రాంగంలో ఎక్కువైందని వార్తలొచ్చాయి.

తానే సర్వశక్తివంతుడినంటున్న ట్రంప్

యుద్ధకాలంలో ప్రయోగించాల్సిన కఠిన చట్టాలు, నిబంధనలను శాంతికాలంలో ఉపయోగించాల్సిన అవసరం ఏమొచ్చిందని పలువురు న్యాయనిపుణులు వాదిస్తున్నారు. అక్రమ వలసదారులను తరిమేసేందుకు ఏకంగా 18వ శతాబ్దంనాటి విదేశీ శత్రుచట్టాన్ని హఠాత్తుగా అమలుచేయాల్సిన పనేముందని పలువురు ప్రశ్నిస్తున్నారు. అయితే తాను మాత్రమే అమెరికాను కాపాడగలనన్న విశ్వాసంతో రెండో దఫా భారీ మెజారిటీతో తనను ప్రజలు గెలిపించారన్న అతివిశ్వాసం ట్రంప్‌లో పెరిగిందని, అందుకే సర్వశక్తివంతుడినన్న ధీమాతో అసాధారణ నిర్ణయాలు తీసుకుంటున్నారని వార్తలొచ్చాయి. సొంత పార్టీలో తన వ్యతిరేకవర్గాన్ని పూర్తిగా అణిచేసి, విపక్ష డెమొక్రాట్ల చేతిలో ఏ రాష్ట్రంలోనూ ప్రభుత్వరంగంలోని ఏ విభాగం లేకుండా చేసి ఏకఛత్రాధిపత్యంగా దేశాన్ని ఏలాలని ట్రంప్ భావిస్తున్నారు. ఇదే ధోరణి ఆయన పాలనాయంత్రాంగంలోని సీనియర్ సభ్యుల్లోనూ కనిపిస్తోంది. సోమవారం సీఎన్ఎన్ ‘కేసీ హంట్’కార్యక్రమంలో శ్వేతసౌధం సీనియర్ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ సైతం ట్రంప్‌లాగా మాట్లాడారు. ‘‘అమెరికాలోకి విదేశీయుల చొరబాట్లను అడ్డుకునే, వారిని తరిమేసే సర్వాధికారం అధ్యక్షుడికే ఉంటుంది. ఈ అంశాన్ని సమీక్షించే హక్కు కోర్టులకు లేదు. అందులోనూ ఒక జిల్లా జడ్జికి అస్సలు లేదు’’అని ఆయన అన్నారు. ట్రంప్ సైతం జడ్జి బోస్‌బర్గ్‌ను తిడుతూ ‘ట్రూత్‌సోషల్’ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. ‘‘ఆ జడ్జిని అభిశంసించాల్సిందే. ఆయన పెద్ద సమస్యగా తయారయ్యారు. నిరసకారుడిగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. గత ఏడాది ఎన్నికల్లో మొత్తం 7 స్వింగ్ రాష్ట్రాల్లో పాపులర్ ఓటు సాధించి నా నాయకత్వం, నా నిర్ణయం ఎంత సరైనవో నిరూపించుకున్నా. అధ్యక్షుడిగా నేను తీసుకున్న నిర్ణయాల చట్టబద్ధతను సమీక్షించే అధికారం జడ్జి కంటే నాకే ఉందని తాజా ఎన్నికలు నిరూపించాయి’’అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

జిల్లా జడ్జిని తిడుతూ అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ఒక పోస్ట్‌పెట్టడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ మంగళవారం స్పందించారు. ‘‘గత రెండు శతాబ్దాల చరిత్రను గమనిస్తే కోర్టుల నిర్ణయాన్ని విబేధించేందుకు కార్యనిర్వాహణ వ్యవస్థ ‘అభిశంసన’అనే విధానాన్ని ప్రయోగించడం ఎంతమాత్రం సబబు కాదు’’అని వ్యాఖ్యానించారు.

జడ్జీలపై కన్నెర్ర

పాలక రిపబ్లికన్లు తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు చెప్పే జడ్జీలను సాగనంపాలని చూస్తున్నారు. బూస్‌బర్గ్‌కు వ్యతిరేకంగా అభిశంసన తెస్తే బాగుంటుందని ఇప్పటికే ఇద్దరు దిగువసభ రిపబ్లికన్ సభ్యులు వ్యాఖ్యానించారు. ట్రంప్‌కు సంబంధించన కేసులో ఆయనకు వ్యతిరేకంగా తీర్పులిచ్చిన జడ్జీలు అమీర్ అలీ, పాల్ ఈగల్‌మేయర్‌లను అభిశంసించాలని దిగువసభలో గతంలో వ్యాఖ్యానించారు. 2019 జూలైలో అధ్యక్షుడిగా ట్రంప్ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ‘‘అధ్యక్షుడిగా నాకేం కావాలన్నా నచ్చినట్లు చేసుకునే హక్కు రాజ్యాంగంలోని రెండో ఆర్టికల్ నాకు ప్రసాదించింది’’అని వ్యాఖ్యానించడం తెల్సిందే.

- సాక్షి, నేషనల్ డెస్క్

బైడెన్ పిల్లలకు ఇక రక్షణ ఉండదు: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాజీ అధ్యక్షుడు జో బైడెన్ విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన పిల్లలకు సీక్రెట్ సర్వీస్ సంరక్షణను నిలిపివేశారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని తన సోషల్ వేదిక ‘ట్రూత్ సోషల్’గా ప్రకటించారు. ‘బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ భద్రత కోసం 18 మంది ఏజెంట్లు, ఆయన కుమార్తె ఆష్లే బైడెన్ కోసం 13 మంది ఏజెంట్లు పనిచేస్తున్నారు. వారికి భద్రతను తక్షణమే తొలగిస్తున్నాం’ అని ట్రంప్ పేర్కొన్నారు. దీనిపై బైడెన్ కార్యాలయం ఇంకా స్పందించలేదు. మాజీ అధ్యక్షులు, వారి జీవిత భాగస్వాములు ఫెడరల్ చట్టం కింద జీవితకాలం సీక్రెట్ సర్వీస్ భద్రతలో ఉంటారు. 16 ఏళ్ల పైబడిన వారి పిల్లలకు మాత్రం పదవి నుంచి దిగిపోగానే భద్రతను నిలిపివేస్తారు. అయితే.. తను పదవి నుంచి తప్పుకొనే ముందు పలు కీలక నిర్ణయాలు తీసుకున్న బైడెన్.. పిల్లల సంరక్షణను జూలై వరకు పొడిగించారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం జాన్ ఎఫ్ కెనెడీ సెంటర్ ఫర్ ది పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌ను సందర్శించిన ట్రంప్‌ను ‘మాజీ అధ్యక్షుడి కొడుకు హంటర్ బైడెన్ రక్షణను రద్దు చేస్తారా’ అని మీడియా ప్రశ్నించింది. ఈ విషయం గురించి వినడం ఇదే మొదటిసారని చెప్పిన ట్రంప్.. పరిశీలిస్తానని చెప్పారు. సాయంత్రానికి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మాట్లాడే అవకాశం ఇవ్వలేదు: రాహుల్

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ పాలనలోని ‘న్యూ ఇండియా’లో ప్రతిపక్ష నేతకు లోక్‌సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. మంగళవారం లోక్‌సభ వాయిదా పడిన అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం సభలో ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వాలన్నారు. కానీ, తాను మాట్లాడేందుకు స్పీకర్ అనుమతించలేదని ఆక్షేపించారు. కుంభమేళాపై మోదీ చేసిన వ్యా ఖ్యలను తాను సమర్థిస్తున్నట్లు తెలిపారు. కానీ, తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయినవారికి కనీసం నివాళులు అర్పించకపోవడం దారుణమని విమర్శించారు.

లాలూకు ఈడీ సమన్లు

పాట్నా: ‘ల్యాండ్ ఫర్ జాబ్స్’ మనీ లాండరింగ్ కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. లాలూ బుధవారం పాట్నాలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు హాజరు కావాలని ఆదేశించింది. కొన్ని అదనపు విషయాలు తెలుసుకునేందుకు తాజా విచారణ అవసరమని ఈడీ పేర్కొంది. కాగా, ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి, లాలూ భార్య రబ్రీదేవి, వారి పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ మంగళవారం ఈడీ ఎదుట హాజరయ్యారు. సీబీఐ ఫిర్యాదు మేరకు ఈడీ గతేడాది లాలూ కుటుంబ సభ్యులపై మనీలాండరింగ్ కేసులో చార్జి షీటు దాఖలు చేసింది. చార్జి షీటులో రబ్రీదేవి, మీసా భారతి, హేమా యాదవ్‌లతో పాటు మరికొంతమందిని నిందితులుగా చేర్చింది.

విపక్షం ఔరంగజేబు అభిమాన సంఘం: బీజేపీ

న్యూఢిల్లీ: కుంభమేళాపై లోక్‌సభలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం పట్ల నిరసన వ్యక్తం చేసిన విపక్ష కూటమిపై అధికార బీజేపీ మంగళవారం నిప్పులు చెరిగింది. విపక్ష కూటమి ఔరంగజేబు అభిమాన సంఘమని బీజేపీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది ఆరోపించారు. కుంభమేళాలో కాంగ్రెస్ సహా విపక్ష నాయకులు పాల్గొనలేదని తప్పుపట్టారు. మొఘల్ పాలకుడు ఔరంగజేబు గొప్పతనాన్ని పొగిడే నాయకులు నేడు కుంభమేళాను ప్రధానమంత్రి పొగిడితే సహించలేకపోతున్నారని ధ్వజమెత్తారు.

కొత్త ఆర్థికంలో 15 ప్రయోగాలే ఇస్రో లక్ష్యం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) రాబోయే ఆర్థిక సంవత్సరంలో 15 ప్రయోగాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులోభాగంగా 11 వాణిజ్యపర ప్రయోగాలు, నాలుగు దేశీయ అవసరాలకు సంబంధించిన ప్రయోగాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటితోపాటే గగన్‌యాన్ ప్రాజెక్ట్ సంబంధ ప్రయోగాన్నీ ఇస్రో శాస్త్రవేత్తలు చేపట్టనున్నారు. ఇస్రో అనుబంధ న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ సంయుక్తంగా 11 వాణిజ్యపర ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ప్రణాళికలు సిద్ధంచేశాయి. వివిధ రకాల రాకెట్ల ద్వారా బ్లూబర్డ్, ప్రోబా-3, టీడీఎస్-1, ఆద్య, దృష్టి, సన్‌స్కార్‌దామ్, డీఎస్ పీ30, పరీక్షిత్, టీబీడీ, అజిస్టా-60 అనే ఉపగ్రహాలను ప్రయోగించనున్నారు. అగ్నికుల్ ప్రైవేట్ సంస్థకు చెందిన రెండు అగ్నిబాన్ రాకెట్లు, స్కైరూట్ సంస్థకు చెందిన మూడు ప్రయోగాలు చేయనున్నారు. దేశీయ అవసరాల నిమిత్తం నిసార్ ఉపగ్రహం, కమ్యూనికేషన్ ఉపగ్రహాలను ప్రయోగించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

కుమార స్వామి ఫామ్‌హౌస్‌లో కూల్చివేతలు

దొడ్డబళ్లాపురం: కేంద్ర ఉక్కు, గనుల శాఖ మంత్రి, జేడీ(ఎస్) అగ్రనేత హెచ్.డి.కుమారస్వామికి కర్ణాటక ప్రభుత్వం షాక్ ఇచ్చింది. బెంగళూరు శివార్లలో రామనగర తాలూకా కేతిగానహళ్లి సమీపంలోని ఫామ్‌హౌస్‌లో మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారు. ఇక్కడ కుమారస్వామి, ఆయన కుటుంబ సభ్యులకు దాదాపు 40 ఎకరాల భూమి ఉంది. అయితే, ఇందులో 14.04 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని అధికారులు సర్వేలో గుర్తించారు. 14.04 ఎకరాలను ఆక్రమించి, ఫామ్‌హౌస్‌లో కలిపేసుకున్నట్లు తేల్చారు. కోర్టు ఆదేశాల మేరకు అధికారులు భారీ బందోబస్తు నడుమ ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. అక్కడున్న నిర్మాణాలను జేసీబీతో కూల్చివేశారు. ఈ వ్యవహారంపై కుమారస్వామి స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై కక్ష సాధిస్తోందని మండిపడ్డారు.



100 కేజీలకు పైగా బంగారు కడ్డీలు, ఆభరణాల పట్టివేత

గుజరాత్‌లో ఓ ఇంట్లో స్వాధీనం చేసుకున్న రెవిన్యూ ఇంటెలిజెన్స్ పోలీసులు

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో భారీ స్థాయిలో అక్రమ బంగారం గుట్టు రట్టయింది. విదేశాల నుంచి అక్రమంగా తరలించినట్లు భావిస్తున్న దాదాపు 100 కేజీలకుపైగా బంగారు కడ్డీలు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం గుజరాత్ ఉగ్ర వ్యతిరేక బృందం(ఏటీఎస్), డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న వాటిల్లో 87.92 కేజీల బంగారు కడ్డీలు, 19.66 కేజీల బంగారు ఆభరణాలు ఉన్నాయి. రూ.1.37 కోట్ల విలువైన కరెన్సీ కట్టలను సైతం స్వాధీనంచేసుకున్నారు. అహ్మదాబాద్ నగరంలోని పాల్డీ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో విస్తృత సోదాలు చేయడంతో ఈ బంగారం బయటపడింది. బంగారు కడ్డీల మార్కెట్ విలువ దాదాపు రూ.80 కోట్లు ఉండొచ్చు. వజ్రాలు పొదిగిన పాటెక్ ఫిలిప్, జాకబ్ అండ్ కో, ఫ్రాంక్‌ముల్లర్ వంటి 11 అత్యంత ఖరీదైన లగ్జరీ చేతిగడియారాలు, వజ్రాలు, అత్యంత విలువైన రత్నాలు పొదిగిన పుత్తడి నగలను స్వాధీనం చేసుకున్నారు. షేర్ మార్కెట్ ట్రేడింగ్, బెట్టింగ్, బంగారం స్మగ్లింగ్‌లలో ఆరితేరిన వాళ్లే ఇంతటి భారీస్థాయిలో బంగారాన్ని తెప్పించగలరని అధికారులు చెప్పారు. ఈమేరకు డీఆర్ఐ మంగళవారం ఒక ప్రకటన విడుదలచేసింది.

గాంధీజీ హాజరైన రౌండ్ టేబుల్ సమావేశం?

బ్రిటిషర్లు భారత్‌లో రాజ్యాంగ సంస్కరణల కోసం చేసిన చట్టాల్లో అతిపెద్దది 'భారత ప్రభుత్వ చట్టం-1935'. భారత రాజ్యాంగాన్ని ఈ చట్టం నమూనాగా వర్ణిస్తారు. రాజ్యాంగంలోని సుమారు 60 శాతం అంశాలను ఈ చట్టం నుంచే గ్రహించారు. ఈ చట్టం ప్రధానంగా స్వయంపాలనకు ఉద్దేశించింది. దీని ద్వారా మొదటిసారిగా కేంద్రంలో సమాఖ్య వ్యవస్థ,రాష్ట్రాల్లో ద్విసభా విధానాన్ని ప్రతిపాదించారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత రాజ్యాంగం - చారిత్రక నేపథ్యం

నెహ్రూ నివేదిక (1928)

భారత వ్యవహారాల కార్యదర్శి లార్డ్ బిర్కెన్ హెడ్ 1927 నవంబర్‌లో బ్రిటన్ ఎగువసభలో మాట్లాడుతూ 'అందరికీ సమ్మతమైన రాజ్యాంగాన్ని భారతీయులు రూపొందించగలరా?' అని సవాలు విసిరారు. ఈ సవాలును స్వీకరించిన భారత జాతీయ కాంగ్రెస్ 1928 మే 19న బొంబాయిలో అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించింది. 1928 ఆగస్టు 10న రాజ్యాంగ రచనకు మోతీలాల్ నెహ్రూ అధ్యక్షుడిగా 8 మంది సభ్యులతో కూడిన ఉపసంఘాన్ని నియమించింది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దీనికి కార్యదర్శిగా పనిచేశారు.

ముఖ్యాంశాలు

- భారతదేశానికి డొమినియన్ (స్వయం ప్రతిపత్తి) ఇవ్వడం.
- భాషాప్రయుక్త రాష్ట్రాలు, స్వయం ప్రతిపత్తి రాష్ట్రాలు అనే అంశాల ఆధారంగా దేశంలో సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేయడం.
- కార్యనిర్వాహక శాఖ.. శాసన శాఖకు బాధ్యత వహించడం.
- అల్పసంఖ్యాక వర్గాల వారికి శాసనమండళ్లలో కనీసం 10 సంవత్సరాల పాటు కొన్ని స్థానాలను కేటాయించడం.
- 19 ప్రాథమిక హక్కులను కల్పించడం.

గమనిక: మొదటిసారిగా ప్రాథమిక హక్కులను సూచించింది - నెహ్రూ రిపోర్టు.

1929లో బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సైమన్ కమిషన్ నివేదిక, భారత్‌లో రాజ్యాంగపరమైన సంస్కరణలపై చర్చించడానికి రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేశారు. నాటి బ్రిటన్ ప్రధానమంత్రి రామ్ సే మెక్‌డొనాల్డ్ చొరవతో రాజప్రతినిధి (వైస్రాయ్) ఇర్విన్‌ను ఇంగ్లండ్‌కు రప్పించారు. భారతీయుల సమస్యల గురించి చర్చించడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తుందని, ఇందులో పాల్గొనడానికి అన్ని పార్టీలు, వర్గాలకు ఆహ్వానం వస్తుందని మెక్‌డొనాల్డ్ ఒక ప్రకటన చేశారు.

మొదటి రౌండ్ టేబుల్ సమావేశం

1930 నవంబర్ 12 నుంచి 1931 జనవరి 19 వరకు మొదటి రౌండ్ టేబుల్ సమావేశం లండన్‌లో జరిగింది. ఇందులో 89 మంది ప్రముఖ రాజనీతిజ్ఞులు పాల్గొన్నారు. కానీ భారత జాతీయ కాంగ్రెస్ పాల్గొనలేదు. ఈ సమావేశంలో 'భావి భారత రాజ్యాంగం సమాఖ్యగా ఉండాలా? లేదా ఏక కేంద్రంగా ఉండాలా?' అనే అంశంపై చర్చించారు. కాంగ్రెస్ పాల్గొనకపోవడం వల్ల చర్చలో వాస్తవమైన ప్రగతి సాధ్యం కాలేదు. సమావేశంలో పాల్గొనని ప్రజా వర్గాల సహకారం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పి ప్రధానమంత్రి మెక్‌డొనాల్డ్ సమావేశాన్ని ముగించారు.

మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో ముస్లిం లీగ్ తరఫున జిన్నా, అగాఖాన్, మహ్మద్ అలీ, మహ్మద్ షా, ఫజల్ హక్; హిందూ మహాసభ తరఫున మూంజే, జయకర్; ఉదారవాదుల తరఫున తేజ్ బహదూర్ సప్రూ, చింతామణి, శ్రీనివాస శాస్త్రి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్; హైదరాబాద్ దివాన్ అక్బర్ హైదర్ పాల్గొన్నారు.

రెండో రౌండ్ టేబుల్ సమావేశం

1931 సెప్టెంబర్ 7 నుంచి డిసెంబర్ 7 వరకు లండన్‌లో రెండో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇర్విన్‌తో చేసుకున్న ఒడంబడిక ప్రకారం కాంగ్రెస్ తరఫున గాంధీజీ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇందులో అన్ని స్వదేశీ సంస్థానాధిపతులతో పాటు 107 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మహిళా ప్రతినిధిగా సరోజినీ నాయుడు, బలహీన వర్గాల తరఫున డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ముస్లిం వర్గాలకు రెండు కొత్త ప్రావిన్సులను (నార్త్ వెస్టర్న్ ప్రావిన్స్, సింధ్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గాంధీజీ దీన్ని 'విభజించు, పాలించు' విధానంగా భావించి తీవ్రంగా వ్యతిరేకించారు. అల్పసంఖ్యాక వర్గాల సమస్యపై ఈ సమావేశం ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. బ్రిటిష్ ప్రధానమంత్రి, తాను దారులు వేరయ్యే చోటుకే వచ్చానని గాంధీజీ ప్రకటించారు.

కమ్యూనల్ అవార్డు (1932)

మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యానికి సంబంధించి నాటి బ్రిటన్ ప్రధాని రామ్‌సే మెక్‌డొనాల్డ్ 1932 ఆగస్టు 4న ఒక ప్రతిపాదన చేశారు. దీన్ని 'కమ్యూనల్ అవార్డు' అంటారు. దీని ప్రకారం ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లకే కాకుండా షెడ్యూల్డ్ కులాలకు కూడా ప్రత్యేక నియోజక గణాలను ప్రతిపాదించారు. దీన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమర్థించారు. మహాత్మాగాంధీ దీన్ని వ్యతిరేకిస్తూ పుణేలోని ఎరవాడ కారాగారంలో 1932 సెప్టెంబర్ 20న ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. రాజాజీ, మదన్‌మోహన్ మాలవ్య లాంటి నాయకులు చొరవ తీసుకొని అంబేద్కర్, గాంధీజీతో చర్చించి దీక్షను విరమింపజేశారు. 1932 సెప్టెంబర్‌లో 'పుణే ఒప్పందం' కుదిరింది. తద్వారా కమ్యూనల్ అవార్డు కంటే ఎక్కువగా షెడ్యూల్డ్ కులాలకు అవకాశాలు లభించాయి.

మూడో రౌండ్ టేబుల్ సమావేశం

1932 నవంబర్ 17 నుంచి డిసెంబర్ 24 వరకు లండన్‌లో మూడో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బ్రిటిష్ ప్రభుత్వం సమస్యలు సృష్టిస్తారని భావించిన వారెవరికీ ఆహ్వానం పంపలేదు. అందువల్ల కాంగ్రెస్ ప్రతినిధులు సమావేశానికి హాజరు కాలేదు. ఇంగ్లండ్‌లోని లేబర్ పార్టీ కూడా దీనికి సహకరించలేదు. ఇందులో అంతకు ముందు నియమించిన ఉపసంఘాల నివేదికలపై చర్చించారు. ఈ సమావేశంలో చేసిన సిఫార్సులకు సంబంధించిన అనేక అంశాలను 1935 భారత ప్రభుత్వ చట్టంలో పొందుపరిచారు. ఈ సమావేశానికి కేవలం 46 మంది ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు.

భారత ప్రభుత్వ చట్టం-1935

బ్రిటిషర్లు రూపొందించిన రాజ్యాంగ సంస్కరణ చట్టాలన్నింటిలో ఇది వివరణాత్మకమైంది, సుదీర్ఘమైంది. 1937 ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఈ చట్టంలో 321 ప్రకరణలు, 10 షెడ్యూళ్లు, 14 భాగాలు ఉన్నాయి.

ముఖ్యాంశాలు

- అఖిల భారత సమాఖ్య ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందులో 11 ప్రాంతాలు, 6 చీఫ్ కమిషనర్ల ప్రాంతాలు, సమాఖ్యలో చేరడానికి అంగీకరించిన స్వదేశీ సంస్థానాలు ఉంటాయి.
- కేంద్రం, రాష్ట్రాల మధ్య 3 జాబితాల ప్రకారం అధికార విభజన ఉంటుంది. కేంద్ర జాబితాలో 59, రాష్ట్ర జాబితాలో 54, ఉమ్మడి జాబితాలో 36 అంశాలు ఉంటాయి.
- అవశిష్ట అధికారాలను వైస్రాయ్‌కి ఇచ్చారు. స్వదేశీ సంస్థానాలు ఈ సమాఖ్యలో చేరకపోవడం వల్ల ఇది అమల్లోకి రాలేదు.
- రాష్ట్రాల్లోని ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేసి కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రతిపాదించారు. కేంద్రంలో పాలనాంశాలను రిజర్వుడు, ట్రాన్స్‌ఫర్డ్ అంశాలుగా విభజించారు.
- గవర్నర్ జనరల్.. రిజర్వుడు అంశాలను తాను నియమించిన ముగ్గురు కౌన్సిలర్ల సహాయంతో పాలిస్తాడు. ట్రాన్స్‌ఫర్డ్ అంశాల కోసం ఒక మంత్రిమండలిని నియమించి, దీని సహాయంతో పాలనను పర్యవేక్షిస్తారు. ఈ మంత్రిమండలిలో సభ్యులు 10 మందికి మించకూడదు.
- రాష్ట్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. దేశంలోని మొత్తం 11 రాష్ట్రాలకుగాను ఆరు (బెంగాల్, బొంబాయి, మద్రాసు, బిహార్, అస్సాం, యునైటెడ్ ప్రావిన్స్) రాష్ట్రాల్లో దీన్ని ప్రవేశపెట్టారు.
- భారత రాజ్య కార్యదర్శికి ఉన్న కౌన్సిల్‌ను రద్దుచేశారు. ఇతడికి సహాయకంగా ముగ్గురి కంటే తక్కువ కాకుండా, ఆరుగురికి మించకుండా సలహాదార్లను నియమించారు.
- కేంద్ర శాసనసభల పరిమాణాన్ని పెంచారు. సభ్యుల సంఖ్యను ఎగువసభ (కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్)లో 260కి, దిగువ సభ (లెజిస్లేటివ్ అసెంబ్లీ)లో 375కు పెంచారు.
- కమ్యూనల్ ప్రాతినిధ్యాన్ని కొనసాగించారు. ఈ సదుపాయాన్ని షెడ్యూల్డ్ కులాలవారికి, మహిళలకు వర్తింపజేశారు.
- ఓటు హక్కును విస్తృతపరిచారు. జనాభాలో 10 శాతం మందికి ఓటు హక్కు వర్తింపజేశారు.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య సమాఖ్య వివాదాలను పరిష్కరించడానికి ఫెడరల్ కోర్టు (సుప్రీం కోర్టు)ను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు ఇతర న్యాయమూర్తులు ఉంటారు. అయితే దీని తీర్పులే సర్వోన్నతం కాదు. వీటిపై ఇంగ్లండులో ఉండే ప్రివికౌన్సిల్‌కు అప్పీల్ చేసుకోవచ్చు.
- ఈ చట్టం ద్వారా బర్మాను భారతదేశం నుంచి వేరు చేశారు. అదేవిధంగా ఒరిస్సా, సింధ్ అనే రెండు కొత్త ప్రావిన్సులను ఏర్పాటు చేశారు. బ్రిటిష్ ఇండియాపై బ్రిటిష్ పార్లమెంట్ సర్వాధిపత్యాన్ని పునరుద్ఘాటించారు.
- కేంద్రంలో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటు చేశారు. భారతదేశంలో విత్త విధానం, రుణ నియంత్రణ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను స్థాపించారు.

చట్టం ప్రాముఖ్యత: ఈ చట్టం ద్వారా పొందుపరచిన అత్యంత ముఖ్యమైన అంశం 'ప్రాంతాల స్వయంప్రతిపత్తి'. దీని ద్వారా మొదటిసారిగా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ప్రాంతీయ పాలనాంశాలన్నింటినీ మంత్రుల ఆధీనంలోకి బదిలీ చేశారు. కేంద్రం నియంత్రణ చాలా వరకు తగ్గింది. గవర్నర్లను రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధమైన అధిపతులుగా పరిగణించారు.

వ్యాఖ్యానాలు

- బానిసత్వానికి ఒక నూతన చట్టం, భారత దేశంపై బలవంతంగా రుద్దారు. ఇంజన్ లేకుండా కేవలం గట్టి బ్రేకులున్న యంత్రం. - జవహర్‌లాల్ నెహ్రూ
- భారతదేశంలో గోచరించే భూస్వామ్య వ్యవస్థను దృఢం చేయడానికి బ్రిటిష్ పాలకులు ఆడిన నాటకం. - సుభాష్ చంద్రబోస్
- కచ్చితంగా పిచ్చిది, సమూలంగా చెడ్డది, మొత్తానికి అనంగీకారమైంది. - జిన్నా
- ఈ చట్టాన్ని మా మీద బలవంతంగా రుద్దారు. బాహ్యంగా దీనికి కొంత ప్రజాస్వామ్య రూపం ఉన్నట్లు కనిపించినా లోపల మాత్రం అంతా శూన్యం. - పండిట్ మదన్‌మోహన్ మాలవ్య
- ఈ చట్టం ద్వారా వైస్రాయ్‌కి ముస్సోలిని, హిట్లర్‌ను తలపించే నియంతృత్వ అధికారాలు ఇచ్చారు. ఇది పొట్టి మనుషులు కట్టిన అవమానకరమైన గొప్ప కట్టడం. - విన్‌స్టన్ చర్చిల్

లిన్‌లిత్‌గో ఆగస్టు ప్రతిపాదనలు

భారత వైస్రాయ్ లార్డ్ లిన్‌లిత్‌గో 1940 ఆగస్టు 8న కొన్ని ప్రతిపాదనలను చేశాడు.

ముఖ్యాంశాలు

- రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత భారతదేశానికి డొమినియన్ ప్రతిపత్తి కల్పించే విషయాన్ని పరిశీలించడం. రాజకీయ పార్టీల ప్రాతినిధ్యంతో రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చేయడం.
- వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులకు గవర్నర్ జనరల్ కార్య నిర్వాహక మండలిలో సభ్యత్వం కల్పించి మండలిని విస్తృతం చేయడం.
- రాజ్యాంగ పరిషత్తులో అల్పసంఖ్యాక వర్గాల వారికి సముచిత ప్రాతినిధ్యం ఇవ్వడం.
- అన్ని రాజకీయ పార్టీలు, సంస్థానాల ప్రతినిధులతో కూడిన యుద్ధ సలహా మండలి ఏర్పాటు చేయడం.

ఈ ప్రతిపాదనలను రాజకీయ పార్టీలు తిరస్కరించాయి.

క్రిప్స్ ప్రతిపాదనలు (1942)

బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ 1942 మార్చి 11న ఒక ప్రకటన ద్వారా భారత రాజ్యాంగ సమస్య విషయంలో అక్కడి నాయకులతో సంప్రదింపుల నిమిత్తం కేబినెట్ మంత్రి సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌ను భారతదేశానికి పంపిస్తున్నట్లుగా పేర్కొన్నాడు. క్రిప్స్ 1942 మార్చి 22న భారతదేశానికి వచ్చాడు. ఇతడి ప్రతిపాదనల ప్రకారం బ్రిటిష్ ప్రభుత్వం రాజ్యాంగ పరిషత్తుకు సంబంధించి మొదటిసారిగా అధికారిక ప్రకటన చేసింది.

ముఖ్యాంశాలు

- భారత్‌కు అవసరమైన కొత్త రాజ్యాంగాన్ని నిర్మించడానికి ఎన్నుకున్న రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటవుతుంది. భారతదేశానికి వీలైనంత త్వరలో స్వయంప్రతిపత్తి లభిస్తుంది.
- రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం అమల్లో ఉన్న రాజ్యాంగాన్ని కలిగి ఉండవచ్చు లేదా నూతన రాజ్యాంగాన్ని రూపొందించుకోవచ్చు.
- గవర్నర్ జనరల్ కార్య నిర్వాహక మండలిలో ఒక భారతీయుడికి సభ్యత్వం ఇస్తారు.

క్రిప్స్ ప్రతిపాదనలను మహాత్మాగాంధీ తీవ్రంగా విమర్శించారు. ఇవి 'దివాళా తీస్తున్న బ్యాంకు మీద ముందస్తు తేదీ వేసిన ఒక చెక్కు లాంటివి' అని వ్యాఖ్యానించారు.

అతి తక్కువ కొవ్వు ఉన్న జీవి ఏది?

జీర్ణనాళంలోని ఏయే భాగాల్లో ఏ జీర్ణక్రియలు జరుగుతాయి? జీర్ణరసాల్లోని ఏ ఎంజైమ్‌లు ఈ చర్యలను నిర్వహిస్తాయి? జీర్ణ గ్రంథులు ఏమిటి? జీర్ణనాళాల క్రమం, నిర్మాణం మొదలైవాటి నుంచి దాదాపు అన్ని పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతున్నారు.

టెట్/డీఎస్సీ ప్రత్యేకం

బయాలజీ



జీర్ణ వ్యవస్థ

మనం తీసుకునే ఆహారంలో శోషణ చెందని సంక్లిష్ట అణువులను, శోషణ చెందే సరళ అణువులుగా మార్చే ప్రక్రియను 'జీర్ణక్రియ' అంటారు. ఇది జీర్ణ వ్యవస్థలో జరుగుతుంది. జీర్ణవ్యవస్థలో జీర్ణనాళం, దాని అనుబంధ గ్రంథులు ఉం టాయి. జీర్ణ గ్రంథులు విడుదల చేసే జీర్ణ రసాల్లోని ఎంజైమ్‌లు జీర్ణక్రియను నిర్వహిస్తాయి.

జీర్ణనాళం

మానవునిలో జీర్ణనాళం నోటితో మొదలై పాయువుతో అంతమౌతుంది. నోరు నోటికుహరంలోకి తెరుచుకుంటుంది. ఇది మళ్లీ గ్రసనిలోకి, తర్వాత ఆహారవాహికలోకి; ఆహారవాహిక జీర్ణాశయంలోకి; జీర్ణాశయం చిన్నపేగులోకి తెరుచుకుంటుంది. చిన్నపేగులో ఆంత్రమూలం, జెజునం, ఇలియం అనే మూడు భాగాలు ఉంటాయి. చిన్నపేగు పెద్ద పేగులోకి తెరుచుకుంటుంది. చిన్నపేగు, పెద్దపేగు మధ్య ఉండూకం (అపెండిక్స్) అనే అవశేష అవయవం ఉంటుంది. పెద్దపేగులో కోలన్, పురీషనాళం అనే భాగాలుంటాయి. చివర్లో ఇది పాయువు అనే రంధ్రం ద్వారా తెరుచుకుంటుంది. ఈ జీర్ణనాళంలోని నోటి కుహరం జీర్ణాశయం, ఆంత్రమూలం , జెజునంలలో జీర్ణక్రియ లు జరుగుతాయి. ఇలియం అనే భాగంలో జీర్ణమైన ఆహారం రక్తంలోకి శోషణం చెందుతుంది. జీర్ణంకాని వ్యర్థమంతా పెద్దపేగు ద్వారా సాగుతూ మలంగా మారి విసర్జితమవుతుంది.

నోటి కుహరంలో జీర్ణక్రియ

నోటి కుహరంలో మూడు జతల లాలాజల గ్రంథులు లాలాజలాన్ని విడుదల చేస్తాయి. లాలాజలం స్వల్ప ఆమ్లస్థితిలో ఉంటుంది. దీంట్లో అమైలేజ్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఆహారంలోని స్టార్చ్‌ను మాల్టోజ్‌గా మారుస్తుంది. క్షీరదాల్లో నాలుగు జతల లాలాజల గ్రంథు లు ఉంటాయి. నోటిలోని ఆహారం బోలస్ అనే ముద్దగా ఆహారవాహికలో చేరుతుంది. ఆహారవాహిక ప్రదర్శించే పెరిస్టాలిసిస్ అనే కదలికల ద్వారా ఆహారం జీర్ణాశయంలోకి చేరుతుంది.

జీర్ణాశయంలో జీర్ణక్రియ

జీర్ణాశయం లోపలి తలంలో ఉన్న జఠర గ్రంథుల నుంచి జఠర రసం విడుదలవుతుంది. ఈ జీర్ణరసంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం, పెప్సిన్ ఉంటాయి. పెప్సిన్ అనే ఎంజైమ్ ఆహారంలోని ప్రోటీన్‌లను ప్రోటియేజెస్, పెప్టోన్స్‌గా విచ్ఛిన్నం చెందిస్తుంది.

జెజునంలో జీర్ణక్రియ

జెజునం అనే చిన్నపేగు రెండో భాగంలో జీర్ణక్రియ పూర్తవుతుంది. జెజునం లోపలి తలంలో ఆంత్రగ్రంథులు విడుదల చేసే ఆంత్రరసంలోని ఎంజైమ్‌లు జీర్ణక్రియను పూర్తిచేస్తాయి. ఆంత్రరసంలోని మాల్టేజ్ అనే ఎంజైమ్ మాల్టోజ్‌ను రెండు గ్లూకోజ్‌లుగా విచ్ఛిన్నం చేస్తుంది. లాక్టేజ్ అనే ఎంజైమ్ లాక్టోజ్‌ను ఒక గ్లూకోజ్, ఒక గాలక్టోజ్‌గా విచ్ఛిన్నం చేస్తుంది. అదేవిధంగా సుక్రేజ్ సమక్షంలో సుక్రోజ్, ఒక గ్లూకోజ్, ఒక ఫ్రక్టోజ్‌గా విచ్ఛిన్నమవుతుంది. ఎరిప్సిన్ ఎంజైమ్ సమక్షంలో పెప్టైడ్‌లు, అమైనో ఆమ్లాలుగా విచ్ఛిన్నం అవుతాయి. ఆంత్రలైపేజ్ సమక్షంలో డైగ్లిసరైడ్స్ అన్నీ కొవ్వు ఆమ్లాలు, గ్లిసరాల్‌గా విచ్ఛిన్నమవుతాయి. ఈవిధంగా జీర్ణమైన ఆహారమంతా చిన్నపేగు మూడో భాగమైన ఇలియంలో రక్తంలోకి శోషణం చెందుతుంది. ఇందు కోసం ఇలియం ఉపరితలమంతా సూక్ష్మ చూషకాలు అనే వేళ్లాకార నిర్మాణాల్లోకి మడతలు పడి ఉంటుంది. ఇవి ఆహార శోషణ ఉపరితల వైశాల్యాన్ని పెంచుతాయి. జీర్ణం కాని వ్యర్థమంతా పాయువు ద్వారా విసర్జితమవుతుంది.

ఆంత్రమూలంలో జీర్ణక్రియ

జీర్ణాశయంలో జీర్ణక్రియ పూర్తయిన తర్వాత ఆహారం ఆమ్లయుతంగా మారడానికి ఆంత్రమూలంలోకి చేరుతుంది. వెంటనే కాలేయం నుంచి పైత్యరసం, క్లోమం నుంచి క్లోమరసం ఆంత్రమూలంలోకి విడుదలవుతాయి. పైత్యరసంలో ఎంజైమ్‌లు ఉండవు. పైత్యరస వర్ణదాలు, పైత్యరస లవణాలు ఉంటాయి. బైలీరూబిన్, బైలీవర్డిన్ అనే విష రసాయనాలు మలం నుంచి విసర్జితమవుతాయి. సోడియం, పొటాషియంల టారోక్లోరేట్‌లు, గ్లైకోక్లోరేట్‌లు అనేవి పైత్యరస లవణాలు. ఆహారంలోని కొవ్వుల ఎమల్సిఫికేషన్‌ను నిర్వహిస్తుంది.

క్లోమరసంలోని ఎంజైమ్‌లు ఆంత్రమూలంలో జీర్ణక్రియను నిర్వహిస్తాయి. నోటి కుహరంలో జీర్ణంకాని స్టార్చ్‌ను అమిలోప్సిన్ అనే ఎంజైమ్ మాల్టోజ్‌గా విచ్ఛిన్నం చేస్తుంది. ట్రిప్సిన్, కైమోట్రిప్సిన్ అనే ఎంజైమ్‌లు ప్రోటియేజ్‌లు, పెప్టోన్‌లను పెప్టైడ్‌లుగా విచ్ఛిన్నం చేస్తుంది. అదేవిధంగా కొవ్వులను క్లోమరస లైపేజ్ (స్టియాప్సిన్) డైగ్లిజరైట్స్, కొవ్వు ఆమ్లంగా విచ్ఛిన్నం చేస్తుంది. ఈవిధంగా ఆహారం ఆంత్రమూలంలో జీర్ణమవుతూ క్లోమ, పైత్యరసాలతో కలిసి క్షారయుతంగా మారుతుంది.


దంతాలు

దవడ ఎముకల్లోని ప్రత్యేక సంచుల లాంటి నిర్మాణాల్లో దంతాలు అమరి ఉంటాయి. క్షీరదాల్లో ఎక్కువగా అసమదంతాలు.. ముఖ్యంగా నాలుగు రకాల దంతాలు ఉంటాయి. కుంతకాలు కొరికే దంతాలు. రదనికలు చీల్చే దంతాలు. ఇవి మాంసాహార జీవుల్లో బాగా అభివృద్ధి చెందుతాయి. అగ్రచర్వణకాలు నమిలే దంతాలు. సాధారణంగా శిశువు పుట్టిన తర్వాత వచ్చేవి పాలదంతాలు. ఇవి 20 ఉంటాయి. ప్రతి దవడ అర్ధభాగంలో రెండు కుంతకాలు, ఒక రదనిక, రెండు చర్వణకాలు ఉంటాయి. ఇవన్నీ ఊడిపోయి మళ్లీ వస్తాయి. ఇలా రెండు సార్లు ఏర్పడే దంతాల సంఖ్య 20. ఆ తర్వాత ఒకే సారి ఏర్పడేవి 12. ఇవన్నీ చర్వణకాలు. ఇవి ప్రతి దవడ అర్ధభాగంలో మూడు ఉంటాయి. ఇలా శాశ్వత దంతాలు 32 ఉంటాయి. ప్రతి దవడ అర్ధ భాగంలో రెండు కుంతకాలు, ఒక రదనిక, రెండు అగ్రచర్వణకాలు, మూడు చర్వణకాలు ఉంటాయి. ప్రతి దవడ అర్ధభాగంలోని చివరి చర్వణం జ్ఞాన దంతం. ఇవి మొత్తం నాలుగు ఉంటాయి. 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఇవి వస్తాయి. సాధారణంగా దంత నిర్మాణంలో వేరు, మెడ, కిరీటం అనే మూడు భాగాలు ఉంటాయి. బయటకు కన్పించే భాగం కిరీటం. మొత్తం దంతం డెంటిన్ అనే అస్థి పదార్థంతో తయారవుతుంది. కిరీటంపై మెరిసే పింగాణి ((ఎనామిల్) ఉంటుంది. ఇది శరీరంలో అత్యంత గట్టి పదార్థం. దంత విన్యాసాన్ని భిన్నం రూపంలో తెలియజేస్తారు. పైదవడ అర్ధ భాగంలోని దంతాలను కుంతకాలు, రదనికలు, అగ్రచర్వణకాలు, చర్వణకాల క్రమంలో లవంలో, కింది దవడలోని దంతాలను అదే క్రమంలో హారంలో చూపించడాన్నే 'దంతవిన్యాసం' అంటారు.

కాలేయం

శరీరంలోని వైవిధ్యమైన విధులను నిర్వహించే అవయవం కాలేయం.

- ఇది శరీరంలో అతి పెద్ద గ్రంథి.
- దీని బరువు 1560 గ్రాములు.
- ఇది విషనిర్మూలన అవయవంగా పనిచేస్తుంది.
- ప్రోత్రాంబిన్, ఫైబ్రినోజన్ అనే రక్త స్కంధన కారకాలు, హెపారిన్ అనే రక్తస్కంధన నివారిణి కాలేయంలోనే ఉత్పత్తి అవుతాయి.
- మూత్రంలో విసర్జించే యూరియా కాలేయంలోనే ఉత్పత్తి అవుతుంది.
- గ్లూకోనియోజెనిసిస్, గ్లైకోజెనిసిస్, గ్లైకోజెనోలైసిస్ ప్రక్రియలు కాలేయంలో జరుగుతాయి. కొవ్వులో కరిగే విటమిన్‌లు ఎ, డి, ఎఫ్, కెలతోపాటు మరికొన్ని బి-కాంప్లెక్స్ విటమిన్‌లు కాలేయంలో నిల్వ ఉంటాయి.
- మానవ కాలేయంలో నాలుగు లంబికలు ఉంటాయి. క్షీరదాల కాలేయంలో ఐదు లంబికలు ఉంటాయి.



- కాలేయానికి సంబంధించిన శాస్త్రీయ అధ్యయనాన్ని 'హెపటాలజీ' అంటారు.
- ఏకారణం వల్లనైనా కాలేయ విధులకు అవరోధం ఏర్పడితే కామెర్లు (జాండిస్) సంభవించే ప్రమాదం ఉంటుంది.
- పిండాభివృద్ధి సమయంలో కాలేయం నుంచి రక్తం, రక్తకణాలు ఏర్పడతాయి.

మాదిరి ప్రశ్నలు

1. శరీరంలో పునరుత్పత్తి శక్తి ఉన్న అవయవం?
   1) క్లోమం 2) కాలేయం
   3) ఉండూకం 4) ప్లీహం
2. చిన్నపేగులోని పొడవైన భాగం?
   1) ఇలియం 2) జెజునం
   3) ఆంత్రమూలం 4) కోలన్
3. పొడవైన రదనికలు ఉన్న జీవి?
   1) సీల్ 2) ఆటర్
   3) వాల్‌రస్ 4) బీవర్
4. కిందివాటిలో అవశేష అవయవం ఏది?
   1) ఉండూకం 2) బాహ్య చెవి
   3) అనుత్రికం 4) పైవన్నీ
5. లాలాజలం pH విలువ?
   1) 5.2 2) 6.7
   3) 7.4 4) 8.0
6. అతి తక్కువ కొవ్వు ఉన్న జీవి?
   1) ఆవు 2) గేదె
   3) మేక 4) ఒంటె
7. పసి పిల్లల జఠర రసంలో ప్రత్యేకంగా కన్పించే ఎంజైమ్?
   1) కెసిన్ 2) రెనిన్
   3) పారాకెసిన్ 4) గ్యాస్ట్రిన్
8. కిందివాటిలో హార్మోన్‌ను గుర్తించండి.
   1) గ్యాస్ట్రిన్ 2) సెక్రిటిన్
   3) ప్యాంక్రియోజైమిన్ 4) పైవన్నీ
9. మానవుడు జీర్ణం చేసుకోలేని పదార్థమేది?
   1) సెల్యూలోజ్ 2) సుక్రోజ్
   3) స్టార్చ్ 4) పైవన్నీ
10. ఏ గ్రంథులను Krypts of Leber-kuhn అంటారు?
    1) లాలా జల గ్రంథులు 2) క్లోమం
    3) జఠర గ్రంథులు 4) ఆంత్ర గ్రంథులు
11. కిందివాటిలో టేబుల్ షుగర్ ఏది?
    1) మాల్టోజ్ 2) సుక్రోజ్
    3) లాక్టోజ్ 4) స్టార్చ్
12. చిన్న పేగు పొడవు ఎంత?
    1) 6.5 మీ. 2) 8.5 మీ.
    3) 12 మీ. 4) 2 మీ.
13. పిండి పదార్థాలను జీర్ణం చేసే ఎంజైమ్?
    1) ప్రోటియేజెస్ 2) లైపేజెస్
    3) అమైలేజెస్ 4) ఏదీకాదు
14. పిత్తాశయ సంకోచాన్ని ప్రేరేపించే హార్మోన్?
    1) సెక్రిటిన్ 2) గ్యాస్ట్రిన్
    3) ఎంటిరో గ్యాస్ట్రిన్
    4) కొలిసిస్టో కైనిన్

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 4; 5) 2
6) 4; 7) 2; 8) 4; 9) 1; 10) 4
11) 2; 12) 1; 13) 3; 14) 4.

ప్రతాపరుద్రుడి మరణం... కాకతీయ వంశం అంతం

'ప్రతాపరుద్ర చరిత్ర' ప్రకారం ప్రతాపరుద్రుడికి విశాలాక్షి అనే భార్య ఉంది. లక్ష్మీదేవి అనే భార్య ఉన్నప్పటికీ వారికి సంతానం లేదని ఎలిగేడు శాసనం ద్వారా తెలుస్తోంది. అయితే ప్రతాపరుద్రుడికి వీరభద్రుడు, అన్నమదేవుడు అనే కుమారులు ఉన్నారని, వారు రాజ్యపాలన చేశారని కథనాలున్నాయి. కానీ అవి నిర్ధారణ కాలేదు. అందువల్ల ప్రతాపరుద్రుడితోపాటే కాకతీయ సామ్రాజ్యం, కాకతీయవంశం అంతరించిందని చెప్పవచ్చు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కాకతీయులపై ఢిల్లీ దండయాత్రలు

ప్రతాపరుద్రుడు రాజ్యాన్ని సుస్థిర పరుచుకుంటుండగా ఉత్తర భారతదేశంలో అనేక మార్పులు సంభవించాయి.

ఖిల్జీ వంశం

మాలిక్ ఫిరోజ్.. ఖిల్జీ తెగకు చెందినవాడు. ఇతడి పూర్వీకులు తుర్కిస్తాన్ నుంచి అఫ్గానిస్తాన్ వచ్చారు. అక్కడి నుంచి ఢిల్లీ చేరి తురుష్క సుల్తాన్ల కొలువులో చేరారు. మాలిక్ ఫిరోజ్ (జలాలుద్దీన్ ఫిరోజ్ ఖిల్జీ) సుల్తాన్ల వద్ద ఉన్నత పదవులు పొందాడు. సుల్తాన్ వారసుల్ని చంపి క్రీ.శ.1290లో ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించాడు. జలాలుద్దీన్ అల్లుడైన గర్షాస్ప్ మాలిక్(అల్లా ఉద్దీన్ ఖిల్జీ) తన మామను చంపి క్రీ.శ.1296లో ఢిల్లీ సుల్తానుగా ప్రకటించుకున్నాడు. తర్వాత దాదాపు ఉత్తర భారతం అంతటినీ జయించాడు. అనంతరం దక్షిణ భారతాన్ని జయించాలని సంకల్పించాడు. అప్పటికి దక్షిణాదిలో దేవగిరి, హోయసాల, కాకతీయ రాజ్యాలు బలంగా ఉండేవి. వింధ్య పర్వతాలను దాటి దక్షిణాపథంపై దండెత్తిన తొలి ముస్లిం పాలకుడు అల్లా ఉద్దీన్ ఖిల్జీ. చక్రవర్తి కాకముందే క్రీ.శ.1294లో దేవగిరి మీద దండెత్తి విజయం సాధించాడు.

చక్రవర్తి అయ్యాక జరిపిన దండయాత్రల్లో భాగంగా అల్లా ఉద్దీన్ క్రీ.శ.1303లో కాకతీయ సామ్రాజ్యంపై దండెత్తాడు. మాలిక్ ఫక్రుద్దీన్ జునా, ఝాజా నాయకత్వంలో అల్లా ఉద్దీన్ సైన్యం కాకతీయ రాజ్యంపై దండెత్తింది. ఇది తురుష్కుల మొదటి దండయాత్ర. ఖిల్జీ సైన్యాన్ని కాకతీయ సైన్యం ఉప్పరపల్లి వద్ద ఓడించింది. ఇది అల్లా ఉద్దీన్ తొలి పరాజయం. ముస్లింల ఓటమికి రేచర్ల ప్రసాదిత్యుడి కుమారుడు వెన్నమ కారణమని 'వెలుగోటి వంశావళి' తెలుపుతోంది. మనరస్గోదారి రాజు, అయనదేవులు ముస్లింల ఓటమికి కారకులని ఓరుగల్లు కోటలోని స్తంభ శాసనం తెలుపుతోంది. ప్రతీకారేచ్ఛతో అల్లా ఉద్దీన్ ఖిల్జీ రెండోసారి దండెత్తాడు. ఈసారి అతడి సేనలకు మాలిక్ కఫూర్ నాయకత్వం వహించాడు.

25 రోజుల ముట్టడి తర్వాత ప్రజల కష్టనష్టాలను చూడలేక ప్రతాపరుద్రుడు మాలిక్ కఫూర్‌కి అపార ధనరాశులు, ఏనుగులు ఇచ్చి సంధి చేసుకున్నాడు. కప్పం చెల్లించి అల్లా ఉద్దీన్ ఖిల్జీని సార్వభౌముడిగా గుర్తించాడు. ఈ దండయాత్రతో దక్షిణ భారతదేశంలోని రాజ్యాలన్నీ ఢిల్లీ సార్వభౌమత్వాన్ని అంగీకరించాయి.

తిరుగుబాట్ల అణచివేత

ముస్లింల చేతిలో ప్రతాపరుద్రుడు ఓటమి పొందడంతో ఇదే అదనుగా కొందరు సామంతరాజులు తిరుగుబాటు చేశారు. వారిలో కాయస్థ మల్లిదేవుడు, నెల్లూరు రంగనాథుడు ముఖ్యులు. ప్రతాపరుద్రుడు మల్లిదేవుడిపై జుట్టయలెంక గొంకయరెడ్డి నాయకత్వంలో సేనను పంపాడు. అతడు మల్లిదేవుడిని ఓడించి చంపాడు. గొంకయరెడ్డిని ప్రతాపరుద్రుడు ఆ ప్రాంత పాలకుడిగా నియమించాడు. ఈ యుద్ధాలు, తురుష్కుల దండయాత్రలు (క్రీ.శ.1315 నాటికి) ఢిల్లీ సుల్తాన్‌కు కప్పం చెల్లించాల్సి రావడంతో ఖజానా ఖాళీ అయింది. కోశాగారాన్ని నింపడానికి ప్రతాపరుద్రుడు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కడప, కర్నూలు, పల్నాడు ప్రాంతాల్లో అడవులను నరికించి భూములను వ్యవసాయ యోగ్యం చేయించాడు. చెరువులు, బావులు తవ్వించాడు. ఫలితంగా అనేక కొత్త గ్రామాలు, నగరాలు ఏర్పడ్డాయి. క్రమంగా రాజ్య ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

క్రీ.శ.1316లో అల్లా ఉద్దీన్ ఖిల్జీ మరణించాడు. ఢిల్లీపై అధికారం కోసం కొంత కాలం అంతఃకలహాలు చేలరేగిన తర్వాత ఖిల్జీ మూడో కుమారుడైన ముబారక్ షా సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఈ అంతఃకలహాలను అవకాశంగా తీసుకొని ప్రతాపరుద్రుడు కప్పం చెల్లించడం మానేశాడు. దీనికి ఆగ్రహించిన ముబారక్‌షా ఖిల్జీ కాకతీయ ప్రతాపరుద్రునిపై దండెత్తి కప్పం వసూలు చేశాడు. తెలుగుదేశంపై ఢిల్లీ సామ్రాజ్య అధికారాన్ని తిరిగి స్థాపించాడు. ఇది తురుష్కుల మూడో దండయాత్ర. ఇంతలో ముబారక్ షాను చంపి నాసిరుద్దీన్ ఖుస్రూ ఖాన్ క్రీ.శ.1320లో చక్రవర్తి అయ్యాడు.

తుగ్లక్ వంశం

ఢిల్లీ సుల్తాన్ల అధికారిగా, పంజాబ్ పాలకుడిగా ఉన్న ఘాజీ మాలిక్ ఖుస్రూ ఖాన్‌ను వధించి ఘియాజుద్దీన్ తుగ్లక్‌షా పేరుతో క్రీ.శ.1320లో ఢిల్లీ సింహాసనం అధిష్ఠించాడు. తన పెద్ద కుమారుడు ఫక్రుద్దీన్ మహ్మద్ (ఉలూఘ్ ఖాన్ /మహమ్మద్ బిన్ తుగ్లక్)ను క్రీ.శ. 1321లో ఓరుగల్లుపై దండయాత్రకు పంపాడు. ఉలూఘ్ ఖాన్ స్వయంగా ఓరుగల్లు కోటను ఆరు నెలలపాటు ముట్టడించాడు. కానీ కోట స్వాధీనం కాలేదు. సుల్తాన్ మరణించాడని ఉబైద్ దుష్ప్రచారం చేయడంతో ముస్లింసేనలో కలకలం రేగింది. సైన్యంలో చాలాభాగం పారిపోయింది. దీంతో ఉలూఘ్ ఖాన్ ముట్టడి ఆపివేశాడు. పారిపోతున్న ముస్లిం సైన్యంపై కాకతీయ సైనికులు దాడిచేసి కోటగిరి దాకా తరిమివేశారు. ఇది తురుష్కుల నాలుగో దండయాత్ర.

ఓడిపోయి దేవగిరికి చేరిన ఉలూఘ్ ఖాన్ ఢిల్లీ నుంచి వచ్చిన కొత్త సైన్యంతో క్రీ.శ.1323లో తిరిగి ఓరుగల్లుపై దండెత్తాడు. ఉలూఘ్ ఖాన్ అంత తొందరగా తిరిగి దాడి చేస్తాడని ఊహించని ప్రతాపరుద్రుడు తగిన యుద్ధ సన్నాహాలు చేయలేదు. అయినప్పటికీ అయిదునెలలపాటు కోటను కాపాడగలిగాడు. ఇది తురుష్కుల అయిదో దండయాత్ర. లొంగిపోయిన ప్రతాపరుద్రుడిని ఖాదిర్‌ఖాన్, ఖ్వాజీహాజీ అనే సేనానుల రక్షణలో ఉలూఘ్ ఖాన్ ఢిల్లీకి పంపాడు. కానీ ప్రతాపరుద్రుడు ముస్లిం సైనికుల అవమానాలను భరించలేక నర్మదానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రతాపరుద్రుడి మరణంతో కాకతీయ వంశం అంతమైంది. ఈ ప్రాంతం ఢిల్లీ సుల్తానుల రాజ్యంలో 23వ రాష్ట్రమైంది. క్రీ.శ.1325లో ఉలూఘ్ ఖాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ పేరుతో ఢిల్లీ సింహాసనం అధిష్ఠించి ప్రతినిధుల ద్వారా తెలంగాణను పాలించాడు.

మాదిరి ప్రశ్నలు

1. రుద్రమదేవికి ఎంతమంది కుమార్తెలు?
   1) 4 2) 2 3) 3 4) 5
2. నాయంకర వ్యవస్థను పునర్వ్యవస్థీకరించింది?
   1) గణపతిదేవుడు 2) రుద్రమదేవి
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రదేవుడు
3. దక్షిణాపథంపై దండెత్తిన తొలి ముస్లిం పాలకుడు?
   1) మహమ్మద్ బిన్ తుగ్లక్
   2) అల్లా ఉద్దీన్ ఖిల్జీ
   3) ఘియాజుద్దీన్ ఖిల్జీ
   4) ఫిరోజ్‌షా తుగ్లక్
4. అల్లా ఉద్దీన్ ఖిల్జీ కాకతీయ సామ్రాజ్యంపై మొదటిసారి దండెత్తిన సంవత్సరం?
   1) క్రీ.శ.1300 2) క్రీ.శ.1303
   3) క్రీ.శ.1301 4) క్రీ.శ.1304
5. అల్లా ఉద్దీన్ సైన్యాన్ని కాకతీయ సైన్యం ఏ ప్రాంతం వద్ద ఎదిరించి ఓడించింది?
   1) పానగల్లు 2) ఏలకుర్తి
   3) పిల్లలమర్రి 4) ఉప్పరపల్లి
6. అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఓరుగల్లుపై రెండోసారి దండెత్తినప్పుడు సేనలకు నాయకత్వం వహించింది ఎవరు?
   1) మాలిక్ ఫక్రుద్దీన్ 2) ఝాజ
   3) మాలిక్ కఫూర్ 4) ముబారక్ షా
7. అల్లా ఉద్దీన్ ఖిల్జీ మరణించిన సంవత్సరం?
   1) క్రీ.శ.1313 2) క్రీ.శ.1316
   3) క్రీ.శ.1314 4) క్రీ.శ.1317
8. ముబారక్‌షా ఖిల్జీ ప్రతాపరుద్రుడిపై దండయాత్రకు ఎవరి ఆధ్వర్యంలో సైన్యాన్ని పంపాడు?
   1) మాలిక్ కఫూర్ 2) మాలిక్ ఫక్రుద్దీన్
   3) ఝాజ 4) ఖుస్రూ ఖాన్
9. ఓరుగల్లుపై నాలుగో దండయాత్ర చేసిన ఢిల్లీ సేనాధిపతి?
   1) ఖుస్రూఖాన్ 2) ఉలూఘ్ ఖాన్
   3) మాలిక్ కఫూర్ 4) ఝాజ
10. ప్రతాపరుద్రుడు మరణించిన సంవత్సరం?
   1) క్రీ.శ.1320 2) క్రీ.శ.1321
   3) క్రీ.శ.1323 4) క్రీ.శ.1325
11. ప్రతాపరుద్రుడు ఏ నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని చరిత్రకారుల అభిప్రాయం?
   1) గోదావరి 2) నర్మద
   3) కృష్ణా 4) తుంగభద్ర
12. ఉలూఘ్ ఖాన్ మరో పేరు?
   1) ఘియాజుద్దీన్ తుగ్లక్
   2) ముబారక్ షా 3) మహ్మద్ బిన్ తుగ్లక్
   4) ఫిరోజ్‌షా తుగ్లక్
13. రేచర్ల రెడ్ల వంశ మూలపురుషుడు?
   1) రేచర్ల బేతిరెడ్డి
   2) రేచర్ల బమ్మిరెడ్డి 3) రేచర్ల నాగిరెడ్డి
   4) రెండో కాటచమూపతి
14. పిల్లలమర్రి పట్టణాన్ని నిర్మించింది?
   1) రేచర్ల బేతిరెడ్డి 2) రేచర్ల బమ్మిరెడ్డి 3) రేచర్ల నాగిరెడ్డి 4) ఎవరూ కాదు
15. రేచర్ల రెడ్లలో మొదటి రాజు?
   1) రేచర్ల బేతిరెడ్డి
   2) రేచర్ల బమ్మిరెడ్డి 3) రేచర్ల నాగిరెడ్డి
   4) రెండో కాటచమూపతి
16. రెండో కాటచమూపతి రాజ్య రాజధాని?
   1) ఏలకుర్తి 2) పిల్లలమర్రి
   3) ఆమనగల్లు 4) పానగల్లు
17. రుద్రదేవుడు బేతిరెడ్డికి ఏ రాజ్యానిచ్చి సామంతుడిగా చేసుకున్నాడు?
   1) ఏలకుర్తి 2) పిల్లలమర్రి
   3) ఆమనగల్లు 4) దేవరకొండ
18. మొదటి ప్రతాపరుద్రుడని ఎవరిని పిలుస్తారు?
   1) రెండో ప్రోలరాజు
   2) రెండో బేతరాజు
   3) జాయప సేనాని 4) రుద్రదేవుడు
19. రేచర్ల రెడ్డి రాజుల్లో ప్రసిద్ధుడు?
   1) రేచర్ల బేతిరెడ్డి 2) రేచర్ల నామిరెడ్డి
   3) రేచర్ల రుద్రారెడ్డి
   4) రెండో కాటచమూపతి
20. పిల్లలమర్రిలో ఎరకేశ్వర, కాచేశ్వర, నామేశ్వర దేవాలయాలను కట్టించినవాడు?
   1) రేచర్ల బేతిరెడ్డి 2) రేచర్ల రుద్రారెడ్డి
   3) రేచర్ల లోకిరెడ్డి 4) రేచర్ల నామిరెడ్డి
21. 'కాకతీయ రాజ్య భార ధౌరేయు' అని పేరొందింది ఎవరు?
   1) రేచర్ల రుద్రారెడ్డి 2) రేచర్ల చెవిరెడ్డి
   3) రేచర్ల కాటిరెడ్డి 4) రేచర్ల లోకిరెడ్డి
22. భేతాళరెడ్డి అని మరోపేరు ఎవరికి ఉంది?
   1) మల్లారెడ్డి 2) చెవిరెడ్డి
   3) కాటిరెడ్డి 4) లోకిరెడ్డి
23. ఎవరి వంశస్థులు కాలక్రమంలో రేచర్ల పద్మ నాయకులు అయ్యారు?
   1) మల్లారెడ్డి 2) కోటిరెడ్డి
   3) లోకిరెడ్డి 4) చెవిరెడ్డి
24. కింద పేర్కొన్న ఏ దేవాలయాలు అజంతా తర్వాత ప్రాచీనమైనవని చరిత్రకారుల అభిప్రాయం?
   1) పిల్లలమర్రి 2) పానగల్లు
   3) కొలనుపాక 4) ఓరుగల్లు
25. చెరకురెడ్డి వంశస్థుల తొలి రాజధాని?
   1) పిల్లలమర్రి 2) పానగల్లు
   3) జమ్ములూరు 4) కొలనుపాక
26. విరియాల వంశంలో సుప్రసిద్ధుడు?
   1) పోరంటి వెన్న 2) ఎఱ్ఱభూపతి
   3) ఎఱ్ఱ నరేంద్రుడు 4) దన్నసేనాని

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 2	5) 4
6) 3	7) 2	8) 4	9) 2	10) 3
11) 2	12) 3	13) 2	14) 1	15) 4
16) 1	17) 3	18) 4	19) 3	20) 4
21) 1	22) 2	23) 4	24) 1	25) 3
26) 3				

How is boy related to Reema?



BANK EXAMS

REASONING

Blood Relations

1. P is the brother of Q, M is sister of Q. T is brother of P. How is Q related to T?
   1) Brother 2) Sister
   3) Brother or sister
   4) Data inadequate
   5) None of these

Sol: T and P are brothers of Q
The sex of Q is not given
Therefore, Q is either brother or sister of T
Ans: 3

2. Pointing to a boy, Reema said "He is the son of my grandfather's only child". How is boy related to Reema?
   1) Brother
   2) Cousin
   3) Sister
   4) Data inadequate
   5) None of these

Sol: Only child of Reema's grandfather means father or mother of Reema.
Therefore, the boy is brother of Reema.
Ans: 1


3. If Ramesh's mother's brother is Alok's father's brother, then Ramesh's mother is Alok's?
   1) Grandmother
   2) Aunt 3) Cousin
   4) Sister-in-law
   5) None of these

Sol: Aunt
Ans: 2

4. B is only child of C's grandfather's only daughter. How is C's father related to B?
   1) Maternal uncle
   2) Paternal Uncle 3) Father
   4) Cannot be determined
   5) None of these

Sol: C's grandfather's only daughter is mother of B.
C is cousin of B. Therefore, C's father is maternal uncle of B.
Ans: 1

5. i) P is the sister of Q
   ii) R is the brother of S
   iii) Q is the mother of R
   iv) T is the father of S
   How is P related to S?
   1) Cousin 2) Maternal aunt
   3) Niece
   4) Can't be decided
   5) None of these


Sol:


P is Maternal Aunt of S.
Ans: 2

6. Pointing to boy Uma said, "He is the son of my mother-in-law's only child. How is the boy related to Uma?
   1) Grandson 2) Son
   3) Nephew 4) Data inadequate
   5) None of these

Sol: Boy is Son of Uma
Ans: 2

7. M is brother of K, P is sister of K, R is father of P. How is K related to R?
   1) Son 2) Daughter
   3) Son or Daughter
   4) Data inadequate
   5) None of these


Sol:


The sex of K is not given
Therefore, K is either son or daughter of R
Ans: 3

8. Pointing to a girl, Mr. Suraj said "She is the only daughter of my father's son-in-law". How is the girl related to Mr. Suraj?
   1) Niece 2) Cousin
   3) Sister 4) Daughter
   5) Can't be determined

Sol: Only daughter of Suraj's brother-in-law is Suraj's niece.
Ans: 1


9. M is brother of K. T is sister of M. J is brother of T. H is father of J. How is K related to H?
   1) Niece 2) Son
   3) Brother 4) Sister
   5) Data inadequate

Sol: Either son or daughter


Ans: 5


Directions (Q.10 & 11): These questions are based on the following information
'A × B' means 'A is mother of B'
'A ÷ B' means 'A is son B'
'A + B' means 'A is husband of B'
'A - B' means 'A is sister of B'.

10. Which of the following expressions indicate M is daughter of H?
   1) M – R ÷ H 2) M × R – H
   3) R ÷ M – H 4) H × R – M
   5) None of these

Sol: M – R ÷ H:


Clearly, M is daughter of H
Ans: 1


11. In F ÷ K × V - T, how is V related to F?
   1) Son 2) Niece 3) Nephew
   4) Can't be determined
   5) None of these

Sol: F ÷ K × V - T:


Clearly, V is Sister of F.
Ans: 5


Directions (Q.12 & 13): These questions are based on the following information
'P + Q' means 'P is brother of Q'
'P – Q' means 'P is wife of Q'
'P × Q' means 'P is father of Q'
'P ÷ Q' means 'P is daughter of Q'

12. Which of the following expressions indicate T is mother of L?
   1) T – H + L 2) T – H × L
   3) T ÷ H × L 4) T ÷ H + L
   5) None of these

Sol: 2) T – H × L :


Ans: 2


13. In F + M × V ÷ R, How is V related to F?
   1) Daughter 2) Son
   3) Niece 4) Nephew
   5) None of these

Sol: F + M × V ÷ R:


Ans: 3


Directions (Q.14 & 15): Study the following information carefully and answer the questions given below?
'P × Q' means 'P is brother of Q'
'P – Q' means 'P is sister of Q'
'P ÷ Q' means 'P is father of Q'
'P + Q' means 'P is mother of Q'

14. Which of the following means 'D is nephew of R'?
   1) D × M ÷ R 2) R - M ÷ D
   3) R – M ÷ D × T
   4) R × M + D 5) None of these

Sol: R – M ÷ D × T:


Ans: 3
Clearly, D is nephew of R.


15. Which of the following means 'M is maternal uncle of T?
   1) M × R + T 2) M × R ÷ T
   3) T × J - N ÷ M 4) M – R + T
   5) None of these

Sol: M × R + T


Clearly, M is maternal uncle of T.
Ans: 1


Directions (Q.16 & 17): Read the following information carefully and answer the questions which follow:
'A × B' means 'A is wife of B'
'A + B' means 'A is brother of B'
'A ÷ B' means 'A is daughter of B'
'A – B' means 'A is son of B'

16. Which of the following means 'T is father of P'?
   1) P + Q × R – T
   2) P ÷ R - T × Q
   3) P + Q ÷ R × T
   4) P - Q + T ÷ R
   5) None of these

Sol:


Hence, T is father of P
Ans: 3


17. How is Y related to Z if Y × V + W ÷ Z?
   1) Daughter
   2) Father-in-law
   3) Wife
   4) Daughter - in - law
   5) Can't be determined

Sol: Y × V + W ÷ Z


Clearly, Y is daughter in law of Z.
Ans: 4


Directions (Q.18 & 19): Read the following information carefully and answer the following questions.
If 'A × B' means 'A is wife of B'
If 'A + B' means 'A is brother of B'
If 'A ÷ B' means 'A is daughter of B'
If 'A - B' means 'A is son of B'.

18. Which of the following means 'D is father of A'?
   1) A – B × C + D
   2) D ÷ C - B × A
   3) A + B ÷ C × D
   4) D + B × C - A
   5) None of these

Sol:


Hence, D is father of A
Ans: 3


19. How is F related to J if 'F – G ÷ H × J'?
   1) Son 2) Grandson
   3) Son-in-law 4) Father
   5) Grandfather

Sol:


Ans: 2

Directions (Q.20 & 21): Study the following information and answer the questions that follow.
M, N, O, P, Q and R are members of a family. There are two married couples. Lawyer is father of Engineer. N is an engineer and is a father of Q. R is grandfather of O and is a lawyer. P is the grandmother of Q and is a housewife. There is one engineer, one lawyer, one teacher, one housewife and two students in the family.

20. Name the two married couples.
   1) NM, OP 2) NM, RP
   3) OP, MN 4) MN, QR
   5) MQ, OR
21. What is the profession of M?
   1) Engineer 2) Lawyer
   3) Housewife 4) Teacher
   5) Student

Sol: (20 & 21): The given information can be depicted as a family tree, which looks like


20. NM, RP:
R is the grandfather of O; P is the grandmother of Q.
Therefore, one of the couples = RP
Obviously, O and Q are students
Therefore, another married couple must be NM.
Ans: 2

21. Teacher.
N is an engineer, R is a lawyer, P is a housewife, O and Q are students. Therefore, M is a teacher.
Ans: 4